శ్రీమతే రామానుజాయ నమః ।
శ్రీహయగ్రీవాయనమః ।
శ్రీ సీతారామాభ్యాం నమః ।
శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః॥
శ్రీ సరస్వత్యై నమః ।

శ్రీమద్రామాయణము - బాలకాండము

అథ ప్రథమ స్సర్గః	మొదటి సర్గ
హరిః ఓం ॥ తప స్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరం నారదం. పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మ్ముని పుంగవమ్ ॥ 1	తపస్సునందును స్వాధ్యాయమునందును నిరంతర మాసక్తి కలవాడు, వాగ్విదులలో శ్రేష్ఠుడును, ముని పుంగవుడును అయిన నారద మహర్షిని ప్రశస్తమైన తపస్సుగల వాల్మీకి మహాముని చక్కగా పూజించి (తాను తెలిసికొనగోరిన విషయమునుగూర్చి) ఇట్లు ప్రశ్నించెను.

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః ।

రామంసీతాం లక్ష్మణంచ - వాల్మీకించాంజనాసుతం ।
నత్వా గోవింద రాజంచ - భక్త్యా గురువరానపి ॥
శ్రీనివాసస్య తనయః - వేంకటాచార్యనామకః
కోనప్పలార్యసచ్ఛిష్యః - జానకీజాని సేవకః
రామాయణస్య వ్యాఖ్యానం - యథాశక్తి కరోమ్యహం ।
గోవిందరాజ వ్యాఖ్యాన - మనుసృత్యాంధ్రభాషయా ॥

చిత్తమందు గోవింద రాజీయటీక
తెలుగునందున వ్రాయగా దలచుటయును
నీదు సంకల్పమే, దాని నిర్వహింప
శక్తినొసగుము దయతోడ జానకీశ ।

శ్రీమహావిష్ణువే కర్మచేయువాడు
అతడె ఫలభోక్త ప్రేరకుండతడె తలప ।
కర్మయును వానిదే, ఉపకరణమేను
ఈ రచన విశ్వశుభము కల్గించుగాక ॥
తండ్రి శ్రీనివాసుడు వేద ధరుడు గురుడు
సాధ్వి రామానుజమ్మ నాజనని యగును,

గుండి వంశ్యుడ కాశ్యప గోత్రజుండ
రామదాసుడ వేంకటనామకుండ.

శ్రియః పతియు, అవాప్త సమస్త కాముడు (పొందబడిన సమస్తమైన కోరికలుగలవాడు, అనగా కోరికలనన్నింటిని పొందినవాడు), సమస్త కల్యాణ గుణగణములు గలవాడును, సర్వేశ్వరుడును అయిన శ్రీమన్నారాయణుడు "వైకుంఠేతుపరేలోకే శ్రియాసార్థం జగత్పతిః ఆస్తేవిష్ణు రచింత్యాత్మా భక్తైర్భాగవతైస్సహ"॥ - (పరలోకమైన వైకుంఠమందు అచింత్యాత్మయు, జగత్ప్రభువును, అగు శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితోకూడ భక్తులతో భాగవతులతోగూడ ఉంటున్నాడు) అని చెప్పబడినట్లు శ్రీవైకుంఠమనెడి దివ్యలోకమునందు తిరుమామణి మంటపమున శ్రీభూనీళాదులతోకూడ రత్నసింహాసనమునందు కూర్చున్నవాడై నిత్యులతో ముక్తులతోడను ఎల్లప్పుడు సేవింపబడుచున్న పాదపద్మములు గలవాడు. అయినప్పటికిని ఆనిత్యముక్తులవలెనే తన పాద కమల ద్వంద్వమును సేవించుటకు తగినవారైనను, అట్టి భాగ్యములేక ప్రళయకాలమునందు ప్రకృతిలో విలీనమై మైనములో (జంటిమైనము లో) నద్దిన బంగారు పిసరుల వంటి క్షీణించిన జ్ఞానముగల జీవులను గాంచి "ఏవం సంసృతి చక్రస్థే భ్రామ్యమాణే స్వకర్మభిః జీవే దుఃఖాకులే విష్ణోఃకృపాకాప్యుప జాయతే (ఇట్లు సంసార చక్రమందు పడియున్న జీవుడు తమతమ కర్మలచేత నానాయోనులలో పుట్టుచు గిట్టుచు దుఃఖపరంపరల ననుభవించుచు నల్లాడుచుండగా విష్ణువునకు పరుల దుఃఖమును జూచి సహించలేకుండుట, దానిని తొలగించకయుండలేకపోవుట యనెడి దయ కలుగును) అని చెప్పబడిన విధముగా ఆ శ్రీమన్నారాయణుడు జీవుల యెడ కరుణించిన మనస్సు గలవాడగును. విచిత్రాదేహ సంపత్తిః ఈశ్వరాయనివేదితుం। పూర్వమేవకృతా బ్రహ్మన్ హస్తపాదాది సంయుతా ॥ (బ్రాహ్మణోత్తమా! చేతులు కాళ్ళు మొదలగు వానితో కూడిన దైన విచిత్రమైన దేహసంపత్తి ఈశ్వరునికి సేవచేయు నిమిత్తమె భగవంతునిచే పూర్వము జీవునికి నిర్మించి ఈయబడినది) అని చెప్పబడిన ప్రకారముగా పరమాత్మ మహత్తుమొదలైన వానిసృష్టి క్రమముగా జేసి, జీవులకు తన పాదపద్మముల నాశ్రయించుటకు తగినట్లుగా ఉచితములైన కరణకళేబరముల నొసంగినాడు. నది దాటుటకు ఈయబడిన ఓడలతో నదీవేగము ననుసరించి సముద్రమును జేరి మునిగినట్లు, ఈ జీవులు పరమాత్మచే నీయబడిన ఆ ఇంద్రియ శరీరముల చేతనే పరమాత్మను మరచి, ఇతర విషయములందాసక్తులు కాగా, మానవులయిన జీవులకు మంచిచెడ్డలు తెలియుటకై "శాసనాచ్ఛాస్త్రమ్" (ఇది చేయుము. ఇది చేయకూడదు అని శాసించుట వలన శాస్త్రమనబడును) అని చెప్పబడిన ప్రకారముగా, ఆ శ్రీమన్నారాయణుడు తన ఆజ్ఞారూపములైన వేదములనెడి శాస్త్రమును ప్రవర్తింపజేసెను. అయినప్పటికిని, ఆ శాస్త్రమునందు అప్రతిపత్తి, విప్రతి పత్తి, అన్యథా ప్రతిపత్తులచేత మానవులచే ఆవేదము అనాదరింపబడగా, తన శాసనము నతిక్రమించిన జనులను తాను స్వయముగానే సాధించుటకు రాజు బయలుదేరి వచ్చినట్లు, తన నడవడి ద్వారా జీవులను అనగా మనుష్యులను శిక్షించుటకు శ్రీరాముడు మొదలైన రూపములతో నానా విధములుగా నవతరించగోరిన వాడయ్యెను. ఈ లోపల బ్రహ్మ మొదలైన దేవతాసమూహములచే నభ్యర్థితుడై, తన నారాధించు దశరథుని యొక్క మనోరథమును కూడ పూరించుటకుగాను శ్రీమన్నారాయణుడు నాలుగు విధములుగా నవతరించెను. అందు శ్రీరాముడుగా నవతరించి, రావణాసురుని సంహరించి తండ్రిమాటను పాటించుట మొదలైన సామాన్య ధర్మముల నాచరించి చూపెను. లక్ష్మణ రూపుడై రావణిని అనగా ఇంద్రజిత్తును నిరసించి భగవంతుని శేషత్వరూపమైన (అనగా భగవంతునికి దాసుడై సేవించుటయను) విశేష ధర్మమును ప్రకటించెను. భరతుడుగా పుట్టి గంధర్వులను పారద్రోలి, భగవత్పారతంత్ర్య రూప విశేషతర ధర్మమును ప్రదర్శించెను, శత్రుఘ్న రూపముతో లవణాసురుని సంహరించి భాగవత శేషత్వధర్మమును బోధించెను.

అట్టి ఈ ధర్మములు, పూర్వమందు జరిగిన అట్టి ఈ పరిశుద్ధమైన కర్మలు తత్కాలమందు మాత్రమే

పర్యవసితములు (జరిగి పరిసమాప్తములు) కాగలవని తలంచిన వాడైన, సకల లోకముల మేలునందు ఆసక్తిగల వాడైన పితామహుడగు బ్రహ్మదేవుడు శ్రీరామ చరిత్రచే పవిత్రముగావింపబడిన శతకోటి ప్రవిస్తరమగు ప్రబంధమును నిర్మించి, నారదుడు మొదలైన వారికి దాని నధ్యయనము చేయించి, భూలోకమందును ఎల్లప్పుడు శ్రీరామ మంత్రము ననుసంధించుటచేత నిర్మలమైన హృదయముగల వాల్మీకి ద్వారా సంక్షిప్తముగా వ్రాయించి ప్రవర్తింపజేయుటకు నారదమునిని పంపించెను. "వాల్మీకినాచ యత్ప్రోక్తం రామోపాఖ్యానముత్తమం। బ్రహ్మణా చోదితం తచ్చ శతకోటి ప్రవిస్తరం । ఆహృత్య నారదేనైవ వాల్మీకాయ నివేదితం" (వాల్మీకిచేత ఉత్తమమైన ఏ శ్రీరామోపాఖ్యానము చెప్పబడినదో, అది మొదట బ్రహ్మచేత శతకోటి ప్రవిస్తరముగా విధింపబడినది, అదియే నారదుని చేత తీసికొని రాబడి వాల్మీకి మహర్షికి తెలుపబడినది) అని ఈ విషయమే మాత్స్య పురాణమునందు చెప్పబడినది. వాల్మీకి గూడ సకల వేదాంతములచేత విహితమైన పరతత్త్వమును నిర్ధారణచేయు కోరికతో యాదృచ్ఛికముగా వచ్చిన నారద మహాముని నడిగి, పరతత్త్వ స్వరూపము నవగతము చేసికొన్నవాడై పిమ్మట ప్రసన్నుడైన బ్రహ్మచేత ఈయబడిన వరము వలన సమస్తమును సాక్షాత్కరించుకొని ప్రబంధమును నిర్మించు శక్తి గలవాడై వేదమునకుపబృంహణమును మొదలుపెట్టి అవేదము యొక్క అర్థమె ప్రధానమైన, సుహృత్సమ్మితమగు ఇతిహాసతను, వ్యంగ్య ప్రధానమైన కాంతాసమ్మితమగు కావ్య తను పురస్కరించుకొనుచు, "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" (కావ్యాలాపములను విడువవలెను) అనెడి నిషేధ వాక్యము అసత్కావ్యమును గూర్చి చెప్పబడినట్లుగా నిర్ధరించుకొని, తన గ్రంథమందు చూచువారి ప్రవృత్తి కొఱకు మొదటి నాలుగు సర్గలచేత తదంగములను కనబరచుచున్నాడు. అందు మొదటి సర్గచేత విషయ ప్రయోజనములను చూపించుచున్నాడు. అచ్చట కూడ "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" - (ఆయాత్మజ్ఞానమును సాష్టాంగ నమస్కారము చేతను, చక్కగా (వినయ పూర్వకముగా సందర్భము ననుసరించి) యడుగుటచేతను శుశ్రూషచేతను తెలిసికొనుము (భగవద్గీత అధ్యా 4. శ్లో. 34) అని చెప్పబడినట్లు జిగీషా ప్రశ్నకాక, జిజ్ఞాసు ప్రశ్నపూర్వకముగా వేదాంత రహస్యమును తెలిసికొనవలసి యుండును. "నాపృష్టః కస్యచిద్బ్రూయాత్" - (అడగబడకుండ ఎవ్వనికిని తత్త్వము చెప్పకూడదు) అని చెప్పబడిన ప్రకారముగా అడుగబడకుండ ఉత్తరమిచ్చుట నిరసింపబడు చున్నది. అందువలన ప్రథమ సర్గలో మొదటి నుండి అయిదు శ్లోకముల చేత ప్రశ్నావిష్కరించుచున్నాడు వాల్మీకి భగవానుడు.

పిమ్మట ప్రారీప్సితమైన గ్రంథము నిర్విఘ్నముగా పరిసమాప్తి యగుటకును, త్వరగా నడచుటకును గురు నమస్కారమును, దేవతా నమస్కారమును కూడ "తపస్స్వాధ్యాయ" అని ఏర్పరచుచున్నాడు. (కూర్చుచున్నాడు)

"ఆచార్యాద్ధైవవిద్యా విదితా సాధిష్ఠం ప్రాపత్ - ఆచార్యవాన్ పురుషోవేద" (ఆచార్యుని వలన తెలిసికొనబడిన విద్యయే మిక్కిలి సాధువైనది. ఆచార్యుడు గల పురుషుడే తెలిసికొనును) ఈ మొదలైన శ్రుతిచే సదాచార్యోపదేశమునకే అతిశయము కలిగి ఉండుట వలన మొదట తన గురువుయొక్క ఆచార్యలక్షణ పూర్తిని తెలుపుచున్నాడు. ద్వితీయాంత పదములచేత - అందు వేదసంపన్నత్వమును చెప్పుచున్నాడు. తపస్స్వాధాయ నిరతం = (తపస్సునందు స్వాధ్యాయము నందునిరతుడు) అని, తపస్సును స్వాధ్యాయమును తపస్స్వాధ్యాయములు. అల్పాచ్తరం పూర్వం అనుసూత్రముచే కొలది అచ్చులున్న పదము సమాసమున పూర్వపదముగా ప్రయుక్తమైనది. తపస్సు అనగా చాంద్రాయణ వ్రతము మొదలగునవి, స్వాధ్యాయమనగా వేదము. "స్వాధ్యాయోవేద తపసోః" అని వైజయంతి = స్వాధ్యాయమునకు వేదము, మరియు తపస్సు అని రెండు విధములైన అర్థములు. తయోర్నిరతం - వానియందు ఎల్లప్పుడు (నిరంతరము) ఆసక్తికలవాడు. అవసరమగుటవలన ఈ రెండును చెప్పబడినవి. మనువును ఇదియె చెప్పినాడు. "తపో విద్యాచ విప్రస్య నిశ్శ్రేయసకరం పరం । తపసాకల్మషంహంతి విద్యయా జ్ఞానమశ్నుతే". తపస్సు, విద్యయును బ్రాహ్మణునికి మిక్కిలి నిశ్శ్రేయసమును కలిగించును - తపస్సుచే పాపము

నశించును విద్యచే జ్ఞానము కలుగును. అని లేక 2, తపస్సనగా జ్ఞానము. తప ఆలోచనే అనుధాతువునుండి ఉత్పన్నమైనది తపశ్శబ్దము, ఇచ్చట వేదమున కూడ "యస్యజ్ఞానమయం తపః" అని కలదు. యోగమని తాత్పర్యము - స్వాధ్యాయమనగా వేదము. దాని యందు నిరతడు తపస్స్వాధ్యాయనిరతుడు. స్వాధ్యాయాద్యోగమాసీత యోగాత్స్వాధ్యాయమావసేత్, స్వాధ్యాయ యోగ సంపత్త్యా గమిష్యతి పరాంగతిం" వేదము వలన యోగమును పొందవలెను, యోగము వలన స్వాధ్యాయమును అభ్యసించవలెను. స్వాధ్యాయ యోగముల సంపత్తితో (చేరికతో) పరమగతిని పొందగలడు. అని చెప్పబడిన ప్రకారముగా యోగ స్వాధ్యాయములందు సక్తుడని అర్థము - లేక 3. తపస్సు అనగా వేదము - తపోహి స్వాధ్యాయః = తపస్సనగా వేదము అని శ్రుతికలదు - స్వాధ్యాయమనగా జపము, స్వాధ్యాయో వేదజపయోః = స్వాధ్యాయమనగా వేదజపములు" అని చెప్పబడుటవలన - వానియందు నిరతుడు.

స్వాధ్యాయాన్మాప్రమదః । స్వాధ్యాయము (వేదాధ్యయనము) వలన ఏమఱకుము, వేదమేవజపేన్నిత్యం" వేదమునే నిత్యము జపించవలెను. అని చెప్పబడిన రీతిగా ఆరెంటియందు (వేదాధ్యయనము - జపములందు) సక్తుడని అర్థము - లేక 4) తపస్సనగా బ్రహ్మము. బ్రహ్మైతదుపాస్స్వైతత్తపః (ఈబ్రహ్మమునుపాసించుము, ఈ బ్రహ్మోపాసనమే తపస్సు) అని శ్రుతి ఉండుట వలన - తపస్సు (బ్రహ్మము) ప్రధానముగా గల స్వాధ్యాయము. తప స్స్వాధ్యాయము శాకపార్థివాదులవలె మధ్యమ పదలోపి సమాసము. వేదాంత మని తాత్పర్యము. దాని యందు నిరతుడు. "స్వాధ్యాయప్రవచనాభ్యాంనప్రమదితవ్యం" అని చెప్పబడిన ప్రకారము అధ్యయనాధ్యాపనాదు-లందు ఆసక్తుడు అని అర్థము - లేక 5) తపస్సనగా వ్యాకరణము. వాక్యపదీయమునందట్లు చెప్పబడినది. ఆసన్నం బ్రహ్మణస్తస్య తపసాముత్తమంతపః, ప్రథమం ఛందసా మంగ మాహుర్వ్యాకరణం బుధాః ॥ (ఆబ్రహ్మమునకు దగ్గరలోనున్నది, తపస్సులలో ఉత్తమమైన తపస్సు, వేదములకు మొదటి అంగము వ్యాకరణము అని బుధులు చెప్పుదురు) అది ఇతరమైన అంశములకును ఉపలక్షణము, దీనితో (వ్యాకరణాద్యంగములతో) కూడిన స్వాధ్యాయము తపస్స్వాధ్యాయము. దానియందు నిరతుడు - అంగములతోకూడ వేదము నధ్యయనము చేసినవాడని అర్థము (సాంగవేదాధ్యాయి) లేక 6) తపస్సు స్వమ్ము (సొత్తు-ధనము) గా గలవాడు తపస్వుడు - అధ్యాయమనగా వేదము. అందువలన "స్వాధ్యాయోధ్యేతవ్యః" తనశాఖా వేదమును అధ్యయనము చేయవలసినది. అనుచోట స్వస్య అధ్యాయః స్వాధ్యాయః తనశాఖకు చెందిన వేదము అని ఆచార్యులచే వ్యాఖ్యానింపబడినది దానియందు నిరతుడు అధ్యాయనిరతడు - తపస్వుడును, అధ్యాయనిరతుడును తపస్వాధ్యాయనిరతుడు అని కర్మధారయ సమాపము. లేక 7) తపస్సనగా బ్రహ్మము. తద్రూపమైన స్వాధ్యాయము తపస్స్వాధ్యాయము, దాని యందు నిరతుడు, అనగా సామగానలోలుడని యర్థము - వేదానాం సామవేదోస్మి అని గీతయందు భగవంతునిచే చెప్పబడుట వలన - ఇట్లు వేదాధ్యయనము చెప్పబడినది - పిమ్మట - "యదధీతమవిజ్ఞాతం నిగదేనైవ శబ్ద్యతే - అనగ్నా వివ శుష్కైధోన తజ్జ్వలతి కర్హిచిత్ - (అర్థము తెలియని అధ్యయనము స్పష్టమైన పలుకుచే ధ్వనిచేయబడినట్లు (వ్యర్థము) ఎండిన సమిధ నిప్పులేని బూడిదయందు వేసిన ఒకప్పుడు అది మండదు కదా।) అన్నట్లు కేవలాధ్యయనము నిందితమగుట వలన, వేదము యొక్క యర్థమును దెలిసినవాడగుటను - వాగ్విదాంవరుడని చెప్పెను - వాక్ అనగా వేదము. "అనాది నిధనాహ్యేషా వాగుత్సృష్టా స్వయంభువా" ఆద్యంతములు (పుట్టుక నాశములు) లేని ఈ వాక్కు - వేదము స్వయం భువైన పరమాత్మచే ఉత్సృష్టమైనది. (ఉచ్ఛ్వాస నిశ్వాస రూపమైనది వేదము) అని వాక్ శబ్దము వేదమునందు ప్రయోగింపబడుట వలన - దానిని విదంతి దెలిసికొనువారు వాగ్విదులు - వేదార్థజ్ఞులు. వారి నడుమ వరుడు అనగా శ్రేష్ఠుడు వాగ్విదాం వరుడు - నిర్ధారణమున షష్ఠి విభక్తి వచ్చును. లేక - 2) వాక్ అనగా వ్యాకరణము. "యశ్చవ్యాకురుతే వాచం, వాగ్యోగ విద్దుష్యతి చాపశబ్దైః" ఈ

మొదలగువానియందు శిష్టులచేత వ్యాకరణ పర్యాయముగా వాక్ శబ్దము వ్యవహరింపబడుటవలన, ఇది ఇతర అంగములకు ఉపలక్షణము - ఆరంగములను దెలిసికొన్న వారిలో అగ్రేసరుడని యర్థము - దీనిచేత వేదార్థమును తెలిసికొన్నవాడని అర్థాత్సిద్ధమైనది. లేక - 3) వాగ్విదులు అనగా వివక్షితమగు అర్థమును ప్రతిపాదింపదగిన శబ్దములను ప్రయోగించుటను దెలిసినవారు. వారిలో వరుడు-శ్రేష్ఠుడు - పూర్వము వేదాధ్యయనము చెప్పబడినది. (వేదములను చదువుట చెప్పబడినది) ఇచ్చట దానిని అధ్యాపనము చేయుట (చెప్పుట)ను చెప్పబడుచున్నది - లేక గోబలీవర్ద న్యాయమున - వాక్కులు అనగా వేదవ్యతిరిక్తములైన శాస్త్రములు అని అర్థము - వానిని దెలిసికొన్న వారిలో వరుడు - శ్రేష్ఠుడు - దీనిచేత 14 విద్యల యొక్క స్థానమును దెలిసినవాడని చెప్పబడినది. లేక 4) భూమ విద్యాప్రారంభమున నారదునిచే తనకు సకల విద్యలు తెలిసియుండుట చెప్పబడినది. "ఋగ్వేదంభగవోధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థ మితిహాస పురాణం పంచమం వేదానాంవేదం పిత్ర్యం రాశిం దైవం నిధిం వాకోవాక్యమేకాయనం బ్రహ్మవిద్యాం దేవవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాం నక్షత్ర విద్యాం సర్వదేవ విద్యాం ఏతత్ భగవోధ్యేమి" అని, అదియిచ్చట వాగ్విదాంవరమని చెప్పబడినది. లేక

5. వాక్ అనగా సరస్వతి. "గీర్వాగ్వాణీ సరస్వతీ" అని సరస్వతికి పర్యాయపదములుగా చెప్పబడుట వలన - సరస్వతిచే 'విద్యంతే' - పొందబడినవారు అని వాగ్విదులు - సరస్వతి పుత్రులు మరీచి మొదలగువారు, భగవద్భక్తులగుటచేత వారిలో వరుడు శ్రేష్ఠుడు. దీనిచేత ఆభిజాత్యము - ఉత్తమకులమున పుట్టుట చెప్పబడినది. తపస్స్వాధ్యాయ నిరతుడు అను దానిచేత విద్య చెప్పబడినది. ముని పుంగవుండని సమాహితత్వమును చెప్పినాడు. దీనిచేత "అభిజన విద్యాసముపేతం సమాహితం సంస్కర్తారమీప్సేత్" అని ఆపస్తంబుని చేత చెప్పబడిన ఆచార్య లక్షణము జ్ఞాపకము చేయబడినది (గుర్తు చేయబడినది) మునులు మనన స్వభావముగలవారు, పుమాంశ్చాసౌ గౌశ్చ. పుంగవః - శ్రేష్ఠుడని యర్థము. "బుధేచ, పుంగవశ్శ్రేష్ఠే వృషభే భిషజాంవరే" అని విశ్వనిఘంటువు - పుంగవ శబ్దము బుధునికిని, శ్రేష్ఠునికిని, వృషభమునకు, వైద్యశ్రేష్ఠునికిని పేరులు. మునులయందు పుంగవుడు మునిపుంగవుడు. సప్తమీతి యోగవిభాగాత్ నాగోత్తమాదివత్సమాసః॥ తపస్స్వాధ్యాయనిరతుడు అను దానిచేత వేదార్థము యొక్క శ్రవణము చెప్పబడినది. వాగ్విదాంవరం అనుదానిచేత మననమును, ముని పుంగవం అనుదానిచేత నిదిధ్యాసనము చెప్పబడినది. లేక 6. "తస్మాద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్ బాల్యం చపాండిత్యంచ నిర్విద్యాథమునిః" అని చెప్పబడిన క్రమముగా ఈ మూడు పదములచేత పాండిత్య - బాల్య - మౌనములు చెప్పబడినవి. నరునికి సంబంధించినదినారము - అజ్ఞానమని అర్థము. తద్ద్యతి-ఖండయతీతి - దానిని ఖండించువాడు నారదుడు - దో అవఖండనే. పురాణమునందు" నారదోనాశయన్నేతి నృణామజ్ఞానజంతమః మనుష్యులకు అజ్ఞానము వలన కలిగిన చీకటిని నాశనము చేయువాడు నారదుడు" - అని చెప్పబడినది. లేక 7) నారము అనగా జ్ఞానము. తద్దదాతీతినారదః = దాని నొసంగువాడు గావున నారదుడు. లేక 8) నరతి సద్గతిం ప్రాపయతీతి నరః = సద్గతిని పొందించువాడు నరుడు అనగా పరమాత్మ - నృనయే అని ధాతువు. భారతమునందు "నరతీతి నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః" పొందించువాడు కావున నరుడని సనాతనమైన పరమాత్మ చెప్పబడుచున్నాడు - (పరమాత్మకు పేరు) అతడే నారుడు - తందదాత్యుపదిశతీతి నారదః = అతని గూర్చి ఉపదేశించువాడు కావున నారదుడు - ఇట్లు ఆచార్య లక్షణ పూర్తిని చెప్పి అధికారత్వ సంపూర్తిని ప్రదర్శించుటకై తపస్వి అను మొదలగు దానిచే శిష్య లక్షణము చెప్పియున్నాడు - తపః అస్యఅస్తీతి తపస్వీ - తపస్సు గలవాడు తపస్వి. మతు బర్థమందు విన్ ప్రత్యయము వచ్చినది - భూమాదులు మత్వర్థములు - "భూమనిందా ప్రశంసాసు నిత్యయోగేతిశాయినే - సంసర్గేస్తి వివక్షాయాం భవంతి మతుబాదయః" అని మతు బర్థములు వచ్చు చోటులు చెప్పబడినవి. తపస్వి అనగా ప్రశస్తమైన తపస్సు గలవాడు అని యర్థము. దానిచేత 'తపసాబ్రహ్మనిజిజ్ఞాసస్వ'

సతతపోతప్యత । సతపస్తప్త్వా । ఆనందో(బ్రహ్మేతి వ్యజానాత్, అని వినబడిన బ్రహ్మను తెలుసుకొనదగిన సాధనము తపస్సు అని చెప్పబడినది. లేక తపస్సు అనగా వేదము మరియు వ్యాకరణ జ్ఞానము కూడ. అది గలవాడు తపస్వి. అట్లే అధ్యయనము చేయబడిన, అంగములతో కూడిన, ఉపనిషత్తులతో కూడిన వేదము కలవాడు, పొందబడిన అల్పమైన, అస్థిరమైన ఫలము లొసంగు కేవలకర్మల యొక్క జ్ఞానము కలవాడు అని చెప్పబడినది. తపస్సనగా నిర్వేదము అనియు అర్థము. "తపస్వీ తాపసే శోచ్యే" అని వైజయంతీ. దానిచేత మోక్షమునందు అభిలాష కలిగినవాడు అని చెప్పబడినది. అట్టివాడే బ్రహ్మజ్ఞానమునందు అధికారి. తపస్వి అని యనుటచేత శమము దమము మొదలైన సంపత్తి కలవాడని సిద్ధించినది. లేక, తపస్సు అనగా న్యాసము - (భరసమర్పణము). "తస్మాన్న్యా సమేషాంతపసామతిరిక్తమాహుః" (అందువలన ఈతపస్సులలో భరసమర్పణము (శరణాగతి - న్యాసము) గొప్పదని చెప్పుదురు.) అని శ్రుతివలన - న్యాసమనగా శరణాగతి. ప్రణిపాతరూపమైనది. ఇట్లు (తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అని ఈ మొదలైన చెప్పబడిన ప్రణిపాత పురస్సరమైనవి చూపబడినవి.

వల్మీకస్యాపత్యం వాల్మీకిః = వల్మీకము (పుట్ట) యొక్క సంతానము వాల్మీకి. ఇతడు భృగుపుత్రుడని కనబడుచుండగా వల్మీకము యొక్క అపత్యమని ఎట్లు చెప్పుట అట్లే విష్ణు పురాణమునందును "ఋక్షోభూ ద్భార్గవ స్తస్మాద్వాల్మీకి ర్యోభిధీయతే (ఎవడు వాల్మీకియని చెప్పబడుచున్నాడో, అతడు భృగుపుత్రుడు (భార్గవుడు) అయిన ఋక్షుడు అని చెప్పబడినది. ఇచ్చట ఉత్తర కాండయందు "భార్గవేనేతి సంస్కృతౌ ((లవకుశులు) భార్గవునిచే సంస్కరింపబడినవారు). భార్గవేన తపస్వినా" (భార్గవుడను ఋషిచేత)" అని చెప్పగలడుకూడ. మరొక చోట ప్రచేతసునియొక్క కుమారుడగుట చెప్పబడినది." చక్రే ప్రచేతసః పుత్రస్తం బ్రహ్మాప్యన్వమన్యత". (ప్రచేతసుని యొక్క పుత్రుడు రచించెను దానిని బ్రహ్మకూడ అనుమోదించెను." అనియు, "వేదః ప్రాచేతసాదాసీత్" (వేదము ప్రాచేతసుని నుండి రామాయణ రూపమున నవతరించినది" అనియును ప్రసిద్ధమైనది. అందువలన ఇతడు వల్మీకమునకు సంతానమగుట యెట్లు"?. చెప్పబడుచున్నది మిక్కిలి నిశ్చలమైన తపో విశేషముచేత పుట్టినవాడనుట వల్మీకము (పుట్ట) చుట్టు పుట్ట ఏర్పడి ప్రచేతసుడగువరుణునిచేత ఎడతెగకుండ వర్షము కురిపింపబడుట చేత ఇతని యొక్క ప్రాదుర్భావము (జన్మ) అయినందున భృగుపుత్రుడైన ఇతనికే ప్రచేతసునికి పుత్రుడగుటయు. వల్మీకాపత్యత్వమును సమకూరుచున్నది. అచ్చట కేవలము పుట్టుటచేత దాని సంతానమగుట ఎట్లు సిద్ధము? గోణీ పుత్రుడు, కలశీసుతుడు ఇత్యాదివ్యవహారమునకు దాని పుట్టుక యందును అధికముగా ఉప లబ్ధియుండుట వలన - బ్రహ్మవైవర్త పురాణమునందు ఇట్లు చెప్పబడినది. "అథాబ్రవీన్మహాతేజా బ్రహ్మలోక పితామహః। వల్మీక ప్రభవోయస్మాత్తస్మా ద్వాల్మీకి రిత్యసౌ" వల్మీకమునందు నుండి పుట్టిన వాడగుటచే ఇతడు వాల్మీకియని మహా తేజస్సుగల లోక పితామహుడైన బ్రహ్మచెప్పెను." అని, ఇచ్చట అపత్యార్థత్వము కాకపోవుగాక. అయినను వాల్మీకి శబ్దము సాధువే" గర్గాదులయందు పఠింపబడుట వలన, లేక - భృగువంశమునందు పుట్టిన ప్రచేతసుడను పేరుగలవాడొకడుండెను. ఇతడు అతని యొక్క పుత్రుడు ఋక్షుడను పేరుగలవాడు "చక్రేప్రచేతసఃపుత్రః" అని పుత్రుడగుట చెప్పబడుటవలన భార్గవ-భృగునందన శబ్దములు రామునియందు రాఘవ రఘునందన శబ్దములవలె గ్రహింపదగినది. పుత్రుడగుట అనెడి ఉపచారము వలన వాల్మీకి శబ్దమును. ఇందువలన ఒకప్పుడు వాల్మీకి మహర్షి చేత అని సంబంధ మాత్రముతో ప్రయోగింపబడుచున్నది. ఇతర నామములున్నప్పటికిన్ని వాల్మీకి శబ్దముతో పిలుచుట జ్ఞానమున కంగమైన శమదమాదులు పొందియుండుటను స్ఫురింపచేయుట కొఱకు - పరిపప్రచ్ఛ - ప్రరి = విశేషముగా, అడిగినవాడాయెను. "కోన్వస్మిన్ అని ఈ మొదలయినవి ముందు చెప్పబడునవి తపః" అని ప్రత్యేకమైన (వేరైన) పదము బ్రహ్మను చెప్పునది. నారదుని బ్రహ్మనుగూర్చి విశేషముగా అడిగెను అని యర్థము. ఇందువలన ద్వికర్మకత్వమునకు హాని లేదు. పృచ్ఛ్ అనుధాతువునకు ద్వికర్మకత్వము. పరిపప్రచ్ఛ అని

పరోక్షమునందు 'లిట్' (భూతకాలము) ప్రశ్నమునకు పరోక్షత్వము చెప్పబడిన భగవద్గుణముల యొక్క అనుసంధానముచే చేయబడిన వైచిత్ర్యమువలన. సుప్తో౽హంకిలవిలలాప (నిద్రించిన నేను ఏడ్చితినట) అన్నట్లు, లేక, విభక్తి ప్రతిరూపకమైన అవ్యయము. లేక, తనవినయమును తెలుపుట కొఱకు ప్రథమ పురుష నిర్దేశము. ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే౽ర్జున తిష్ఠతి. (అర్జునా! సర్వభూతముల హృదయదేశమునందు ఈశ్వరుడున్నాడు) అన్నట్లు తనయందు అన్యత్వమును (ఇతరుని తనమును) ఆరోపించుకొని పరోక్ష నిర్దేశము. దీనిచేత "పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన, తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం, తస్మై స విద్వానుపసన్నాయ సమ్యక్ ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ, యేనాక్షరం పురుషంవేద సత్యం ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యాం" అని ఆథర్వణికోపనిషత్తు గురువు యొక్క ఆశ్రయణ విషయముగానే ఉపబృంహణముచేయబడినది. (వివరింపబడినది) అట్లే గదా! తపస్వి అను దానిచేత, కర్మచితములైన లోకములను పరీక్షించి (పరీక్ష్యలోకాన్‌కర్మచితాన్) బ్రాహ్మణుడు నిర్వేదము నొందును. అనుదాని యొక్క అర్థము సూచింపబడినది అంగములతోకూడిన, ఉపనిషత్తులతో కూడిన వేదమునధ్యయనము చేసినవాడు, అల్పమైన అస్థిరమైన ఫలముల నొసంగుకేవల కర్మల యొక్క జ్ఞానమును పొందిన వాడగుటచే మోక్షమునందభిలాష జనించినవాడు (అని) తపస్వి శబ్దముయొక్క అర్థము వర్ణింపబడినది. వాల్మీకిః అనుదానిచేత బాగుగ (చక్కగా) ప్రశాంతమైన మనస్సు కలవాడు, శమముతో కూడినవాడు అను దానియొక్క అర్థము చూపబడినది. స్వాధ్యాయ నిరతుడు అనుదానిచేత శ్రోత్రియుడు అనుశబ్దార్థము చెప్పబడినది. శ్రోత్రియ శ్ఛందో౽ధీతః" (వేదము నధ్యయనము చేసినవాడు శ్రోత్రియుడు) అని శ్రోత్రియ శబ్దార్థము ప్రకాశింప చేయుటవలన. వాగ్విదాంవరం అను దానిచేత బ్రహ్మనిష్ఠుడు అను శబ్దార్థము, నారద శబ్దముచేత గురువు అను శబ్దార్థము, "గుశబ్దస్త్వంధకార స్స్యాత్ రుశబ్దస్తన్నిరోధకః, అంధకార నిరోధిత్వాద్గురు రిత్యభిధీయతే" అని కదా గురుశబ్దము యొక్క నిరుక్తి. (నిర్వచనము) పరిపప్రచ్ఛ, అనుదానిచేత బ్రహ్మను తెలుసుకొనుట కొఱకు అతడు గురువు దగ్గరకే పోవలెను. (గురువునే ఆశ్రయించవలెను) అని ఉపపాదింపబడినది. విధివదుపసన్నః పప్రచ్ఛ (విధి (శాస్త్రము) ప్రకారముగా ఆశ్రయించినవాడై అడుగవలెను) అని శ్రుతి చెప్పుచున్నది.

ఇచ్చట బ్రహ్మను తెలుపునట్టి 'తప' శ్శబ్దముయొక్క ప్రయోగము చేత దేవతా నమస్కారరూపమైన మంగళమాచరింపబడినది. అట్లు చెప్పబడినది. "అ ఇతి భగవతోనారాయణస్య ప్రథమాభిధానం అభిదధతా కిన్నామ మంగళ నకృతం మితి. "అ" అని భగవంతుడైన నారాయణుని యొక్క మొదటి పేరును చెప్పుటచేత (ధరించుట చేత) మంగళమేమి చేయబడలేదు! (అన్ని విధములైన మంగళము లాచరించినట్లె) అనియు, దేవతా వాచకాశ్శబ్దా యేచ భద్రాదివాచకాః। తేసర్వేమంగళార్థాః స్యుర్లిపితో గణతో౽పివా (దేవతావాచకములైన శబ్దములు. భద్రము మొదలైన శుభసూచకములైన శబ్దములు - అవి అన్నియు వ్రాసినను, లెక్కించినను (చెప్పినను) మంగళార్థములు అగును.) అనియును చెప్పబడినది. నిరతిశయానంద రూపుడైన, తపోజ్ఞాన రూపుడైన బ్రహ్మమును చక్కగా ధ్యానించి అనియు అర్థము. దేవతానమస్కారమును, గురునమస్కారమును చేసిన వాడగును ఎట్లు? తపస్సునందు నిరతుడైన నారదుని నమస్కరించి (ధ్యానించి) అడిగెను అని. లేక పరి = చక్కగా పూజించి అని అర్థము - "పరిస్సమంతతో భావవ్యాప్త దోషకథాసుచ। భాషాశ్లేషే పూజనేచ వర్జనే వచనే శుభే" అని చెప్పుట వలన. నారదుని చక్కగా పూజించి అడిగెను అని అర్థము.

"పరాశరం మునివరం కృత పౌర్వాహ్ణికక్రియం। మైత్రేయః పరిపప్రచ్ఛ ప్రణిపత్యాభివాద్యచ" అన్నట్లు. ఈ రామాయణము గాయత్రియొక్క అక్షర సంఖ్యాను సారముగా 24 వేల గ్రంథసంఖ్యతో ప్రవృత్తమైనదగుట వలన మొదటి వేయి ప్రారంభమునందు తకారము ప్రయోగింపదగినది అని బ్రహ్మను తెలుపునట్టి ఇతర

శబ్దములనేకము లున్నను తపశ్శబ్దము యొక్క ప్రయోగము (చేయబడినది) - ప్రబంధాదియంది (కావ్యప్రారంభమునందు) తకారము యొక్క ప్రయోగము ఆవశ్యకము కూడ - అప్రబంధవక్తకు, వాచకమునకు (ప్రబంధమునకు, చదువువానికి) సౌఖ్యము కలిగింపజేయునదగుట వలన - అట్లె చెప్పబడినది - "వస్తు లాభకరో ణస్తు, తకార స్సౌఖ్యదాయకః" (ణకారము వస్తు లాభమును కలిగించును, తకారము సౌఖ్యము నొసంగును) అని సాహిత్య చూడామణి యందును, "తకారో విఘ్ననాశకః" తకారము విఘ్నములను నశింపజేయును" అని చెప్పబడినది. ఇంతేకాకుండ తకారమునకు జలము భూతము, బృహస్పతి దేవత, ఇందువలన దీనిచేత ప్రబంధారంభము శుభావహము. ఇందువలననే చమత్కార చంద్రికయందు చెప్పబడినది." వర్ణముల (అక్షరముల యొక్క) పుట్టుక, పిదప వ్యక్తి, అటు తర్వాత సంఖ్య, తరువాత భూతము యొక్కయు, బీజము యొక్కయు విచారము, పిమ్మట వర్ణముల యొక్క గ్రహములుకూడ" అని మొదలిడి దీనినంతయు తెలియకుండ కవి ఒకవేళ పద్యమును చెప్పినచో, కేతకి (మొగిలి) చెట్టునెక్కిన కోతివలె కంటక పీడితుడగును అని. (వర్ణానాముద్భవః పశ్చాద్ వ్యక్తిస్సంఖ్యాతతః పరం । భూతబీజవిచారశ్చతతోవర్ణ గ్రహాఅపి. అని మొదలుపెట్టి 'ఏతత్సర్వ-మవిజ్ఞాయ యదిపద్యం వదేత్కవిః కేతకారూఢ కపివ ద్భవేత్ కంటకపీడితః") అని, "కారణాత్పంచ భూతానా ముద్భూతా మాతృకాయతః, అతో భూతాత్మకావర్ణాః పంచపంచ విభాగతః వాయ్వగ్ని భూజలాకాశాః పంచాశల్లిపయః క్రమాత్। పంచహ్రస్వాః పంచదీర్ఘాః బింద్వంతా స్సంధయస్తథా। తత్రస్వరేశ స్సూర్యోయం క్షవర్గేశస్తులోహితః చవర్గ ప్రభవః కావ్యష్టవర్గాద్బుధసంభవః, తవర్గోత్థః సురగురుః పవర్గోత్థశ్శనైశ్చరః యవర్గజోయం శీతాంశురితి సప్తగ్రహాః క్రమాత్॥ అని.

(పంచభూతములు కారణముగా మాతృకలు పుట్టినవి. కావున వర్ణములు భూతాత్మకములు, 50 అక్షరములు క్రమముగా వాయువు, అగ్ని, భూమి, జలము, ఆకాశములుగా ఐదు, ఐదు చొ॥న విభాగములు చేయబడినవి. ఐదు హ్రస్వములు, ఐదు దీర్ఘములు, బిందువులు అంతములు, సంధులు. అందు అచ్చులకు అధిపతి సూర్యుడు, కవర్గాధిపతి అంగారకుడు. శుక్రుడు చవర్గమువలన, టవర్గము వలన బుధుడు, తవర్గమునుండి సురగురువు బృహస్పతి, పవర్గమునుండి శనైశ్చరుడు, యవర్గమునుండి చంద్రుడు క్రమముగా సప్త గ్రహములు పుట్టియున్నారు. (వానికి అధిపతులు వారు).

ఇచ్చట తపస్స్వా అనియగణము. ఆది లఘువు తరువాత రెండు గురువులుండుట వలన - "ఆదిమధ్యావసానేషు యరతా యాంతిలాఘవం, భజసా గౌరవం యాంతి మనౌతు గురులాఘవౌ" అని. యగణప్రయోగము అర్థకరమని చమత్కార చంద్రికయందు చెప్పబడినది. "కరోత్యర్థా నాదిలఘు ర్యగణోవాయుదైవతమ్" - వాయుదేవతాకమైన మొదట లఘువు గల యగణము అర్థములను కలిగించును) అని - శంక :- తపమనగా తాపము, సుతరాం ఆధిఃస్వాధిః - మిక్కిలి అధి,- స్వాధి, తయోః ఆయేనిరతం = వానియొక్క ఆయమునందు నిరతుడు అని గ్రంథారంభమునందు అశ్లీలవచనము తగనిది (అనుచితమైనది) అని శంక - "అశ్లీలం తదమాంగళ్యం జుగుప్సావ్రీడదీకరం' అశ్లీల వచనము అశుభమును, జుగుప్సను, సిగ్గును కలిగించును" అని చెప్పబడినది. ఈ ప్రయోగమట్లనుచితమైనది. అని శంకరాగా - ఇట్లనగూడదు - ప్రసిద్ధి యొక్క విశేషము (ఆధిక్యత) చేత మొట్టమొదట తపోవేదములే బుద్ధికి తోచుట వలన అశ్లీలత్వ ప్రసంగము లేకపోవుట వలన - ఎట్లనగా - భగినీ, లింగము మొదలగు ప్రయోగములందు వలెనె. ఇచట తరుచుగా అంతట పథ్యావక్త్రమగు వృత్తము వాడబడినది. "యుజోర్జేన సరిద్భర్తుః పథ్యావక్త్రం ప్రకీర్తితం" - అని వృత్తరత్నాకరమందు లక్షణము చెప్పబడినది. అచ్చటచ్చట వృత్త విశేషములు సందర్భాను సారముగా చెప్పబడగలవు. తకారము మాటిమాటికి ఆవృత్తియగుటచే వృత్త్యను ప్రాసమనెడి శబ్దాలంకారముగలదు. "వర్ణసామ్య మనుప్రాస" అని కావ్యప్రకాశమునందు చెప్పబడినది - విశేషణములు

సాభిప్రాయముగా ప్రయుక్తములగుటచే పరికరమను అర్థాలంకారము కలదు. "విశేషణానాం సాభిప్రాయత్వే పరికరః" అని అలంకార సర్వస్వమునందు చెప్పబడినది. తపస్స్వాధ్యాయములందు నిరతత్వము మొదలైనవానికి గురువును ఆశ్రయించుటకు కారణమైన జ్ఞానానుష్ఠానములు ప్రతిపాదింపబడుట వలన పదార్థ హేతుకమైన కావ్యలింగాలంకారమును చెప్పబడును. "హేతోర్వాక్య పదార్థత్వే కావ్యలింగముదాహృతమ్" అను లక్షణము వలన - ఇచ్చట వాల్మీకి నారదుల యొక్క స్వరూప కథనముచేత శిష్యాచార్యులచే ఇట్లు ఉండదగినది అని స్ఫురించుట వలన వాక్యగత వస్తువుతో వస్తు ధ్వని -

కోన్వస్మిన్ సాంప్రతంలోకే గుణవాన్ కశ్చవీర్యవాన్ । ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ॥ 2	(వాల్మీకిమహర్షి నారద మహామునిని ఇట్లు ప్రశ్నించుచున్నాడు) ఈ లోకంలో ఈ కాలంలో ఇప్పుడు గుణవంతు డెవ్వడు? వీర్యవంతుడెవ్వడు? ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్యుడు, ధృఢవ్రతుడును ఎవ్వడు? 2
చారిత్రేణచ కోయుక్తః సర్వభూతేషు కోహితః । విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైక ప్రియదర్శనః ॥ 3	చారిత్రముతో కూడినవాడు ఎవ్వడు? సర్వభూతములయందు హితుడెవ్వడు? విద్వాంసుడెవ్వడు? సమర్థుడెవ్వడు? ఏకప్రియదర్శనుడెవ్వడు? 3
ఆత్మవాన్కో జితక్రోధో ద్యుతిమాన్ కోనసూయకః । కస్యబిభ్యతిదేవాశ్చ జాతరోషస్య సంయుగే ॥ 4	ఆత్మవంతుడు జితక్రోధుడునెవ్వడు ద్యుతిమంతుడు, అసూయలేనివాడెవ్వడు యుద్ధములో ఎవనికి కోపము కలిగిన, దేవతలు కూడ భయపడుదురో అట్టి నరుడెవ్వడు? 4
(కఉదారః సమర్థశ్చ త్రైలోక్యస్యాపి రక్షణే । కఃప్రజానుగ్రహరతః కోనిధిర్గుణ సంపదాం ॥ సమగ్రారూపిణీలక్ష్మీః కమేకం సంశ్రితానరం । అనిలానల సూర్యేందు శక్రోపేంద్ర సమశ్చకః) ॥ అధిక పాఠము.	

ఎట్లు ప్రశ్నించెను అనెడి ఆకాంక్ష కలుగగా ప్రశ్నించిన రీతిని కోను అని మొదలైన మూడు శ్లోకములచేత తెలుపుచున్నాడు. నుఃపృచ్ఛాయాం, "నుఃపృచ్ఛాయాం వికల్పేచ" (ను-ఇది ప్రశ్నయందును, వికల్పమందును వర్తించును. ప్రశ్నకు, కోనుధావతి - ఎవడు పరుగెత్తుచున్నాడు, వికల్పమునకు భీమోను ఫల్గునోను యోద్ధా - యోద్ధ భీముడా లేక ఫల్గునుడా? ఉదాహరణములు) అని అమరము. అస్మిన్‌లోకే = ఈ భూలోకమునందు, సాంప్రతం - ఈ కాలములో, ఇప్పుడు "అస్మిన్‌కాలేధునేదానీం సంప్రత్యేతర్హి సాంప్రతం" అని బాణనిఘంటువు - ఇతర లోకములో విష్ణువునకు (ఈ గుణములుండుట) తెలియబడుటవలనను, ఈ భూలోకమునందే కాలాంతరమందు అనగా జరిగిన కాలమునందు నృసింహస్వామి మొదలగు అవతారములకు (ఈ గుణములుండుట) ప్రసిద్ధమగుటవలనను, వాని నుండి వేరుపరచుటకై ఇచ్చట సాంప్రతం - ఈ కాలములో - ఇప్పుడు అని చెప్పబడినది. (గుణాఃఅస్య సంతీతి గుణవాన్) గుణవంతుడు = గుణములు కలవాడు. ఈ

లోకమునందు ఈ కాలమునందు, సకల కల్యాణ గుణ సంపన్నుడెవ్వడు అని అర్థము. ఇట్లు సామాన్యముగా గుణ సముదాయము కలవానిని అడిగి ప్రత్యేకించి (విశేషించి) వీర్యవంతుడెవడు అని మొదలగు వానిచే ఆయా గుణముల కాశ్రయము కలవానిని గూర్చి అడుగుచున్నాడు. లేక - గుణ్యతే ఆవర్త్యతే పునఃపునరాశ్రితై రనుసంధీయతే ఇతి గుణః = ఆశ్రితులచేత మరల మరల చెప్పుకొని అనుసంధింపబడునది గుణమనబడును. అది సౌశీల్యమే. సుశీలంహినామ మహతో మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషః, తస్యాధిక్యం సౌశీల్యం = అని నిర్వచనము, మంచి శీలము గలవాడు సుశీలుడు. సుశీలుని ధర్మము సౌశీల్యము. కుల, ధన, విద్యాదులచేత తాను గొప్పవాడయ్యు వానిలో తనకంటె తక్కువయినవారితో అరమరికలేకుండ కలిసియుండువాడు సుశీలుడు. వాని ధర్మము (గొప్పతనము) సౌశీల్యము. అట్టి సౌశీల్యము గలవాడు గుణవంతుడు. సౌశీల్యమునందే గుణ శబ్దము పెద్దలచేత ప్రయోగింపబడినది. "వశీవదాన్యో గుణవాన్ ఋజుశ్శుచిః" అని ఆళవందార్లు తమ స్తోత్రరత్నములో ప్రయోగించినారు. సౌశీల్యము గలవాడెవ్వడని అర్థము. అంతట ప్రశ్న అనుసరించును. కింశబ్దము కూడ (ఎవ్వడు అను పదము) ప్రయోగింపబడని స్థలమునందును అన్వయించుకొనవలెను. ఒకేఒక్క కింశబ్దము (ఎవడు) అను పదముచేత ఉపపత్తి యగుచుండగా ఆదరాతిశయమువలన మరల మరల దాని ప్రయోగము ప్రధాన గుణమునకు వలెనే ఆవృత్త్యభిప్రాయముతో చెప్పబడినది. లోకమునందు గుణముయొక్క సంబంధము వలన గుణికి అతిశయము (ఉండును) ఇచ్చటనయితే, గుణి యొక్క సంబంధము వలన గుణమునకతిశయము (కలిగినది) అని తెలుపుట కొరకై గుణికి ప్రథమా (విభక్తి) నిర్దేశమైనది. గుణములు సత్యజ్ఞానములని చెప్పుటవలన - 2 కశ్చవీర్యవాన్. ఎవడు వీర్యవంతుడు. చకారము చెప్పబడిన వానియొక్క సముచ్చయమునందు వాడబడును. (సముచ్చయము అనగా చెదరిన వస్తువులను (విషయములను) ఒక దిక్కున గూర్చుట - వికారమునకు హేతువులు ఉండియున్నను వికారములేకపోవుట వీర్యము. వికారము అనగా మార్పు. వీర్యముగల ఔషధము అని మొదలైన వానియందు వికారము లేకపోవుటను చూడవచ్చును. అట్టి వీర్యము కలవాడు వీర్యవంతుడు. ధర్మము అలౌకికమైన శ్రేయస్సునకు సాధనమైనది. అది రెండు విధములు. సామాన్య ధర్మము, విశేష ధర్మము. ఇట్టి రెండు విధములైన ధర్మములను తెలిసినవాడు ధర్మజ్ఞుడు. చకారము చెప్పబడని వాని సముచ్చయమును, విషయములను తెలుపును. విడువదగిన అధర్మములను కూడ తెలిసినవాడని అర్థము.

కృతజ్ఞుడు = చేయబడిన ఉపకారము స్వల్పమైనను, ప్రాసంగికమైనను (అనుకోకుండ తటస్థించినను) తెలిసికొన్నవాడు కృతజ్ఞుడు. ఇచ్చట చశబ్దముయొక్క అర్థము అపకారమును స్మరింపకపోవుట. (తలచకుండుట) "నస్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా । కథంచిదుపకారేణ కృతేనైకేనతుష్యతి" అని ముందు చెప్పగలడు. (ఎవరైన అనుకొనియో అనుకొనకయో, ఏదో ఒక రీతిగా ఒక్క ఉపకారమును చేసినను శ్రీరాముడు సంతోషించును. వంద అపకారములు చేసినను ఆత్మవంతుడగుటచేత మంచిమనస్సుగలవాడగుటచేత ఆ అపకారములను మరచిపోవును - ఈ శ్లోకములచే రాముని కృతజ్ఞత ప్రకటింపబడినది.

సత్యవాక్యుడు - కష్టములయందుకూడ అసత్యములేని వాక్కులు కలవాడు సత్యవాక్యుడు. అట్లే చెప్పగలడు. "అనృతంనోక్తపూర్వంమే నచవక్ష్యేకదాచన" అని, ఎంతకష్టమైనను అసత్యమును మాటాడకుండువాడు. (ఇంతకుపూర్వము అసత్యము పలుకలేదు. ఇకముందెప్పుడు కూడ పలుకను) అని శ్రీరామునిమాట. దృఢవ్రతుడు = నిశ్చలమైన సంకల్పముకలవాడు - "అప్యహం జీవితం జహ్యాం త్వాంవాసీతేసలక్ష్మణాం । నతుప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః. (సీతా! నేను జీవితమును విడిచినను విడుతునుగాక! నిన్ను వదలవలసి వచ్చినను వదలుదును గాక, లక్ష్మణుని ఎడబాయవలసివచ్చినను ఎడబాయుదును, కాని విశేషముగా బ్రహ్మవేత్తలగుమునులకు

మాటయిచ్చి, దానిని దప్పను - తప్పక నెరవేర్తును.)" అని చెప్పగలడు.

చారిత్రేణచకోయుక్తః = చరిత్రమనగా ఆచారము. అదియే చారిత్రము. వాయస రాక్షసాది శబ్దములకువలె స్వార్థమునందు అణ్‌ప్రత్యయము వచ్చినది. చారిత్రముతో కూడినవాడు - ఎల్లప్పుడును కులాచారమును విడువని వాడని అర్థము.

కులీన మకులీనంవా శుచింవా యదివాశుచిం । చారిత్రమేవ వ్యాఖ్యాతి వీరం పురుషమానినం. ఒక వ్యక్తి ఉత్తమ కులమునకు చెందినవాడా, కాడా, పవిత్రుడా లేక అపవిత్రుడా, వీరుడా కాక పిరికివాడా అనుదానిని చారిత్రమే (నడవడియే - ఆచారమే) వ్యాఖ్యానించును. అని ముందు చెప్పగలడు.

భూత శబ్దముచేత తాను, పరులు అనెడి తారతమ్యము లేకపోవుట చెప్పబడినది. సర్వ శబ్దముచేత తప్పుచేసిన వారి విషయమునందుకూడ (సాపరాధుల యందును) మేలుచేయుట చెప్పబడినది. కావున సర్వభూతేషు-సమస్త ప్రాణుల విషయమున, "భూతం ఖాదౌచ జంతౌచ నస్త్రియాం గుణసత్త్వయోః" అని బాణనిఘంటువు. హితః = మేలుకూర్చువాడు - మేలును గోరువాడు. (భూత శబ్దము ఆకాశాదులకు, ప్రాణులకు, గుణమునకు సత్వమునకును పేరులు) కః = ఎవ్వడు.

విద్వాంసుడు-వేత్తీతివిద్వాన్ = తెలిసినవాడు. సకల శాస్త్రములను ఎఱింగినవాడు. సమర్థుడు = సర్వకార్య ధురంధరుడు. ఏకప్రియదర్శనుడు = ఎల్లరకు, ఎల్లవేళల ఏకరూపముగ ప్రియమైన దర్శనము గలవాడు. (ప్రియందర్శనం యస్యాసౌ ప్రియదర్శనః) రాముడు వలె ఇతరుడు ఎవ్వడు లోకమునందు ప్రియదర్శనుడు లేడని అర్థము. లేక - లోకమునందు కొందరి దర్శనము ఒకప్పుడు ప్రియమును, ప్రీతిని మరొకప్పుడు అప్రీతిని (అప్రియమును) కలిగించును. "తస్మాద్దుఃఖాత్మకం నాస్తి నచకించిత్సుఖాత్మకం" - అందువలన కేవలము దుఃఖమును కలిగించునది గాని లేక కేవలము సుఖము కల్గించునదియేగాని లోకమునందు లేదు. ఎల్లవేళల ప్రియమైయుండవు. అనువచనము వలన, ఇతడట్లుకాదు - ఎల్లప్పుడునందరకు తాను ప్రియదర్శనుడై యుండును. ఇంతేకాకుండ "క్షణేక్షణే యన్నవతా ముపైతి తదేవరూపం రమణీయతాయాః" (ఎంతజూచినను, చూచినకొలది క్షణ క్షణమేది క్రొత్తదనమును పొందునో, అదియే సౌందర్యము యొక్క రూపము) అని చెప్పబడిన రీతిగా ఎల్లప్పుడు అనుభవించుచున్నను క్రొత్తదిగా, అపూర్వముగా ఆశ్చర్యమును కలిగించువాడు అని యర్థము. అట్లే ముందు చెప్పగలడు. సదైక ప్రియదర్శనుడు అని. "ఏకముఖ్యాన్యకేవలాః" అని అమరము. ఏకశబ్దము ప్రధానమైన దానికిని, ప్రకృతమైనదానికంటె వేఱైనదానికిని, సహాయములేక ఒకటైన దానికిని పేరు) అనిరెండు చోట్లను అర్థము. ఆత్మవంతుడు = ధైర్యవంతుడు - 'ఆత్మా జీవే ధృతౌదేహే స్వభావే పరమాత్మని' - (ఆత్మాయత్నో ధృతిర్బుద్ధి స్స్వభావోబ్రహ్మవర్ష్మచ) ఆత్మ శబ్దము జీవునికి, ధైర్యమునకు, దేహమునకు, స్వభావమునకు, పరమాత్మకును పేరు) అని అమరము - చలించని ధైర్యము కలవాడు అని అర్థము.

జితక్రోధుడు - విధేయమైన (వశపడిన, తన వశమందుండిన) కోపము గలవాడు. దండార్హులైన (దండించతగిన) వారియందే హితముకాని కోపముగలవాడు అని అర్థము, క్రోధమాహారయత్తీవ్రమ్ - (క్రోధము తెప్పించుకొనెను) అని ముందు చెప్పగలడు గదా. ద్యుతిమంతుడు - కాంతిమంతుడు - "రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతాం । దదృశుర్విస్మితాకారా రామస్య వనవాసినః (రాముని యొక్క శరీర సౌందర్యమును, శోభను (కాంతిని), లావణ్యమును సౌకుమార్యమును, పవిత్ర వేషమును అరణ్యవాసులైనమునులు, ఆశ్చర్యమునొందినవారై చూచిరి) అని చెప్పగలడు.

అనసూయకుడు = అసూయలేనివాడు. అసూయకుడు కాని వాడు. గుణములయందు దోషావిష్కరణము

అసూయ, అసూయాతు దోషారోపో గుణేష్వపి (మంచి గుణములు గలిగి యున్నను పరుని యందు చెడు గుణములను ఆరోపించుట అసూయ అనబడును) అని అమరకోశము. దేవాశ్చ (దేవతలును) అని చకారముచే అసురులు మొదలైనవారు సముదాయముగా చెప్పబడుచున్నారు. యుద్ధమునందెవని వలన కోపము జనించినచో దేవతలు మొదలైన వారందరు భయపడుదురో అని అన్వయము. శత్రు విషయమైన (శత్రువులను గూర్చిన) కోపము మిత్రులకు కూడ భయమును కలిగించునని అర్థము. లేక, చకారమునకు కూడ (అపి) అని అర్థము. అనుకూలురు (ను) భయపడదురు, ఇంక ప్రతికూలురు (భయపడకపోవుట) ఏమి! అని యర్థము. లేక - యుద్ధమునందు రోషము కలిగిన ఎవనికి భయపడుదురు? అనియైనా అన్వయము చేయవచ్చును.

ఈ మూడు శ్లోకములందు గుణ సమృద్ధిగల వస్తువు యొక్క వర్ణన వలన ఉదాత్తాలంకారము కలదు.

తనిశ్లోకి :

1) కోన్వస్మిన్ సాంప్రతంలోకే గుణవాన్కశ్చవీర్యవాన్ ।
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యోదృఢవ్రతః ॥

హేమారవిందమువలె (బంగారు కమలమువలె) ఆశ్రయవైలక్షణ్యముచేత తనకు సమానమైనది, తనకంటె అధికమైనది లేదు అని చెప్పుటకు 'కోను' (ఎవడున్నాడు) అని మొదట ధర్మి నిర్దేశింప బడినాడు. ఇట్టి గుణములు గలవాడు (ఇట్టివాడు) అప్రాకృతమైన దివ్యలోకమునందు విష్ణువు తెలియబడినవాడె, తెలిసినవాడె, ఈ లోకమునందు ఇచ్చట ఎవడు అని ప్రశ్న. ఇప్పుడు (సాంప్రతం), నరసింహస్వామి మొదలగు వారు కాలాంతరము నందు కలరు, ఇట్లును, నిస్సమాభ్యధికత్వముచేత పరుడును, దేశము చేతను, కాలముచేతను, దూరమునందున్నవాడుగాక దగ్గరగా నున్న వాడును సులభుడును ఎవడు అని ప్రశ్న. సౌలభ్యమునందు కూడ తామరాకు మీది నీరు (అంటనివాడు) అనుదాని వ్యావృత్తి కొఱకై (వేరుచేయుటకై) గుణవంతుడని చెప్పెను. గుణశబ్దము సౌశీల్యమును తెలుపునది. సౌశీల్యమనగా "మహతః మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషః" - (జాతివిద్యాధనాదుల చేత) చాలగొప్ప వాడయ్యును, తనకంటె తక్కువ వారితో గాఢముగా అరమరికలేక కలిసి యుండెడి గుణము, (అనగా కలిసియుండుట). లేక గుణశబ్దముచేత హేయగుణములకంటె వేరైన అనంతమైన ప్రశస్తమైన (మంచి) కల్యాణగుణములు చెప్పబడుచున్నవి. ప్రశ్న సమాధానములందు హేయగుణవ్యతిరిక్తమైన కల్యాణ గుణములు ప్రతిపాదించుట వలన కల్యాణ గుణములు చెప్పబడినవనియే గ్రహింపవలెను. వీర్యవంతుడు - తాను వికారముచెందక పరులకు వికారమును (మార్పును) కలిగించుట వీరవత్త్వము. చకారప్రయోగము "పరాక్రమమును" అని అర్థమును తెలుపును. ధర్మజ్ఞుడు - "ఏకతః క్రతువత్సర్వే సమగ్ర వర దక్షిణాః। ఏకతో భయభీతస్యప్రాణినః ప్రాణరక్షణం" (ఒకరి వలన యజ్ఞమువలె అందరు సమగ్రముగా శ్రేష్ఠమైన దక్షిణగలవారగుదురు. ఒకరివలన భయముచే భీతుడైన ప్రాణియొక్క ప్రాణరక్షణము జరుగును) అని మొదలుగా చెప్పబడిన విశేషమైన ధర్మముల యొక్క జ్ఞానము కలవాడు, చకారము చేత రక్షణ త్యాగము (రక్షించుటను విడుచుట - కాపాడక పోవుట) మొదలైన అధర్మ విశేషములను మిక్కిలి హేయముగా తెలిసికొన్నవాడని అర్థము. కృతజ్ఞుడు - స్వల్పమైనదైనను, ప్రాసంగికమైనను (అనుకొనియో - అనుకొనకయో ఏదో ఒక విధముగా చేసిన దైనను) ఆశ్రితులు చేసిన యుపకారమును అనేక విధములుగా, గొప్పగా, తెలిసికొన్నవాడని అర్థము, అట్లే అలసత్వము చేత ఒక్కడు కూడ దానిని చేయడు అయినను ఉపకరించును అని చకారముయొక్క అర్థము. సత్యవాక్యుడు - కష్టములందు కూడ అసత్యవచనములేనివాడు, దృఢవ్రతుడు, ప్రతిజ్ఞ చేయబడిన ఆర్తరక్షణాదులను విడుచుట తనకు హానిగా (కీడుగా) తలంచువాడు, ఎట్టి పరిస్థితి ఏర్పడినను తానుచేసిన ప్రతిజ్ఞను విడువనివాడు - అని అర్థము.

ఏత దిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలంహిమే మహర్షేత్వం సమర్థోసి జ్ఞాతు మేవంవిధం నరం ॥ 5	ఇది వినుటకు నేను కోరుచున్నాను ఏలనన నాకు మిక్కిలి కౌతూహలము కలదు. మహర్షీ! ఇట్టి వాడైన (ఇట్టి గుణములు గలవాడైన) నరుని (పురుషుని) తెలిసికొనుటకు నీవు మిక్కిలి సమర్థుడవు

పిమ్మట ఈ ప్రశ్నము విజిగీషామూలము (వాదించిజయించుటకు కారణము) అని నారదుడు తలంచవచ్చునని తలచినవాడై (ఊహించినవాడై) తన ప్రశ్న జిజ్ఞాసాహేతుకము (తెలిసికొనుకోరికయే కారణముగా గలది) అని సూచించుచు ప్రశ్నమును "ఏతత్" అని ముగించుచున్నాడు. ఏతత్ = ముందు (వెనుక) చెప్పిన గుణముల కాశ్రయభూతమైన వస్తువు. నేను తెలిసికొనగోరినవాడను, విజిగీషువునుకాను - శ్రోతుం = వినుటకు, కాని, నిరసించుటకు కాదు. ఇచ్ఛామి = కోరుచున్నాను, కాని, చెప్పుమని నిర్బంధించుటలేదు. నేనింత మాత్రమే కోరుచున్నాను. నాయందు మీకనుగ్రహముండినచో చెప్పదగుదువు. (చెప్పవలసినది) అని భావము - ఆవిషయమును (కోరుటకు గల కారణమును) 'పరం' అని చెప్పుచున్నాడు. 'హి' అనునది కారణమునందు ప్రయోగింపబడును. "హిర్హేతా వవధారణే" (హి అనునది కారణమునందును, అవధారణమునందు, పాదపూరణమునందును వర్తించును). తుహిచస్మహవైపాదపూరణే అని అమరము -నాకు ఉత్కృష్టమైన (అధికమైన) కౌతూహలము విస్మయము కలిగినందువలన తెలిసికొనగ కోరుచున్నాను అని భావము. లేక, హి = ప్రసిద్ధము గదా! ముఖవికాసము మొదలగు అనుభావములచేత మహర్షియైన మీకిది స్పష్టము అని యర్థము. తన ప్రశ్నకు తగిన సమాధానమొసంగు గురువు దొరకనందు వలన నిర్విణ్ణుడనై ప్రస్తుతమిప్పుడు మీదర్శనముచే మరల ఉదయించిన కోరికగల వాడనైతిని - కావున నేనడిగిన దానిని చెప్పుమని భావము. ఆచార్యుడు (గొప్ప) జ్ఞానముకలవాడై యుండుటను ఊహించి (అనుమానించి) శిష్యునిచే ఆశ్రయణము చేయబడును. (శిష్యుడాశ్రయించును) అనెడి న్యాయముచే నారదునకు అడుగబడిన దానియొక్క విషయమును గూర్చిన జ్ఞానము ఉండియుండుటను గూర్చి (మహర్షే) అని చెపుచున్నాడు, ఋషి = జ్ఞానముయొక్క చివరిదరిచేరినవాడు, గత్యర్థము జ్ఞానార్థము, మహర్షి = గొప్ప ఋషి. ఇది హేతుగర్భ విశేషణము - మహర్షివగుట వలన నీవిటువంటి నరుని (పురుషుని) తెలియుటకు దగినవాడవు. బ్రహ్మ దగ్గర నుండి విశేషములనన్నింటిని దెలిసికొన్న నీవు, ఎట్లు జిజ్ఞాసగల నాకు చెప్పజాలవు అని భావము. ఉత్తర వాక్యార్థమునకు పూర్వ వాక్యార్థము హేతువగుట వలన ఇచ్చట శ్లోకపూర్వార్థమునందు కావ్యలింగాలంకారము. "హేతోర్వాక్య పదార్థత్వే కావ్యలింగ మలంకృతిః" వాక్య పదార్థత్వమునకు హేతువుచెప్పబడినచో కావ్యలింగాలంకారము" - అని లక్షణము. ఉత్తరార్థమునందు పరికరాలంకారము, ఈ రెండింటికి సంకరము, చివరకు 'ఇతి' కరణము తెలిసికొనవలెను. "అని అడిగెను" అని పూర్వముతో సంబంధము. ఇట్లు వాల్మీకి నారదునడిగెను.

తనిశ్లోకి : ఏతదిచ్ఛామ్యహంశ్రోతుం -

• ఇది నేను వినగోరుచున్నాను, నాకు మిక్కిలి కుతూహలమున్నది. మహర్షీ! ఇట్టి (గుణములు గల) వాడైన పురుషుని గూర్చి తెలిసికొనుటకు నీవు మిక్కిలి సమర్థుడవు, ఇంతకు పూర్వమునందు చెప్పబడిన దేశకాల గుణములచే విశిష్టమైన ఈ వస్తువును (అనగా ఈ పురుషుని) గూర్చి వినగోరుచున్నాను. మిక్కిలి కుతూహలముగా నున్నది. కేవలము చెప్పబడిన గుణములతో కూడిన వానియందే కుతూహలముకాదు, మరి, కేవలము ఈ దేశకాలములకు సంబంధించిన నరునియందే కుతూహలముకాదు, కాని ఉభయాత్మకుని యందు - అతనికి

ఆశ్చర్య రూపముండుటచేత అతని గూర్చి వినుటయందు కుతూహలము. 'హి' శబ్దము ప్రసిద్ధియందు ప్రవర్తించును, అంతటను ఆశ్చర్యము యొక్క దర్శనమొంధు కౌతూహలముండుట సుప్రసిద్ధమేకదా! వేదాంతమును వినుట వలన రెండును వేరు వేరు (ప్రత్యేకము) గా నాకు తెలిసినది, కాని అచట కౌతూహలము లేదు, శంక - ఇటువంటి వస్తువు నాచే నెట్లు చెప్పసాధ్యమగును? అని శంక కలుగగా, త్వంసమర్థోసి (నీవు సమర్థుడవు) అని ఇచ్చట చెప్పుచున్నాడు. ఎట్లు నాకు సామర్థ్యమున్నదను ప్రశ్న నాకాంక్షించుకొని, "మహర్షే" - అని అచట చెప్పుచున్నాడు. ఏలననగా, ఋషులు అలౌకికములైన అర్థములను (విషయములను) చూడగలవారు గదా!, కావున అచట 'మహర్షి'వగుట వలన నీకు నాకంటెను వేదాంత రహస్య జ్ఞానము అధికము, అని అర్థము. ఇటువంటి పరమ పురుషుడైన నరుని తెలిసికొనుటకు నీవు శక్తుడవు అని భావము.

శ్రుత్వా చైతత్త్రిలోకజ్ఞో వాల్మీకే ర్నారదో వచః। శ్రూయతామితి చామంత్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్ ॥ 6	మూడు లోకములను తెలిసిన వాడైన నారుదుడు వాల్మీకి యొక్క ఈ మాటను విని సంతోషించినవాడై "వినవలసినది" అని పిలిచి (సగౌరవముగా హెచ్చరించి) సమాధానము చెప్పెను.

వాల్మీకికి రామవృత్తాంతమంతయు తెలిసియుండటచేత నిశ్చయమునందు (నిర్ణయమునందు) అనుమానము కలుగుటకు వీలు లేనందున, వాల్మీకియొక్క ఈ ప్రశ్న సముచితమైనదికాదు గదా! అని శంకపొడచూపును, అయోధ్యాకాండమునందు "ఇతి సీతాచ రామశ్చ లక్ష్మణశ్చ కృతాంజలిః అభిగమ్యాశ్రమం సర్వేవాల్మీకి మభివాదయన్" (సీతయు, రాముడును అంజలి బద్ధుడైన లక్ష్మణుడును ఆశ్రమమును చేరి అందరును (అంజలి బద్ధులై) వాల్మీకి కభివాదము చేసిరి. అని చెప్పగలడు. రామ విషయ మధ్యవర్తి (రాముని దేశములో నున్న) వాల్మీకి రాముని గుణములను ఎట్లు తెలిసికొనజాలడు? "విషయేతే మహారాజ రామవ్యసనకర్శితాః, అపివృక్షాః పరిమ్లానాః సపుష్పాంకుర కోరకాః (దశరథ మహారాజ! నీ రాజ్యమునందు రామునికి కలిగిన ఆపదవలన అందరును కృశించి పోయినారు. పూలు, మొలకలు, మొగ్గలతో గూడ వృక్షములును వాడిపోయినవి" అని చెప్పగలడు. "రామోరామోరామ ఇతి ప్రజానామభవన్ కథాః రామ భూతం జగదభూద్రామే రాజ్యం ప్రశాసతి" = (రాముడు రాముడు రాముడు అని జనుల నడుమ కథలయినవి. రాముడు రాజ్యమును శాసించుచుండగా (పాలించుచుండగా) జగత్తంతయు రామమయమయ్యెను". అని జనుల చేత గూడ విడివిడిగా (ప్రత్యేకముగా) తెలియబడిన రామవైభవము ఈ వాల్మీకి మహాముని ఎట్లు తెలియకుండును. సత్యలోకమునుండి వచ్చిన నారదుడు ఇంతమాత్రమే అడుగబడుట కెట్లు తగియున్నాడు. ఏనారదుడు రాముడని జనులచే వినబడినవాడని ఇట్లు సమాధానము చెప్పును అని శంకరాగా, ఇట్లు చెప్పబడుచున్నది.

ఇది అప్పుడే అనుకొనకుండ స్ఫురించిన ప్రశ్నార్థము కాదు, సమాధానార్థమును కూడ కాదు ఇచ్చట కరతలామలకముగా (అరచేతిలోని ఉసిరిక కాయవలె) తెలియబడినది కాగా, వాల్మీకికి కుతూహలము కలుగకపోవుట వలనను, తెలిసికొని (ఆలోచించి) గుర్తించి చెప్పగలనని చెప్పినమాట కనుపపత్తి వలనను ఇది ప్రశ్నార్థముకాదు, ఉత్తరార్థమును కాదు. కాని వక్త (చెప్పేవారి) యొక్క బోద్ధ (తెలిసికొనేవారి) యొక్క యోగ్యతను బట్టి వేదాంతముల యందు, అనేక విద్యలయందు ఆయా గుణ విశిష్టుడుగా తెలియబడుచున్న పరమతత్వము విష్ణువా, లేక రుద్రుడు మొదలైన వారిలో నొకడా? అని ప్రశ్నార్థము. (ప్రశ్నయొక్క అర్థము). అట్టి వాల్మీకి యొక్క ఈహృదయాన్ని ఆకళింపు (అవగాహనము) చేసికొన్నవాడై, నారద భగవానుడు కూడ రాముడుగా అవతరించిన విష్ణువే వేదాంత

వేద్యుడైన (వేదాంతములచే తెలిసికొనదగిన వాడైన) పురుషుడు, బ్రహ్మ మొదలైన వారందరు, అతని భ్రుకుటి భటులే (బొమముడి ఎటుల త్రిప్పిన అట్లు గ్రహించి సేవజేయువారె), పరతంత్రులే సత్, బ్రహ్మ, ఆత్మ, ఈ మొదలైన శబ్దము లన్నియు పర్యవసాన వృత్తిచేతను, అవయవ వృత్తిచేతను, విష్ణుపరములే అని యిట్టి అభిప్రాయముతో సకల వేదాంతములందు చెప్పబడిన గుణసమూహమంతయు రాముని యందు సమకూర్చి చేర్చుచు (యోజించును) సమాధానము చెప్పుచున్నాడని సర్వము అనవద్యము. (దోషరహితము) సమంజసము.

ఏవంతద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్ (ఇట్లు దానిని (ఆ బ్రహ్మ తత్త్వమును) దెలిసికొనుట కొఱకు అతడు గురువునే పొందవలెను) అని చెప్పబడిన గురూపసదనవిధిని (గురువునాశ్రయించు పద్ధతిని) చక్కగా వివరించి, "యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచ తాంతత్త్వతో బ్రహ్మవిద్యాం" (దేనిచే అక్షరుడైన పురుషుని తెలిసికొనునో, అట్టి బ్రహ్మవిద్యను తత్త్వముతో సత్యముగా చెప్పెను") అని చెప్పబడిన ప్రవచన విధిని వివరించి చెప్పుచున్నాడు (శ్రుత్వా అని ఈ మొదలగువాని చేత) అచట "నా సంవత్సర వాసినే ప్రబ్రూయాత్" (కనీసమొక సంవత్సరమైనను నియమములతో సేవచేస్తూ ఉండని వానికి (బ్రహ్మ తత్త్వమును గూర్చి) చెప్పగూడదు) అని నియమమునకు జ్యేష్ఠపుత్రునికంటె వేరైన వానిని గూర్చిన విషయమగుట వలన, వాల్మీకి భృగుపుత్రుడగుటచే సోదరుని కుమారుడగుట వలన, శుశ్రూష అవసరము లేకుండగనే ప్రీతితో నుపదేశించెను అని "శ్రుత్వాచ" అని చెప్పుచున్నాడు - నారదుడు త్రిలోకజ్ఞుడు.

త్రిలోకజ్ఞుడు = మూడు లోకముల సమాహారము త్రిలోకము, లేక త్రిత్వ విశిష్టమైన (త్రిత్వములతోకూడిన) లోకము త్రిలోకము. నవరసరుచిరాం అనుచోట కావ్య ప్రకాశమునందు అట్లె (అలాగె) వ్యాఖ్యానింపబడుట వలన, లేక దేని యందు మూడులోకములున్నవో (కలవో) అది త్రిలోకము అని బ్రహ్మాండమని చెప్పబడుచున్నది. దానిని తెలిసినవాడు త్రిలోకజ్ఞుడు - భూలోకము, భువర్లోకము, సువర్లోకము అని త్రైలోక్యము. (భూః, భువః సువః అని త్రైలోక్యము) లేక, విష్ణు పురాణము నందు చెప్పబడినట్లు కృతకము, అకృతకము, కృతకాకృతకమని మూడు లోకములు. మహర్లోకము వరకు కృతకము, జనోలోకము కృతకాకృతకము, సత్యలోకము అకృతకమని (చెప్పబడుచున్నది) లేక - లోకులు అనగా జనులు. "లోకస్తు భువనేజనే" (లోకశబ్దము) స్వర్గాదిలోకములందును, జనులయందును వర్తించును) అని అమరకోశము, బద్ధులు, ముక్తులు, నిత్యులు అని మూడు విధములైన లోకులు (జనులు-జీవులు). నారదుడు బ్రహ్మపుత్రుడగుటచేత వారిని తెలిసికొనదగినవాడు. పూర్వము చెప్పబడినట్లు ఇది వ్యంగ్యార్థగర్భము (లోనవ్యంగ్యార్థము గలది). వాల్మీకి యొక్క - తనకభిమతుడైన కుమారుని యొక్క, వచః = పరిపూర్ణమైన అర్థము గల వాక్యమును, శ్రుత్వా = విని, చకారముతో దానినూహించియు అని అర్థము. హృష్టః = తనచే నుపదేశింపబడగలవాడే అడుగుట చేత సంతోషించినవాడై, నూరు కోట్ల శ్లోకములుగా మిగుల విస్తృతమైన రామాయణమునందు తనకవగతమైనవాడే ఇతనిచే అడుగబడుటవలన, రామునియొక్క గుణములను స్మరించుటయనెడి అమృత పానము యొక్క లాభమువలన, అపూర్వమైన (క్రొంగ్రొత్త) శిష్యుని యొక్క లాభము వలనను - సోహం మంత్రవిదేవాస్మి నాత్మవిత్ (అనేను మంత్రవేత్తనే (మంత్రమును తెలిసిన వాడనే) కాని ఆత్మవేత్తను (ఆత్మను - పరమాత్మను - తెలిసినవాడనుకాను) అని చెప్పబడిన ప్రకారముగా, సనత్కుమారుని వద్దకు పోయి తానాశ్రయించుట అనుసంధించుట వలన జనించిన (కలిగిన) తన ఆశ్చర్యమును మిష (ఉపాయము)తో పరిహరించుటకు "శ్రూయతాం" వినుము - వినవలసినది (విందువుగాక) అని, ఆమంత్ర్య = అభిముఖము చేసికొని, శ్రద్ధగా వినుటకు సిద్ధపరచుకొని, వాక్యం = సమాధాన (ఉత్తర) రూపమైన మాటను, అబ్రవీత్ = స్పష్టముగా చెప్పెను.

బహవో దుర్లభాశ్చైవ యేత్వయా కీర్తితా గుణాః । మునే వక్ష్యామ్యహంబుధ్వా తైర్యుక్త శ్ర్శూయతాం నరః ॥ 7	నీచేత కీర్తింపబడిన గుణములు అనేకములు, దుర్లభములు కూడ. మహర్షీ! ఆగుణములతో యుక్తుడైన నరుడెవ్వడో తెలిసికొని (గుర్తించి) నేను చెప్పగలను. వినుము (విందువుగాక)

తాను చెప్పబోవునది అసదుత్తరము (అసత్సమాధానము) అను శంకను పరిహరించుటకై తనకు వాల్మీకి యొక్క అభిప్రాయము తెలిసియుండుటను (బహవః) అని చెప్పుచున్నాడు. లేక వేదాంతములందు చెప్పబడిన గుణములు విష్ణువుకంటె ఇతరమైనచోట (ఇతరమైన వ్యక్తుల యందు) ఉండుట అసంభవమగుట వలన, వార్షికి పురుష శబ్దముచే చెప్పబడుటయు అసంభవమగుట వలన, చతుర్ముఖ సంప్రదాయము వలనను, విష్ణువునందే పరతత్వముండుటయు పరిశేషింపజేయుచు "బహవః" అని చెప్పుచున్నాడు. బహవః = విస్తారములు, అనేక గుణసమూహములకు మూల భూతములు, అనియర్థము. దీని చేత అడుగబడనట్టి చెప్పబోయే గుణములకును కారణము చూపబడినది. లేక, బహవః = అపరిచ్ఛిన్నములు అని యర్థము. యతోవాచో నివర్తంతే - అప్రాప్యమనసాసహ! ఆనందం బ్రహ్మణోవిద్వాన్ - నబిభేతికుతశ్చన (మనస్సుతో కూడపొందలేక - తెలిసికొనలేక వాక్కులు ఎందువలన మరలివచ్చునో, అట్టి బ్రహ్మయొక్క ఆనందమును అపరిచ్ఛిన్నమని తెలిసికొన్నవాడు దేనినుండియు, ఎవరివలన నుండియు భయపడడు" అని గుణముల యొక్క అపరిచ్ఛిన్నత్వము వినబడుచున్నది. ఇచట ఒక ఆనందము యొక్క అపరిచ్ఛిన్నత్వమును చెప్పుట. ఇతర గుణముల యొక్క అపరిచ్ఛిన్నత్వమును చూపుటయే ప్రయోజనముగా గలది. ఉపర్యుపర్యబ్జ భువోపి పూరుషాన్ (బ్రహ్మకంటెనుపైన పైన పూరుషులను) అను మొదలగు వానిచే యామునాచార్యులచేత చెప్పబడినది కదా! దుర్లభాః = దుర్లభములు, పరమ పురుషుని కంటె మరొకచోట చక్కగా తలంపబడనివి, (ఉండజాలనివి) ఇతరులకు - నబ్రహ్మనేశానః (బ్రహకాడు, ఈశానుడు - శంకరుడు కాడు) అను మొదలగు వాని చేత సమ్మానింపదగకుండుట మొదలగు వాక్కుల వలన, అని భావము. దీనిచే ప్రశ్నకు దేవతావిశేషమును నిశ్చయించు గొప్పతనము తనకు తెలిసినదని వ్యంజింపబడినది. చకారము చెప్పబడినవాని సముదాయము యొక్క అర్థము - లేక చెప్పబడనివాని సముచ్చయార్థము - దానిచేత స్వాభావికములైన - సహజములైన - మేరలేని అతిశయము గల లెక్కలేని కల్యాణ రూపములు అని చెప్పబడుట - ఏవకారము మరొకచోట బొత్తిగా తలంపబడకపోవుటను తెలుపుచున్నది. యే=ఏవి, అని వేదాంతములందలి ప్రసిద్ధి చెప్పబడుచున్నది. గుణాః - వీర్యము మొదలైన గుణములు, కీర్తితాః = కీర్తింపబడినవో - అనుటచేత (అనుదానిచేత) గుణముల యొక్క ప్రశ్న కాలమునందే భోగ్య తాతిశయము సూచింపబడుచున్నది. తైర్యుక్తః = వానితో కూడిన వాడు, కల్పింపబడినవాడు కాడు అని నిర్గుణవాదముయొక్క నిరాసము (నిరసనము) నరః = పురుషుడు, పురుషాః, పూరుషానరాః = (పురుషులు, పూరుషులు, నరులు - ఇవి పర్యాయపదములు) అని అమరము.

యఏషోంతరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతె, పురుషః పుండరీకాక్షః (ఆదిత్యుని లోపల ఏయితడు హిరణ్మయుడగు పురుషుడు కనబడుచున్నాడో, ఆ పురుషుడు పుండరీకాక్షుడు) అని శ్రుతి స్మృతులయందున్న పురుష శబ్దము దీనిచే చక్కగా గుర్తింపబడుచున్నది. శ్రూయతాం - వినుము, విందువు గాక, ఏదో ఒక విధముగా ఊహించి నిర్ణయించకుము - శ్రుణు - వినుము అని చెప్పుట వలన వినయోక్తియిది తాత్కాలికముగా కొంచెము ఊహింపబడుచున్నది (కల్పింపబడుచున్నది) అనే భ్రమను తొలగించుచున్నది. అహంబుధ్వా వక్ష్యామి ఇతి (నేను

తెలిసికొని చెప్పగలను అని) నాతండ్రియైన బ్రహ్మయొక్క సమీపమున (సమక్షమున) శతకోటి ప్రవిస్తరమైన రామాయణము ద్వారా తెలిసికొని చెప్పగలను. దీనిచేత తనయొక్క సంప్రదాయాభిజ్ఞత్వము చూపింపబడినది. లేక రామగుణముల యొక్క అనుసంధానముచేత గలిగిన వైచిత్ర్యము (ఆశ్చర్యము) చేత నాకేమియుతోచుచు లేదు (ప్రతిభాసించుటలేదు) క్షణములో తెలిసికొని చెప్పగలను అని అర్థము. ఇందువలన నడుమ వాక్యాంతరము (రెండవ వాక్యము) అలంకారము (సౌందర్యము) కొరకు లేనిచో వాక్యగర్భితమను కావ్యదోషమగును. అహంవక్ష్యామి = నేనుగానయి చెప్పగలను. రామగుణములను వినుటచే శిథిలుడనగుటవలన ఇప్పుడు నేను నారదుడను కాను. రామగుణములందు మునిగిన యితడు నదీప్రవాహమునందు మునిగినవాడువలె ఆధారయష్టిని (పట్టుకొనుటకాధారమైన చేతికఱ్ఱను) కోరుచున్నాడు. మునే ఇతి = మునీ అని - పిమ్మట క్షణముసేపులో సంధుక్షితుడై (రాజ బెట్టబడినవాడై) (తెప్పరిల్లినవాడై) నారదుడు మిగిలిన వాక్యమును (వాక్య శేషమును) త్రైః" అని పూరించుచున్నాడు. నరః = పురుషుడు అనుదానిచేత పరత్వమును నిశ్చయించుట (నిర్ధారణ చేయుట) ప్రశ్న యొక్క ఫలితార్థముగా స్ఫురించుచున్నది. బుధ్వాఅనుటచేత శ్రుతి (వేదము) నందున్న 'తత్' శబ్దముయొక్క అర్థము వివరింపబడినది.

తనిశ్లోకి - "బహవోదుర్లభాశ్చైవ" :-

బహవః = చాల, అడిగిన (చెప్పిన) గుణములు పదహారు అని లెక్కపెట్టుటకు వీలుగానున్నప్పటికిని, అందు ప్రత్యేకముగా ఒక్కొక్క గుణములో అనేక గుణ సమూహములు కలిసియుండుటకు అవకాశము (వీలు) ఉండుటచేత రాశీకరణము వలన (అనగా కుప్పబోయుటవలన) లెక్కింపరానివి - (అసంఖ్యాతములు), దుర్లభాః = ఈశ్వరుడు కానివానియందును, ఈశ్వరునియందును, పరమాకాశమునందు వసించువాని యందును ఇతరమైన అవతారములందును దుర్లభములు (దొరకనివి), కీర్తితాః = వాచిక వ్యాపారముచే ప్రతిపన్నములైనను (అనగా తెలియబడినప్పటికిని) దుర్లభములు, ఇటువంటి ప్రశ్నయందే, (ప్రశ్నవేయుటయందే) ఇతరునికి అధికారము లేదు అని "మునే" - అని సంబోధించి చెప్పుచున్నాడు. మునిః = మననశీలుడు, మననము చేయు స్వభావము గలవాడు, దానిచేత "కుందేటికొమ్ము" యొక్క ప్రశ్నవలె నరునియందు చెప్పబడిన గుణములతో కూడిన ప్రశ్నకు దోషము మూలమగుట తొలగింపబడినది. ఉత్తరము చెప్పుటయందు కూడ ఇతరునకు అధికారము లేదని 'అహం' (నేను) అని చెప్పుచున్నాడు. నాకు గూడ అకస్మాత్తుగా (హఠాత్తుగా) సమాధానము చెప్పుటకు సాధ్యముకాదని (బుద్ధ్వా) తెలిసికొని, అని చెప్పుచున్నాడు, బుద్ధ్వా (తెలిసికొని) అను దానిచేత కోన్వస్మిన్ (ఎవడున్నాడు) అని మొదలైన ప్రశ్నవాక్యములచేత ఉద్బోధింపబడిన (మేలు కొలుపబడిన) శ్రీరాముని యొక్క ఒప్పిదమైన (మనోహరమైన) గుణముల యొక్క అనుసంధానము చేత విస్మరింపబడిన లోకములు గలవాడని సూచింపబడుచున్నది. అట్టి అసంఖ్యేయములైన గుణములతో యుక్తుడైన నరుడైన పురుషుడు ఎవడో, వానిని గూర్చి విందువుగాక. (అతడు నీచే శ్రద్ధాసక్తులచే వినబడునుగాక అని అర్థము).

ఇక్ష్వాకువంశప్రభవో రామోనామ జనైఃశ్రుతః । నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ ॥ 8	ఇక్ష్వాకువంశమున జన్మించినవాడు ప్రజలందరిచేత కీర్తింపబడువాడగు రాముడను పేరుతో ప్రసిద్ధిపొందిన నరుడొకడుగలడు. అతడు నియతాత్ముడు, మహావీర్యుడు, ద్యుతిమంతుడు, ధృతిమంతుడు, సమస్తమును వశీకరించు-కొన్నవాడు.

అనంతరము వేదాంతములందు చెప్పబడిన గుణములను రాముని యందు చూపించుట ద్వారా రామత్వముతో రామునిగా అవతరించిన విష్ణువే వేదాంత వేద్యుడైన పరతత్వమని కనబరచుచున్నాడు. ఇక్ష్వాకువంశప్రభువు అను మొదలైన సర్గశేషముచేత అచట వేదాంతములందు చెప్పబడిన గుణగణములకు నిధియైనవాడు రామునిగా అవతరించిన విష్ణువే అని మహావాక్యము. "ఇక్ష్వాకువంశప్రభవః" అని మొదలుకొని సత్యేధర్మఇవాపరః అను తుదివరకు 11 1/2 శ్లోకములవరకు ఏకాన్వయము. ఒక్కటేసారి అన్వయము చెప్పుకొనవలెను. ఇక్ష్వాకువనువాడు వైవస్వతమనువు యొక్క జ్యేష్ఠ కుమారుడు. అతని యొక్క వంశము పుత్రులు పౌత్రులు మొదలైన వారియొక్క పరంపర "ప్రభవతి అస్మాత్" దీని నుండి ప్రభవించుచున్నది కావున ప్రభవము అనగా ప్రాదుర్భావస్థానము - పుట్టెడు చోటు. ఇక్ష్వాకువంశము ప్రాదుర్భావస్థానముగా గలవాడు ఇక్ష్వాకువంశ ప్రభవుడు - జనకుడు మొదలైన వారి మహాకులములుండగా ఎందువలన ఇచ్చటనే భగవంతుడవతరించినవాడు అనెడి అపేక్షయందు ఇక్ష్వాకు శబ్దము ప్రయుక్తమైనది. ఏలననగా, ఇక్ష్వాకుమహారాజు చాలకాలము విష్ణువునారాధించి, అతని యొక్క అర్చామూర్తి విశేషమైన రంగనాథుని పొందెనని పురాణగాథ కలదు. అందువలన అతని యందలి పక్షపాతముతో అతని వంశమునందవతరించినాడని సూచించుటకు ఇక్ష్వాకు శబ్దము, (ప్రయుక్త మైనది), వంశమను దానిచేత "గుణవంతుడెవ్వడు" అని అడుగబడిన సౌశీల్యము చెప్పబడినది. రమయతి సర్వాన్ గుణైరితిరామః - అందరిని గుణములచేత రమింపజేయుచున్నాడు (ఆనందింపజేయుచున్నాడు) కావున రాముడు "రామో రమయతాం వరః"- రాముడు రమింపజేయువారిలో (ఆనందింపజేయువారిలో) శ్రేష్ఠుడు, అని ఆర్ష (ఋషి యొక్క) నిర్వచన బలము వలన, లేక జనులందరు గుణములచే ఇతనియందు రమింతురు (ఆనందింతురు). అని అగస్త్య సంహితయందు చెప్పబడినది" రమంతే యోగినోనంతే సత్యానందే చిదాత్మని - ఇతిరామపదేనాసౌ పరంబ్రహ్మాభిధీయతే" యోగులు అనంతుడు, సత్యానంద స్వరూపుడు, జ్ఞాన స్వరూపుడగు ఇతని యందు రమింతురు (ఆనందము నొందుదురు) అని ఈ పరంబ్రహ్మ రామపదముచే (రాముడని) చెప్పబడుచున్నాడు" 'నామ' అనునది ప్రసిద్ధియందు ప్రవర్తించును. చిత్రకూటవాసియైన నీచేత తెలియబడినది కదా (నీకు తెలిసినది కదా) అని యర్థము. కేవలము నీచేతనే కాదు, పామరుల చేత కూడ తెలియబడినది (నీకే కాదు పామరులకు కూడా తెలిసినదే) అని యర్థము. (జనైశ్శ్రుతఃఇతి) - శ్రుతః - వినబడినది (నిశ్చయింపబడినది) శ్రుతంశాస్త్రావధృతయోః - (శ్రుతశబ్దము శాస్త్రమునకును, వినబడిన దానికిని పేరు) అని అమరము తాటకి, తాటకేయులైన మారీచ సుబాహుల వధ (సంహారము), విశ్వామిత్రుని యాగ సంరక్షణము, అహల్యా శాప విమోచనము, శివధనుర్భంగము, పరశురాముని నిగ్రహించుట, ఏడు సాలములను భేదించుట, వాలివధ, సముద్రుని బంధించుట, (సేతునిర్మాణము), రావణుని మూలబలమును చంపుట, మొదలగు వానిచేత వినబడిన (తలంపబడిన) నారాయణ భావము అని అర్థము. ఇట్టి వాడైన అతడే నియతాత్ముడు, అతడే మహావీర్యుడు అని యిట్లు చెప్పబోవు ప్రతి పదమునకు అతడే యను పదము కూర్చబడును (అనుసంధింపబడును) రామరూపమున అవతరించిన విష్ణువే వేదాంతములందు చెప్పబడిన ఆయా గుణములు కలవాడు అని అంతట తాత్పర్యార్థము. మొదట స్వరూపము నిరూపించునట్టి (నిరూపకములైన) ధర్మములను (నియతాత్మా అని మొదలగువానిచే) చెప్పుచున్నాడు. నియతాత్మా - నియతమైన (ఎల్లప్పుడును మారని) స్వభావము కలవాడు. నిర్వికారుడు అని భావము. "నాస్యజరయా ఏతజ్జీర్యతే, నవధేనాస్యహన్యతె (శరీరము యొక్క ముసలి తనముచేత ఇతడు (జీవుడు-పరమాత్మ) శిథిలము (వికారము) కాడు, సంహారముతో ఇతడు చంపబడడు) - అపహతపాప్మా, విజరో విమృత్యుర్విశోకో, విజిఘత్సో, అపిపాసః (పాపములంటనివాడు, ముసలితనములేనివాడు, చావులేనివాడు, దుఃఖము

లేనివాడు, ఆకలి లేనివాడు, దప్పిలేనివాడు) అను మొదలైన శ్రుతులు గలవు. మహావీర్యుడు = చింతింపరాని (ఊహింపరాని) వివిధములైన విచిత్రములైన శక్తులు కలవాడు. పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబల క్రియాచ - (ఇతని యొక్క పరా(గొప్పదైన) శక్తి అనేక విధములుగా వినబడుచున్నది. అది స్వాభావికమైనది, జ్ఞానము, బలము, కార్యాచరణమునతో కూడుకొన్నది) అని శ్రుతి.

ద్యుతిమంతుడు = ప్రకాశముగలవాడు (ప్రకాశవంతుడు), స్వయం ప్రకాశుడు, జ్ఞానస్వరూపుడనియు చెప్పవచ్చును. "విజ్ఞాన ఘనఏవ ప్రజ్ఞాన ఘనః (విజ్ఞానఘనుడే ప్రజ్ఞానఘనుడు - (జ్ఞానపు ముద్దయె - అజ్ఞానమే మాత్రము లేని వాడని అర్థము - ప్రకాశమున్నచోట చీకటి యుండనట్లు) అని శ్రుతి, ధృతిమాన్ = ధృతి గలవాడు - నిరతిశయమైన ఆనందముగలవాడు - ధృతి అనగా ఆనందము. ఆనంద స్వరూపుడు - ధృతిస్తు తుష్టిస్సంతోషః (ధృతి తుష్టి, సంతోషము - ఇవి ఆనందవాచకములు) అని వైజయంతి నిఘంటువు. ఆనందోబ్రహ్మ (ఆనందమే పరబ్రహ్మము) అని ఉపనిషత్తు చెప్పుచున్నది. వశీ = సమస్త ప్రపంచము తన వశమునందుండువాడు, సర్వస్వామి అని యర్థము. "సర్వస్యవశీ సర్వస్యేశానః" (సమస్తము తన స్వాధీనమునందు కలవాడు, సమస్తమును (అన్నింటిని) నియమింపగలవాడు, అన్నింటికి ఈశ్వరుడైనవాడు) అని శ్రుతి వాక్యము గలదు.

తనిశ్లోకి = ఇక్ష్వాకువంశ ప్రభవః శ్లో - 8

తర్వాత నారదుడు "చెప్పబడిన నరధర్మము - నారాయణ ధర్మము అనెడి రెండు విధములైన ధర్మములకు వేరువేరు (విడివిడిగా) నడవడిక మాత్రమే ఇతనికి తెలియను, (ఇతనిచే తెలిసికొనబడినది) కాని ఏకధర్మము (నరధర్మము) నందె నారాయణ ధర్మము విశేషముగా (అతిశయముగా) నిలుకడగల్గియుండుట తెలియకుండనున్నది, అదియె అంతరముగ బ్రహ్మతత్వము, బాహ్యముగ నర(రామ) తత్వమును (అనగా బాహ్యముగా నరుని గూర్చిలోన పరుని గూర్చికూడ ప్రశ్నించినట్లు నారదుడు గుర్తించి అట్టి గుణములతో గూడిన వాడై నరుడుగా అవతరించిన ఆపరాత్పరుని గూర్చియే ఉపదేశించవలసియున్నది అనెడి అభిప్రాయముతో సమాధానము చెప్పుచున్నాడు. అందు - ప్రశ్న శ్రేష్ఠమైనది లోకోత్తరమైనది - ఉత్తరము లోకోత్తరమైనది. ఈ రెండింటికి ఆశ్రయమైన (సంబంధించిన) విషయము చెప్పదగినదగుట చేత ఆశ్రయమునకు ఇతర వ్యావర్తకత్వమును (ఇతరమైన వానినుండి వేర్పాటును) తెలుపుచున్నాడు. "ఇక్ష్వాకువంశప్రభవః" అని తపస్సుచే పొందబడిన శ్రీరంగ నాథునియొక్క ఆరాధనయే ఫలముగా గలదగుటచేత ఆవంశమునందే అవతరించినాడు అని 'ఇక్ష్వాకు' శబ్దగ్రహణము. "వైష్ణవోనః కులే జాతస్సన స్సం తారయిష్యతి (వైష్ణవుడు మన కులమునందు పుట్టినవాడు, అతడు మనలను తరింపజేయగలడు) అని ఒక వైష్ణవుని పుట్టుక మాత్రము చేతనే ఆవంశమంతటికి ఉత్తారముకాగలదు. ఎచ్చట (ఏ వంశమునందయితే) అందరును గృహమునందే ఆరాధనము చేసికొనబడుచున్న శ్రీరంగనాథుడు కలవారో అనగా (నిత్యము ఇంటియందె శ్రీ రంగనాథుని ఆరాధించువారో) ఆ వంశమునందే అతడే (పరమాత్మ శ్రీమన్నారాయణుడే) అవతరించినాడు. వంశము యొక్క గొప్పదనమును గూర్చి ఇంకెమి చెప్పవలెను? అని వంశ శబ్దము యొక్క అభిప్రాయము. ప్రభవతి అస్మాదితి ప్రభవః = దీని వలన నుండి పుట్టుచున్నది అని ప్రభవము = ఉత్పత్తి స్థానము. ఇక్ష్వాకువంశము ప్రభవము (ఉత్పత్తి స్థానము) గా గలవాడు (ఇక్ష్వాకువంశః ప్రభవః యస్యసః) అని బహువ్రీహి సమాసము - వంశమును ఉత్పత్తి స్థానముగా చెప్పుటచేత కౌసల్యాదేవి యొక్క గర్భము అప్రాకృతమైన భగవంతుని విగ్రహము లోన ప్రవేశించుటకు నిర్గమించుటకు మాత్రము కారణముగ గలదగుటచేత పుట్టుకకు చోటగుట యని చెప్పినట్లైనది దానిచేత "సుగ్రీవ మారుతి విభీషణ పుణ్యపాద సంచార పూత భవనం ప్రవివేశరామః" సుగ్రీవుడు, హనుమంతుడు, విభీషణుడు - వీరియొక్క పుణ్యమైన (పవిత్రమైన) పాదముల సంచారము (కాళ్ళతో నడచుట) చేత పవిత్రమైన

భవనమును రాముడు (ప్రవేశించెను) అన్నట్లు పవిత్రము గావింపబడిన వంశమును ప్రవేశించుట అనునది వ్యంజింపబడినది (బయలుపరుపబడినది). పిమ్మట ఆశ్రితునియొక్క (ఆశ్రయింపబడినవానియొక్క) వైలక్షణ్యమును (వైశిష్ట్యము - ప్రత్యేకతను) చెప్పుచున్నాడు. (రామః-అని) గుణైః రమయతీతి రామః = గుణములచే రమింపజేయువాడు (ఆనందింపచేయువాడు) రాముడు, రమంతే యోగినోస్మిన్ (ఇతని యందు యోగులు రమింతురు, (ఆనందింతురు), అనియైనను - రాముడు అని రెండు వ్యుత్పత్త్యర్థములు చెప్పవచ్చును. ఇట్లు ఆశ్రితుని యొక్క సమస్త వస్తు విలక్షణత్వము, పరమాకాశము (పరమపదము) నందలి విగ్రహ వైలక్షణ్యమునున్ను చెప్పబడినది. స ఉ శ్రేయాన్ భవతి జాయమానః = సః+ఉ = ఆ పరమాత్మయే జన్మించినవాడై శ్రేయః ప్రదుడగును, శ్రేయాన్+ఉ = పరమాత్మ జన్మశ్రేయః ప్రదమే గాని వేరొక విధముగా ఉండదు. జాయమానః+ఉ = పరమాత్మ పుట్టినవాడయియే శ్రేయః ప్రదుడగును. భవతి+ఉ = జన్మనందిన ఆ పరమాత్మ శ్రేయః ప్రదుడు అయియె తీరును". అని శ్రుతి చెప్పుచున్నది. అవతారవైలక్షణ్యమును "రామం సత్య పరాక్రమం" (సత్యపరాక్రముడైన, సత్యమే పరాక్రమముగా గల - రాముని) అని చెప్పగలడు - నామ అని ప్రసిద్ధియందు ప్రవర్తించును. ప్రసిద్ధియును "తంధీరాసః కవయ ఉన్నయంతి స్వాధియో మనసాదేవయంతః"

అని మొదలైన శ్రుతులయందు చెప్పబడినది. దేవయంతః = స్తుతిశీలురు, స్తుతిచేయుటయే స్వభావముగా గలవారు. ఇట్లు కేవలము వైదికమైన ప్రసిద్ధి మాత్రమే కాదు లౌకికమైన ప్రసిద్ధియు కలదని, (జనైశ్శ్రుతః - అని) చెప్పుచున్నాడు.

నియతాత్మా = అసాధారణమైన దివ్యమంగళ విగ్రహము గలవాడు, మహావీర్యః = మహావీర్యుడు, మహత్త్వము = దోషములు గల ఉపాధి, మేర, (ఎల్ల-హద్దు) సమాతిశయము తనకంటె ఆధిక్యము = ఇవిలేకపోవుట మహత్త్వము = అట్టి మహత్త్వముగలవాడు - ద్యుతిమంతుడు = అత్యంతమైన ద్యుతి - (ప్రకాశము) గలవాడు = ఇచ్చట అతిశయమునందు మతుప్ ప్రత్యయమువచ్చినది - భూమనిందా ప్రశంసాసు నిత్యయోగేతిశాయనే, సంసర్గేస్తి వివక్షాయాం భవంతి మతుబాదయః అనిచెప్పియుండుట వలన. దీనిచేత నీలతోయదము యొక్క నడుమ నున్న మెరుపుతో సమానమైన ఔజ్జ్వల్యము (ప్రకాశము) కలిగియుండుట చెప్పబడినది. "నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా" । అని శ్రుతి. తంతపంత మివాదిత్య ముపపన్నం స్వతేజసా" తేజస్సుతో కూడి సూర్యుని వలె ప్రకాశించుచున్నవాడు అనిముందు చెప్పగలడు. ధృతిమాన్ = ధృతిగలవాడు, ధృతియనగా ధరించుట, (విధరణము) ధైర్యము (ధృతిర్ధారణ ధైర్యయోః) = లోకమును ధరించువాడు. ప్రశాసనమునకు అధీనమైన లోకముగలవాడు అని యర్థము. వశీ = గుణములచే వశీకరింపబడిన సమస్త జనులుగలవాడు, లేక హృషీకేశుడు = హృషీకేశుడనగా జితేంద్రియుడని అర్థము - (హృషీకేశో జితేంద్రియః - అని నిఘంటువు)

బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః । విపులాంసో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః 9	శ్రీరాముడు బుద్ధిమంతుడు, నీతిమంతుడు, వాగ్మి (ప్రశస్తమైన వాక్కుగలవాడు). శ్రీమంతుడు, శత్రువులను సంహరించువాడు, విపులాంసుడు (విశాల (ఎత్తైన) మైన మూపులు (భుజ శిరస్సులు) గలవాడు దీర్ఘభుజుడు, (గొప్ప భుజములు కలవాడు) శంఖమువంటి మెడ గలవాడు, గొప్ప దౌడలు (దవడలు) గలవాడు.

పిమ్మట సృష్టికి ఉపయోగించెడి (ఉపయోగపడు) గుణములను (బుద్ధిమాన్) అని మొదలగువానిచేత చెప్పుచున్నాడు. బుద్ధిమాన్ = సర్వజ్ఞుడు. యస్సర్వజ్ఞస్సర్వవిత్ (ఎవడు సర్వజ్ఞుడు, సర్వవేత్తయో వాడుపరమాత్మ) అని శ్రుతి. (అన్నింటిని పరిపూర్ణముగా విడివిడిగా ఎరుంగగలవాడు సర్వజ్ఞుడు - సర్వజ్ఞత్వము సృష్టించుటకు ఉపయోగించును).

నీతిమాన్ = మర్యాదావంతుడు. ఇచ్చట "ధాతా యథాపూర్వమకల్పయత్, ఏషసేతుర్విధరణః ఏషలోకానామసంభేదాయ" = బ్రహ్మ పూర్వమెట్లున్నదో అట్లే - పూర్వమున్నట్లే సృష్టించెను. ఈ సమస్త లోకములు, గోళములు, గ్రహములు అన్నియు ఒకదానిని ఒకటి తాకి చెడకుండ విడివిడిగా నిలుపువాడు భగవానుడే) అని శ్రుతి కలదు. సృష్టించిన దానిని క్రమబద్ధముగా నడుపుటకు నీతియుండవలెను. (అందులో క్రమబద్ధత - ఒక మర్యాద-ఒక కట్టుబాటు ఉండవలెను). వాగ్మీ = శోభనావాక్ అస్యఅస్తీతి వాగ్మీ - శోభనమైన (ప్రశస్తమైన) వాక్కుగలవాడు. (మేలుకలిగించు, ఆనందమును కలిగించు మంగళకరమగు వాక్కుకలవాడు). మాటయొక్క మంగళకరత్వము జ్ఞాపనముచేయుట కొఱకని వ్యాసకారుడు చెప్పినాడు. వాక్కనగా ఇచట వేదమే. సకల వేదములను ప్రవర్తింపజేసినాడని అర్థము. యోబ్రహ్మాణం విదధాతి పూర్వం - యోవైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై - (ఎవడు పూర్వము బ్రహ్మను సృష్టించినాడో - ఎవడు వేదములనున్ను వానికి ఒసంగినాడో) అని శ్రుతి.

శ్రీమతుండు - సమృద్ధమైన లీలావిభూతి - నిత్యవిభూతి అనెడు రెండు విధములైన విభూతులయొక్క ఐశ్వర్యము (సంపద) గలవాడు. శ్రీః కాంతి సంపదోర్లక్ష్మ్యాం = శ్రీశబ్దము కాంతియందును, సంపదయందును, లక్ష్మియందును చెప్పబడును - అని బాణనిఘంటువు. "సర్వమిదమభ్యాత్తః" అని శ్రుతి.

(నియమన సామర్థ్యమును ఐశ్వర్యమందురు - సమస్త లోకములు అతనిచే నియమింపబడునవి - కావున వానిని తన విభూతిగా గలవాడు శ్రీమంతుడు)

శత్రునిబర్హణుడు = శత్రూన్ తద్విరోధినః నిబర్హయతి ఇతి శత్రునిబర్హణః, బర్హ్ హింసాయాం = తన శత్రువులను నాశనము చేయగలవాడు.

(శరీరమునకు, శరీర సంబంధులకు ఆపద కలిగించువారు శత్రువులు. బాహ్యమగు శత్రువులను, ఆంతరములగు కామక్రోధాది శత్రువులనుగూడ జయింపగలవాడు - భగవంతునకు చేతనాచేతనములతో కూడిన ప్రపంచమే శరీరము. అతనికి ఐశ్వర్యము ప్రపంచమే - కావున అట్టి జగత్తునకు కీడును, వినాశమును కలిగించు శత్రువులను ఉపేక్షింపక నాశనము చేయగలవాడు). ఏషభూతపతి రేషభూతపాలః (ఇతడు సకల భూతములకు భర్త, ఇతడు సమస్త భూతములను పాలించువాడు) అని శ్రుతి.

అథ యఏషోంతరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే హిరణ్యశ్మశ్రు ర్హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వఏవ సువర్ణస్తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ తస్యోదితినామ సఏష సర్వేభ్యః పాప్మభ్యః ఉదిత ఉదేతిహవై సర్వేభ్యః పాప్మభ్యో యఏవంవేద"

అని అంతరాదిత్య విద్యయందు చెప్పబడినట్టి సర్వావయవముల యందు సుందరమైన విగ్రహ స్వరూపమును (విపులాంస, అని మొదలైన) రెండున్నర శ్లోకములచేత చూపించుచున్నాడు.

విపులాంసుడు = విశాలమైన స్కంధములు (మూపులు - భుజశిరస్సులు) గలవాడు. ఉన్నతమైన స్కంధములు కలిగియుండుట మహాపురుష లక్షణమని సాముద్రిక శాస్త్రమునందు చెప్పబడినది. కక్షః, కుక్షిశ్చ, వక్షశ్చ, ఘ్రాణస్కంధౌ, లలాటికా । సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాస్తు సుఖప్రదాః ॥ (చంకలు, కడుపు, వక్షస్థలము, ముక్కు, మూపులు, నుదురు, సర్వప్రాణులయందు ఉన్నతముగా నుండిన సుఖము నొసంగును) అని.

మహాబాహుః = గుండ్రమైన, బలసిన బాహువులు కలవాడు (ఆజానుబాహువు) అని దీర్ఘముగా నుండుటను ముందు చెప్పగలడు. ఆజాను లంబినౌ బాహూవృత్త పీనౌ మహీశ్వరే" (మోకాలి వరకు వ్రేలాడునట్టి వృత్తమైన బలిసిన బాహువులు గలవాడు. భూమీశ్వరుడగును) అని సాముద్రిక లక్షణము. కంబుగ్రీవుడు = శంఖముతో సమానమైన కంఠముగలవాడు. 'ఇందుముఖి' అన్నట్లు శాకపార్థివుడు మొదలైనవానివలె మధ్యమపదలోపి సమాసము. "కంబుగ్రీవశ్చ నృపతిర్లంబకర్ణోతి భూషణః" (కంబుగ్రీవుడు రాజగును, వేలాడు చెవులుగలవాడు మిక్కిలి ఆభరణములు ధరించువాడగును) అని లక్షణము. "రేఖాత్రయాన్వితాగ్రీవా కంబుగ్రీవేతి కథ్యతే" (మూడు రేఖలతో విరాజిల్లు మెడ కంబుగ్రీవమని చెప్పబడును) అని హలాయుధ నిఘంటువు.

మహాహనుః = గొప్పనైన హనువులు (దవడలు) కలవాడు - హనువనగా కపోలములయొక్క మీది భాగము ." అధస్తాచ్చుబుకం గండకపోలౌ తత్పరాహనుః" (పెదవియొక్క క్రిందటి ప్రదేశము చుబుకము (గడ్డము), భక్షించు సమయమునందు చలించు గండకపోలములు (చెక్కిళ్ళు, చెక్కిళ్ళ మీదటి పార్శ్వముగాని, వెనుకటి పార్శ్వముగాని) హనువు అనబడును. హనువు అనగా వెలిదౌడ అని అర్థము.

"మాంసలౌతు హనూయస్య భవతస్త్వీష దున్నతే, సనరోమృష్టమశ్నాతి యావదాయుస్సుఖాన్వితః" (ఎవని దవడలు బలిసినవై కొంచెము ఎత్తుగా నుండునో, ఆ మనుష్యుడు చక్కని భోజనము చేయును. ఆయువున్నంత వరకు సుఖించును) అని లక్షణము.

మహోరస్కో మహేష్వాసో, గూఢజత్రు రరిందమః । ఆజానుబాహు స్సుశిరా స్సులలాట స్సువిక్రమః ॥	10	విశాలమైన వక్షస్థలము కలవాడు, గొప్పధనుస్సు కలవాడు, కనబడని మూపుసంధులు గలవాడు, శత్రువులనణచువాడు, మోకాలి వరకు వ్రేలాడుపొడవైన బాహువులు కలవాడు పెద్ద (చక్కని) శిరస్సు కలవాడు, విశాలమైన మంచి నుదురు కలవాడు, గొప్ప పరాక్రమము కలవాడు, సుందరమైన పదవిన్యాసము గలవాడు.

మహోరస్కుడు = మహత్‌విశాలం ఉరోయస్యఅసౌ = విశాలమైన వక్షస్థలము కలవాడు. ఉరః ప్రభృతిభ్యః కప్ = ఉరస్ మొదలైనవానికి కప్ వచ్చును. అనుసూత్రముచే కప్‌రాగా, మహోరస్కః అనియగును. "స్థిరం విశాలం కఠిన మున్నతం మాంసలం సమం, వక్షోయస్య మహీపాల స్తత్సమో వాభవేన్నరః (స్థిరమైన, విశాలమైన, కఠినమైన, ఉన్నతమైన, బలిసిన, సమమైన వక్షస్థలము ఎవరికుండునో అట్టి మనుష్యుడు రాజుకాని, రాజుతో సమానమైనవాడుగాని అగును.") అని లక్షణము. పీనవక్షాః" అని బలిసియుండుటను ముందుచెప్పగలడు.

మహేష్వాసుడు = మహాన్‌ఇష్వాసోధనుర్యస్య అసౌమహేష్వాసః = గొప్పనైన విల్లుకలవాడు ఇష్వాసమనగా ధనుస్సు - "ధనుశ్చాపౌ ధన్వశరాసనకోదండ కార్ముకం ఇష్వాసోపి" అని అమరకోశము. గొప్పనైన విల్లుకలవాడు, విలుకాడు, దీనిచేత దానికి తగిన శరీర విశేషము గుర్తింపబడుచున్నది. కావున చెప్పబడునట్టి క్రమమునకు విరోధము లేదు.

గూఢ జత్రుః = గూఢే మాంసలత్వేన అప్రకాశే జత్రుణీ అంసద్వయ సంధిగతాస్థినీ యస్యాసౌ గూఢజత్రుః = బలిసియుండుట చేత కనబడని మూపుల సంధులు (సంధులయందలి ఎముకలు) గలవాడు. "స్కంధో భుజశిరోంసోస్త్రీ సంధీతస్యైవ జత్రుణీ" అని అమరము. విషమైర్జత్రుభిర్నిస్వా అతిసూక్ష్మైశ్చ మానవాః - ఉన్నతైర్భోగినో

నిమ్నై ర్నిస్వాః పీనైర్నరాధిపాః" (మూపుసంధులు హెచ్చుతచ్చులై మిక్కిలి చిన్నవైనచో దరిద్రులుగాను, ఉన్నతములైనచో భోగవంతులుగాను, లోతైనచో దరిద్రులుగాను, బలిసినవైనచో రాజులుగాను అగుదురు) అని సాముద్రిక లక్షణము.
అరిందమః = శత్రువును అణచివేయువాడు లేక వెనుకకు త్రిప్పికొట్టువాడు ఇచ్చట అరిశబ్దముచే పాపము చెప్పబడుచున్నది. పాపములు లేనివాడు (అపహత పాప్మా) (నాశనము చేయబడిన పాపములు కలవాడు) అని అర్థము. దీనిచేత విగ్రహ పరిగ్రహము (శరీరమును ప్రేమతో స్వీకరించుట) కర్మమూలముకాదు, కాని అనుగ్రహమూలము "ఇచ్ఛా గృహీతాభిమతోరుదేహః" (కోరికతో స్వీకరింపబడిన ఇష్టమైన గొప్ప దేహము కలవాడు. అని స్మృతి (విష్ణుపురాణము నందు చెప్పబడినది) కావున ప్రక్రమభంగము కాదు.
ఆజానుబాహుః = మోకాళ్ళ వరకు వ్రేలాడుచున్న (మోకాళ్ళను తాకుచున్న) బాహువులు కలవాడు.
సుశిరాః = సుష్ఠుసమంవృత్తంఛత్రాకారం శిరోయస్యాసౌ - సుశిరాః (సమమైన, గుండ్రనైన ఛత్రాకారము వంటి చక్కని శిరస్సు గలవాడు). "సమవృత్త శిరాశ్చైవ ఛత్రాకార శిరాస్తథా । ఏకచ్ఛత్రాం మహీంభుంక్తే దీర్ఘమాయుశ్చ జీవతి" - సమానమైన గుండ్రనైన (చక్కని పెద్ద) తలగలవాడును, ఛత్రము యొక్క ఆకారము వంటి శిరస్సుగలవాడు ఏకచ్ఛత్రాధిపత్యముగా భూమిని పాలించును, దీర్ఘాయువుగలవాడై (బ్రతుకును) అని లక్షణము. సులలాటః = మంచివెడల్పైన నుదురుకలవాడు అని లలాటముయొక్క సౌష్ఠవము (చక్కదనము) చెప్పబడినది.
"అర్ధచంద్రనిభం తుంగం లలాటంయస్యసప్రభుః" (అర్ధచంద్రునితో సమానమైన ఎత్తైన లలాటమెవరికుండునో అతడు రాజగును)' అని లక్షణము.
సువిక్రమః - శోభనో విక్రమః పదవిక్షేపో యస్యాసౌ సువిక్రమః = శోభనమైన పదవిన్యాసము గలవాడు. సువిక్రముడు - శోభనముగా నుండుట (సుందరమైనదగుట) యనగా గజాదితుల్యము.

సింహర్షభ గజవ్యాఘ్రగతయో మనుజామునే,
సర్వత్ర సుఖమేధంతే సర్వత్ర జయినస్సదా ॥ (సింహమువంటి, వృషభమువంటి, ఏనుగువంటి, పెద్దపులి వంటి నడకలు గల మనుష్యులు అంతట విజయవంతులై అంతట సుఖమును పొందుదురు) అని జగద్వల్లభ మను సాముద్రిక శాస్త్రమునందు చెప్పబడినది. అనగా (చతుర్గతిః) నాలుగు విధములైన నడకలు గలవాడు అనుట.

సమ స్సమవిభక్తాంగః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్ । పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః ॥ 11	సముడు, సమముగా విభజించబడిన (ఉన్న) అవయవములు కలవాడు, స్నిగ్ధవర్ణుడు ప్రతాపవంతుడు, బలిసిన వక్షస్థలము కలవాడు, విశాలనేత్రుడు, లక్ష్మీవంతుడు శుభ లక్షణుడు.

సమః = మిక్కిలి (ఎక్కువ) పొడుగుగాక, మిక్కిలి (ఎక్కువ) పొట్టియుగాక యుండువాడు, అట్లగుటను గూర్చి "షణ్ణవత్యంగుళోత్సేధస్సార్వభౌమోభవేన్నృపః" (తొంబది ఆరు అంగుళములు ఎత్తు ఉన్నవాడు సార్వభౌముడగును) అని సాముద్రిక శాస్త్రమునందే చెప్పబడినది.

సమవిభక్తాంగః = సమాని అన్యూనాధికపరిమాణాని విభక్తాని అశ్లిష్టాని, అంగాని కరచరణాద్యవయవా యస్యసః సమవిభక్తాంగః = (ఎక్కువ తక్కువ పరిమాణముకలవి గాక - ఏ అవయవము ఎంత పరిమాణము కలిగియుండిన రూపము అందముగా నుండునో అంతంత పరిమాణముగా - సరిగా విభజించబడిన చేతులు కాళ్ళు మొదలైన అంగములు (అవయవములు) కలవాడు సమవిభక్తాంగుడు -

భ్రువౌనాసా పుటౌ నేత్రే కర్ణావోష్ఠౌచ చూచుకే । కూర్పరౌ మణిబంధౌచ, జానునీ వృషణౌ కటీ । కరౌ పాదౌ స్ఫిజౌ యస్య సమౌ జ్ఞేయౌ సభూపతిః (కనుబొమలు, ముక్కు రంధ్రములు, కన్నులు, చెవులు, పెదవులు, చనుమొనలు (స్తనాగ్రములు), కూర్పరములు (మోచేతులు) చేతిమణికట్టులు మోకాళ్ళు, వృషణములు (ముష్కములు అండములు) పిరుదులు (మొలలు) చేతులు, కాళ్ళు, స్ఫిక్కులు (పిరుదుల యున్నతులు) సమానముగా ఎవరికుండునో అతడు రాజగును) అని సాముద్రికశాస్త్రమునందు ఆ అవయములగూర్చి చెప్పబడినవి. (శరీరమునందు ఒకేరకమైన, ఒకే క్రియ ధర్మము గల అవయవములు రెండు రెండుగా ఉన్నవి - రెండు కన్నులు, రెండు చేతులు మొదలగునవి. ఇందులో ఒక అవయవము పెద్దదిగా, మరొకటి చిన్నదిగా ఉన్నచో చూచుటకు వికారముగా నుండును. అట్లుగాక రెండు సమానముగా నున్నచో చూడదగినవిగానుండును. ఇట్లు అన్ని అవయవములు సమముగా విభక్తమై ఎంత పరిమాణము కలిగి యుండవలెనో అంత పరిమాణము కలిగియుండినచో, శరీరము శోభకలిగి అందముగా నుండును, అట్లున్నవాడు శ్రీరాముడు సమవిభక్తాంగుడు).

స్నిగ్ధవర్ణః - స్నిగ్ధః స్నేహయుక్తో వర్ణః యస్యసః స్నిగ్ధవర్ణః -

స్నేహయుక్తమైన వర్ణము కలవాడు - స్నేహమనగా నునుపు లేక మెరుపు అని యర్థము. రంగు ఎటువంటిదైనను చూచెడివారిని ఆకర్షించునది మెఱుపు, కావున మెరుపుతో గూడిన మనోహరమైన వర్ణము కలవాడు. "చక్షుస్స్నేహేన సౌభాగ్యం దంత స్నేహేన భోజనం త్వచస్స్నేహేన శయ్యాచ పాదస్నేహేన వాహనం" కన్నులయందలి మెరుపు (కాంతి) చే సౌభాగ్యము, దంతములందలి స్నేహముచే మంచి భోజనము, చర్మమునందలి నునుపుచే శయ్యా (భోగము) పాదములందలి నునుపు-మెరుపు చెలిమిచే వాహన లాభము కలుగునని సాముద్రికమునందు వరరుచిచే చెప్పబడినది.

ప్రతాపవాన్ = తేజస్సుగలవాడు. మొత్తముపై శోభతో కూడిన వాడు.

ఎదిరించేవారిని తపింపజేయ జాలిన ప్రతాపము గలవాడు - వేసవిలో ఆచ్ఛాదనలేకుండ ఎండలో నిలుచుట శక్యముకానట్లు రాముని ఎదుట అనాశ్రితులు నిలుచుట అంతకష్టము.

పీనవక్షాః = బలిసిన (మాంసలమైన) వక్షస్థలము గలవాడు.

విశాలాక్షః = విశాలే పద్మ పత్రాయతే అక్షిణీ యస్యసః విశాలాక్షః = తామర రేకులవలె దీర్ఘములైన వెడల్పైన కన్నులు గలవాడు.

రక్తాంతైః పద్మపత్రాభై ర్లోచనై స్సుఖభోగినః" (ఎఱుపు కొనలందుగలిగి (రక్తాంతములైన) కమల పత్రములవంటి నేత్రములు గలవాడు సుఖభోగియగును) అని సాముద్రిక శాస్త్రము నందు చెప్పబడినది.

లక్ష్మీవాన్ - అవయవ శోభతో కూడినవాడు - సర్వాంగసుందరుడు - ఎన్నడును విడదీయుటకు వీలుకాని లక్ష్మీదేవితో కూడియుండువాడు.

శుభలక్షణః = ఇంకను చెప్పబడని సమస్తమైన శుభ (మంచి) లక్షణములతో కూడుకొన్నవాడు -

ధర్మజ్ఞ స్సత్యసంధశ్చ ప్రజానాంచ హితే రతః । యశస్వీ జ్ఞానసంపన్న శ్శుచి ర్వశ్య స్సమాధిమాన్ ॥ 12	ధర్మజ్ఞుడు, (ధర్మమును తెలిసినవాడు) సత్యసంధుడు (సత్యప్రతిజ్ఞ కలవాడు). ప్రజలకు మేలుచేయుట యందాసక్తి గలవాడు. (ప్రజాహితమును కోరువాడు) యశస్వి, జ్ఞానసంపన్నుడు, పరిశుద్ధుడు, పెద్దవారికి లొంగియుండువాడు, సమాధి కలవాడు.

ఇట్లు ఆశ్రితులచే ననుభవింపదగిన దివ్య మంగళ విగ్రహము కలిగియుండుటను చెప్పి ఆశ్రితులైనవారిని రక్షించుటకు కావలసిన గుణములను (ధర్మజ్ఞ మొదలుకొని స్వజనస్యచ రక్షితా అనుదానివరకు ($2^1/_2$ శ్లోకములచే) చెప్పుచున్నాడు.

ధర్మజ్ఞః = ధర్మంశరణాగతరక్షణ రూపం జానాతీతి ధర్మజ్ఞః ॥ శరణాగత రక్షణ రూపమైన (శరణని కోరివచ్చిన వారిని రక్షించుట అను) ధర్మమునెఱింగినవాడు. మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన । దోషోయద్యపితస్య స్యాత్సతామేతదగర్హితం" (స్నేహభావముతో వచ్చిన వానిని ఎప్పుడును, ఏ విధముగానైనను విడిచిపెట్టను. అతనిలో దోషము (తప్పు) ఉండుగాక. సత్పురుషులకిది నిందనీయముకాదు) అని ముందుచెప్పగలడు.

సత్యసంధః = సత్యాసంధా ప్రతిజ్ఞా యస్యసః సత్యసంధః - సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు. ఆడినమాట తప్పనివాడు, చేసిన ప్రతిజ్ఞను వదలక పాటించువాడని అర్థము. సంధా ప్రతిజ్ఞా మర్యాదా (సంధాశబ్దము ప్రతిజ్ఞకును, మర్యాదకును పేరు) అని అమరము.

అప్యహంజీవితం జహ్యాం త్వాంవాసీతే సలక్ష్మణాం । నహిప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః" (నేను ప్రాణములనయినను వదలుదును, లక్ష్మణునితో కూడ నిన్నైనను వదలుదును, కాని బ్రాహ్మణులకు (బ్రహ్మవేత్తలగు ఋషులకు) ప్రత్యేకముగా మాటనిచ్చి (ప్రతిజ్ఞచేసి) దానిని మాత్రము వదలను. (అనగా వారికిచ్చిన మాట తప్పుట నాచేతకాదు) అని ముందు జెప్పగలడు.

ప్రజానాంచహితే రతః = ప్రజలకు - ప్రాణులకు మేలు చేయుటయందు రతుడు (ఆసక్తి - కోరిక గలవాడు)
యశస్వీ = ఆశ్రిత రక్షణైక కీర్తి := ఆశ్రితులను రక్షించుటలో ప్రధానమైన కీర్తిగలవాడు "తస్యనామమహద్యశః" (అతనికి (పరమాత్మకు) మహద్యశుడు (యశస్వి) అని పేరు కలదు) అని ఉపనిషత్తు.
జ్ఞానసంపన్నః= జ్ఞానముతో కూడినవాడు - యస్సర్వజ్ఞ స్సర్వవిత్ (సర్వజ్ఞుడు - సర్వవేత్త = అన్నింటిని సమూహముగా తెలిసికొన్నవాడు, వానినన్నింటిని వేరువేరుగ ప్రత్యేకముగా తెలిసికొన్నవాడు) అని శ్రుతియందు చెప్పబడిన ప్రకారముగా స్వరూపముచే, స్వభావముచే సకల విషయములను ఎరుంగ (తెలిసికొన) గల స్వభావము గలవాడు.
శుచిః = పావనుడు, పరిశుద్ధుడు, ఆర్జవము కలవాడు. కౌటిల్యములేని వాడని తాత్పర్యము. ఋజువైనవాడు - (ముక్కుసూటివాడు) అన్నట్లు = (యోర్థే శుచిః సహిశుచిః = ధనము విషయమున పరిశుద్ధిగలవాడే పరిశుద్ధుడు - ఇంతేగాక (దోషములను అంటనివాడు, దోషములను దూరము చేయువాడు) ఆహార విషయమున, స్త్రీ విషయముననను నియమము పాటించి యుండుటయు శుచిత్వమే - అట్టి శుచిత్వము గలవాడు) పరిశుద్ధిని కలిగించువాడు. పవిత్రాణాం పవిత్రంయో మంగళానాంచమంగళం = పవిత్రములగు పదార్థములకు గూడ పవిత్రతను కలిగించువాడు. వశ్యః = వశంగతుడు - ఆశ్రితులకు పరతంత్రుడు (లోబడినవాడు) విధేయుడు.
సమాధిమాన్ = సమాధి అనగా ఆశ్రితులను రక్షించుటయందలి ఆలోచనము ఇదియే 'యోగము' (చింత ఆలోచనము) అది గలవాడు (ఆశ్రితులను రక్షించుట యందలి ఆలోచనము గలవాడు)

ప్రజాపతి సమ శ్రీమాన్ ధాతా రిపునిషూదనః రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా ॥ 13	బ్రహ్మతో సమానుడు, శ్రీమంతుడు, ధాత, (పోషకుడు) శత్రువులను నిరసించువాడు. జీవ సమూహమును రక్షించువాడు, ధర్మమును పరిరక్షించువాడు.

ప్రజాపతి సమః = బ్రహ్మతోతుల్యుడు - మధ్యేవిరించిగిరిశం ప్రథమావతారం: (బ్రహ్మతో సమానముగా బ్రహ్మవిష్ణుమహేశ్వరులని కీర్తించుటకై బ్రహ్మకు మహేశ్వరునకు మధ్యలో విష్ణువుగా చేరిన మొదటి అవతారమైనవాడు) అని చెప్పబడిన ప్రకారముగా జగద్రక్షణము కొఱకు ప్రజాపతితో సమానముగా అవతరించినవాడు.
శ్రీమాన్ = శ్రీమంతుడు పురుషకార భూతురాలైన శ్రీదేవితో ఎడతెగని విడదీయరాని సంబంధము గలవాడు.
ధాతా = పోషకుడు. (డుధాఞ్‌ధారణపోషణయోః అను ధాతువునుండి పుట్టినది ధాతృశబ్దము) సకల ప్రాణులను వారి వారికి కావలసిన అవసరములను తీర్చి పోషించువాడు.
దాతా అని పాఠాంతరము కూడకలదు. అడిగినవారికి కోరినదిచ్చువాడు.
రిపునిషూదనః = రిపూన్ శత్రూన్ నిషూదయతి నిరస్యతీతి రిపునిషూదన : = శత్రువులను నిరసించువాడు (తొలగించువాడు) చంపువాడు.

ఆశ్రితుల విరోధులను అంతమొందించు స్వభావముగలవాడని అర్థము. పిమ్మట అవతారమునకు ప్రధాన ప్రయోజనమైన గుణములను రక్షితా అనుదానిచే చెప్పుచున్నాడు. (ధర్మరక్షణమే - సాధుపరిత్రాణమే అవతారము యొక్క ప్రధాన ప్రయోజనము) రక్షితా జీవలోకస్య = జీవకోటిని రక్షించువాడు. లోకమునందు సార్వభౌముడు (చక్రవర్తి) తన ప్రజలను రక్షించుట యందే ప్రయత్నించును - ఇతడు (రాముడు) అట్లుకాదు సమస్త ప్రాణిసముదాయమును రక్షించువాడు. ఒకవేళ అందరిని రక్షించువాడయినచో, దుష్కృతుని (చెడు చేసిన వానిని) కూడ సుఖవంతునిగా చేయును గదా! అని శంకపాడమగా, "ధర్మస్య పరిరక్షితా" అని అచట సమాధానముగా చెప్పుచున్నాడు.
ధర్మస్యపరిరక్షితా = ధర్మమును పరిరక్షించువాడు. ఆచరణ ప్రచారముల చేత (తాను ఆచరించుచు, ఇతరులు తమతమ ధర్మములు ఆచరించునట్లు జేయుచు) సర్వ ధర్మములను నిలబెట్టువాడు (కాపాడువాడు) శాస్త్రముల నతిక్రమించి వర్తించువారిని కూడ చికిత్సక న్యాయముతో తప్పుచేయకుండ చూచువాడు. (చికిత్సకుడు దుష్టాంగమును ఖండించి మిగిలిన శరీరావయవములకు రక్షణ కల్గించునట్లు, శాస్త్రాతిక్రమణచేయువారిని నిరోధించి, మిగిలిన ప్రజలను శాస్త్రానుసారముగా నడచునట్లు చూచువాడు అని భావము)

రక్షితా స్వస్యధర్మస్య స్వజనస్యచరక్షితా । వేదవేదాంగ తత్త్వజ్ఞో ధనుర్వేదేచనిష్ఠితః ॥ 14	తన ధర్మమును రక్షించువాడు (స్వధర్మరక్షకుడు) తన జనులను (తనవారిని) రక్షించువాడు (స్వజన రక్షకుడు) వేదముల యొక్కయు, వేదాంగముల యొక్కయు తత్వమును తెలిసినవాడు, ధనుర్వేదమునందు నిష్ఠ (నేర్పు - నిలుకడ - శ్రద్ధ) గలవాడు.

రక్షితాస్వస్యధర్మస్య = తనయొక్క శరణాగత రక్షణ రూపమైన విశేష ధర్మమును మిక్కిలి (పట్టుదలతో) రక్షించువాడు.
ధర్మస్య పరిరక్షితా = ఆయావర్ణాశ్రమధర్మములను (నలువైపుల పూర్తిగా) అంతట రక్షించువాడు. లోకమునందు సమస్త ధర్మములను ప్రవర్తింపజేయువాడైనప్పటికిని, ధర్మోపదేశసమయే జనాస్సర్వేపిపండితాః (పరోపదేశసమయే సర్వేవ్యాస పరాశరాః) తదనుష్ఠానసమయే మునయోపి నపండితాః (ధర్మమునుపదేశించు సమయమందు జనులందరును పండితులే - దాని నాచరించు (అనుష్ఠించు) సమయమునందు మునులుకూడ పండితులుకారు) అను న్యాయముచేత జనులు తన ధర్మము ననుష్ఠించునప్పుడు (ధర్మము యొక్క అనుష్ఠానమందు) జారిపోవుచున్నారు. ఇతడు (రాముడు) అట్లు కాదని చెప్పుచున్నాడు. (పరోపదేశము చేయుటకు అందరు

సమర్థులే కాని తమ ధర్మమును తాము ఆచరింపజాలరు రాముడట్లుకాదు)
స్వస్యధర్మస్యరక్షితా = తన అసాధారణమైన క్షత్రియధర్మమును రక్షించువాడని యర్థము. లోకమునందు సర్వ రక్షకుడైనప్పటికిని కొందరు (ఒకానొకడు) తన జనులయొక్క రక్షణను చేయుటకు శ్రద్ధచూపడు(రు). దాస్యమైశ్వర్య భావేన జ్ఞాతీనాంచ కరోమ్యహం। అర్థభోక్తాచ భోగానాం వాగ్దురుక్తానిచ క్షమే - (ఐశ్వర్య భావముతో జ్ఞాతులయొక్క (పాలివాండ్లయొక్క) దాస్యమును కూడ నేను చేయుదును, విషయభోక్తను మాటలలో చెడు మాటలను క్షమింతును.) అని భగవంతుని చేతను చెప్పబడుట వలన, అది కూడ చేయుటకు కోరుచున్నాడని చెప్పుచున్నాడు - స్వజనస్యచరక్షితా = తన వారియొక్కయు, చకారప్రయోగముచే - తన యొక్కయు కూడ (రక్షణము చేయువాడు) (తనను రక్షించుకొనువాడు) దీనిచే స్వజనుల రక్షణ యొక్క దుర్ఘటత్వము (ఘటింపరాకుండుట) సూచింపబడినది. లేక, చ అనుదానికి అయితే అని అర్థము. తన వారిని అనగా శరణాగతుని విశేషముగా (ప్రత్యేకముగా) రక్షించువాడు ఇందు విశేషమేమనగా వారి అపరాధములను సహించి యుండుట. (తప్పులను క్షమించి సహించువాడు). మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయంకథంచన, దోషోయద్యపి తస్యస్యా త్సతామేత దగర్హితం - మిత్రభావముతో వచ్చినవానిని ఏ విధముగానైనను ఎట్లును విడువను, ఒకవేళ అతనిలో దోషమున్నను (విడువను) సత్పురుషలకు ఇది గర్హితము (నిందింపబడినది - నిందనీయము) కాదు. అని ముందు చెప్పగలడు (భగవానునకు శరణాగత రక్షణము స్వధర్మము) లేక, లోకమునందు ఒకానొకడు అందరిని రక్షించుచు తన జనులను (తనవారిని) పీడించును, ఇతడయితె తన వారిని కూడ రక్షించునని అర్థము. లేక, రక్షకుడు (రక్షితా) అని తన అవతారము యొక్క ప్రయోజనమును చెప్పుచున్నాడు. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం। ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని గీతలో చెప్పుకొన్నాడు గదా! తన వారిని (తనకు శేషభూతుడైన వానిని) అని, స్వజనమునకు తనకు శేషభూతమైన దానిని, అని సర్వలోకములకు విశేషణము - రక్షణకు స్వజనమును హేతువైన సంబంధముగా తెలుపుట కొఱకు రక్షితా - ఇష్టమును పొందించువాడు. (అభీష్టమును కలిగించువాడు అనిష్టమును తొలిగించుటవాడు) దీనిచే సాధు పరిత్రాణము చెప్పబడినది. చ శబ్దము అన్వాచయమునందును ప్రవర్తించును. (అన్వాచయమనగా రెండు క్రియలలో ఒకటి ప్రధానమై మరియొకటి అప్రధానమై యుండుట. ఉదా॥ భిక్షామట గాంచానయ. ఇక్కడ భిక్షాటనము అవశ్యముగనుక ప్రధానము. ఆవును జూచిన యెడల తోలుకొని రమ్ము లేనియెడల ప్రయత్నమున బోవలదని భావము గనుక గవానయనము అప్రధానము) రక్షితాచ - రక్షకుడును - అనిష్ట నివర్తకుడు - దీనిచే ఆనుషంగికముగా దుర్మార్గుల వినాశము చెప్పబడినది - (అనుషంగికము - ఉద్దేశము లేకుండగనే ప్రసంగవశమున సంభవించినది అప్రధానము). (సాధువులను రక్షించుట ప్రధానము - దానికై దుష్టులను శిక్షించిన శిక్షించును - ఈ దుష్టులను శిక్షించుట అప్రధానము) సామాన్య విశేష రూపమైన (రెండు విధములైన) ధర్మమును స్థాపించుటను గూర్చి ఇతరమైన రెండు వాక్యములచేత చెప్పుచున్నాడు. రక్షితాస్వస్యధర్మస్య - సీతాపరిణయము ద్వారా తన ఆశ్రమమునకు ఉచితమైన ధర్మములననుష్ఠించువాడు - లేక, తన ధర్మము పరత్వము, దానిని రక్షించువాడు - శివుని ధనుస్సును విరచుట, పరశురాముని జయించుట మొదలగు వానిచేత పరత్వము స్థాపింపబడినది. లేదా - ధర్మము అనగా ధనుస్సు. స్వామ్య స్వభావ సుకృతే ష్వస్త్రీ ధర్మంతుకార్ముకః - అని బాణనిఘంటువు - (అధికారము (రాజ్యము) స్వభావము, పుణ్యము, విల్లు అను అర్థములందు ధర్మశబ్దము ప్రవర్తించును) ఎల్లప్పుడు ధనుర్ధరుడని అర్థము.

స్వజనస్యచ రక్షితా - స్వభూతోజనఃస్వజనః - తానైనవాడు - తనకైనవాడు స్వజనుడు - జ్ఞానీ త్వాత్మైవమేమతం (జ్ఞానియన్నవో ఆత్మయే అని నా అభిప్రాయము) అని గీతయందు చెప్పబడుట వలన - వానిని రక్షించువాడు = తనకు వలెనె అందరికి యోగక్షేమములను కలిగించువాడు అని అర్థము. పిమ్మట ఇతనికి 18 విద్యలు - వాని యొక్క స్థానములు తెలిసియుండుటను చెప్పుచున్నాడు.

వేదవేదాంగ తత్త్వజ్ఞః = విదంత్యనేన ధర్మాధిక మితివేదః = ధర్మము మొదలగువానిని తెలుపునది వేదము. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము (ఋగ్యజుస్సామాధర్వణములను) భేదము వలన అదినాల్గు విధములు (ప్రత్యక్షముచే గాని, అనుమానముచే గాని తెలియుటకు వీలులేనిది అగుసుఖసాధనము వేదము) = వేదమునకు సహకరించునవి (తోడ్పడునవి) వేదాంగములు. అవి ఆరు-శిక్షాకల్పోవ్యాకరణం నిరుక్తం జ్యోతిషాంగతిః। ఛందసాం విచితిశ్చేతి షడంగాని ప్రచక్షతే (శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు అనునవి ఆరు వేదాంగములు)

1) అకారము మొదలైన వేద వర్ణములను (అక్షరములను) ఏఏ స్థానములలో ఎటువంటి ప్రయత్నముతో ఉచ్చరించవలెనో తెలుపునది. స్వరములు మొదలైన వానిని తెలుపునది శిక్ష. 2) యాగముల యొక్క క్రమమును తెలియజేయునది కల్పము. 3) సాధు - (అసాధు) శబ్దములను వివరించునది (నిరూపించునది) వ్యాకరణము, వర్ణాగమము, వర్ణలోపము, వర్ణ విపర్యయము మొదలగు వానిచేత । శబ్దముల యొక్క వ్యుత్పత్తిని తెలుపుచు అర్థమును నిశ్చయించి చెప్పునది నిరుక్తము. కర్మల నాచరించుటకు (కర్మానుష్ఠానమునకు) తగిన కాలము మొదలైన వానిని ప్రతిపాదించు శాస్త్రము జ్యోతిషము ఆయా ఛందస్సులను వివేచించి పద్యముల గూర్చి చెప్పు శాస్త్రము ఛందోవిచితి యనగా ఛందశ్శాస్త్రము.

వేదములయొక్క, వేదాంగముల యొక్కయు తత్త్వార్థమును తెలిసికొన్నవాడు వేదవేదాంగతత్త్వజ్ఞుడు. ధనుర్వేదేచ నిష్ఠితః = ధనుర్వేదమనగా - ధనుస్సును చేతితో/పిడికిలితో పట్టుకొనుట (పట్టుకొనెడి స్థితి విశేషములు) ధనుస్సును లాగుట (ఆకర్షించుట) బాణమును సంధించుట ఎక్కుపెట్టుట, ప్రయోగించుట, దివ్యములైన అస్త్రములను ప్రయోగించుట, ఉపసంహరించుట, మొదలగు వానిని తెలియజేయు శాస్త్రగ్రంధము - చ కారముచే ఇతరమైన ఉపవేదముల యొక్క సముదాయము (సముచ్చయము) అని అర్థము. క్షత్రియుడు ధనుర్వేదము ప్రధానముగా గలవాడు అని అతని నిర్దేశము. (అనగా క్షత్రియులు ధనుర్వేదమును తప్పకుండనేర్వవలెను అని అర్థము) ఉపవేదములు నాలుగు - "ఆయుర్వేదో, ధనుర్వేదో, వేదోగాంధర్వ ఏవచ। అర్థశాస్త్ర మితిప్రోక్త ముపవేద చతుష్టయమ్" - (ఆయుర్వేదము ధనుర్వేదము, గాంధర్వవేదము, అర్థశాస్త్రము అని ఉపవేదములు నాలుగు) అని చెప్పబడినది.

బహిరంగముగా (బాహాటముగా) వైదిక ధర్మములను అనుష్ఠించుటకు విరోధులైన రోగములను తొలగించునట్టి మందులు మొదలైన వానిని తెలుపు శాస్త్రము ఆయుర్వేదము, సామగానమునకుపయోగించునట్టి భరత శాస్త్రము గాంధర్వ వేదము, చాణక్యుడు మొదలగు వారిచే నిర్మింపబడిన (రచింపబడిన) నీతిశాస్త్రము అర్థశాస్త్రము. ఇది కర్మలయొక్క అనుష్ఠానమునకు ఉపయోగపడునట్టి అర్థమును సాధించు వానిని తెలియచేయునది - ఇట్లు నాలుగు వేదములందును నిష్ఠగలవాడు (ప్రధానముగాధనుర్విద్యయందు నేర్పరి యైనవాడు)

సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞః
స్మృతిమాన్ ప్రతిభానవాన్ ।
సర్వలోక ప్రియ స్సాధు
రదీనాత్మా విచక్షణః ॥ 15

సకల శాస్త్రములయొక్క అర్థములను వానియొక్క తత్త్వమును అనగా నిగూఢమైన అభిప్రాయమును తెలిసికొన్నవాడు, వానిని మరవనివాడు, సద్యస్ఫురణ గల ప్రతిభావంతుడు, లోకములన్నింటికి (సకల జనులకు) ప్రియమైనవాడు, సాధువు, దైన్యము లేనివాడు విచక్షణుడు (వివిధ వస్తువులను - వాని భేదములను గుర్తించ గలవాడు)

సర్వశాస్త్రార్థతత్వజ్ఞః = సకల శాస్త్రములు - గోబలీవర్ద న్యాయమువలన పరస్పర విరుద్ధ విషయములను ప్రతిపాదించు శాస్త్రములు - ఉపాంగములు అని చెప్పబడును.

"ధర్మశాస్త్రం పురాణంచ మీమాంసా2న్వీక్షకీతథా । చత్వార్యేతాన్యుపాంగాని శాస్త్రజ్ఞా స్సంప్రచక్షతే"॥ (ధర్మశాస్త్రము, పురాణము, మీమాంస, ఆన్వీక్షకీ (న్యాయశాస్త్రము) ఈ నాలుగింటిని ఉపాంగములని శాస్త్రజ్ఞులు చెప్పుదురు). ధర్మశాస్త్రము పూర్వకాండ (కర్మకాండను తెలుపు వేదములోని పూర్వభాగము) యొక్క భాగమును ఉపబృంహణముచేయును.

పురాణము ఉత్తరకాండ (వేదాంతము) యొక్క ఉపబృంహణము. న్యాయ మీమాంసములు - ఇవి సర్వవేదములకు సాధారణములు - వానియొక్క అర్థతత్త్వము అనగా అర్థము యొక్క యాథాత్మ్యమును (నిజస్థితిని - నిగూఢాభిప్రాయమును) తెలిసికొన్నవాడు - వానిని తెలిసికొనుటయే కాదు, వానిలో పరస్పర విరోధ విషయములను పరిహరించి తత్వ నిర్ణయము చేయువాడని యర్థము. అట్లే పదునెన్మిది విద్యల యొక్క స్థానమును, వాని తత్త్వమును ఎఱింగినవాడనియు సారార్థము (నాల్గువేదములు - 6 అంగములు, నాలుగు ఉపవేదములు, నాల్గు ఉపాంగములు - మొత్తము 18).

స్మృతిమాన్ = తెలిసిన అర్థముల విషయమునందు ఏమాత్రము విస్మరణలేశము (కొంచెము మఱపుకూడ) లేనివాడు. (అవసరము వచ్చినప్పుడు స్మరణ కలుగునట్లు ధారణ కలవాడు). ప్రతిభానవాన్ = ప్రతిభావంతుడు, వ్యవహారకాలమునందు విన్నదానియొక్కయు, విననిదాని యొక్కయు శీఘ్రస్ఫూర్తి (త్వరగా స్ఫురించుట)ను ప్రతిభానము (ప్రతిభ) యందురు - అది కలవాడు - (వ్యవహార కాలమునందు ఇతర శాస్త్రములతో విరోధములేకుండ నిరూపించగల సమయస్ఫూర్తి కలిగించు ప్రతిభగలవాడు)

పిమ్మట సాధువులందరిచేత చక్కగా ఉపాసింపబడుటను తెలుపుచున్నాడు.

(సర్వ అని), సర్వలోకప్రియః = సర్వేలోకాః ప్రియాఃయస్యసః - సమస్త లోకులు (లోకులందరు) ప్రియముగా గలవాడు, లోకులందరికి ప్రియమైనవాడు - (సర్వేషాంలోకానాం ప్రియః) అని బహువ్రీహి, తత్పురుష సమాసములు అగును - అతడు జనులందరికి ప్రియమైనవాడు, అతనికి జనులందరు ప్రియమైనవారు. అందరిచేతను ప్రేమించబడి, అందరిని ప్రేమించువాడని తాత్పర్యము). సర్వలోక ప్రియుడగుట వలన సత్పురుషులచే పొందదగిన (చేరదగిన) వాడని అర్థము.

సాధుః = సాధువు - సజ్జనుడు, సౌమ్యుడు, వారి కార్యములను (పనులను) సాధించువాడు, లేక ఉచితుడు, సత్పురుషులచే సేవింపబడుటకు ఉపాసింపబడుటకు పొందబడుటకు (సత్పురుషులు పొందుటకు) తగినవాడని అర్థము - సాధుస్త్రిషూచితె సౌమ్యే సజ్జనే వార్ధుషావపి (సాధుశబ్దము ఉచితునియందు, సౌమ్యునియందు, సజ్జనునియందు, వడ్డీకిచ్చి బ్రతుకు వానియందును ప్రవర్తించును) అని వైజయంతి నిఘంటువు.

అదీనాత్మా = అకార్పణ్యాత్మా = కొఱతలేనిమనస్సు గలవాడు, మిక్కిలి గంభీరమైన స్వభావము గలవాడు.

విచక్షణః = వివిధములైన వస్తు విషయములలో సూక్ష్మములైన భేదములను గూడ గుర్తించి చెప్పగలిగినవాడు - (వివిధం వక్తి)

సర్వదాభిగత స్సద్భిః సముద్రఇవ సింధుభిః । ఆర్య స్సర్వ సమశ్చైవ సదైకప్రియదర్శనః ॥ 16	నదులచే సముద్రము పొందబడునట్లు ఎల్లప్పుడు సత్పురుషులచే పొందబడుచుండెడివాడు (నదులు సముద్రమును చేరునట్లు సత్పురుషులు ఎల్లప్పుడు శ్రీరామునిచేరి సేవించుచుండెడి వారు) ఆర్యుడు, సర్వసముడు (అందరి యందును సమానమైన భావముగలవాడు) ఎల్లప్పుడు ఒకేరీతిగా ప్రియమైన దర్శనము కలవాడు. చూడగానే ప్రీతిని కల్గించువాడు.

ఇందువలననే ఎల్లపుడు సత్పురుషులచేత ఉపాసింపబడుటను చెప్పుచున్నాడు (సర్వదా) అని - సర్వదా = ఎల్లప్పుడు, అస్త్ర (శస్త్ర)ములను నేర్చుకొను (అభ్యసించు) కాలములలో కూడ, సత్పురుషులచేత అభిగతుడై (చుట్టుకొనబడి) సేవింపబడువాడు అని అర్థము. ఎట్లనగా - సముద్రము నదులచేతను వలె - (సముద్రః సింధుభిరివ) - స్త్రీనద్యాం నా నదే సిందుర్దేశ భేదేం బుధౌగజే," (సింధుశబ్దము నదియందును, నదమునందును ఒకానొక దేశమునందును, సముద్రమునందును, ఏనుగునందును వర్తించును) అని వైజయంతీ నిఘంటువు - సర్వదాభిగతః = (ఖురళీ) సాము, గరిడీ / అస్త్ర శస్త్రాభ్యాసము, క్రీడల శ్రమను తీర్చుకొనుటకై (విశ్రాంతికై) రాముడేదోయొక నీడను చేరినప్పుడు సత్పురుషులందరు ఆయా అర్థవిశేషములను వినుట కొఱకై అతనిని చుట్టుకొని (చుట్టి-మూగి-పరివారించి) యుందురు అని యర్థము - జ్ఞానవృద్ధై ర్వయోవృద్ధై శ్శీలవృద్ధైశ్చ సజ్జనైః - కథయన్నాస్తవై నిత్య మస్త్ర యోగ్యాంత రేష్వపి (అస్త్రవిద్యలను నేర్చుకొను సమయములందు విశ్రాంతి సమయములలోను జ్ఞానవృద్ధులును, వయోవృద్ధులును, శీలవృద్ధులును అగు సజ్జనులతో చుట్టుకొనబడి సేవింపబడుచు వారి సందేహములకు సమాధానములు చెప్పుచుండును) అని అట్లే ముందు చెప్పగలడు. అస్త్ర యోగ్యమనగా అస్త్రాభ్యాసము. సముద్రము సింధువులచే పొందబడినట్లు - ఇట్లు సత్పురుషులచేరిక రామునికి తెలియని దానిని తెలుపుటకొరకు గాదు. అతడు స్వయముగా సహజముగా గొప్పదనము (పూర్ణత) గలవాడు అగుట వలన గత్యంతరము లేకపోవుటవలన, తమకే అపూర్వమైన అర్థ విశేషములు పొందుట కొఱకై వారు రాముని చేరుదురు. నదులు తమ ఉనికిని తాము పొందుటకే (నిలుపుకొనుటకే) సముద్రమును చేరుచున్నవి. కాని సముద్రమునకు గొప్పతనమును (అతిశయమును) కలిగించుటకు కాదు గదా । ఇట్లు సాధువులు చేరుటకు కారణ భూతమైన సౌలభ్య గుణము మొదలైన వానిని విశదీకరించుచున్నాడు - (ఆర్యః) అని (సత్పురుషులు తమ గుణములను పెంపొందించుకొనుటకే రాముని చేరువారని తాత్పర్యము - ఇది సముద్ర ఇవసింధుభిః అను ఉపమానముచే తెలుపబడినది).

ఆర్యః = పొందదగినవాడు, చేరదగినవాడు (ధర్మమునకు చేరువగా, అధర్మమునకు దూరముగా నడచుకొను బుద్ధిగలవాడు) ఏమి సత్పురుషులకేనా? (చేరదగినవాడు) కాదని (అందరికి) అని చెప్పుచున్నాడు.

సర్వసమః = సర్వసముడు - జాతి, (కులము), గుణము, వృత్తి (వ్యాపారము) మొదలగు తారతమ్యము (భేదము) లేకుండ అందరికిని ఆశ్రయింపదగియుండుట యందు సమానుడు (ఎల్లరును ఆశ్రయింపదగిన వాడని అర్థము) ఏవకారము ఇతని యొక్క కాదాచిత్కత్వమును (ఎప్పుడో ఒకప్పుడగుటను) నివారించుచున్నది. చకారము చెప్పబడినవాని సముచ్చయమును తెలుపుచున్నది. కొంచెమైనను ఉపదేశము లేనివేళయందును (ఉపదేశించనప్పుడును) సౌందర్యము వలన పొందదగియుండుటను చెప్పుచున్నాడు (సదైక ప్రియదర్శనః - అని)= సదైక ప్రియదర్శనః - ఎల్లప్పుడు అనుభవించుచున్నను, మాటిమాటికి క్రొంగ్రొత్తగా ప్రకాశించువాడు అని అర్థము

ఎల్లప్పుడు, అందరికి అనుభవమున్నను చూడగానే క్రొత్త క్రొత్తగా ప్రకాశించుచు ప్రీతిని కలిగించువాడని యర్థము.
తన్నిశ్లోకి 16 సర్వదాభిగతస్సద్భిః ....

(సర్వదా - అని), సద్భిః = సత్పురుషులచేత - శ్రీరాముని యొక్క సంబంధము వలన లబ్ధ సత్తాకులైన (అనగా సత్తను పొందిన) వసిష్ఠుడు మొదలగు వారిచేత, సర్వదా సింధుభిః అభిగతః సముద్ర ఇవ - ఎల్లప్పుడు నదులచేత పొందబడిన (నదులు చేరిన) సముద్రమువలె, అనగా మహానదీత్వ సిద్ధి కొఱకు, (మహానది - (పెద్దనది) యగుట సిద్ధించుట కొఱకు) సింధువులు (నదులు) ఎట్లు సముద్రమును గూర్చి కదలిపోయి ఆ సముద్రమును పొందునో (ఆ సముద్రములో చేరునో), ఇట్లు తమ యొక్క సజ్జనత్వ సిద్ధికొఱకు సత్పురుషులు శ్రీరామ గోష్ఠిని (శ్రీరామ సల్లాప సభను) ప్రవేశించుదురు. (చేరుదురు) (నదులచే సముద్రమువలె అని), సత్పురుషులు ఒక సల్లాపగోష్ఠిలో నిష్ఠ (నిలుకడ - శ్రద్ధ) గలవారగుచుండగా, చుక్కల నడుమ నున్న చంద్రునివలె శ్రీరామునికి అందరి యొక్క కోరికతో అందరికంటె ఎక్కువగా మిక్కిలి అతిశయమైన తేజస్సు కలిగియుండుట తెలియబడుచున్నది, అనర్గళమైన (అడ్డంకిలేని) ప్రవాహములుగల నదులచే నెట్లు సముద్రము అక్షోభ్యమో (కలతపెట్టబడదో - వికారము చెందదో) ఇట్లే జాబాలి మొదలగు వారిచేత కలతపెట్టబడినప్పటికిని కలవరపడని వాడు (వికారము చెందనివాడు) అని ప్రకటింపబడినది. సర్వదా ఇతి - (ఎల్లప్పుడు అని), కాలవిశేషమునందు (అనగా వర్షాకాలమునందు, ప్రత్యేక కాలమునందు) ఒకప్పుడు నదులచే పొందబడునది సముద్రము, కాని ఇతడయితే ఎల్లప్పుడు, అని భేదము (వైలక్షణ్యము - ప్రత్యేకత) చెప్పబడుచున్నది. (సర్వదాభిగతః - ఇతి) - ప్రయోజన వశమున సత్పురుషుల చేరిక యందు వారితోడ ప్రలాపములు (అనగా ఉపయుక్తము కాని మాటలు - పరమతమును ఖండించి స్వమతమును నిలుపుకొనునట్టి మాటలు), వితండ (వాద)ములు (స్వపక్షపాతముగ వాదించెడువాదములు, పనికిమాలినవాదములు, అడ్డమాటలు) మొదలగునవి చేయుటలో అసహ్యత చేత, అసూయచేత లోకమునందు వారు కూడచేరరు, దగ్గరకురారు, శ్రీ రాముడయితే అట్లు చేయడని ధ్వనించుచున్నది. నవిగర్హ్యకథారుచిః (విశేషముగా నిందింపదగిన కథల యందు (మాటలయందు) రుచిలేనివాడు అని ముందు చెప్పబడగలదు, రత్నాకరమును (సముద్రమును) పొందిన నదులకు దానిని చేరిన దేశమునందే కొన్ని రత్నములయొక్క సంబంధము. ఇట్లు గుణాకరుడైన (సద్గుణనిలయుడైన) శ్రీరామునియొక్క సంబంధమువలననే సత్పురుషులకు కొన్ని గుణములు ప్రకాశింపబడును (వెలువడును) అని అభిగత పదముయొక్క వ్యంగ్యమైన అర్థము. లోకమునందు రాజకుమారులు ఒకానొకప్పుడు వినోదము కొఱకై ఏకాంత (రహస్య) గోష్ఠియందు శృంగార, హాస్య రసములు తెలిసినవారితో పరివేష్టింపబడినవారగుదురు ఇతడట్లు కాదని 'సత్' - పదముచే తెలియజేయబడదగిన యర్థము. సింధుభిః సముద్రః ఇవ - (నదులచే సముద్రమువలె) అని సత్పురుషులకు ప్రాప్యాంతరము (పొందదగిన వాడు మరొక్కడు) లేక పోవుటయు, శ్రీరాముని యొక్క సౌలభ్యమున్ను వ్యంజనచే తెలియబడుచున్నది.

సచ సర్వగుణోపేతః కౌసల్యానంద వర్ధనః । సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ ॥	17	అతడు సకల గుణసంపన్నుడు (అన్ని కల్యాణ గుణములతో కూడిన వాడు). కౌసల్య యొక్క ఆనందమును పెంపొందించువాడు శ్రీరాముడు. (కౌసల్య కుమారుడైన శ్రీరాముడు). గాంభీర్యమునందు సముద్రము వంటివాడు. ధైర్యములో హిమవంతుని-వంటివాడు.

పిమ్మట "ఇషుక్షయాన్నివర్తంతే నాంతరిక్ష క్షితిక్షయాత్ । మతిక్షయాన్నివర్తంతే నగోవింద గుణక్షయాత్" ((విలుకాడు) అమ్ముల పొదిలో తన వద్ద బాణములు లేక పోవుట వలన బాణములు వేయుటను మానుచున్నాడు, కాని ఆకాశములో స్థలము లేనందువలన కాదు. అట్లే భగవంతుని గుణములను వర్ణించువారు తమ బుద్ధి క్షయించుట వలన (ప్రసరింపకపోవుట వలన) వర్ణించుటను మానెదరు కాని భగవంతుడైన గోవిందునికి గుణములు పూర్తియగుట (ఇంక లేకపోవుట)చే గాదు అని భగవద్గుణములను వేల (కొలది) సంవత్సరములైనను వర్ణించుటకు శక్యము కాకపోవుటచేత సంక్షిప్తముగ చెప్పుచు సమాధానమును సమాప్తము చేయుచున్నాడు. (సచ-అని), కోసల రాజతనయ కౌసల్య. ఆమె యొక్క ఆనందమును వృద్ధిపొందించువాడు కౌసల్యానందవర్ధనుడు. చశబ్దము ఏవకారముయొక్క (అవధారణ యొక్క) అర్థమును తెలుపును. కౌసల్యయొక్క కుమారునిగ అవతరించిన విష్ణువే (శ్రీరాముడే) వేదాంతములచే చెప్పబడిన సకల కల్యాణ గుణములతో కూడుకొన్న పరమాత్మ, కాని బ్రహ్మమొదలైన వారిలో నొకానొకడు కాడు. అనియర్థము - దశరథనందనుడు అని చెప్పకపోవుట కౌసల్యచేతనే పుత్రలాభమనెడి ఫలమును పొందుటవలన - ఇందువలననే 'కౌసల్యా లోకభర్తారం సుషువేయం మనస్వినీ'' (మంచి మనస్సు గల ఈ కౌసల్య లోకభర్తయైన (శ్రీరాముని) కన్నది. అని ముందు చెప్పగలడు. లోకములో ఒక్కొక్క గుణమునందు ఒక్కొక్కటి ప్రసిద్ధము. అవియన్నియు రామునియందున్నవి.

పిమ్మట అతనికి సమానుడును మరి అతనికంటె అధికుడును లేకుండుటను చెప్పుటకు లోకమునందు ప్రకృష్టమైన (మిక్కిలి అతిశయమైన) వస్తువులకు అతనియొక్క ఒక్కొక్క గుణముతో సామ్యము (పోలికను) చెప్పుచున్నాడు. (సముద్ర ఇవ - మొదలైన రెండు శ్లోకములచేత) సముద్ర ఇవ గాంభీర్యే = గాంభీర్యములో సముద్రమువంటివాడు. గాంభీర్య మనగా తనలోనున్న పదార్థములను బయటకు కనబడకుండ దాచగలశక్తి.

సముద్రమెట్లు తనలోనున్న రత్నములు మొదలైన వానిని బయటి వారికి (ఏ మాత్రము) కనబరచకుండ ఉండునో, అట్లే ఇతడు కూడ తన పరత్వమును బయలు పడనీయకుండనే (ప్రకటించకుండనే) ఉన్నాడని అర్థము.

ఆత్మానం మానుషమన్యే. (దేవతలు వచ్చి నీవు సాక్షాత్తుగా నారాయణుడవు) అన్నప్పుడును, తనను మనుష్యునిగనే తలంచుచున్నాను) అని ముందు చెప్పగలడు - ధైర్యేణ హిమవానివ = ధైర్యములో హిమవంతునివంటివాడు ధైర్యమనునది శోకమునకు కారణమున్నను శోకించకుండుట (శోకము లేకుండుట) (దుఃఖముచే మనస్సు చలింపక నిలుచుట ధైర్యము) దానిచే (ధైర్యములో) హిమవానివ = హిమవంతునితో సమానుడు. (దేనికిని చలింపని ధైర్యము గలవాడు) గిరయో వర్షధారాభి ర్హన్యమానా నవివ్యథుః । అభిభూయ మానా వ్యసనై ర్యథా ధోక్షజచేతసః) (పర్వతములు వర్షధారలచే కొట్టబడుచున్నను చలించనట్లు, నారాయణుని యందు మనస్సుగలవారు వ్యసనములచే (ఆపదలచే - దుఃఖములచే) పీడింపబడుచున్నను చలించరు) అని చెప్పబడినది. ఇచ్చట వాస్తవముగా సముద్రము మొదలైన వానికి ఉపమానముగా నుండు యోగ్యత లేకున్నను, తెలియబడు వానికి ఉపమానముండుట సంభవించునని ఇట్లు చెప్పబడినది. ఎట్లనగా - సూర్యుడు బాణమువలె పోవును (ఇషువద్గచ్ఛతి సవితా) అనినట్లు చెప్పుచున్నాడు.

విష్ణునా సదృశోవీర్యే సోమవ త్ప్రియదర్శనః । కాలాగ్ని సదృశః క్రోధే క్షమయా పృథివీసమః ॥ ధనదేన సమస్త్యాగే సత్యేధర్మ ఇవాపర ః ॥ 18 1/2	వీర్యములో విష్ణువుతో సమానుడు, చంద్రునివలె ప్రియదర్శనుడు. (ఆహ్లాదమును కలిగించు స్వభావము రూపముకలవాడు), క్రోధమునందు ప్రళయకాలాగ్ని వంటివాడు. (ప్రళయ కాలాగ్నివలె మండిపడునట్టి వాడు) క్షమా (ఓర్పు) గుణములో భూమితో సమానుడు, త్యాగమునందు కుబేరునితో నమానుడు. సత్యమునందు అపర ధర్మదేవతవంటి వాడు.

విష్ణునా సదృశోవీర్యే = వీర్య విషయమునందు విష్ణువుతో సమానుడు. విష్ణువు యొక్క సగ భాగమగుటచేత రామునికి విష్ణు సాదృశ్యము మంచి మాటయె. "సఉశ్రేయాన్ భవతి జాయమానః" అని చెప్పబడుటచేత అతని అంశమునకు గూడ అతనితో సమానత్వము తగినదే (యుక్తమైనదే)
(ఎంత ప్రతికూలమైన పరిస్థితులున్నను, ఎదుటి వారిని లెక్కజేయక యుద్ధభూమిలో పువ్వులను చిమ్మునట్లు బాణములు వదలగలుగుట వీర్యము. పదునాల్గువేల మంది రాక్షసులతో యుద్ధము చేయునపుడు అందరికి అందరై అన్ని వేల బాణములు వదలగలుగుట అతని యొక్క వీర్యము)
సోమవత్ప్రియదర్శనః = (ఆశ్రితులయెడ) చంద్రునివలె శోకనివృత్తి పూర్వకముగా (శోకమును తొలగించి) ఆహ్లాదమును కలిగించువాడు.
క్రోధే కాలాగ్ని సదృశ ః = (ఆశ్రితులకు బాధలు కలిగించినవారిపై) కోపము నందు ప్రళయకాలాగ్నితో సమానుడు.
ప్రళయకాలాగ్నివలె మండిపడునట్టి కోపముగలవాడు అని యర్థము. తన విషయమున అపరాధము (తప్పు) చేసినను స్వయముగా సహించును (ఓర్చుకొనును) కాని, తన నాశ్రయించిన వారి విషయములో అపరాధము చేసినప్పుడు, మండుచున్న అగ్నివలె మిక్కిలి చల్లనిదైనప్పటికిని హృదయమునందు కోపమును పొందును అని యర్థము - జలమునందును ప్రళయకాలాగ్ని జ్వలించును.
క్షమయా పృథివీసమః - (క్షమ అనగా ఓర్పు. భూమికి క్షమయని పేరు. ఎంత త్రవ్వినను, తన్నినను దున్నినను భూమి ఓర్చి యుండును, మీదు మిక్కిలి తాను వారికి మేలు గూర్చును. అందువలననే భూమికి క్షమయని పేరు) క్షమా రూపముతో సమానమైన ధర్మముచే (అనగా క్షమాగుణములో - ఓర్పులో) భూమితో సమానుడు - పృథివితో సమానమైన ఓర్పుగలవాడని అర్థము. (క్షమతో సమానమైన క్షమగలవాడు అని అర్థము) తన కపకారము చేసినప్పుడు అచేతనము (వస్తువు) వలె ఉండునని యర్థము. "నస్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా" (మంచి మనస్సు గలవాడగుటచే వంద అపకారములు చేసినను మరిచిపోవును) అని చెప్పగలడు. ధనదేన సమస్త్యాగే = త్యాగ విషయములో ధనదునితో అనగా కుబేరునితో సముడు - అతనివలె దాత (దానము చేయువాడు - అడిగిన వారికి లేదనక ఇచ్చువాడు) అని యర్థము. ధనందదాతీతి ధనదః = డుదాఞ్‌దానే - ధనమునిచ్చువాడు, ధనందయతే రక్షతీతి వా ధనదః దేఙ్ రక్షణే = ధనమును రక్షించువాడు ధనదుడు - యాథ్యర్థము కుబేరుడు. కుబేర స్త్ర్యంబకసఖో యక్షరా డ్గుహ్యకేశ్వరః. మనుష్యధర్మా ధనదో రాజరాజో ధనాధిపః" అని అమరము. కుబేరుని యొక్క దాతృత్వము (ఔదార్యము) "త్యాగేచ ధనదోయథా" (త్యాగమునందును ధనదుడెట్లో - ఎట్లు త్యాగమునందు కుబేరుడో) అని తర్వాత ముందు చెప్పబడగల వచనము వలన సిద్ధమైనది. అతని యొక్క పిసినారితనము (లుబ్ధత్వము) ఎక్కడను, ఎందువలనను సిద్ధమైనది కాదు. ఔదార్యమున్నను ధనదునివలె ఆఢ్యుడు అని

వ్యాఖ్యానము ప్రక్రమ విరుద్ధము. (చెప్పగా మొదలు పెట్టబడిన దానికి విరుద్ధము). అథ్యత్వ మనునది ఒక గుణము (గుణమే) కాదు అట్లైనచో పిసినారితనమే (లుబ్ధత్వమే) అతనికి సిద్ధమైనదగును - ధనముకలవాడు లోభికావచ్చును, కాని లోభి కాని ధనదుడు. అని అర్థము.

సత్యేధర్మఇవాపరః = సత్యే-సత్య వచనమునందు, అపరః = ఉత్కృష్టమైనవాడు, (రెండవ వస్తువు (వ్యక్తి) లేనివాడు) ధర్మః ఇవ = ధర్మ దేవతవలె ఉన్నవాడు - ధర్మదేవత వంటివాడు ధర్మదేవత ఎన్నడునూ మాట తిరుగనిది. తన మాటకు కట్టుబడి యుండువాడని తాత్పర్యము. ధర్మదేవతవలె అపాయములేని (నిరపాయమైన) సత్యవచనుడు అని అర్థము. సత్యమునందు రెండవ ధర్మమువలె ఉన్నవాడు అనువ్యాఖ్యానమునందు ప్రకృతమైన (ఇప్పుడు ప్రకరణము వలన పొందబడెడి) పోలికకు విరోధమగును - దానికి ఉత్ప్రేక్షారూపమగుట వలన - ఒక చోట ఉపమ, ఒకచోట ఉల్లేఖము, ఒక చోట ఉత్ప్రేక్షయనీ విజాతీయ సంకరమని కూడ కొందరు చెప్పుదురు.

ఇట్లు వేదాంతములందు చెప్పబడిన జగత్కారణత్వము, సర్వజ్ఞత్వము, సర్వశక్తిత్వము, సర్వాంతర్యామిత్వము మొదలైన సమస్త కల్యాణ గుణములకు నిలయమైన (ఆకరమైన) ఆధారస్థానమైన పరబ్రహ్మము రాముడుగా అవతరించిన విష్ణువా? లేక బ్రహ్మ రుద్రుడు మొదలగువారిలో ఒకడా? అని వాల్మీకిచే వేదము యొక్క ఉపబృంహణము కొఱకై అడుగబడగా, విష్ణువుకంటే ఇతరమైన వారియందు వేదాంతములందు చెప్పబడిన గుణములు లభింపకపోవడము వలన (కలుగకపోవడము - లేకపోవడము వలన) అతనికే (విష్ణువునకే - రాముడుగా అవతరించిన విష్ణువునకె) కలుగుట వలన అతడే (రాముడుగా అవతరించిన విష్ణువే) వేదాంతములందు చెప్పబడిన పరతత్వము అని ఉపదేశింపబడినది. అచటచ్చట జగత్కారణ ప్రకరణములయందు ప్రయోగింపబడిన శంభుడు, శివుడు మొదలైన శబ్దములు, సత్ బ్రహ్మ మొదలైన సామాన్య శబ్దములవలె అపర్యవసానవృత్తి చేతను, లేక అవయవ వృత్తిచేతను పరమాత్మపరములు (పరమాత్మను చెప్పునట్టివే) అని కూడ అర్థ సిద్ధము (అర్థము నిశ్చితమైనది). ఇట్లు వేదాంతముల యొక్క సారమైన అర్థము చక్కగా చూపింపబడినది.

బ్రహ్మ స్వరూపమువలె ఫలస్వరూపము, అతనిని పొందుటకైన ఉపాయ స్వరూపము కూడ వేదము యొక్క అర్థమగుట వలన అదియు ఉపబృంహణము చేయదగినదే - ఆ రెండు (ఫలము - ఉపాయము) ఏమి అడుగబడలేదా, ఉపదేశింపబడలేదా అని శంకరాగ, "పరిపప్రచ్ఛ" అని ఇచ్చట 'పరి' అనెడి ఉపసర్గచేత ఆరెంటియొక్క స్వరూపము కూడ అడుగబడినదే. ఉత్తరము (సమాధానము) నందు కూడ "ప్రజానాంచహితే రతః" (ప్రజల యొక్క మేలునందు కోరికగలవాడు) అని మొదలగువానిచేత ఉపాయత్వమును, "సదైక ప్రియదర్శనః" (ఎల్లప్పుడు ఏక రూపముగా చూడగానే మిక్కిలి ప్రీతిని (ఆనందమును) కలిగించువాడు) అని మొదలగువానిచేత ఉపేయత్వమును అతనికే అని చెప్పబడినది, సిద్ధమైన అతనికే ఉపాయత్వమున్నయెడల సర్వముక్తి, ప్రసంగము వచ్చును కదా అనిశంకయైనచో, అట్లుకాదు. ఎవడు ఉపాయోపేయములకు అధికారియో (అర్హుడో) అతనికే ఫలమునొసంగును, అధికారులు కాని వారికి (అనధికారులకు) కాదు అని శాస్త్ర నిరూపితనియమముండుట వలన. అనధికారులకు ఫలమొసంగబడదు. అధికారమనగా అతనిని పొందుట యందలి కోరిక (అపేక్ష) ఇతర సాధనములను (సాధనాంతరములను) విడిచిపెట్టుట అని తరువాతి గ్రంథమునందు చక్కగా తెలుపబడినది.

శంక = ఈ రామాయణము వేదము యొక్క ఉపబృంహణము అని, చెప్పబడినది కదా! ధర్మము (కర్మము) కూడ వేదము యొక్క అర్థమె. అది యేల (యెట్లు) ఉపబృంహితము కాలేదు? ఇంతే కాకుండ, ఇంత మాత్రమైన ఈ గ్రంథము చేతనే వేదాంతార్థము ఉపబృంహితమా? ఏమి ఇంతకంటె వేరైన గ్రంథముచేతనా?

సమాధానము = చెప్పబడినవి, చెప్పబడనివియును అగు కల్యాణ గుణములను అతనియొక్క చరిత్ర (నడవడి)యనే దృష్టాంతముద్వారా ప్రతిపాదించుటకు తరువాత గ్రంథము చెప్పబడుచున్నది.

పూర్వభాగ (కర్మకాండ)ము యొక్క ఉపబృంహణము కూడ రామాయణము నందలి పురుషుల యొక్క ఆచారము (ప్రవర్తన - ఆచరణము) ద్వారా సామాన్య ధర్మము విశేష ధర్మము కూడ ఉపబృంహితమైనది. అయినను బాలకాండమునందలి కథ చూపబడలేదేమి? ఇట్లు చెప్పదగదు. అచట చూపదగిన గుణ విశేషములు లేకపోవుట వలన (అని చెప్పదగదు).

ఇక్ష్వాకువంశ ప్రభవః (ఇక్ష్వాకువంశమున జన్మించినవాడు) అని అవతరణము, మహావీర్యః (గొప్ప వీర్యము కలవాడు) అని తాటకయొక్క తాటకేయుల యొక్క సంహారము, ధనుర్వేదేచ నిష్ఠితః (ధనుర్వేదము నందు నేర్పు (నిలకడ - శ్రద్ధ)కలవాడు) అని విశ్వామిత్రునిచేత పొందిన సకల దివ్యాస్త్రములు గలవాడగుటయు, శ్రీమాన్ (శ్రీమంతుడు - లక్ష్మీదేవితో కూడినవాడు, లక్ష్మిగలవాడు) అని సీతాదేవి యొక్క లాభము (వివాహము) అని బాలకాండ యొక్క కథను సూచించుట వలన (మిక్కిలి) బొత్తిగా (పూర్తిగా) చూడబడనిది కాదు. (అనగా కొలదిగా సూచించబడినది). పిమ్మట అయోధ్యాకాండయొక్క కథను ప్రస్తుతించుచున్నాడు. "తమేవం" అని మొదలగు దానిచేత - మొదట రెండు శ్లోకములు ఏకాన్వయము గలవి. (ఒకే అన్వయము గలవి)

తమేవం గుణసంపన్నం రామం సత్య పరాక్రమం । జ్యేష్ఠం శ్రేష్ఠ గుణైర్యుక్తం ప్రియం దశరథ స్సుతం ॥ 19 1/2 ప్రకృతీనాం హితైర్యుక్తం ప్రకృతి ప్రియకామ్యయా యౌవరాజ్యేన సంయోక్తుం ఐచ్ఛత్ప్రీత్యామహీపతిః ॥ 20 1/2	ఇట్టి (సకల కల్యాణ) గుణములతో సంపన్నమైన సమృద్ధి కలవాడు, సత్యమైన (మొక్కవోని) పరాక్రమము గలవాడు, శ్రేష్ఠమైన గుణములతో కూడినవాడు, తన కుమారులలో పెద్దవాడు, ప్రజలకు మేలు కలిగించు పనులు చేయువాడు ప్రియమైనవాడును అగు ఆ శ్రీరామచంద్రుని దశరథ మహారాజు ప్రజల యొక్క అభీష్టముతో (ప్రియమైన కోరికతో) యువరాజును జేయుటకు ప్రీతితో ఇచ్ఛయించెను (సంకల్పించెను).

దశరథః = దశసుదిక్షు రథో యస్యసః దశరథః = పది దిక్కులయందును రథముగలవాడు దశరథుడు - అప్రతిహత (అడ్డులేని) రథముగలవాడు అగుటచేత రామునికి రాజ్యమొసంగబడినది. భీతిచే ఈయబడినది కాకపోవుట చేత మరల ఇయ్యదగనిదగుటయు చెప్పబడినది.

మహీపతిః = భూపతి (రాజు). స్వామికాని వానిచే ఈయబడకపోవుట చెప్పబడుచున్నది. (రాజు గావున ఇచ్చుట కధికారి అతనికి ఈయదగియుండుట, చెప్పబడినదని తాత్పర్యము) ఇట్లు దాతయొక్క దోషముతో (చే) మరల గ్రహింపదగనిదగుటయు (తీసికొనదగనిదగుటయును) జెప్పి సంప్రదానగుణము (ఔదార్య గుణము) చేతను కూడ చెప్పుచున్నాడు. తంప్రసిద్ధం ఏవం గుణ సంపన్నం - పూర్వమునందు (వెనుక) చెప్పబడిన సకల కల్యాణ గుణములచే సమృద్ధుడు, అన్నింటికి స్వామి అయినవాడన్నట్లు, సత్యపరాక్రమం = అమోఘ పరాక్రముడు అందరిని రక్షించుటకు సమర్థుడు అన్నట్లు (అందరిని రక్షింప జాలినవాడు) జ్యేష్ఠం=జ్యేష్ఠుడు-పెద్దవాడు, జన్మక్రమముచేతకూడ రాజ్యమునకు తగినవాడు, శ్రేష్ఠగుణైర్యుక్తం = నీతి శాస్త్రమునందు చెప్పబడిన ఆరు గుణములతో కూడినవాడు. సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, సమాశ్రయము అని ఆరుగుణములు కామందక

నీతిశాస్త్రమునందు చెప్పబడినవి. ప్రియం = ప్రీతికి విషయమైనవాడు, (ప్రీతిపాత్రుడు) దీనిచేత తాత్కాలికమైన ప్రీతిచే నిచ్చుట యనునది వ్యావర్తింపబడినది (దూరము చేయబడినది). సుతం = కుమారుని, జన్మచేతనే రాజ్యార్హుడైనవానిని, ప్రకృతీనాం = ప్రజలకు, హితైః = మేళ్ళను (ఉపకారములను) చేయుటలతో, యుక్తం = కూడిన వానిని, దీనిచే అందరికి అనుకూలముగా నుండుట (తగియుండుట) చెప్పబడినది - ఇటువంటి రాముని, ప్రకృతి ప్రియ కామ్యయా = మంత్రులు మొదలగు వారికి ప్రీతిని కలిగించు కోరికచేత, ప్రీత్యాచ = తనయొక్క ప్రీతి (ఇష్టము) చేతను (చకారము నిశ్చితార్థమును తెలుపుచున్నది) "గామశ్వం పురుషం జగత్" (గోవు(ల)ను, గుఱ్ఱములను, పురుషులను జగత్తును) అన్నట్లు మంత్రి వృద్ధులచే ఆలోచన పూర్వకముగా చేయబడిన దగుట వలన కూడనిదని నిరాకరింపబడదగనిదగుటను చెప్పబడుచున్నది. ప్రకృతిః పంచభూతేషు స్వభావేమూలకారణే । ఛందః కారణగుహ్యేషు జన్మామాత్యాది మాతృషు" (ప్రకృతి శబ్దము పంచ భూతములయందును, స్వభావమునందును, ప్రధాన కారణమునందును, జన్మనిచ్చిన తల్లి, ప్రజలు అమాత్యులు మొదలైన వారియందును ప్రవర్తించును) అని రెండు చోట్లను వైజయంతి నిఘంటువు. యువాచ అసౌ రాజాచ యువరాజః = యువకుడైన రాజు, తస్యభావః కర్మవా - యౌవరాజ్యం = అతనియొక్క భావము లేక కర్మ. యౌవరాజ్యము - దీనిచేత, తండ్రి రాజ్యమును నిర్వహించినవాడగు చుండగానే, సమస్తమునకు నిర్వాహకుడగుటచే అభిషేకింపబడిన పుత్రుడు యువరాజు. అతని యొక్క భావముతో అని అర్థము. సంయోక్తుం - కూర్చుటకు (ఘటించుటకు - సమకూర్చుటకు) ఐచ్ఛత్ = కోరెను, దానికి సంబంధించి సంభారములను (వస్తు సామగ్రిని - పదార్థ సముహములను) సిద్ధపరపింపజేసెను.

తస్యాభిషేక సంభారాన్ దృష్ట్వా భార్యాథకైకయీ పూర్వందత్తవరా దేవీ వరమేన మయాచత వివాసనంచ రామస్య భరతస్యాభిషేచనం ॥ 22	పిమ్మట అతని యొక్క అభిషేకమునకు సంబంధించిన వస్తు సామాగ్రిని భార్యయైన కైకేయి చూచినదై (మంధర ద్వారా దెలిసికొన్నదై) వెనుక (పూర్వము)తన కొసంగబడిన వరములు గలది గావున రాముని యొక్క అరణ్యావాసము (రాముని అడవికి పంపుట) భరతునికి పట్టాభిషేకము చేయుట అనెడి వరములను యాచించినది. (కోరినది).

ఇట్లు రామునికిచ్చిన రాజ్యము మరల వెనుకకు దీసికొనుట (గ్రహించుట) తగనిది (యోగ్యమైనదికాదు) అని చెప్పి తప్పరానిదగు తరువాత జరుగు కైకేయి యొక్క యాచనను (కోరికను) తెలుపుచున్నాడు. (తస్య-అని), సార్థశ్లోకము (శ్లోకమున్నర)నకు ఏకాన్వయము. (ఒక్కసారి అన్వయము), పిమ్మట రామునికి రాజ్యమునిచ్చుట యనుకోరిక తర్వాత, తస్య= ఆ రాముని యొక్క, అభిషేక = పట్టాభిషేకమనెడి కర్మ విశేషమునకు సంబంధించిన (కావలసిన), సంభారాన్ = సామగ్రిని (ఉపకరణములను) ఔదుంబర్యాసందీ, తస్యైప్రాదేశమాత్రాః, పాదాస్స్యుర్దధి మధుసర్పిరాతప వర్ష్యాఆపః" అని బ్రాహ్మణమునందు చెప్పబడినవానిని, దృష్ట్వా=చూచి, మంధర ద్వారా స్వయముగా (తానే) చూచినట్లు తెలిసికొని, భార్యా = భరించుటకు తగినది, కాని స్వాతంత్ర్యమునకు తగినది కాదు, (పత్ని), పూర్వం = పూర్వకాలమునందు, విభక్తి ప్రతిరూపకమైన అవ్యయము, ఆ దశరథుని చేత, దత్తవరా = ఈయబడిన వరములు కలది, శంబ రాసురుని విజయకాలము నందు సారథ్యముచేయుటకు పారితోషికముగా (బహుమానముగా) ఒసంగబడినది. ఏనం = అతనిని (దశరథుని), ఇచ్చుట తచ్ఛబ్దమునకు దశరథుడు

పరామర్శింపబడుటచేత శంబరాసురుని యొక్క యుద్ధము సూచింపబడినది. పది దిక్కులందు అడ్డులేని రథముగలవాడు గదా అతడు (అదశరథుడు). దీవ్యతీతిదేవీ = (క్రీడించునది) దేవి - రాణి, భోగ సాధనమైనది - భోగమునకుపయుక్తమైనది అని వ్యామోహమునకు మూలమైన (కారణమైన) వచనము. కైకయీ - కేకయదేశముల యొక్క రాజు కైకయుడు. కైకయుని యొక్క బిడ్డ = కైకయీ - కైకేయీ, కైకయీ అని శబ్దభేద ప్రకాశికయందు (రెండు పదములును) చెప్పబడినవి.

"ప్రాక్కైకయీతో భరతస్తదభూత్" అని భట్టి కవి ప్రయోగించుట వలన - కేకయదేశములు జన్మభూమి యగుటచేత కైకయీ అని చెప్పబడినదనవచ్చును. కైకయీదేవి, ఏనం = ఈదశథుని, రామస్య వివాసనం = రాముని యొక్క వివాసనము. (రాముని (అరణ్యమునకు) పంపుట) భరతస్య అభిషేచనం = భరతుని యొక్క పట్టాభిషేకము, అను, వరం = వరమును, అయాచత = అర్థించెను - (కోరెను).

యాచ్‌ధాతువు ద్వికర్మకము - (రెండు కర్మపదములు గలది.)

(ఇచ్చట ఏనం అనునది ఒకకర్మ పదము, వరం అనునది రెండవ కర్మ పదము)

స సత్యవచనా ద్రాజా ధర్మపాశేన సంయతః । వివాసయామాస సుతం రామం దశరథః ప్రియం ॥ 23	ఆ దశరథ మహారాజు ధర్మ పాశముచే కట్టబడినవాడై, సత్యవచనుడగుట వలన (సత్యవచనుడై) (ప్రియ పుత్రుడైన (ప్రియమైన కుమారుడగు) రాముని అరణ్యమునకు పంపెను. (పంపుటకు సమ్మతించెను)

"స"- అని, రాజా = అందరిని రంజింపజేయువాడు (సంతోషింపజేయువాడు). రాజా ప్రకృతి రంజనాత్ (ప్రజలను ఆనందింపజేయుట వలన రాజు (అనబడును) అను ప్రయోగము వలన, అతడు పూర్వము (వెనుక) రామునికి రాజ్యమునొసంగిన వాడు (ఈయబడిన రాజ్యము గలవాడు) మంత్రులు మొదలగు వారిచేత ఆలోచనా పూర్వకముగా (ఆలోచించి) ప్రతిజ్ఞచేయబడిన (వాగ్దానము చేయబడిన) రామునియొక్క పట్టాభిషేకముగలవాడు (రామునికి పట్టము గట్టెదనని మాటయిచ్చినవాడు) అగు దశరథుడు, ధర్మః పాశఇవ - ధర్మపాశః = పాశము (త్రాడు) వంటి ధర్మము, ఉపమితం వ్యాఘ్రాదిభిః = (పులి మొదలగు వానితో పోల్చబడినది) అని సమాసము. వ్యాఘ్రాదులు ఆకృతిగణము తేన = (దానిచేత (ఆధర్మపాశము చేత) సంయతః = బద్ధుడైన వాడై, కట్టబడినవాడై, సత్యవచనాత్ = సత్యవచనుడగుట వలన -(సత్యవచనమువలన) స్త్రీ విషయముగా ఇచ్చిన వచన సిద్ధి యొక్క హేతువు వలన, (కైకెయికిచ్చిన మాట నెరవేర్చుట అనెడి కారణమువలన) ప్రియం సుతం రామం వివాసయామాస = ప్రియమైన కుమారుడగు రాముని అరణ్యమునకు పంపగా నంగీకరించెను. (అడవికి పంపెను).

రామో విగ్రహవాన్ ధర్మః (రాముడు రూపెత్తిన (ఆకారము ధరించిన) ధర్మము) - (శరీరముగల ధర్మమే రాముడు) అని చెప్పబడిన ప్రకారముగా మొదట అంగీకరింపబడిన పరమధర్మమును (రాముని) విడిచిపెట్టి, తరువాత ప్రవృత్తమైన (ప్రవర్తించిన - ఆరంభమైన -కనబడిన) స్త్రీ విషయమైన క్షుద్ర (నీచమైన) ధర్మమును అవలంబించినవాడు అని అర్థము. దీనిచేత "సాంకేత్యం పారిహాస్యం వాస్తోభం హేళనమేవవా, వైకుంఠనామ గ్రహణం అశేషాఘ వినాశనం. ఆక్రుశ్య పుత్ర మఘవాన్ యదజామిలోపి నారాయణేతి మ్రియమాణ ఉపైతిముక్తిం । కామాద్గోప్యో భయాత్కంసః ద్వేషాచ్చైద్యాదయో నృపాః సంబంధా ద్వృష్ణయః స్నేహాద్యూయం, భక్త్యావయంనృప ॥.

(శ్రీమన్నారాయణుని పేరును బిడ్డలకు పేరుగా పెట్టి పిలిచినను, (సరిగా పలుకలేని వానిని) పరిహసించుటకై

(వెక్కిరించుటకై) ఉచ్చరించినను, స్తోభమునకై (పద్యము నిలుపుదలకు మాయమాటలు, అమర్యాదపాట మొదలగు వాని పూర్తికై చేర్చి) ఉచ్చరించినను, హేళనమునకైనను, (తన శత్రువును తిట్టుటలో) వాడినను, సమస్తమైన పాపములను పోగొట్టి (ఇష్టముల నొసంగును) (అని తెలిసికొందురు), అతి పాపిష్ఠియగు (పాపము గలవాడగు) అజామిళుడును మరణించువాడై 'నారాయణ' అని కుమారుని ఆక్రోశి[illegible] (గట్టిగా పిలిచి) ముక్తిని పొందెను. కామము వలన గో[illegible]కలు, భయముచే (వలన) కంసుడు [illegible] శిశుపా[illegible] మొదలైన రాజులు, సంబంధముచే వృష్ణి [illegible] భక్తి[illegible] ([illegible]మి) అనియిట్లు ఎటులో [illegible] (ఏదో ఒక [illegible]వన్నామము గలవారిని (ఉచ్చరించువారికి - తలంచువారికి) ముక్తి నిశ్చితమగుచుండగా, ఎల్లప్పుడు రామునియందు ఆసక్తిగల (రామపరాయణుడైన) దశరథునికి ఎట్లు ముక్తి లేదు (కలుగలేదు) అను శంక దూరముగా తొలగింపబడినది, సిద్ధ సాధనమును విడుచుట వలన (రాముడే - భగవంతుడే సిద్ధమైన సాధనము. అతనిని ఒకరు తయారుచేయవలసినది లేదు. స్వయం భువగుట వలన) రెల్లుగడ్డిని ఆశ్రయించుట వలన, ధర్మపాశము యొక్క ప్రతి బంధమువలన (అడ్డగింత వలన)ను - ముక్తి ప్రసంగమే లేనిదగుట వలన - (దశరథుడు సాక్షాద్ధర్మమును విడిచి ఆభాస ధర్మమును పట్టుకొన్నాడు). ఆ విధముగా ముముక్షువు (మోక్షమునందిచ్ఛగల వాడు) ఉండఁగినది కాదు (వర్తింపదగినది కాదు) అని చెప్పబడినదగును.

స జగామ వనం వీ[illegible]: ప్రతిజ్ఞా మనుపాల[illegible] పితుర్వచన నిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్ ॥ 24	తండ్రియొక్క మాట[illegible]పు వలన (పితృ వాక్యమును ఆజ్ఞగా స్వీకరి[illegible]కేయికి ప్రీతిని కలిగించుటకును [illegible]కేయి యొక్క (ప్రియమే హేతువుకాగా) కైకే[illegible]కి ఇష్టమగుట వలన) ప్రతిజ్ఞ[illegible] (కైకేయి ఎదుట తాను చేసిన ప్రతిజ్ఞకు అనుగుణముగ) పాలించుచు వీరుడగు ఆ రామచంద్రుడు అడవికి వెళ్ళెను.

పితృ వాక్యపాలనము తప్పకుండ చేయదగినది అని ఇది రాముని యొక్క నడవడిక ద్వారా, (అచారముఖముగా) (స జగామ) అని చూపుచున్నాడు. సః = అతడు (రాముడు), వీరోపి = రాజ్యమును పరిపాలించుట యందు సమర్థుడు అయినప్పటికిని, కైకేయ్యాః = కైకేయి యొక్క, ప్రియకారణాత్ = ప్రియమునకు (ఇష్టము, సంతోషమునకు) కారణము (హేతువు) అగుటవలన, స్త్రీ యొక్క పారవశ్యముచే (స్త్రీకి పరవశుడగుటచే) చెప్పబడినదగుటవలన అని యర్థము, పితుర్వచన నిర్దేశాత్ = తండ్రియొక్క మాటయే నిర్దేశము (ఆజ్ఞ) అగుటవలన "ఆజ్ఞాయామపినిర్దేశః (నిర్దేశ శబ్దము ఆజ్ఞయందు వర్తించును) అని బాణనిఘంటువు - (అపవాదస్తు నిర్దేశో నిదేశశ్శాసనంచసః, శిష్టిశ్చాజ్ఞాచ - అపవాదము, నిర్దేశము, నిదేశము, శాసనము, శిష్టి, ఆజ్ఞ, ఈఆరు ఆజ్ఞకు పేళ్ళు) అని అమరము. తస్మాత్ = ఆ కారణమువలన - ప్రతిజ్ఞాం = (తండ్రి యెదుట కైకేయితో తాను చేసిన ప్రతిజ్ఞను) కైకేయి యొక్క సమక్షమునందు (ఎదుట) తాను చేసిన ప్రతిజ్ఞను, అనుపాలయన్ = పాలించువాడై, "తద్బ్రూహి వచనం దేవి రాజ్ఞో యదభికాంక్షితం, కరిష్యే ప్రతిజానేచ రామోద్విర్నాభిభాషతే" - (దేవి (అమ్మా) రాజునకేది యిష్టమో (రాజుయొక్క కోరిక యేదో), ఆ మాటను చెప్పుము, చేయగలను, ప్రతిజ్ఞ చేయుచున్నాను కూడ. రాముడు రెండు మాటలు పలుకువాడు కాడు) అని ముందుచెప్పగలడు - తన ప్రతిజ్ఞను పాలించుట కొరకు తండ్రి మాటను పాలించుట కొరకు కూడ, అని యర్థము. వనం = దండకారణ్యమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తంవ్రజంతం ప్రియోభ్రాతా లక్ష్మణోను జగామహ । స్నేహాద్వినయసంపన్నః సుమిత్రానందవర్ధనః ॥ భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్రమనుదర్శయన్ । 25	(రామునియందు) ప్రీతిగలవాడు, సోదరుడు, వినయముతోకూడినవాడు, సుమిత్రయొక్క ఆనంద-మును వృద్ధిపొందించువాడు, అన్నయైన రామునికి ప్రియమైనవాడు అగు లక్ష్మణుడు సౌభ్రాత్రమును (మంచి తోడబుట్టుదనమును) ప్రదర్శించుచు (వనమునకు) పోవుచున్న అన్ననునసరించి తానును వనమునకు పోయెను.

ఇక్ష్వాకు వంశము అని మొదలైన దానిచేత సకల కల్యాణ గుణపరిపూర్ణుడగుట యను మాటచేత రాముని యొక్క పరత్వము చెప్పబడినది. తమేవం, అను మొదలగు దానిచేత అభిషేకము యొక్క ప్రవృత్తి (సమాచారము-ఆరంభము) మరియు నివృత్తి (చాలించుట, ఆగిపోవుట) యొక్క కథనము వలన సౌలభ్యము చెప్పబడినది. పిమ్మట పరత్వ-సౌలభ్యములకు అనుగుణమైన, సమాశ్రయణమును (భక్తులు చక్కగా ఆశ్రయించుటను) (సేవించుటను) చెప్పుచున్నాడు - (తంవ్రజంతం-అని), లేక, పిమ్మట సిద్ధసాధన నిష్ఠుడైన లక్ష్మణునివలె కైంకర్యపరులై యుండదగి యుండుటను సూచించుచు (వ్యంజింప చేయుచు) చెప్పుచున్నాడు. (తంవ్రజంతం) అని సార్ధ శ్లోకములకు (ఒకటిన్నర శ్లోకములకు) ఏకాన్వయము - (ఒక్కటే అన్వయము). ప్రీణాతీతి ప్రియః = ప్రేమించువాడు, రామునియందు ప్రీతిగలవాడు, దీనిచేత అనుసరించి పోవుటకు హేతువైన భక్తి చెప్పబడినది. భ్రాతా = తోడబుట్టినవాడు. భ్రాతా స్వామూర్తి రాత్మనః - (ఆత్మయొక్క తనదైన మూర్తి) అని మూర్తీ భూతుడు, వినయసంపన్నః = కైంకర్యమునకు హేతువైన వినయముతో కూడినవాడు, వినయ మనగా శేషత్వ జ్ఞానము, రాముని యొక్క కైంకర్య రూపమైన ఆచారము (నడవడి) "వినయో ధర్మ విద్యాది శిక్షాచార ప్రశాంతిషు" = వినయశబ్దము ధర్మము, విద్య మొదలైన వానియొక్క శిక్ష, నడవడి (ఆచారము) ప్రశాంతి అనువాని యందు వర్తించును) అని వైజయంతి - సుమిత్రాయాః ఆనందం వర్ధయతీతి సుమిత్రానందవర్ధనః = సుమిత్రయొక్క ఆనందమును వృద్ధిపొందించువాడు, సృష్టస్త్వం వనవాసాయ - (వనవాసమునకై (కొఱకే) నీవు జన్మించినావు (సృష్టింపబడినావు)

"రామందశరథం విద్ధి మాంవిద్ధి జనకాత్మజాం।
ఆయోధ్యామటవీంవిద్ధి గచ్ఛతాతయథాసుఖం" (రాముని దశరథునిగాను, సీతాదేవిని నన్నుగాను, అయోధ్యను అరణ్యముగాను తెలిసికొనుము, తండ్రి! యథాసుఖముగా వెళ్ళుము (పోయిరమ్ము) అని సుమిత్ర చేతనే చెప్పబడినదగుట వలన 'దయితః' రామునికి మిక్కిలి ఇష్టమైనవాడు. యమేవైషవృణుతే తేనలభ్యః - ఎవరినైతే ఇతడు (భగవంతుడు) వరించునో, అతనిచేతనే పొందబడును. (అతనికే లభించును) అని చెప్పబడిన రీతిగా, ప్రియతముడగుటచేత వరింపదగినవాడు అని యర్థము. లక్ష్మణః = కైంకర్య లక్ష్మితోకూడినవాడు కాగలడు అని ఎఱింగి లక్ష్మణుడని వసిష్ఠునిచేత పెట్టబడిన పేరుగలవాడు. "సతునాగవర శ్రీమాన్" (ఆ గజేంద్రము శ్రీ గలది) అని చెప్పుటవలన కైంకర్య లక్ష్మి గలిగియుండుటయే - లక్ష్మణో లక్ష్మిసంపన్నః (లక్ష్మణుడు లక్ష్మితో కూడుకొన్నవాడు) అని ముందు చెప్పగలడు. లక్ష్మీవాన్, లక్ష్మణః, శ్రీమాన్ అని పర్యాయపదములుగా పాఠమున్నది. సుభ్రాతుర్భావః సౌభ్రాత్రం = చక్కని తోడబుట్టుదనము, రాముడు లేకుండ క్షణకాలము కూడ జీవించలేక పోవుట (బ్రతుకుటక సమర్థుడగుట) సుభ్రాతృత్వము (చక్కని సోదరత్వము) "నచసీతా త్వయాహీనా నచాహ మపిరాఘవ, ముహూర్తమపి జీవావో జలాన్ మత్స్యావివోద్ధృతౌ (రామచంద్రా! నీవు లేకుండ సీతయు, నేనును నీటినుండి మీదికి తీయబడిన

చేపలువలె ముహూర్తకాలము కూడ జీవింపజాలము) అని ముందు చెప్పగలడు. రామునికిని లక్ష్మణుని యొక్క వియోగము (విరహము) సహింపలేనితనము (ఓర్చుకొనలేనితనము)ను సుభ్రాతృత్వమే. అది కూడ "నచ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః । మృష్టమన్న ముపానీతం అశ్నాతి నహి తం వినా" (పురుషోత్తముడైన రాముడు అతడు (లక్ష్మణుడు) లేక నిద్రించెడివాడు కాడు. రుచికరమగు (మృష్టమైన) మంచి భోజనము (ఆహారము) తెచ్చినను లక్ష్మణుడు లేనిచో తినేవాడు కాడు) అని ముందు చెప్పగలడు. ఆసౌభ్రాత్రమును బయలు పరచు (వెల్లడించు) చున్నాడు లేక, ఇట్లు మంచి తోడబుట్టువులచే ఉండదగినది అని చూపుచున్నాడు-వలె అని గమ్యోత్ప్రేక్ష. వ్రజంతం - పోవుచున్న వానిని, ఏకాంతమునందు తనకభిమతమైన (ఇష్టమైన సకల కైంకర్యములను ఇచ్చుటయందు ప్రవృత్తమైన) సోదరుని - ఉపలక్షణమిది.

"మాతా పితా నివాస శ్శరణం సుహృద్గతి ర్నారాయణః" (తల్లి, తండ్రి, ఇల్లు, రక్షకుడు, స్నేహితుడు, దిక్కు, (సర్వము) నారాయణుడే) అని చెప్పబడిన సకల విధములైన బంధువు (చుట్టము) "అహం తావన్ మహారాజే పితృత్వం నోపలక్షయే, భ్రాతా భర్తాచ బంధుశ్చ పితాచ మమ రాఘవః (నేనిక మహారాజునందు తండ్రి భావనను గుర్తించను (నిలుపను) అన్న, భర్తయును, బంధువును, తండ్రియును (సమస్తమును) నాకు రామచంద్రుడే) అని ముందుచెప్పగలడు. "బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః (కైంకర్య) లక్ష్మీవర్ధకుడైన లక్ష్మణుడు బాల్యమునుండియు లోకాభిరాముడైన శ్రీరామునకు మంచి స్నేహితుడు. (సుస్నిగ్ధుడు - ప్రీతిపాత్రుడై అతనియెడ అధికముగా ప్రీతి గలవాడు), అని చెప్పబడిన రామభక్తి (రాముని యందలి భక్తి) యొక్క హేతువు వలననే, అనుజగామ = వెంటవెళ్ళెను. యేన యేన ధాతా గచ్ఛతి తేనతేన సహగచ్ఛతి - యేయే మార్గమున పరబ్రహ్మ నడచునో, ఆయా మార్గమున (అతని తోడను జీవుడు కూడ వెళ్ళును) అన్నట్లు అపూర్వమైనది ఈ ఒకానొక వృత్తి (నడివడి) యొక్క విశేషము అని నారద మహర్షియే ఆశ్చర్యపడుచున్నాడు. (హ) అని, హ విస్మయే విషాదేచ (హ అనుపదము విస్మయమునందును, విషాదమునందును వర్తించును) అని బాణ నిఘంటువు - ఆశాలేశమాత్రముచే తనయందే అధిక ప్రేమగల భగవంతుని ఎక్కడనో ఒకచోట ఏకాంత స్థలమునందు తన కోరికకు తగిన విశిష్ట విషయమందు సమస్త కైంకర్యముల పొందుటకై అనుసరించుచున్న (వెంబడించు) అధికారి ఇచ్చట వ్యంజింపబడుచున్నాడు (సూచింపబడుచున్నాడు).

రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణ సమాహితా । జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా ॥ సర్వలక్షణ సంపన్నా నారీణా ముత్తమా వధూః । సీతాప్యనుగతా రామం శశినం రోహిణీయథా ॥ 27 1/2	రామునకు ప్రియమైన భార్యయు నిత్యము ప్రాణములతో సమానమైనది, మేలునుకూర్చునది, జనక వంశమున జనించినది, దేవమాయవలె (విష్ణువు యొక్క ఆశ్చర్యకరమగు దివ్యశక్తివలె) స్త్రీ మూర్తి దాల్చినది. సకల శుభలక్షణములతో కూడినది, స్త్రీలలో ఉత్తమురాలు, అయిన సీతాదేవి కూడ రోహిణి చంద్రుని (విడువలేక) అనుసరించియుండునట్లు శ్రీరాముని అనుసరించి వెడలినది.

పిమ్మట, సాధనదశయందు సీతయొక్క పురుషకారముండుటచేతను, ఫలదశయందు పొందదగినదగుట చేతను, సంబంధము వలన ఆమెతో నిత్యయోగమును చూపుచున్నాడు. (రామస్య అని మొదలైన రెండు శ్లోకములచేత) రామస్య దయితా = మనోహరుడైన (సుందరుడైన) రామునికికూడ ప్రియమైన (సుందరమైన)ది,

నిత్యం భార్యా = మనస్సునందు ఎల్లప్పుడు ధరింపదగినది. (భరింపబడునది) (నిత్యము అతని మనస్సును వదలని ప్రియురాలు (ప్రేమమూర్తి), ప్రాణసమా = ప్రాణములతో సమానమైనది. చెప్పబడిన రెండు అర్థములందు హేతువిది. హితా = మేలుచేయునది. చేతనుల యొక్క మేలునందు ఆసక్తికలది. మిత్ర మౌపయికంకర్తుం (రాముడు స్నేహితుడుగా చేసికొనుటకు దగును = రామునితో మైత్రి చేసికొనుట యుక్తము) అని మొదలుగా చెప్పగలదు. రాముని యొక్క మేలునందు ఆసక్తి కలది. స్మారయే త్వాం నశిక్షయే (నీకు గుర్తుచేయుచున్నాను, (స్మరింపజేయుచున్నాను), శిక్షించుటలేదు. (తెలియని దానిని తెలుపుటను శిక్షించుట యందురు) - అనియు ముందు చెప్పగలదు. జనకస్య కులేజాతా = జనకుని వంశమున పుట్టినది. ఆచార ప్రధానురాలని అర్థము. దేవమాయేవ నిర్మితా = దేవుని యొక్క మాయవలె సృష్టింపబడినది. (నిర్మింపబడినది). అమృతమథనము తర్వాత అసురులను మోహింపజేయుట కొఱకై సృష్టింపబడిన విష్ణువు యొక్క మాయ (జగన్మోహిని) వలె ఉన్నది. విష్ణువు తన ఆశ్చర్యకరమగు దివ్యశక్తి (మాయ) చేత అసురులను మోహింపజేయగా స్త్రీమూర్తిని దాల్చిన వాడు అని చెప్పుట (వచనము) వలన, నిర్మితా = కృతకమైన మూర్తి (కల్పితమైన మూర్తి) దేవమాయా - విష్ణువు యొక్క ఆశ్చర్యకరమైన శక్తివలె ఉన్నది. దీనిచేత సౌందర్యము యొక్క పరాకాష్ఠ (చివరిమేర - అత్యంతా తిశయము) చెప్పబడినది. నిర్మితా - చేయబడిన అవతారము గలది. (అవతరించినది) దేవమాయా - దేవుడైన విష్ణువుయొక్క (ప్రియురాలైన భార్య) లక్ష్మి "ఋతే మాయాం విశాలాక్షీం తవ పూర్వపరిగ్రహం" (ఆశ్చర్యమైన శక్తిగలది. విశాలమైన కన్నులు గలది యగు నీయొక్క మొదటి భార్యను విడిచి) అని ఉత్తరకాండమునందు చెప్పబడగలదు. ఇవ (వలె) శబ్దము వాక్యాలంకారమునందు, లేక ఏవకారము యొక్క అర్థమునందు ప్రయోగింపబడినది. సర్వలక్షణ సంపన్నా = సాముద్రిక శాస్త్రమునందు చెప్పబడిన సమస్తమైన ఉత్తమ స్త్రీ లక్షణములతో కూడికొన్నది. నారీణా ముత్తమా = పూర్వము (వెనుక) చెప్పబడిన సర్వ ప్రకారములచేత స్త్రీ లందరిలో శ్రేష్ఠురాలు. పురుషోత్తముడైన రామునికి అనురూపమైన (తగిన)ట్లు స్త్రీలలో ఉత్తమురాలు అని యర్థము. వధూః= దశరథుని యొక్క కోడలు, కొలదికాలము క్రితమే పెండ్లాడిన భార్య (అచిరోఢా వధూః) అని వైజయంతి, సీతా = నాగటిచాలు. దానినుండి పుట్టినదగుటచేత సీతయనే పేరుతో పిల్వబడినది. దీనిచే అయోనిజత్వము (తల్లిగర్భము నుండి జనించకపోవడము) చెప్పుట వలన దేవలోకము నందు వసించునప్పటి సౌందర్యమే తక్కువ కాకుండా చెప్పబడినది. అపి (కూడ) శబ్దముతో లక్ష్మణుడు రాముని వెంటపోవుటయు చెప్పబడినది. రామం అనుగతా = అతిశయమైన (నిరవధికమైన) సౌందర్యముచే ఆకర్షింపబడిన హృదయము గలదగుటచేత (క్షణకాలము చూడక నిలువలేనిదై), రోహిణివలె వెంబడిపోయినది. యథాశబ్దము 'వలె' అనునర్థముగలది. "వద్వా యథాతథేవైవం సామ్యే" (వత్ వా, యథా, తథా, ఇవ, ఏవం అను పదములు పోలిక యందు వర్తించును) అని అమరము - రోహిణి అనునామె చంద్రుని యొక్క అసాధారణమైన భార్య (పత్ని) "వరిష్ఠా సర్వనారీణా మేషా చ దివి దేవతా! రోహిణీ నవినా చంద్రం ముహూర్తమపి దృశ్యతే" (ఈమె స్త్రీలందరిలో శ్రేష్ఠురాలు, స్వర్గమునందలి దేవత యగు రోహిణి చంద్రుడులేక (చంద్రుని విడిచి) క్షణకాలము కూడ కనబడదు) అని, కేవలము రామ సౌందర్యముచే ఆకర్షింపబడినదై వెంటపోలేదు. మరి అయితే (మచ్చగల) చంద్రుని రోహిణిదేవి వలె పాతివ్రత్య స్వరూపమునకు తగిన విధముగా వెంటపోయినది అని యర్థము ఈ అర్థమే అనసూయ (అత్రిభార్య) ఎదుట వ్యక్తముకాగలదు. (వ్యక్తీకరింపబడ గలదు).

పౌరైరనుగతోదూరం పిత్రాదశరథేన చ॥	28	పౌరులచేతను, తండ్రి దశరథుని చేతను కొంత (కొలది) దూరము ఆరాముడు వెంటననుసరింపబడెను - (పురజనులు, తండ్రి దశరథుడు కొంత దూరము అతని వెంటననుసరించిరి).

రామభక్తియందు తేడా (భేదము) లేకపోవడమువలన సీతాలక్ష్మణులవలె పౌరుల యొక్క పరమభక్తి చెప్పబడినది. పున ర్విశ్లేష భీరుత్వంపరమా భక్తిరుచ్యతే. (మరల వియోగము కలుగునని భయపడుటయే పరమ భక్తియని చెప్పబడుచున్నది) అనెడి మాట వలన, పురజనులచేత - అనుదానిచే అతని దేశమునందు వసించుటయే రామభక్తికి కారణము అని చెప్పబడినది. పిత్రాదశరథేనచ - తండ్రియైన దశరథుని చేతను (తోడను), చశబ్దము అన్వాచయమునందు, కొలదిగా వెంబడించినాడు అని యర్థము. ద్వారము వరకు ఆ తండ్రిచే వెంటననుసరింప బడెను. అనుదానిచేత, కుమారుని యందున్న వాత్సల్యము వలన 'వెంటననుసరింపబడినవాడు' అని చెప్పబడినది.

శృంగిబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్ ॥ గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియం గుహేన సహితో రామో లక్ష్మణేనచ సీతయా ॥ $29^1/_2$	శృంగిబేరపురమునందు నిషాదులకు ప్రభువును, ప్రేమగలవాడును (ప్రియుడును) అగు గుహుని చేరి ధర్మాత్ముడగు శ్రీరాముడు గుహుని తోడ, లక్ష్మణునితోడ, సీతతోడను కూడుకొన్న వాడై సూతుడైన సుమంత్రుని గంగాతీరమున (ఇక తమతో రావలదని) విడిచెను - గుహుని సాయముతో గంగను దాటెను -

ఇట్లు పరత్వ సౌలభ్యములు చూపబడినవి. పిమ్మట వాత్సల్య సౌశీల్యములను చూపుచున్నాడు (శృంగిబేరపురే) అని, ధర్మాత్మా రామః = ధర్మే ఆశ్రిత వాత్సల్య సౌశీల్యే ఆత్మా స్వభావోయస్యసః - ఆశ్రితవాత్సల్యము, సౌశీల్యము అను ధర్మములు ఆత్మ (స్వభావము)గా గలవాడు ధర్మాత్ముడు = ఆశ్రిత వాత్సల్య సౌశీల్యములు అను ధర్మములు (గుణములు) స్వభావముగా గల రాముడు. శృంగిబేరపురే = శృంగము (కొమ్ము) గలది శృంగి, కృష్ణసారము (నల్ల మచ్చల జింక) మొదలగునవి శృంగులు, వానియొక్క బేరములు - కృత్రిమములైన శరీరములు, "ప్రతిచ్ఛందః ప్రతినిధిర్బేరంచ ప్రతిరూపకం" (ప్రతిచ్ఛందము, ప్రతినిధి, బేరము, ప్రతిరూపము - ఈ నాలుగు సమానార్థకములు) అని వైజయంతి, మోసముతో సజాతీయమైన మృగములను పట్టుకొనుటకైన విషయము దేనియందు ఉన్నదో అది శృంగిబేరము, అట్లగుట వలన, ఆ పేరు గల పట్టణము. శృంగిబేరపురము - గంగాకూలే = శృంగిబేర పురమునకు దగ్గరనున్న గంగాతీరమునందు, అని యర్థము - దీనిచే గంగాతీరమగుట మాత్రముచేత ఉద్దేశింపబడియుండుట కాదు, కాని భక్తులచే సేవింపబడుట చేతనే అని చెప్పబడినది. "సాకాశీతి నచాకశీతి" అని మొదలైన అభియుక్తుల (ఆప్తులైన పండితులయొక్క) ఉక్తివలన, నిషాదులు = ప్రతిలోమ జాతి విశేషులు, నిషాదో మృగఘాతీ స్యాత్ (మృగములను చంపువాడు నిషాదుడు) అని వైజయంతి నిఘంటువు - (ఒకరకమైన ఆటవికజాతికి చెందినవాడు) తేషాం అధిపతిః = వారియొక్క ప్రభువు, అని జాతియొక్క తక్కువతనము (నైచ్యము) చెప్పబడినది (ప్రీణాతీతి ప్రియః తం) ప్రేమించువాడు అతనిని, తనయందు ప్రీతిగల వానిని, అనియర్థము, గుహతి గోపయతి పంచయతి పరస్వం ఇతిగుహః = ఇతరుల సొత్తును దాచి పెట్టువాడు, మోసగించువాడు. జాతివలన, వృత్తివలన, గుణము వలన హీనుడైనప్పటికిని, తనయందు ఒద్దిక (అనుకూల భావము) ఉండుట వలన అతనిని ఆదరింపదగి యుండుటయు చెప్పబడినది. నిషాదాధిపతిని చేరి, అనుదానిచేత సౌశీల్యము చెప్పబడినది. మహతో మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషోహి-సౌశీల్యం = గొప్పవారికి చిన్న వారితోడ దట్టమైన కలయిక అనగా కలిసిమెలిసి యుండుటయే సౌశీల్యము. ఆసాద్య అని, ఇచ్చట అభివిధి - (అభివాదనము) చెప్పుట చేత, అర్థానైరంధ్ర్యం (విషయము - ధనము-వలని సాంద్రత) చెప్పబడినది. ధర్మాత్మా అనుదానిచే

మహత్వము చెప్పబడినది. శృంగిబేరపురమున గుహుని పొంది, అని దోషములయొక్క భోగ్య స్వరూపమైన (దోషములను భోగ్యములుగా స్వీకరించునట్టి) వాత్సల్యము చెప్పబడినది. సూతం-సుమంత్రుని, పారంపర్యముగా (కులక్రమముగా) అనుసరించి వర్తించుచున్నవాడయినను విడిచెను. అప్పుడే ఈనిన దూడయందలి వాత్సల్యమువలన వెనుకటి దూడను (ఇంతకు ముందరి దూడను) విడుచునట్టి ఆవునకు వలె వాత్సల్యాతి శయము చెప్పబడినది.

తనయందలి ఆశాలేశమాత్రముచేత (కొలది ఆశచేత) జనించిన గుహుని విషయమైన ప్రేమాధిక్యతను చూపుచున్నాడు.

(రామఃగుహేన సహితఃసన్ లక్ష్మణేన సీతయాచసహితః) రాముడు గుహునితో కూడినవాడై లక్ష్మణునితో, సీత తోడను కూడిన వాడాయెను - (అంతకు పూర్వమే లక్ష్మణుడు సీతకూడ రామునితో కూడియున్నారు, కాని గుహునితో చేరువరకు వారితోకూడియున్నను తాను ఒంటరిగ ఉన్నట్లె శ్రీరామునకు అనిపించుచుండెనట. ఎప్పుడు గుహుని కలయిక లభించినదో, అప్పుడు సీతా లక్ష్మణుల కలయికచే కలిగిన ఆనందము ఉన్నట్లు అనిపించెను. ప్రేమగల ముగ్గురిలో ఒకరు దగ్గర లేనినాడు మిగిలిన ఇద్దరు దగ్గరున్నను వారున్న ఆనందము తల్లికి ఉన్నట్లు తోచదు, ఎపుడు మూడవ వాడు కలియునో అపుడు అంతకు ముందున్న ఇద్దరితో కూడిన ఆనందము కూడ బహిర్గతమై అనుభవింపబడును - శ్రీరామునకు గుహుని పైగల ప్రేమ తనతోనున్న సీతాలక్ష్మణులను కూడ మరచునట్లు చేయునంతటిది అని శ్లోకము తెలుపుచున్నది. ఇదియే రాముని సౌశల్యము (అని శ్రీభాష్యం అప్పలాచార్యుల వ్యాఖ్యానము) గుహుని యొక్క చేరిక (కలియిక) తర్వాతనే నిత్యానపాయినులైన (ఎల్లప్పుడు వదలకుండనుండు వారైన) లక్షణ సీతలతో చేరిక (సాహిత్యము) అయెను. అంతకు పూర్వము కలిసియున్నను (చేరియున్నను) అదిలేనట్లే ఉండెను. లేక, దృష్టాంతము కొఱకు లక్ష్మణ సీతలయొక్క చేరికను చెప్పుట. అటువంటి ప్రేమ భావమే (సౌహార్దమే) గుహుని యందుకూడ ఉండెను అని భావము.

సహితః। సంహితః = (చేర్పబడినవాడు, సంధింపబడినవాడును) సఃరామః = ఆ రాముడు లక్ష్మణునితో సీతతోడను గూడ గుహునిచేత, హితః - (ప్రహితః పంపబడినవాడు) - గంగను దాటింపబడినవాడు (తరింపజేయబడినవాడు) అనికూడ కొందరు అర్థము చెప్పుదురు - గుహునిచే గంగ (గుహుని సాయముతో గంగ) దాటినవాడు అని తాత్పర్యము.

తే వనేన వనం గత్వా నదీస్తీర్త్వా బహూదకాః । చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్ ॥ $29^1/_2$	వారొక వనమునుండి మరొక వనమునకు పోవుచు, (నడుమ నడుమ) అధిక జలములు గల నదులను దాటుచు, భరద్వాజుని యొక్క ఆజ్ఞ వలన, (అనుశాసనముచే) చిత్రకూట (పర్వత) మును పొంది.
రమ్య మావసథంకృత్వా రమమాణా వనేత్రయః । దేవ గంధర్వ సంకాశా స్తత్రతే న్యవసన్ సుఖం ॥ $30^1/_2$ ఉవాస సీతయా సార్థం వల్కలాజిన సంయుతః = అధికపాఠము	సుందరమైన ఆశ్రమమును నిర్మించుకొని దేవ గంధర్వులతో సమానులైన ఆ ముగ్గురును ఆ వనమునందు ఆనందముగా విహరించుచు సుఖముగా నుండిరి.

తేవనేన-అని రెండు శ్లోకములకు ఏకాన్వయము (ఒకేసారి అన్వయము) తేత్రయః = రాముడు మొదలైన ఆ ముగ్గురు - అనుట చేత గుహనివర్తనము (గుహుని వెనుకకు పంపుట - మరలించుట) స్ఫురింపబడినది. వనేన వనంగత్వా = వనమునుండి మరొక వనమునకు వెళ్ళి - అని పంచమీ విభక్తి యొక్క అర్థమునందు తృతీయా విభక్తి వచ్చినది. లేక, హేతువునందు తృతీయావిభక్తి. దీనిచేత నూతన వనములను చూచుట యందలి కుతూహలమును, నగరమునందు ప్రవేశించుట తన యధికారమునకు విరుద్ధమగుటయును సూచింపబడుచున్నది. లేక, తే+ అవనేన వనంగత్వా = పరస్పర రక్షణముతో (ఒకరినొకరు రక్షించుకొనుచు) వనమునకు వెళ్ళి, అని యర్థము. అగ్రతో గచ్ఛ సౌమిత్రే సీతా త్వా మనుగచ్ఛతు. పృష్ఠతోహం గమిష్యామి త్వాంచ సీతాంచ పాలయన్. అన్యోన్యస్యేహ నో రక్షా కర్తవ్యా పురుషర్షభ" (లక్ష్మణా! (నీవు) ముందునడువుము. సీతాదేవి నిన్ననుసరించి (నీవెంబడి) నడచును, నిన్నును, సీతను గాపాడుచు నేను వెనుక రాగలను, పురుష శ్రేష్ఠా ఇచ్చట మనకు పరస్పరము ఒకరినొకరు కాపాడుట చేయదగినది (కర్తవ్యము) అని ముందు చెప్పగలడు. లేదా, అవనేన - తండ్రిమాటను పరిపాలించుట యనెడి కారణముచే, అడవికి వెళ్ళి, లేదా అవనేన - లోకములను రక్షించుటయను కారణముచేతను - (రావణుడు మొదలైన దుష్టులను సంహరించుట ద్వారా లోక రక్షణ కొఱకు గదా వారి వన గమనము) లేదా, తేవనేన - (దేవనముగా - క్రీడగా) లీలగా, అనాయాసముగా అని యర్థము. లేదా - వేటాడుట చేతను - ఇట్టిదైన వ్యుత్పత్తిచే- తేవనము - కాలినడక అని సూచింపబడుచున్నది. సూతుని విడిచిన తర్వాత రథమునుండి దిగి కాలినడకచే వనమునకు (అడవికి) పోయి, అని అర్థము. లేదా వనేనవనం = జలముతో కూడిన అడవి - కాని మరుకాంతారముకాదు - (నిర్జలారణ్యము - నీరులేని అడవి మాత్రము కాదు) అని అర్థము - "పయః కీలాల మమృతం జీవనం భువనం వనం" - (పయః, కీలాలము, అమృతము, జీవనము, భువనము, వనము, - ఈ శబ్దములు జలపర్యాయవాచకములు, (నీరుపేళ్ళు) అని అమరము - బహూదకాః = విస్తారమైన నీళ్ళు గలవి - అధికముగా నీళ్ళు గలవి. విపులానేకయోర్బహు" (బహుశబ్దము, విపులము, అనేకము అను అర్థములందు వర్తించును) అని, వైజయంతి. నావచే తరింపదగినవి - దాటదగినవి అని యర్థము. నదీః = నదులను, గంగను, తీర్త్వా = దాటి (ఉత్తరించి), గంగానదీనాం (నదులలో గంగ) అని నదులలో ముఖ్యమైనదగుట వలన ఉపపదములేని నదీశబ్దముచే గంగ చెప్పబడుచున్నది. జాతిని చెప్పుటయందు, ఒకదానియందు, "బహువచనమన్య తరస్యాం" అని బహువచనము - లేక పూజాయాం బహువచనం. (పూజయందు -పూజ్యార్థమునందు బహువచనము) లేక అదితిః పాశా నితివత్ (అదితి పాశములను అనునట్లు) అవయువములనేకములుండుట యొక్క అభిప్రాయముతోనైనను బహువచనము. ఇచ్చట అగ్నిహోత్రమును (నందు) వేల్చుచున్నాడు, జావను (గంజిని) వండుచున్నాడు అనునట్లు అర్థక్రమముగా నదులను దాటి (గంగను దాటి) వనమునకు వెడలి అని కూర్చదగినది లేక - (అపూర్వ కాలేసిక్త్వా ప్రత్యయః. ఆస్యంవ్యాదాయ స్వపితి (నోరును తెరిచి నిద్రపోవుచున్నాడు) అన్నట్లు. సమ్మీల్యహసతి (కనుమూసినవ్వుచున్నాడు) అని ఉపసంఖ్యానమని వార్తికమునందు రెండు చోట్లనే పొందబడినది = అయినప్పటికిని, "న్యాసకృతాపరావరయోగేచ" అని పూర్వ సూత్రమునందు చకారము వలన అంతట ఈ ప్రయోగము సంభవించునని చెప్పబడినది) లేక "తేవనేన" (అనాయాసముగా) అనుదానిచే గంగను దాటుట (గంగాతరణము) అర్థసిద్ధము - నదీశబ్దము యమునాపరము. లేక - నదీః = గంగా యమునా మందాకినులు - మందాకిని అనునది చిత్రకూట పరిసరము (సమీపము) నందు పారుచుండెడునది (స్రవంతి) సౌకర్యము కొఱకు ఒకేసారి చెప్పబడినది. లేక పూర్వార్థము (మొదటి సగము శ్లోకము) నందు (ఒక్క కాలమునందు) సఃరామః లక్ష్మణేన సీతయాచ సహగుహేన హితః = ఆరాముడు లక్ష్మణునితోడ సీతతోడను గుహునిచే పంపబడినాడు. అనగా, సీతా లక్ష్మణ రాములు గుహునిచే (గుహుని సహాయమున) గంగను దాటిరి. (గంగను తరింపచేయబడిరి)

అని యర్థము - ఇందువలన కాలినడకతో అడవికి పోవుట (వనగమనము) ఇచ్చట చెప్పబడినది.

భరద్వాజస్యశాసనాత్ చిత్రకూటమనుప్రాప్య = భరద్వాజుని ఆజ్ఞవలన చిత్రకూటమునుపొంది), ప్రజలను భరించు స్వభావముగలవాడు భరద్వాజుడు - ఇట్లు చెప్పబడిన మృగములు గల అరణ్యమునందు - ఏష ఏవ బిభ్రద్వాజః ప్రజావైవాజ స్తాఏష బిభర్తి యద్బిభర్తి తస్మాద్భరద్వాజ ఇత్యాచక్షతే" (ఇతడే బిభ్రద్వాజుడు - భరించుహవిస్సు (నెయ్యి) గలవాడు. ప్రజలే వాజము. వారినీతడు భరించుచున్నాడు, దేనిని భరించునో, ఆకారణము వలన భరద్వాజుడు అని చెప్పబడుచున్నాడు) అని వాజం అనగా రేతస్సు - వాజీకరణము (పుంస్త్వమును గలుగుజేయుట - పుంస్త్వమును కలుగజేయుమందు) అను మొదలైన వానియందు అట్లు ప్రయోగముండుట వలన బిభ్రద్వాజం (రేతస్సునుభరించువాడు) భరద్వాజుడు - నిత్య బ్రహ్మచారి అని అర్థము - "భరద్వాజోహ త్రిభిరాయుర్భి ర్బ్రహ్మ చర్య మువాస" (భరద్వాజుడు మూడు పురుషాయుష్యములచే (అనగా 300 సంవత్సరముల వరకు) బ్రహ్మచర్యముతో నుండెను. (బ్రహ్మచర్యమవలంబించెను) అని శ్రుతి. తస్యశాసనాత్ = అతని యొక్క నియమనము (ఆజ్ఞ) వలన, చిత్రకూటమునందు మీరుండవలసినది, దాని కిట్లు ఇట్లు మార్గము అని ఇటువంటి శాసనమువలన - అను = సదృశముగా (సమానమైన), "పశ్చాత్సదృశయోరను (అను అనుశబ్దము - వెనుక (తర్వాత) అను అర్థమునందును, సాదృశ్యమునందును వర్తించును) అని అమరము. రాజకుమారులగు తమకు ఉచితమైనది (తగినది) అని అర్థము - "సుభగ శ్చిత్ర కూటోసౌ గిరిరాజోపమో గిరిః - యస్మిన్ వసతి కాకుత్థ్సః కుబేర ఇవనందనే" (ఈ చిత్రకుట పర్వతము పర్వతరాజుతో సమానమైన అందము గలది (మనోహరమైనది). దేనియందు శ్రీరాముడు నందనవనమునందు కుబేరుడువలె ఉన్నాడో) అని చెప్పబడగలదు. లేక, వెనుక భాగమునందు (పశ్చాద్భాగము నందు) చిత్రాణి ఆశ్చర్యావహాని కూటాని శిఖరాణి యస్యాసౌ చిత్రకూటః = చిత్రములైన కూటములు గలది (ఆశ్చర్యమును కలిగించు శిఖరములు గలది) చిత్రకూటము దానిని, "ఆశ్చర్యాలేఖయోశ్చిత్రం" (చిత్రశబ్దము చిత్తరువునకును, అద్భుతము (ఆశ్చర్యము) నకును పేరు) అని అమరము. ప్రాప్య = పొంది, రమ్యం = రమణీయమైన, జలరామణీయకము, స్థలరామణీయకము మొదలైన వానితో గూడినది. ఆవసథం = పర్ణశాలారూపమైన గృహము (పర్ణశాలవంటి ఆకారము గల గృహము) "ధిష్ణ్య మోకో నివసనం స్థానావసథ వాస్తుచ, (ధిష్ణ్యము, ఓకము, నివసనము, స్థానము, ఆవసథము, వాస్తు - ఇవి అన్నియు ఇంటి పేళ్ళు) అని అమరము, కృత్వా = నిర్మించి, నిర్మించికొని, ఇచట పర్ణశాలా నిర్మాణమునందు లక్ష్మణుడు సాక్షాత్కర్తయగుట ఇతరులు (సీతారాములు) ఉచితమైన దేశమును (స్థలమును) చూపించుట మొదలగు వానిచే ప్రయోజక కర్తలగుట "సమానమైన కర్తృపదములకు 'పూర్వకాలమునందు' అని ఇచ్చట సూత్రమునందు గ్రాహ్యైకత్వమువలె ఉద్దేశ్యము పొందబడుట చేత రెండింటి ధర్మము చెప్పబడనిదగుట వలన అనేక క్రియలందు కూడ 'క్త్వా' ప్రత్యయముకలుగును అని న్యాసకారుని యొక్క మాట (వచనము) వలన క్త్వా ప్రత్యయముల బాహుళ్యము (వచ్చినది) ఇచ్చట వనే = చిత్రకూటము యొక్క సమీపమునగల వనమునందు, రమమాణాః = లీలారసమును (వినోదరసమును) అనుభవించుచున్నవారగుచు నుండిరి, సీతారాములకు పూలుగోయుట, జలక్రీడ మొదలైనవి అనురాగము (ఇష్టము) "వైదేహి రమసే కచ్చి చ్చిత్రకూటే మయాసహ, పశ్యంతీ వివిధాన్ భావాన్ మనోవాక్కాయ సంగతాన్ = (సీతా! మనో వాక్కాయములతో కూడిన (చేరికయైన) అనేకములైన (పలువిధములైన) భావములను చూచుచున్నదానివై (అనుభవించుచున్న దానివై) ఆనందించుచున్నావా? అని గదా చెప్పబడగలదు - లక్ష్మణుని కయితే విశిష్ట విషయమునందు కైంకర్యము యొక్క లాభము వలన పుట్టినదైన ప్రీతి కలదు. భవాంస్తు సహవైదేహ్యా గిరిసానుషు రంస్యతే । అహంసర్వం కరిష్యామి జాగ్రత స్స్వపతశ్చతే (తమరు సీతతో కొండ చరియలయందు రమించగలరు, (అప్పుడు) నేను మేల్కొన్నట్టియు, నిద్రించుచున్నట్టియు మీకు సమస్తమైన సేవలు చేయగలను) అని చెప్పబడగలదు

- ముగ్గురు ఆనందించుచున్నవారై అనుదానిచేత ఆనందము యొక్క కారణమునందు భేదముండినప్పటికిని, ఆనందము యొక్క అంశమునందు సమానత్వము చెప్పబడుచున్నది. "పరమంసామ్య ముపైతి" పరమమైన సామ్యమును (తౌల్యమును) పొందును. "భోగమాత్ర సామ్యలింగాచ్చ". (ముక్తునకు ఈశ్వరునితో భోగమాత్రమున సామ్యము కలదు - బ్రహ్మసూత్రము) అన్నట్లు రమమాణాః - రమించుచున్నవారై, అని వర్తమాన నిర్దేశము చేత నిరంతర భావము. (ఎడతెగని అనుభవము) చెప్పబడినది. (వర్తమానార్థమైనప్పటికిని దీనికి ఉండిరి. అని భూతప్రత్యయాంత విశేషణమగుట "ధాతుసంబంధమునందు ప్రత్యయములు" అనెడి అనుశాసనము వలన, అగ్నిష్టోమయాజీ! పుత్రుడు నీకు కాగలడు అన్నట్లు సంభవించును.)

ఇందువలననే దేవగంధర్వులతో సమానమైనవారగుచు - దేవగంధర్వులు మనుష్య గంధర్వులకంటె అధికమైన ఆనందముగలవారు. లేక, దేవీచదేవశ్చ దేవౌ - దేవియు దేవుడును - దేవులు. లక్ష్మీనారాయణులు. పుమాన్ స్త్రియా - (స్త్రీతో పురుషుడు) అని ఏకశేషవృత్తి. గానంధారయతీతి గంధర్వః = (గానమును ధరించుచున్నాడు గావున గంధర్వుడు) ఏతత్సామ గాయన్నాస్తే - (తర్వాత సామగానముచేయుచు ఉండును) అని చెప్పబడినవాడు ఎల్లప్పుడు సామగానమునందాసక్తి గలవాడు ముక్తుడు - దేవౌచ గంధర్వాశ్చ (దేవులును గంధర్వులును - దేవగంధర్వులు) వారితో సదృశులు (సమానులు, దేవగంధర్వసదృశులు. నిభమొదలైన పదములు ఉత్తర పదములైనప్పుడే సదృశవాచకములగును - అనగా సమాసమునందు నిభమొదలగు పదములు ఉత్తర పదములయ్యును సదృశవస్తువుల పేళ్ళగును అని "స్యురుత్తరపదే త్వమీ -నిభ, సంకాశ నీకాశ ప్రతీకాశోపమాదయః" అని (అమరమున చెప్పబడినది) - తే - త ఏవ సంతః = వారే అయి ఉండిరి సత్పురుషులు (సంతులు) సాకేతవాసులే సంతులు. సంతులు సమానవచనము గలవారు - సుఖం న్యవసన్ = సుఖముగా నుండిరి "సురమ్య మాసాద్యతు చిత్రకూటం, నదీంచ తాంమాల్యవతీం సుతీర్థాం । ననంద రామో మృగపక్షి జుష్టాం జహౌచదుఃఖం పుర విప్రవాసాత్ (మిక్కిలి మనోహరమైన చిత్రకూట పర్వతమును, మంచితీర్థము గలదియు, మృగములతో పక్షులతో కూడినదియునగు ఆమాల్యవతీనదినిన్ని చేరి (పొంది) రాముడు పట్టణమును ఎడబాయుట వలన కలిగిన దుఃఖమునున్ను విడిచిన వాడాయెను) అని చెప్పబడగలదు లేక తఏవ సంతః = వనవాసులేయై ఉండువారు, నాగరికులైకూడ, చాలకాలమునుండి యున్న వనచరులవలె ఉండిరి అని యర్థము - ముఖమందలిగ్లాని (వాడుట) (బడలిక) మొదలగువానిచేత వారికి వైదేశికత్వ గంధము కూడ (విదేశములో ఉండుట అనే వాసనయు) తెలియబడకుండెను అని భావము - సుఖమెట్లు కలుగునో, అట్లు ఉండిరి. ఎప్పుడు కూడ దుఃఖలేశమును (కొంచెము దుఃఖమును) అనుభవించకుండిరి (పొందకుండిరి) అని అర్థము. ఇచ్చట క్రియా భేదము వలన రెండు తచ్ఛబ్దములయొక్క ప్రయోగమైనది అని కూడ కొందరు చెప్పుదురు. వారు దాటి వెళ్ళిరి. అని క్రియా పదమును అధ్యాహారముచేసికొని, కొంత మంది యోజింతురు (సమకూర్తురు).

ఇచ్చట "దేవగంధర్వసంకాశులు" అని పదగతమైన ఉపమాలంకారముచేత ఒకయర్థము (కొంచెము వస్తువు) ధ్వనింపబడుచున్నది - ఎవడైతే స్వరూపజ్ఞాన పూర్వకముగా భగవంతుని యందను రక్తుడగునో, అతనిని భగవంతుడు దేవితో (లక్ష్మీదేవితో) గూడవచ్చి దివ్యమైన విమానమునెక్కించుకొని అతివాహిక గణములచేత సత్కరించి (సత్కరింపజేసి) విరజానదిని దాటి తిల్యకాంతారమునుచేరి (పొంది) అమానవునిచే ఆజ్ఞాపించి (అనుమతింపజేసి) దివ్యలోకము (పరమపదము) నందు మహామణిమంటపమును పొంది దివ్యసింహాసనారూఢుడై లక్ష్మీదేవితోడ సంతోషించుచున్నవాడై అతనిచే (భక్తునిచే) చేయబడిన (సమకూర్చబడిన) సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలందు తగిన (ఉచితమైన) సమస్తమైన (సకల విధములైన) కైంకర్యములు గలవాడై తన ఆనందముతో సమానమైన ఆనందమును ఒసంగి (ఇచ్చి) అతనితో యావత్కాలము (కాలమున్నంతవరకు) ఉండును అని అర్థము

వ్యంజింపబడుచున్నది.

(ఇచ్చట సీతారాములకు పూవులు కోసికొనుట జలక్రీడలుమున్నగు వినోదములతో కాలము గడచుచుండుటచే ఆనందించుటకు అవకాశమున్నది, కాని వారిసేవజేయుచున్న లక్ష్మణుడు ఆనందించుట ఏమి అని సందేహము కలుగవచ్చును, సీతా రాములు వనసందర్శనము చేతను, అన్యోన్యానుభవము చేతను ఆనందించుచుండగా, అట్లు ఆనందించుచున్న వారిరువురికి సేవచేసి వాని ఆనందమునకు అంతరాయము కలుగకుండ సేవించెడి భాగ్యము లభించినది అని లక్ష్మణుడు ఆనందించుచుండెను - అందుచే ముగ్గురును ఆనందించుచుండిరి ఇది మనము తెలిసికొనవలసిన విషయము, భగవానుడు లక్ష్మీదేవితో ఆనందించుచుండగ వారి ఆనందమునకు అనుగుణముగ సేవచేసి జీవుడు వారి ఆనంధమును చూచి ఆనందించుటయే పరమ పురుషార్థము. తన అనుభవముచే తనకు కలిగిన ఆనందము ఆనందము కాదు - ఇతరులకు సేవజేసి వారి ఆనందమునకు తాను సాయపడి వారి ఆనందమును జూచి తాను ఆనందించుట నిజమైన ఆనందము. ఇట్టి ఆనందమును పొందుటయే మానవుడు జీవితములో సాధింపదగినదని లక్ష్మణుడు తన ప్రవర్తనచే నిరూపించినాడు-(శ్రీభాష్యం అప్పలాచార్యులు).

చిత్రకూటంగతే రామే పుత్రశోకాతుర స్తథా । రాజా దశరథ స్స్వర్గం జగామ విలపన్ సుతం ॥	$32^1/_2$	రాముడు చిత్రకూటముచేరియుండగా, దశరథ మహారాజు పుత్రశోకముచే (మిగుల) బాధపడినవాడై సుతుని గూర్చియే దుఃఖించుచు, (అతనినే కలవరించుచు) స్వర్గమునకు పోయెను. (ప్రాణములను వదలెను).
మృతేతు తస్మిన్ భరతో వసిష్ఠ ప్రముఖై ర్ద్విజైః । నియుజ్య మానో రాజ్యాయ నైచ్ఛద్రాజ్యం మహాబలః	$33^1/_2$	అతడు చనిపోయినవాడు కాగా (అతని మరణానంతరము) మహాబలుడగు (మహా సమర్థుడగు) భరతుడు వసిష్ఠుడు మొదలైన ద్విజులచే (పురోహిత బ్రాహ్మణులచేత) రాజ్యమునకై (రాజ్యమును పాలించుటకై) నియమింపబడిన వాడయినప్పటికిని రాజ్యమును కోరలేదు. (రాజ్యపాలనకు సమ్మతించ లేదు)

ఇట్లు లక్ష్మణునియొక్క భగవచ్ఛేషత్వవృత్తిని (భగవంతునికి శేషభూతుడగుట, దాని యొక్క వ్యాపారమును) ప్రతిపాదించి భరతునియొక్క పారతంత్ర్య వృత్తిని "మృతేతు తస్మిన్" అనుదానిచేత చూపుచున్నాడు. దాని కుపోద్ఘాతముగా నుండుట చేత "చిత్రకూట" అని చెప్పుచున్నాడు - అట్లు చెప్పిన ప్రకారముగా రాముడు చిత్రకూటమును పొందినవాడుకాగా, దశరథ మహారాజు, పుత్రశోకేన = పుత్రుడు కనబడకపోవుట వలన కలిగిన దుఃఖముతో, ఆతురః - పీడితుడైన వాడగుచు, సుతం = కుమారుని గూర్చి, హాకుమార అని యిట్లు, విలపన్ = దుఃఖించుచు, పలవరించుచు, కలవరించుచు, స్వర్గం జగామ, స్వర్గమునకేగెను - మరణించెను (మృతేతు-అని) = తస్మిన్ = ఆదశరథుడు, మృతే = మరణించినవాడుకాగా, స్వర్గప్రాప్తికూడ నశ్వరమైనదగుట చేత పొందదగినది (ఉత్తమమైనది) కాదు అని యిట్లు చెప్పబడినది, మహాబలుడు = రాజ్యమును భరించుటకు (పాలించుటకు) సమర్థుడు ఇందువలననే భరతుడు అని "రాజ్యస్యభరణాత్" = రాజ్యము యొక్క భరణము వలన) అని చెప్పబడిన రీతిగా భావజ్ఞుడైన వసిష్ఠునిచేత భరతుడని పెట్టబడిన పేరుగలవాడు, భరతుడు, వసిష్ఠ ప్రముఖై ర్ద్విజైః = వసిష్ఠుడు మొదలైన బ్రాహ్మణులచేత, రాజ్యాయ = రాజ్యమును చేయుటకు, నియుజ్యమానః = నియోగింపబడినవాడై (క్రియార్థోపపదస్య కర్మణి స్థానినః ఇతిచతుర్థీ), రాజ్యం = రాజత్వమును, (పరిపాలించు అధికారమును) (యేచాభావ కర్మణోరితి ప్రతిషేధాదనో న ప్రకృతిభావః) నైచ్ఛత్ = న+ఐచ్ఛత్ = అభిలషించలేదు. (కోరలేదు)

సమ్మతించలేదు.

మహాబలుడనుటచేత శక్తి (సామర్థ్యము) ఉన్నప్పటికిని స్వరూపమునకు విరుద్ధమగుట వలన రాజ్యమును అంగీకరించలేదని తెలియుచున్నది ఇందువలననే "రాజ్యంచాహంచరామస్య ధర్మం వక్తుమిహార్హసి । విలలాప సభామధ్యే జగర్హేచ పురోహితం, కథం దశరథాజ్జాతో భవే ద్రాజ్యాపహారకః" - (రాజ్యమును, నేనును రామునికి చెందినవారమే, ఇచ్చట ధర్మమును చెప్పుటకు తగుదువు అని సభనడుమ దుఃఖించెను, పురోహితుడైన వసిష్ఠుని నిందించెను. దశరథుని వలననుండి పుట్టినవాడనైయెట్లు రాజ్యాపహారకుడను (రాజ్యమును దొంగిలించువాడను) కాగలను అని ముందు చెప్పబడ గలదు -

(భరతుడు ఆత్మస్వరూపము నెరింగినవాడు. ఆత్మ స్వరూపము నెరింగిన వారి ప్రవర్తన యెట్లుండవలెనో భరతుడు నిరూపించినాడు. జీవుడు భగవానునకు శరీరము వంటివాడు. శరీరము ఆత్మచే నియమింపబడి, ధరింపబడి వాని కొరకే తాను సర్వవ్యాపారములను చేయుచుండును. అట్లె జీవుడు తాను స్వతంత్రముగా తన కొఱకు తాను చేయగలిగినవాడు కాడు. ఆతడు లేనినాడు తాను ఉండువాడు కాడు, భరతుడు రాజ్యపాలనకు తగిన శక్తి గలవాడు, తల్లిదండ్రులచే రాజుగా ఉండవలెనని నియమింపబడినాడు, వసిష్ఠుడు మొదలగు పురోహితులచే రాజుగా ఉండుమని నియమింపబడినాడు, బాహ్యముగ తనకు యోగ్యత ఉన్నను ఆంతరముగ ఆత్మ స్వతంత్రము కాదు కావున తాను పరిపాలింపకూడదు, రాజ్యము తనది అని భావింపకూడదు, తనను పరిపాలించుమని చెప్పినవారు తన స్వరూపమును నాశనము చేయువారే గాని తన హితమును గోరువారు కారు, భగవానునికి చెందిన విశ్వమును సకల భోగములను భగవానునకు చెందినవాడు గాన, భగవానునికి చెందినవి కనుక, వాని నియమనముచే, వాని ప్రీతి కొఱకు తాను అనుభవించవలెను, తాను పాలించవలెను, అంతేకాని తాను స్వతంత్రముగ పాలించువాడు కారాదు. ఈ ధర్మమును భరతుడు నిరూపించినాడు (శ్రీభాష్యం అప్పలాచార్యులు) -

సజగామ వనం వీరో రామపాద ప్రసాదకః ॥ 34 గత్వాతు సుమహాత్మానం రామం సత్య పరాక్రమం । అయాచ ద్భ్రాతరం రామం ఆర్యభావ పురస్కృతః ॥ 35	ఆవీరుడైన భరతుడు పూజ్యుడైన రాముని అనుగ్రహింపజేయువాడై (రాముని అనుగ్రహమును పొందదలచిన వాడై) వనమున కేగెను. మహాత్ముడైన సత్యపరాక్రముడైన రాముని వద్దకు పోయి ఆర్యభావముచే (ధర్మమునకనుగుణమైన భావముచే) పూజితుడై, శ్లాఘింపబడినవాడై సోదరుడైన రాముని ప్రార్థించెను.

"సజగామ" అనుసగము శ్లోకము ఒకవాక్యము. వీర్యముతో గూడినవాడు వీరుడు, వీరుడనగా ఇచ్చట శత్రువులయిన రాగము (అనురాగము) మొదలైనవానిని జయించినవాడు. విషయములచే నాకర్షింపబడని మనస్సు గలవాడు అని యర్థము - లేక "ఏభిశ్చ సచివై స్సార్థం శిరసా యాచితోమయా । భ్రాతు శ్శిష్యస్య దాసస్య ప్రసాదంకర్తు మర్హసి" (ఈ మంత్రులతో గూడ నాచేత తలతోయాచింపబడుచున్నది. అనగా నేనీమంత్రులతో గూడ తలవంచి యాచించుచున్నాను. సోదరుడను, శిష్యుడను, దాసుడను అగునాకు అనుగ్రహముచేయుటకు తగుదువు. (సోదరుడు, (తమ్ముడు) శిష్యుడు, దాసుడు అగునన్ను అనుగ్రహింపదగుదువు) అని చెప్పబడిన ప్రకారముగా, చతురంగ బలసహితుడైన ఆ భరతుడు, రామపాద ప్రసాదకః - పూజ్యుడగు రాముని అనుగ్రహింపజేయువాడై - పాద శబ్దము పూజ్యవాచి (పూజ్యేతు పాద నామాంకే - అని అమరము - పాదస్స్యా ద్భుధ్న పూజ్యయోః ఇతిశేషః. ప్రసాదకః - (తుమున్ ణ్వులౌ క్రియాయాం క్రియార్థాయా మితిణ్వునల్) పూజ్యుడైన రాముని అనుగ్రహింప జేయుటకు - రాముని ప్రసన్నము చేసికొనుటకు అని అర్థము. లేక రామచరణములకు అనుగ్రహము

కలిగించువాడు - రామునికే అనుగ్రహము కలిగింపబడినట్లయిన పాదములకు కలిగింపబడుట యందలి ఉక్తి శేష (దాన) భూతుని యొక్క వ్యవహారమునననుసరించి యుండును, రాజును దర్శించుటకు అని చెప్పబడవలసియున్నప్పుడు రాజు పాదములను దర్శించుటకు అని గదా సేవక జనులు వ్యవహరించుచుందురు - వనం - అడవిని (కి) జగామ - పొందెను, (వెళ్ళెను) నిజముగా రామునికి కోపము లేకున్నప్పటికిని "భరతునికి రాజ్యమీయబడినది" అను బుద్ధిని నివర్తింపజేయుటకు (తొలగించుటకు-పోగొట్టుటకు) అని యర్థము. "పూజితా మామికా మాతా దత్తంరాజ్య మిదం మమ, తద్దదామి పునస్తుభ్యం యథా త్వ మదదా మమ" (నాతల్లి పూజింపబడినది ఈ రాజ్యము నాకీయబడినది. నాకు నీవెట్లు ఇచ్చితివో, అట్లే మరల దానిని నీకొసంగుచున్నాను) అని చెప్పబడగలదు- "గత్వాతు" - అని - ఇచ్చట సః - అతడు అని చేర్చబడును సః ఆర్య భావపురస్కృతః - అతడు పురస్కరింపబడిన (పూజింపబడిన - గౌరవింపబడిన) ఆర్య భావము (ఆర్యుల యొక్క ధర్మము) గలవాడై (ధర్మముచేత గౌరవింపబడినవాడై) (ఆహితాగ్న్యాదిత్వాత్ పరనిపాతః) - లేక, ఆర్యభావేన - తన యొక్క ఆర్య భావము (మంచి తనము) చేత, పురస్కృతః - పూజితుడై, ఇతనిచే ఉచితము (తగినది) చేయబడుచున్నది అని శ్లాఘింపబడినవాడై అనియర్థము. "పూజిత స్స్యా త్పురస్కృతః" (పురస్కృతుడు - పూజితుడు అగును) అని బాణనిఘంటువు. అటువంటివాడగుచు, సుమహాన్ ఆత్మా అంతఃకరణం యస్య - తంసుమహాత్మానం = మంచి గొప్పనైన మనస్సు కలవాడు, స్వయముగానే (స్వభావ సిద్ధముగానే) ప్రసన్నమైన హృదయము గలవాడు అని అర్థము. సత్య పరాక్రమం సత్యే పరాక్రమః అప్రచ్యుతత్వంయస్యతం = సత్యమునందు పరాక్రమము (తొలగకుండ నుండుట) గలవాడు. అనగా ఎన్నడు తొలగని, జారిపడని సత్యము గలవాడు - సత్యమైన - ఎన్నడు తొలగని- పరాక్రమము గలవాడు అగు రాముని, గత్వాతు = పొంది, చేరి, తు=విశేషముగలదు - అతని ముందు ఉండుటయే (నిలుచుటయే) చాలును, యాచనము (అడుగుట) హెచ్చింపబడును (ఎక్కువ చేయబడినదగును) అని భావము. భ్రాతరం రామం అయాచత్ - అన్నయైన రాముని ప్రార్థించెను - తన అభీష్టమును అని అధ్యాహారము) - యాచే ర్ద్వికర్మకత్వాత్ స్వరితేత్త్వా దుభయపదీ - (యాచ్ధాతువు ద్వికర్మకము (రెండు కర్మలు కలది) అగుట వలన స్వరితేత్వము వలన ఉభయపది) క్రియా భేదము వలన రామ శబ్దమునకు పునరుక్తత (మరల చెప్పబడుట అను దోషము) లేదు - .... రాజ్యలోభం పరిత్యజ్య రామం ద్రష్టు ముపాగతః = (రాజ్యమందలి ఆశను విడిచి రాముని జూచుటకై వచ్చెను) అధిక పాఠము
రామమే వాజగమాశు దర్శయన్ వినయం స్వకం - (తన వినయమును ప్రదర్శించుచు శీఘ్రముగా రాముని దగ్గరకే వెళ్ళెను) అని అధిక పాఠము.

త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతిరామంవచో బ్రవీత్ । రామోపి పరమోదార స్సుముఖ స్సుమహాయశాః నచైచ్ఛత్ పితురాదేశా ద్రాజ్యం రామో మహాబలః ।	$35^1/_2$ $36^1/_2$	"నీవే రాజువు, ధర్మమును తెలిసినవాడవు" అని రామునికి తెలిపెను (రామునితో పలికెను) రాముడు (స్వరూప, రూప గుణములచేత అందరిని రంజింపచేయువాడు) పరమోదారుడు (ఏమికోరినను ఒసంగువాడు) సుముఖుడు (వికసించిన ముఖముగల వాడు) మంచి గొప్పకీర్తిగలవాడు, మహాబలుడు అయినప్పటికిని, రాముడు తండ్రి యాదేశము వలన రాజ్యమును కోరలేదు - అంగీకరింపలేదు.

తన అభీష్టమునే చెప్పుచున్నాడు "త్వమేవ" అని - ధర్మజ్ఞః = ధర్మమును తెలిసినవాడవు - జ్యేష్ఠుడుండగా కనిష్ఠుడు రాజ్యమునకు అర్హుడు కాడు అని ధర్మమును తెలిసినవాడవు (తెలిసికొన్నవాడవు) నీవే రాజువు. ఇతరుడు కాడు అని రామునికి చెప్పెను-(రాముని ప్రార్థించెను) (అకథితం చేతి ద్వికర్మకత్వం) (అంతరార్థము-నీవు పరమాత్మవు - నేను జీవాత్మను, నీవు పాలకుడవు, నేను పాలింపబడువాడను - పాల్యుడను, నీవు స్వామివి - నేను నీ సొత్తును. నేను నీకు పరతంత్రుడను, నీవు స్వతంత్రుడవు - ఈ ధర్మమును నీవు (నీవు ప్రభువవు, నేను సేవకుడను) తెలిసికొందువు - ఈ ధర్మముననుసరించి నేను స్వతంత్రుడనగుట తగదు అని ప్రార్థించెను - (శ్రీ భాష్యం అప్పలాచార్యులు).

అయితే భరతునిచే చేయబడిన ప్రపత్తి ఎందువలన ఫలించలేదు 1) అధికారవైగుణ్యము (విగుణత్వమ్ము) వలననా, 2 లేక - శరణ్య వైగుణ్యము వలననా? (రక్షించువానికి గుణములు లేకపోవుటవలననా)

మొదటిది కాదు. కోరికయొక్క అతిశయము (మించిన కోరిక) లేకపోవుట వలన, చివరిది కాదు. అతడు సకల (కల్యాణ) గుణపరిపూర్ణుడగుటవలన, అని ఆశంకించుకొని (సందేహించుకొని) ప్రబల (మిక్కిలి) ప్రతిబంధకమైన (అడ్డునదియైన) ప్రారబ్ధముండుటవలన ఆ శరణాగతి (ప్రపత్తి) ఫలించలేదు. అని "రామోపి" అని చెప్పుచున్నాడు. ఇచ్చట 'అపి' శబ్దము ప్రతి విశేషణమును అనుసరించి పొందుచున్నది. రామోపి = రమయతి రమింపచేయువాడు (రంజింపచేయువాడు) అని వ్యుత్పత్తిచేత స్వరూప, రూప, గుణములచేత ఆశ్రితులయొక్క చిత్తమును రంజింపజేయు స్వభావముగలవాడైనప్పటికిని, పరమోదారోపి = తన వరకును కోరబడిన వస్తువులను ఒసంగువాడయినప్పటికిని (ఏమి కోరినను ఒసంగువాడు, తన పదవులనే కాదు తననే కోరినను ఒసంగు స్వభావము గలవాడు) "య ఆత్మదా బలదా" (ఎవడు తనను (ఆత్మను) ఒసంగువాడో, బలమునొసంగువాడో) అని శ్రుతి. సుముఖోపి = అర్థిజనుల (యాచకుల యొక్క) లాభముతో ప్రసన్నమైన ముఖముగలవాడైనప్పటికిని (తనను యాచించి ఎవరైనను కోరికలు పొందుదురా! కోరెడివాడు తనకు లభించునా అని చిన్నపుచ్చుకొనిన ముఖముతో ఉండి కోరెడివారు లభించగానే వికసించిన ముఖముగలవాడు). సుమహాయశాః అపి = నహ్యర్థినః కార్యవశాదుపేతాః కకుత్స్థవంశే విముఖాః ప్రయాంతి" (కకుత్స్థుని వంశములో కార్యవశమువలన వచ్చిన యాచకులు విముఖులై (కోరిక తీరనివారై) మరలిపోరు (వెడలిపోరు) అని చెప్పబడిన రీతిగా ప్రసిద్ధమైన కీర్తిగలవాడు అయినప్పటికిని, మహాబలోపి = ఆశ్రితుల యొక్క మనోరథములను పరిపూర్తిచేయుట (నెరవేర్చుట)లో నేర్పుగలవాడు. గొప్ప బలము గలవాడు. అయినప్పటికిని, రామః = శ్రీరాముడు, పితురాదేశాత్ = తండ్రియొక్క ఆజ్ఞవలన (ఇదియే భరతుని కోరిక నెరవేర్చకపోవుటకు బలవంతమైన ప్రతిబంధకము) రాజ్యంనైచ్ఛత్ = రాజ్యమును అభిలషించలేదు - చకారమువలన, అరణ్యవాసము యొక్క సమాప్తిని అభిలషించెను అని అర్థము. ఆదేశము అనగా ఆజ్ఞ, నియోగము.

పాదుకే చాస్యరాజ్యాయ న్యాసం దత్త్వా పునః పునః । నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః $37\frac{1}{2}$	కాని భరతాగ్రజుడగు శ్రీరామచంద్రుడు అతనికి (భరతునికి) రాజ్యము చేయుటకు (రాజ్యమునకై) తన పాదుకలను న్యాసముగా (తన ప్రతినిధిగా) నొసంగి మరల మరల భరతుని వెనుకకు మరలింపజేసెను.

పూర్తిగా (అన్ని విధాల) ప్రపత్తియొక్క వైఫల్యము (ఫలించకపోవుట) అనుచితము (తగినది కాదు) అని ప్రతిబంధకముయొక్క నివృత్తి (తొలగుట) కానంతవరకు ఫలప్రతినిధిని (ఫలమునకు బదులుగా మరొక దానిని) ఇచ్చినాడని (పాదుకేచ) అని చెప్పుచున్నాడు - చ - అయితే అని యర్థము. కానయితే - కాని - భరతాగ్రజః =

భరతునియొక్క అన్న శ్రీరాముడు - ఫలమునొసంగుటకు తగిన సంబంధ స్వభావము గలవాడు, రాజ్యాయ = రాజ్యము చేయుటకు (రాజ్యమునకై) (క్రియార్థోపపదస్య కర్మణి స్థానిన ఇతి చతుర్థీ) అస్య = భరతునికి, పాదుకే = పాదుకలు, న్యాసం = తన ప్రతినిధిగా, దత్వా = ఇచ్చి, రామపాదుకలే రాజ్యము చేయుచున్నవి. నేను వానికి పరిచారకుడను (సేవకుడను) అని తలంచుము అని ఇచ్చి అని అర్థము. పునః పునః = మరలమరల, భరతం = భరతుని, ఆ ప్రదేశమునుండి, అచ్చటినుండి - నివర్తయామాస = వెనుకకు మరలింపజేసెను. పునఃపునః=మరల మరల, అని అనుటచే భరతునికి రామునియొక్క విరహము సహింపలేకపోవుట (భరించలేకపోవుట) తెలియబడుచున్నది.

స్వార్థముండుట తొలగింపబడుట ద్వారా ఇతరులకగుటను కలిగించు రూపమగుట లేనందువలన చతుర్థి విభక్తి లేదు - కాని సంబంధ సామాన్యమున షష్ఠీ విభక్తి. (స్వార్థత్వ నివృత్తిపుర్వక పరస్వత్వాపాదన రూపత్వాభావాన్నచతుర్థీ కింతు సంబంధసామాన్యే షష్ఠీ) (రాముని ఆజ్ఞచే తాను వానిసేవకునిగా పాదుకలకు నివేదించుచు భరతుడు రాజ్యమును పాలించెను. (ఆత్మ స్వరూపమెరింగినవారు పాటించవలసిన ధర్మమిది. ప్రపంచమంతయు భగవానుని సామ్రాజ్యము. అతడే నియామకుడు. మనము అనుభవించు వస్తువులన్నియు వానివే. కాని మనకు వాటిని పాలించుమని భగవానుడు ఒసంగినాడు - పాలించి అనుభవించవలెను. - కాని అట్లు చేయునపుడు ఆ భగవానుని ప్రతి నిధిగా ఒకమూర్తినో, పాదుకలనో ఉంచుకొని వాటికి నివేదించుచు ఈ రాజ్యము తనది కాదు, అని భావించి పాలించవచ్చును - అనుభవింపవచ్చును. ఇది నేర్పబడినది - ఇచట భరతుడు పాలించినది తన రాజ్యము కాదు, తాను రాజుకాడు. పరిపాలించునవి రామపాదుకలు, తాను జేయునది రామాజ్ఞాపరిపాలన, ఈ విధముగా జీవితమున వర్తించుట బంధహేతువుకాదు. ముక్తి హేతువని భరతుడు నిరూపించెను - శ్రీ భాష్యం అప్పలాచార్యులు).

సకామ మనవాప్యైవ రామపాదా వుపస్పృశన్ । నందిగ్రామే2కరో ద్రాజ్యం రామాగమన కాంక్షయా ॥	$38^1/_2$	ఆ భరతుడు కోరికను పొందకయే రాముని*యొక్క పాదములకు (పాదుకలకు) సేవజేయుచు, రాముని రాకను ఆశించుచు, నంది గ్రామమునందుండి రాజ్య పాలనమొనర్చెను.

పిమ్మట, ప్రారబ్ధకర్మ నివృత్తి యగువరకు (సర్వశేషియైన పరమాత్మయందు ప్రపన్నుని యొక్క నడవడిని (ప్రపన్నుడు ఉండు రీతిని) చూపుచున్నాడు. (సకామ) అని -

సః = ఆ భరతుడు, కామం = రామునికైంకర్యమందలి కోరికను (మనోరథమును) అనవాప్యైవ = పొందకయే రామపాదౌ = రాముని యొక్క పాదుకలను, పాదశబ్దము పాదుకలను చెప్పునది. ఉపస్పృశన్ = ప్రతి దినము సేవించుచున్నవాడగుచు, రామాగమన కాంక్షయా = ఎప్పుడు రాముడు రాగలడు అని గాఢమైన యాశతో, పదునాలుగు వత్సరముల రూపమైన ప్రతిబంధకము తొలగి ఎప్పుడు రామకైంకర్యమును పొందగలను అని మనోరథమును (కోరికను) పెంపొందించుకొనుచు అని అర్థము. రాముడు లేని ఆ నివాసము మిక్కిలి దుఃఖము కలిగించుటచేత, అయోధ్యను విడిచి, నందిగ్రామే = నంది గ్రామమనుపేరుగల, అయోధ్యకు దగ్గరగానున్న ఒకానొక గ్రామమునందు (ఉండి), రాజ్య మకరోత్ = రాజ్యమును చేసెను, అతని ఆజ్ఞా (రూప) కైంకర్యమును చేసెను. ఇక్కడ (అకరోత్) పరస్మై పదముచేత అతనియందు భరతుని ఫలభావ సమర్పణము తెలియబడుచున్నది.

గతేతు భరతే శ్రీమాన్ సత్యసంధో జితేంద్రియః । రామస్తు పునరాలక్ష్య నాగరస్య జనస్యచ ॥ తత్రా గమన మేకాగ్రో దండకాన్ ప్రవివేశ హ ॥ 40	భరతుడు మరలి పోయిన తర్వాత, శ్రీమంతుడు, సత్య ప్రతిజ్ఞుడు, జితేంద్రియుడు అగు శ్రీరాముడు అచటికి మరల నగర జనుల రాకను ఆలోచించి (తండ్రి మాటను పాలించుటయందే) ఏకాగ్రమైన మనస్సుగలవాడై దండకారణ్యమును ప్రవేశించెను - ఆశ్చర్యముగదా!

అయోధ్యాకాండయందు ప్రతిపాదింపబడిన తండ్రిమాటను నిలబెట్టుటయను కోరిక నెరవేరుటను పూర్తిచేయుచు, ఇక తర్వాతికాండయగు అరణ్యకాండ యొక్క అర్థమును 'గతేతు' అని ప్రస్తుతించుచున్నాడు. శ్లోకముల యొక్క మూడు సగపాదములు కలిసి ఒకేవాక్యము - భరతే గతే - భరతుడు మరలి అయోధ్యకు పోయినవాడుకాగా (పోయిన తర్వాత), తు = విశేషమున్నది. ఆ విశేషమును చెప్పుచున్నాడు. శ్రీమాన్- ప్రతిజ్ఞా భంగము యొక్క భయము వలన కలిగిన విషాదము దూరమగుట వలన ఆనందముచే కలిగిన, (ఉదయించిన) కాంతి విశేషము గలవాడు. కావుననే శ్రీమంతుడు, (ఆనందముతో ప్రకాశించువాడు). సత్యసంధః - భరతుని యొక్క నిర్బంధముచేతను గూడ చలించని ప్రతిజ్ఞ కలవాడు. "సంధా ప్రతిజ్ఞా మర్యాదా" (సంధాశబ్దము ప్రతిజ్ఞకును మర్యాదకును పేరు) అని అమరము, జితేంద్రియః = తల్లి, భరతుడు, మొదలగు వారి యొక్క ప్రార్థనయనెడి వ్యాజమున్నప్పటికిని రాజ్యభోగమునందలి ఆశ (కోరిక) లేనివాడు, (ఇంద్రియములను జయించినవాడు) అగు రామః = శ్రీరాముడు, నగరేభవఃనాగరః = నగరమందు జన్మించినవాడు నాగరుడు. (తత్ర భవ ఇత్యణ్) నాగరస్య జనస్యచ = పట్టణవాసులైన జనుల యొక్క, తత్ర = ఆచిత్రకూటమునందు (నకు), పునరాగమనం = మరల వచ్చుటను, ఆలక్ష్య = ఆలోచించి, ఊహించి, చకారమువలన ఋషుల యొక్క విప్రకారమును (హానిని - కీడును) చూచుట వలనను, (ఋషులకు రాక్షసులవలన కలుగు కీడును చూచుట వలనను) ఆప్రదేశమును విడిచి, ఏకాగ్రః = తండ్రియొక్క వచనమును పాలించుట యందే ఏకాగ్రమైన చిత్తము గలవాడై, లేక, రాక్షసులు అధికముగా నుండు ప్రదేశమగుటచేత, జాగరూకతగలవాడై, (అనియు అర్థము చెప్పవచ్చును) దండకాన్ ప్రవివేశ = దండకారణ్యములను ప్రవేశించెను. హ-అని విషాదము తెలుపబడుచున్నది. "ఏక సర్గో నన్యవృత్తి రేకాగ్రైకాయనావపి, అని వైజయంతి - సీతాలక్ష్మణులయొక్క ప్రవేశము కూడ అర్థసిద్ధమే. (సీతాలక్ష్మణులు కూడ ప్రవేశించిరని ప్రత్యేకముగా చెప్పవలసిన పనిలేదు అర్థసిద్ధమే) దండకుడను రాజుయొక్క దేశము దండకము. (తస్య నివాస ఇత్యణ్ - జనపదేలుబితిలుప్) శుక్రుని యొక్క శాపము చేత వనత్వము నొందినది (అడవి అయినది), కుత్సాయాం కప్ - అవాంతర వనబహుత్వాద్బహువచనం = (లోపలి (నడుమ) వనములు చాల ఉండుటచే బహువచనము).

శప్తో బ్రహ్మర్షిణా తేన పురావై దండకో హతః ।
తతఃప్రభృతి కాకుత్స్థ దండకారణ్య ముచ్యతే ।
తపస్వినః స్థితాయత్ర జనస్థాన మతో భవత్ - (పూర్వము బ్రహ్మర్షిచే శప్తుడై దండకుడు హతుడైనాడు, రామ! అది మొదలు (అప్పటి నుండి) దండకారణ్యమని చెప్పబడుచున్నది, అచ్చట తపస్వి జనులుండుట వలన జనస్థానమయినది). అని ఉత్తరకాండమునందు చెప్పబడగలదు. దండకాం - అని పాఠము కూడ కలదు. దండకుడను పేరుగల రాజు ఈ అరణ్యమునందున్నాడు అని దండక (అర్శ ఆదిభ్యో జిత్యచ్ ప్రత్యయః తతష్టాప్ - క్షిపకాదిత్వాన్నేత్వం).

ఇట్లు అయోధ్యాకాండ వృత్తము యొక్క సంగ్రహముచేత పితృవచన పరిపాలన రూపమైన సామాన్య ధర్మము, శేషభూతుడైనవానికి శేషి విషయమైన కైంకర్య వృత్తియు, ప్రపన్నుని యొక్క భగవత్పారతంత్ర్యమున్ను చూపబడినది. శత్రుఘ్నుని యొక్క వృత్తాంతమును ప్రదర్శించుట ద్వారా భాగవత పారతంత్ర్యమున్ను సూచింపబడినది.

(తల్లులు, సోదరుడు భరతుడు పురోహితులు నిర్బంధించి తాను చేసిన ప్రతిజ్ఞను విరమింపజేతురేమో అని విషాదముతోనున్న శ్రీరామునకు భరతుడు అంగీకరించి వెనుకకు మళ్ళగనే ప్రకాశము కలిగెనట. కావుననె శ్రీమంతుడని శ్రీరామునకు విశేషణము వేయబడినది. ఎందరుపదేశించినను రాజ్య భోగములపై మనసు ప్రవర్తించనివాడు కనుక జితేంద్రియుడు. ఎందరుపదేశించినను తండ్రికిచ్చిన మాటను పాలింపదలచినవాడు కనుక సత్యసంధుడు - కావున ఇచ్చటి విశేషణములు సార్థకములు. - శ్రీభాష్యం అప్పలాచార్యులు

ప్రవిశ్యతు మహారణ్యం రామో రాజీవలోచనః । విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శహ ॥ సుతీక్ష్ణం చాప్యగస్త్యంచ అగస్త్యభ్రాతరం తథా ॥ 41$^1/_2$	రాజీవలోచనుడగు శ్రీరాముడు మహారణ్యమును ప్రవేశించి విరాధుడను రాక్షసుని సంహరించి, శరభంగుని దర్శించెను. అట్లే (తరువాత) సుతీక్ష్ణుని, అగస్త్యుని, అగస్త్యభ్రాతను దర్శించెను.

పిమ్మట బ్రాహ్మణులయెడ విశేషించి (ప్రత్యేకముగా) సత్యమైన ప్రతిజ్ఞ కలవాడగుటను ప్రతిపాదించుట యందు శ్రేష్ఠమైన ఆరణ్యకాండ వృత్తాంతమును "ప్రవిశ్యతు" అని ఈ మొదలగు దానిచే సంగ్రహించుచున్నాడు.

రామః మహారణ్యం ప్రవిశ్య = రాముడు గొప్పనైన అరణ్యమును ప్రవేశించి, తు. విశేషమున్నది. దానిని చెప్పుచున్నాడు. రాజీవలోచనః = (కమలనేత్రుడు) అపూర్వమైన సన్నివేశములు (తావులు) గల అడవిని చూచుటచేత కలిగిన (జనించిన) కుతూహలముచేత వికసించిన కనుదామరలు గలవాడగుచు, ఆ ఉత్సాహము చేతనే, విరాధం రాక్షసంహత్వా = (విరాధుడను రాక్షసుని సంహరించి), అతని సంహారమును కానుక (బహుమానము) గా జేసి, శరభంగం దదర్శ = శరభంగ మహర్షిని దర్శించెను. హ అని పాదపూరణమునందును, ఆశ్చర్యమునందును, ఐతిహ్యమునందును వర్తించును. ఇచ్చట ఆశ్చర్యార్థమునందు ప్రయోగింపబడి యున్నది. (రిక్తహస్తేన నోపేయాద్ రాజానందైవతం గురుం - అనుటచే, రాజును, దేవుని, గురువును పెద్దలను దర్శించునప్పుడు వట్టి చేతులతో పోరాదని నీతి శాస్త్రము. వారికి సంతోషమును కల్గించు కానుకనో, మాటనో, చేతనో చూపి తృప్తికలిగించుట చేయదగినది (కర్తవ్యము). విరాధుడు ఋషుల తపస్సులకు విఘ్నము కలిగించువాడు, అతనిని సంహరించుట ఋషుల యొక్క, శరభంగ మహామునియొక్క ధర్మాచరణమునకు తోడుపడునది. కావున శరభంగునికి సంతోషమును కలిగించునట్టి విరాధునిచంపుట అనెడి కానుకను తీసికొని రాముడు పోయెను. ఇట్లు రాముడు ధర్మాచరణము చేసినాడని నారదముని ఆనందించి 'హ' అనినాడు.

తనిశ్లోకి : విరాధంరాక్షసంహత్వా శరభంగం దదర్శహ ॥ బాల సర్గ 1 శ్లో. 41.

(విరాధుడను రాక్షసుని సంహరించి శరభంగమునిని దర్శించెను, ఆశ్చర్యము గదా!) విరాధుని సంహరించిన తర్వాతనే శరభంగుడు మొదలైన వారిని దర్శించుటను గూర్చి చెప్పబడుటచేత, శరభంగుడు మొదలైనవారి దర్శనమునందు విరాధవధకు (రిక్త హస్తేన నోపేయా ద్రాజానం దైవతం గురుం" - రాజును, దేవుని, గురువును వట్టి చేతులతో సమీపింపగూడదు, (దర్శించగూడదు), ఏదైన కానుకను వెంటతీసికొనిపోయి దర్శించవలెను)

అని చెప్పబడిన ఉపాయనత్వము (కానుకగానగుట) వ్యంజింపబడుచున్నది లేదా సూచింపబడుచున్నది. తర్వాత అతని (శరభంగుని) ఆజ్ఞతో సుతీక్ష్ణుని, అపి అనునది సముచ్చయార్థకము, కూడ అని అర్థము, అగస్త్యం, అగస్త్య భాతరంచ = అగస్త్యుని, అగస్త్యభ్రాత్రను, కూడ చూచెను. తథా = అట్లె (ఆ ప్రకారముగానె) ఇది సముచ్చయమునందు వాడబడినది. అగస్త్యభ్రాత (అగస్త్యుని సోదరుడు) సుదర్శనుడను పేరుగలవాడు. అది (అవిషయము) సనత్కుమార సంహితయందు "యవీయా నేష మేభ్రాతా సుదర్శన ఇతి స్మృతః (సుదర్శనుడను పేరుగల ఇతడు నా యొక్క చిన్న తమ్ముడు) అని చెప్పబడినది. కుంభసంభవుడైన అగస్త్యునికి సోదరుడు అగుట (తనతోపాటు) సమానముగా పోషింపబడుట వలన అని తెలియదగినది అగస్త్యంచ అగస్త్యభ్రాతరం - అని తెలియదగినది (తెలిసికొనదగినది) అగస్త్యంచ అగస్త్యభ్రాతరం - అని ఇచ్చట సంధి కార్యము లేకపోవుట వాక్యముల సంధి యందు అనిత్యమగుట వలన.

పదేషు సంహితా నిత్యా, నిత్యాధాతూపసర్గయోః, నిత్యా సమాసె, వాక్యేతు సా వివక్షామపేక్షతే - (రెండు పదముల మధ్య సంహిత (సంధి) నిత్యము, ఉపసర్గ ధాతువుల నడుమ సంధి నిత్యము, సమాసమునందు సంధినిత్యము. వాక్యముల నడుమ ఆ సంధి వైకల్పికము అనగా రావచ్చును - రాకపోవచ్చును) అని అట్లు చెప్పబడినది. అగస్త్యంచ (దదర్శ) అగస్త్యభ్రాతరంచ (దదర్శ) అని రెండు వాక్యములున్నట్లు అవగతమగుచున్నది. వాక్య భేదమలందువలెనె పాద భేదము లందును సంధి అనిత్యము (వైకల్పికము).

అగస్త్య వచనా చ్చైవ జగ్రాహైంద్రం శరాసనం । ఖడ్గంచ పరమ ప్రీత స్తూణీ చాక్షయ సాయకౌ ॥ 42½	శ్రీరామచంద్రుడు మిక్కిలి ప్రీతి గలవాడై (ప్రీతుడై) అగస్త్యుని మాట ననుసరించి (ఆదేశము వలననే) ఇంద్రుని విల్లును, ఖడ్గమును, అక్షయములైన బాణములు గల రెండు అమ్ముల పొదులను గ్రహించెను. (స్వీకరించెను)

(అగస్త్య-అని) ఇచ్చట రాముడు అని చేర్చుకొనబడును. రాముడు, పరమ ప్రీతస్సన్ = మిక్కిలి ప్రీతిగలవాడగుచు, జగదేకవీరుడైన తనకు తగిన (సమానమైన) ఆయుధ సమూహము లభించుట వలన మిక్కిలి సంతోషించినవాడగుచు, అగస్త్య వచనా దేవ = అగస్త్యుని మాట వలననే, (తన అభ్యర్థనము వలన కాదని అభిప్రాయము), ఐంద్రం = ఇంద్రునిచే నొసంగబడిన (తస్యేదమితి సంబంధ సామాన్యే అణ్), దత్తో మమ మహేంద్రేణ.. (మహేంద్రునిచే నాకీయబడినది) అని ముందు చెప్పబడుట వలన - (ఇంద్రుడు వచ్చి అగస్త్యునితో 'రావణవధకై అవతరించిన శ్రీమహావిష్ణువే శ్రీరాముడుగా వచ్చుచున్నాడు, అతడు మానవుడుగా ప్రవర్తించుచుండుటచే రావణవధలో ఉపయోగింపదగిన దివ్యమైన ఆయుధములను అతని కందజేయవలెననియు పలికి వానిని అగస్త్యుని ఆశ్రమమున నుంచి వెడలిపోయెను). ఇది విల్లు మొదలైన మూడింటికి సాధారణమైన విశేషణము. శరా అస్యంతే క్షిప్యంతే అనేనేతిశరాసనం - అసు క్షేపణె = (బాణములు దీనిచేత వేయబడును - అని వ్యుత్పత్త్యర్థము) - శరాసనం = ధనుస్సు, ఖడ్గంచ = ఖడ్గమును, అక్షయసాయకౌ = యుద్ధరంగమునందు వేలకొలది ప్రయోగింపబడినను తరగని శరములు గల, తూణీ = రెండు అమ్ముల పొదులను, "తూణోపాసంగ తూణీర నిషంగా ఇషుధిర్ద్వయోః తూణ్యాం" (తూణము, తూణీరము, తూణి, ఉపాసంగము, నిషంగము, ఇషుధి, ఈ ఆరు పదములు అమ్ములపొది పేరులు) అని అమరము. జగ్రాహ = స్వీకరించెను. వచనా జ్జగ్రాహ = మాట వలన స్వీకరించెను అనుటచేత ఖడ్గము మొదలైన వానిని అగస్త్యుడు స్పృశించలేదు (తాకలేదు) కాని (స్వీకరించుమని) నిర్దేశించెను అని చెప్పబడుచున్నది.

వసత స్తస్య రామస్య వనే వనచరై స్సహ । ఋషయో2భ్యాగమన్ సర్వే వధాయాసుర రక్షసాం ॥ $43^1/_2$	ఆ అరణ్యమునందు (వనమునందు) నివసించు ఋషులతో గూడ కలిసి శ్రీరాముడు నివసించుచుండగా, అనంర రాక్షసుల యొక్క సంహారమునకై ఋషులందరును శ్రీరాముని వద్దకు వచ్చిరి.

ఇట్లు విరోధులను నిరసించుటకై ఆనుకూల్యమైన (తగిన) దర్శనముచేత అవకాశము (అవసరము) నొందిన ముని బృందము యొక్క ప్రార్థనను (అభ్యర్థనమును) చెప్పుచున్నాడు ("వసత"-అని), వనే = శరభంగ (ఋషివసించు) వనమునందు, తస్య వసతః (తస్మిన్ వసతి)=ఆ రాముడు ఉంటుండగా, (షష్ఠీచేతి యోగ విభాగా ద్యస్యచ భావేన భావలక్షణ మిత్యస్మిన్నర్థే షష్ఠీ) యద్వా (షష్ఠ్యర్థ సంబంధ సామాన్యస్య ఉక్త విశేషే పర్యవసానం) శరభంగాశ్రమే రామం అభిజగ్ముశ్చ తాపసాః (శరభంగాశ్రమమునందు తాపసులు శ్రీరాముని వద్దకు వచ్చిరి అని ముందు చెప్పబడుట వలనను, శరభంగవనము అని నిశ్చితమైనది. సర్వే = అందరు, ఋషయః = ఋషులు, శరంభంగాశ్రమమునందు నివసించునట్టి వైఖానసులు వాలఖిల్యులు మొదలైన వారు అందరు. వనచరై స్సహ = చిత్రకూటము, పంపావనము మొదలైన వనములందు నివసించువారితో కూడ (కలిసి), "పంపావన నివాసానా మను మందాకినీ మపి, చిత్రకూటాలయానాంచ క్రియతే కదనం మహత్" (పంపావనమునందు నివసించిన వారియొక్కయు, మందాకినీనదియొడ్డుననున్న వారి యొక్కయు చిత్ర కూటమునందున్న వారియొక్కయు గొప్ప హింస గావింపబడుచున్నది. రాక్షసులచేత) (అరణ్య-6సర్గ - 17వ శ్లో.) అని చెప్పబడగలదు. లేక, వనచరైస్సహ వనే వసత స్తస్య = వనచరులతో గూడ వనమునందు అతడు వసించుచుండగా (షష్ఠీ చానాదరే - అనాదరమునందు షష్ఠీ విభక్తి వచ్చును) అని అనాదరమునందు షష్ఠీ విభక్తి - సవిశేషణే" అను న్యాయముచేత అతని యొక్క వనమునందలి నివాసమును అనాదరించి అని యర్థము. ఏలనన, తేవయం భవతా రక్ష్యా భవద్విషయ వాసినః, నగరస్థో వనస్థోవా త్వన్నో రాజా జనేశ్వరః" = (నీచే పాలింపబడు దేశమునందున్న వారము అయిన) ఆమేము నీచేతనే రక్షింపబడదగినవారము, నీ యొక్క దేశము (రాజ్యము) నందుండువారము, నగరమునందున్నను, వనమునందున్నను నీవె మాకు రాజువు, జనాధిపతివి) అనియును చెప్పబడగలదు - లేక, వనమునందు నివసించుచున్న అతని యొక్క సమీపమునకు అని మార్పుచేయదగినది. ఆసురాణి = ఆసురస్వభావము గల రాక్షసులు. దీనిచేత విభీషణస్తు ధర్మాత్మా నతు రాక్షస చేష్టితః (విభీషణుడయితే ధర్మాత్ముడు, రాక్షస చేష్టలు కలవాడు కాడు) అని చెప్పబడిన విభీషణుని యొక్క వ్యావృత్తి (రాక్షసుల నుండి విభీషణుని వేరుచేయుట), లేక అసురులును రక్షస్సులును అని ద్వంద్వ సమాసము - కంబంధుడు మొదలైనవారు అసురులు. అచట దనుశబ్దము ప్రయోగించుట వలన - (కబంధుడు తనను దనుపుత్రుడనని చెప్పుకున్నాడు" శ్రియం విరాజితం పుత్రం దనోస్త్వం విద్ధి లక్ష్మణ) అని. అరణ్య-71 సర్గ. 7 శ్లో.) లేక, అసూన్ ప్రాణాన్ రా.తి గృహ్ణం తీత్యసురాణి = ప్రాణములను తీయువారు అసురులు) అసురాణిచ తాని రక్షాంసిచ - అసురులు అయిన ఆ రక్షస్సులు) అని కర్మధారయ సమాసము - తేషాం వధాయ=వారియొక్క సంహారము చేయించుటకు, ప్రార్థించుటకును లేక (క్రియార్థోపపదస్య కర్మణి స్థానిని ఇతి చతుర్థీ).

అభ్యాగమన్ = అభిముఖముగా (ఎదురుగా) వచ్చిరి. ఆభిముఖ్యము వలన ఇతరులను శరణుపొందుట అనునది లేదు - 'సత్సు కార్యవతాం పుంసాం అలమేవాగ్రతస్స్థితిః = సత్పురుషులయందు కార్యముగల పురుషులకు ముందు భాగమున (ఎదురుగా) ఉండుటయే చాలును. (అవసరమైన పనిగలవారు సత్పురుషుల యెదుట ఉండుట (నిలబడుట) యే చాలును-అనగా అదియె వారి పనితీర్చిపెట్టును).

లేక వనమునందు వసించుచున్న మునులు అతని సమీపమునకు (ఎదుటకు) అసుర, రక్షస్సుల యొక్క సంహారమునకై వచ్చిరి అని కాకాక్షి న్యాయము వలనను, లేక మధ్య మణి (నడుమ నుండు మణి) యొక్క న్యాయము వలనను రెండు చోటులను అన్వయము చేసికొనవలెను.

1. కాకాక్షి న్యాయము = కాకికి ఒక కన్ను ఉన్నను ఎటువైపు మెడను త్రిప్పిన అటువైపు అగుపడును. అనగా ఒక కన్నుచే ఇరువైపులను అవసరమును బట్టి (అటు ఇటు త్రిప్పుచు) చూడగలదు.

2. మధ్యమణి న్యాయము - హారమునకు నడుమనున్న మణి రెండు వైపుల భాగములకు శోభను కలిగించును.

సతేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాంతథా వనే । ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధ స్సంయతి రక్షసాం । ఋషీణా మగ్ని కల్పానాం దండకారణ్య వాసినాం ॥	44 45	ఆ రాముడు రాక్షసుల వనమందు (దండకారణ్యము నందు) వారికి అట్లే మాటయిచ్చెను. దండకారణ్యము లో నున్న వారును, అగ్నివంటివారును అగు ఋషులకు రామునిచేత యుద్ధమునందు రాక్షససంహారము కొఱకు ప్రతిజ్ఞ గావింపబడినదికూడ. (అనగా, శ్రీరాముడు యుద్ధమునందు రాక్షసులను చంపగా ప్రతిజ్ఞ చేసెను)

మునులయొక్క దుర్దశను జూచి వారి విరోధుల నిరసనమునకై ప్రతిజ్ఞ గావింపబడినది అని చెప్పుచున్నాడు. ("సతేషాం"- అని). సః = ఆ రాముడు, రాక్షసానాం = రాక్షసుల యొక్క, వనే = దండకారణ్యమునందు, తేషాం = ఆ ఋషులకు, తథా = అట్లే, (ఆ ప్రకారముగానే) ప్రతి శుశ్రావ = మాట యిచ్చెను - వారిచే నెట్లు (ఏది) కోరబడినదో, అట్లే (దానినే) ప్రతిజ్ఞ చేసెను. అని అర్థము.

"ఆశ్రవ స్సంగర స్సంధా ప్రతిశ్రవ స్సంశ్రవః ప్రతిజ్ఞాచ" (ఆశ్రవము, సంగరము, సంధా, ప్రతిశ్రవము, సంశ్రవము, ప్రతిజ్ఞా అనునవి ప్రతిజ్ఞకు (వాగ్దానమునకు) పేరులు) అని హలాయుధమను నిఘంటువు.

మునులచే అర్థింపబడినది, రామునిచే ప్రతిజ్ఞకావింపబడినదియును ఏ విషయము? అని ఇచ్చట చెప్పుచున్నాడు. (ప్రతిజ్ఞాతశ్చ)-అని. రామునిచేత ప్రతిజ్ఞగావింపబడిన విషయము (అయితే), అగ్నికల్పానాం = (కొంచెము తక్కువగా) అగ్ని సాదృశ్యమును పొందినవారును, (అగ్నివలె పవిత్రమైనవారు (తమకు ఒకటికావలెను అనెడి కోరిక లేక తమను చేరెడివారిని పవిత్రము చేయుటయే స్వభావముగా గల అగ్నియొక్క స్వభావము కలవారు ఋషులు - (ఈషదసమాప్తౌ కల్పబ్దేశ్య దేశీయర ఇతి కల్పప్పత్యయః) ఇందువలననే, దండకారణ్యావాసినాం = దండక వనమునందు నివసించుచున్న వారును అగు, ఋషీణాం = ఋషుల కొరకై, (చతుర్థ్యర్థేషష్ఠీ = చతుర్థీ విభక్త్యర్థమునందు షష్ఠీ విభక్తివచ్చినది). సంయతి = యుద్ధమునందు, "సముదాయః స్త్రియాం సంయత్ సమిత్యాజి సమిద్యుధః (సముదాయము, సంయత్, సమితి, ఆజి, సమిత్, యుత్ అనునవి యుద్ధము పేళ్ళు) అని అమరము, రక్షసాం వధః = రాక్షసులను సంహరించుట. కర్తృకర్మణోః కృతి ఇతి కర్మణిషష్ఠీ = కృత్ప్రత్యయాంత శబ్దములతో అన్వయము గలుగునప్పుడు కర్తృవాచకమునకును, కర్మవాచకమునకును షష్ఠియగును అను సూత్రముచే కర్మవాచకమైన రక్షస్ శబ్దమునకు షష్ఠీ విభక్తి వచ్చి, రక్షసాం అని షష్ఠీ విభక్తితో ప్రయోగింపబడినది. (రక్షస్సులే

రాక్షసులు). ప్రతిజ్ఞాతం - అను పాఠము సామాన్య పాఠమునందు నపుంసకలింగము. ప్రతిజ్ఞాతం వస్తు వధః = మీ కొఱకై సంహారము ప్రతిజ్ఞచేయబడినది అని అర్థము.
(ఇచ్చట రాముడు రాక్షసులను అసురులను చంపుట వారిపై నుండెడి పగ - (ద్వేషము) - చేతకాదు. ధర్మము నాచరించుచున్న ఋషులకు ఆటంకము కలిగించు వారిని తొలగించిన గాని, ధర్మము లోక రక్షణకు సుస్థితమై యుండదని చంపవలసి వచ్చెను) వారికి విరోధమును తొలగించుట లోకశ్రేయము).

తేన తత్రైవ వసతా జనస్థాన నివాసినీ । విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ ॥ 46	ఆదండకారణ్యమునందే వసించుచుండగా ఆ జనస్థానమున (దండకారణ్యమున) వసించుచున్నదియు, కామరూపిణి (కామించిన రూపమును పొందునది) యగు శూర్పణఖ యను పేరు గల రాక్షసి ఆ రాముని చేత విరూపముచేయింప బడినది.

పిమ్మట ప్రతిజ్ఞయొక్క నిర్వాహమునకై బీజము వేయబడుచున్నది 'తేన' - అని, తత్రైవ = ఆజనస్థానమందే - దండకారణ్యమునకు జనస్థానమని పేరు. వసతా = నివసించుచున్న (నివసించుచుండగా), తేన = ఆ రాముని చేత, జనస్థానే నివసతీతి జనస్థాన నివాసినీ = జనస్థానమునందు నివసించుచున్నది గావున జన స్థాన నివాసినియు, (సుప్యజాదౌ ణిని స్తాచ్ఛీల్య ఇతిణినిః), కామేనేచ్ఛయా రూప మస్యాఅస్తీతి కామరూపిణీ = ఇష్టము వచ్చిన రూపము గలది (కామరూపిణి) యు, అగు, శూర్పతుల్యా నఖా యస్యాస్సా శూర్పణఖా = చేటలతో సమానమైన గోళ్ళు గలది. (పూర్వపదా త్సంజ్ఞాయామగ ఇతి ణత్వం, నఖముఖాత్సం జ్ఞాయామితి జీష్ప్రతిషేధః) శూర్పణఖయను పేరుగల రాక్షసి, విరూపితా = ముక్కుచెవులు కోయుటచేత విరూపత్వము (వికారమైన రూపము) పొందింపబడినది (చేయించబడినది). రామస్య దక్షిణో బాహుః = రామునికి దక్షిణబాహువు వంటివాడు అని లక్ష్మణుడు రాముని బాహువగుట వలన రామునికి విరూపకరణ కర్తృత్వము చెప్పబడినది (చెప్పుట) శూర్పనఖీ అను పాఠమునందు అది సంజ్ఞ (పేరు) కాదు. అనగా శూర్పనఖీ అనునది పేరు కాదు (సంజ్ఞానామ వాచకము కాదు).

తతః శూర్పణఖా వాక్యా దుద్యుక్తాన్ సర్వరాక్షసాన్ ॥ ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసం । నిజఘాన రణే రామ స్తేషాంచైవ పదానుగాన్ ॥ $47^1/_2$	పిమ్మట శూర్పణఖ మాటల వలన యుద్ధమునకు సన్నద్ధులై వచ్చిన రాక్షసులనందరిని, ఖరుని, త్రిశిరసుని, దూషణుడనే రాక్షసుని, వారియొక్క అనుచరులను కూడ రాముడు యుద్ధమునందు చంపెను.

'తతః' అని మొదలుకొని శ్లోకము మరియు సగము (సగముతో కూడిన శ్లోకము అనగా శ్లోకమున్నర) ఏకవాక్యము. తతః = పిమ్మట, శూర్పణఖకు వైరూప్యము చేసిన తర్వాత, శూర్పణఖావాక్యాత్ = శూర్పణఖ యొక్క మాటల వలన, ఉద్యుక్తాన్ = యుద్ధము కొఱకై సన్నద్ధులైన (సిద్ధపడి వచ్చిన) సర్వరాక్షసాన్ = పదునాలుగువేలుగా లెక్కింపదగిన వారిలో ప్రధానులైన రాక్షసులనందరిని, వారిలో కూడ ప్రధానులు - ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసం - ఖరుని, త్రిశిరసుని, దూషణుడను రాక్షసుని. చైవ అని రెండు నిపాతముల సముదాయము సముచ్చయార్థమును దెలుపును. తేషాం = వెనుక చెప్పబడిన రాక్షసులైన ఖరుడు మొదలైన వారి యొక్కయు, పదానుగాన్ = అనుచరులను కూడ, రణే = యుద్ధమునందు, నిజఘాన = చంపెను. (హతవాన్ - చంపినవాడాయెను). లేక, ఖరుడు మొదలైన వారిని, వారియొక్క అనుచరులైన సమస్త రాక్షసులను కూడ (రాక్షసులనందరిని కూడ) సంహరించెను, అని యోజన (కూర్పు) చేసికొనవలెను.

వనే తస్మి న్నివసతా జనస్థాన నివాసినాం రక్షసాం నిహతా న్యాసన్ సహస్రాణి చతుర్దశ ॥ 48½	ఆ అరణ్యమునందు నివసించుచున్న రాముని చేత జనస్థాన నివాసులైన 14 వేల మంది రాక్షసులు చంపబడిరి.

చంపబడిన రాక్షసుల గూర్చి లెక్కచెప్పబడినది (వనే - అని), తస్మిన్ వనే = ఆ అరణ్యమునందు, నివసతా = నివసించుచున్న రామునిచేత, (దానిచే, ఒంటరి వాడగుట, సూచింపబడినది. అనగా ఎవరి సహాయములేకుండుట చూపబడినది). జన స్థాన నివాసినాం = జనస్థానము నందు నివసించువారైన (దీనిచేత, అరణ్యమునందు సంచరించువారగుటచేత మిక్కిలి భయంకరముగా నుండుట చెప్పబడినది). రక్షసాం చతుర్దశ సహస్రాణి = రాక్షసుల యొక్క పదునాలుగువేలు (పదునాలుగు వేల మంది రాక్షసులు) అని యుగపద్భావము. ఏక కాలమందు సంభవించుట చెప్పబడినది. నిహతాని ఆసన్ = చంపబడిరి, అని మిగులకుండపోవుట. (మిగులకపోవుట) చెప్పబడుచున్నది. వేలు అని సంఖ్యాసంఖ్యేయములకు (లెక్కకు లెక్క పెట్టదగిన వానికి) తేడాలేకుండ నిర్దేశించుట, లేక, పదునాలుగువేలుగా లెక్కింపదగిన సైన్యములు అని యర్థము. (ఇంత మందిని రాముడొక్కడే ఏక కాలమున ఒకేసారి చంపుట విశేషము - అతని అసహాయ శూరత్వము ప్రతిపాదింపబడినది.

తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః । సహాయం వరయామాస మారీచం నామ రాక్షసం ॥ 49½	పిమ్మట జ్ఞాతుల వధను విని, రావణుడు క్రోధముచే మూర్ఛితుడై (మూఢుడై) (సీతనపహరించుటకు) మారీచుడను రాక్షసుని సహాయమర్థించెను.

ఇట్లు రాముని యొక్క సత్య ప్రతిజ్ఞత్వము చూపబడగా, సీతయొక్క పురుషకారత్వమును చెప్పుటకు బీజము వేయబడుచున్నది. ("తతః"-అని) తతః = ఖరుడు మొదలైన వారి యొక్క వధ (సంహారము) తరువాత, జ్ఞాతి వధం = జ్ఞాతి యైన ఖరుని యొక్క వధను, ఖరుని యొక్క జ్ఞాతిత్వము - (ఖరుడు - దాయాదుడగుట) తన తల్లితోడ బుట్టినవాడగు విశ్రవసునికి పుట్టిన వాడగుటవలన, అని అరణ్య పర్వమునందు వ్యక్తముచేయబడినది. శ్రుత్వా = విని, అకంపన, శూర్పణఖలముఖమున తెలిసికొని, రావణః = రాతి రావయతీతి రావణః = అరచువాడు, అరపింప జేయువాడు - (ఏడ్చువాడు - ఏడిపింపజేయువాడు) కావున రావణుడు, ఉత్తరకాండయందు యస్మా ల్లోకత్రయం హ్యేత ద్రవితం భయమోహితం - తస్మాత్త్వం రావణోనామ నామ్నా తేన భవిష్యసి" - (ఈ మూడు లోకములును రవింపబడినది (ధ్వనింపబడినది), భయముచే మోహితమైనది, ఆకారణము వలన నీవు అదే పేరు (అనగా రావణుడని పేరు) గల వాడవు కాగలవు" - అని చెప్పబడగలదు. లేక, విశ్రవసుని యొక్క సంతానము రావణుడు. (శివాదిగణే విశ్రవసో విశ్రవణ రవణ ఇతి పాఠాత్ రవణాదేశః అణచ్) క్రోధమూర్ఛితః = క్రోధముచేత మూఢుడై - మూర్ఛితౌ మూఢ సోచ్ఛ్రాయావితి వైజయంతీ - (నచాయం మూర్ఛతేర్నిష్ఠా - మూర్త ఇతి తద్రూపత్వాత్) కాని, మూర్ఛా అస్యసంజాతా (ఇతనికి మూర్ఛ కలిగినది). అని మూర్ఛితుడు - (తారకాదిత్వా దితచ్) మారీచం నామ రాక్షసం సహాయం వరయామాస = మారీచుడను రాక్షసుని సహాయునిగా కోరెను - (సీతాపహరణములో తనకు సహాయముగా రావలసినదని మారీచునికోరెను - అని తాత్పర్యము)

వార్యమాణ స్సుబహుశో మారీచేన స రావణః । నవిరోధో బలవతా క్షమో రావణ తేనతే ॥ $50^1/_2$	ఆ రావణుడు మారీచునిచేత ''రావణ! నీకు బలవంతుడైన ఆ రామునితో విరోధము తగినది కాదు (పనికిరాదు) అని మాటి మాటికి అనేక విధములుగా నివారింపబడినవాడు ఆయెను.

'వార్యమాణః' - అని - ఇచ్చట చివర 'ఇతికరణము' (ఇతి అను పదమును కూర్చవలసి యున్నది) సః రావణః = ఆ రావణుడు, మారీచేన = మారీచుని చేత - రావణ = ఓ రావణుడా ! తే = నీకు, బలవతా = బలవంతుడైన (బలముగలవాడైన) ఖరాదులయెడ చూడబడిన వృత్తము (కడచిన పని - నఱకుట) గలవాడైన మిగుల బలవంతుడైన, తేన = ఆ రామునితో, విరోధః = శత్రుత్వము (పగ), నక్షమః = యుక్తమైనది కాదు - (తగినది కాదు) "క్షమ స్త్రిషు హితే యోగ్యేయుక్తే శక్తౌ పటావపి", అని శబ్దరత్నాకరము. (క్షమ శబ్దము హితునియందు, యోగ్యునియందు, యుక్తునియందు, శక్తుని యందు, పటువు గలవాని యందు వర్తించును. ఇది మూడు లింగములందును వాడ వచ్చును) ఇతి = అని, సుబహుశః= మాటిమాటికి, మరల మరల, (అనేక పర్యాయములు) వార్యమాణః (అభూత్) నివారింపబడిన వాడాయెను. సీతయే రామునికి బలము - ఆమెతో కూడియుండగా నీవు రాముని ఏమియు చేయజాలవు అని నివారింపబడెను.

అనాదృత్యతు తద్వాక్యం రావణః కాలచోదితః । జగామ సహ మారీచః తస్యాశ్రమ పదం తదా ॥ $51^1/_2$	రావణుడు కాలునిచే (మృత్యువుచే) ప్రేరేపింప బడినవాడై, ఆతని (మారీచుని) మాటను తిరస్కరించి (పెడచెవినిపెట్టి - వినక) మారీచునితో కూడ కలిసిన వాడై అప్పుడు ఆ రాముని యొక్క ఆశ్రమ స్థానమునకు వెళ్ళెను.

అనాదృత్య - అని, రావణః = రావణుడు, కాలచోదితః = మృత్యువుచేత ప్రేరేపింపబడినవాడగుచు, తద్వాక్యం = ఆ మారీచుని మాటను, అనాదృత్య = తిరస్కరించి, (పెడచెవిని పెట్టి), సహ మారీచః = మారీచ సహితుడై - (మారీచునితో కలిసినవాడై) (తేన సహేతి తుల్యయోగ ఇతి సమాసః) (వోపసర్జనస్యేతి సహశబ్దస్యసభావా భావః) తదా = అప్పుడే, ఆ వేళనే, అదే సమయమునందు, తస్య = అతని యొక్క, ఖరదూషణాదులను చంపుటచేత ప్రసిద్ధుడైన ఆ రాముని యొక్క, ఆశ్రమ పదం = ఆశ్రమ స్థానమునకు (గూర్చి) "పదం వ్యవసితత్రాణ స్థాన లక్ష్మాంఘ్రివస్తుషు' (పద శబ్దము ఉద్యోగమునకును, రక్షించుటకును, స్థానమునకును, చిహ్నమునకును, అడుగునకును, వస్తువునకును పేరు - పద శబ్దము పై అర్థములందు వర్తించునని తాత్పర్యము), జగామ = వెళ్ళెను.

తేన మాయావినా దూరం అపవాహ్య నృపాత్మజౌ జహార భార్యాం రామస్య గృధ్రంహత్వా జటాయుషం ॥ $52^1/_2$	(బంగారు జింక రూపముగా వచ్చిన) మాయావియగు మారీచునిచేత రాజకుమారులగు రామలక్ష్మణులను దూరముగా తొలగించి రావణుడు జటాయువను గ్రద్దను చంపి రాముని భార్యయగు సీతను అపహరించెను.

(తేన- అని), మాయావినా = ప్రశస్త మృగమైన మాయగలవాడగు, (అస్మాయా మేధాస్రజో వినిరితి విని ప్రత్యయః), ఆకర్షింపదగు విచిత్రమైన బంగారు జింక వేషమును ధరించిన వాడు (అని యర్థము) అగు, తేన = కార్యము నెరవేర్ప ప్రయోగింపబడిన (ప్రయోజ్యుడైన) ఆ మారీచునిచేత, నృపాత్మజౌ = రాజకుమారులను -దశరథు పుత్రులగు రామలక్ష్మణులను, దూరం = దూరము ఎట్లుకాగలరో అట్లు, అపవాహ్య = అపసరింపజేసి (తొలగింపజేసి),

కనబడుట చేత రాముని, కనబడకుండ (కనకబడకపోవుటచేత) రాముని యొక్క కంఠస్వరముతో సమానమైన స్వరముతో లక్ష్మణుని కూడ దూరముగా వెడలగొట్టి (తొలగిపోవునట్లుచేసి) అని యర్థము, నడుమ సీతను విడిపించుట కొరకు అడ్డుపడిన, జటాయుషం = జటాయువను పేరుగల, గృధ్రం = గ్రద్దను హత్వా = చంపి, (మరణమే పర్యవసానముగా గల (ఫలితముగా గల) హింసను చేసి, (మరణించునట్లు హింసించి), రామస్య భార్యాం = రామునియొక్క భార్యను, నిత్యానపాయిని (ఎన్నడును, ఎల్లప్పుడును విడిచి యుండనిది యగు సీతను, జహార = అపహరించెను. అత్ర ఆస్యంవ్యాదాయ స్వపితీతి వత్ అపూర్వకాలే క్త్వాప్రత్యయః = ఇచ్చట, నోరును తెఱచి నిద్రించుచున్నాడు, అన్నట్లు తరువాత జరిగిన దానికి (క్రియకు) క్త్వాప్రత్యయము, సీతను అపహరించి త్రోవలో అడ్డుకున్న జటాయువును జంపెను అని యర్థము - ఇచ్చట మాయ చేత నిర్మింపబడిన సీతాదేవియే అపహరింపబడినది. నిజసీత (తనకుతానే) స్వయముగా అగ్నియందు అంతర్హితురాలైనది. ఇందు వల్లనె మాయ సీత అగ్నియందు ప్రవేశించుటయు, నిజమైన సీత మరల అగ్ని నుండి లేచివచ్చుటయు, ఎటులో ఒకటుల (ఏ విధముగానో ఒక విధముగా) లోకము యొక్క అపవాదము (లోకాపవాదము) వలన మరల విడుచుటయు కూడ యుక్తి యుక్తముగా సమర్థింపబడుచున్నదని కొందరందురు - సముచితముగా ఉపపాదింపబడుచున్నది - (తగినదే) యని కొందరందురు.

గృధ్రంచనిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వాచ మైథిలీం రాఘవ శ్శోకసంతప్తో విలలాపాకులేంద్రియః ॥ $53^1/_2$	చనిపోవుటకు సిద్ధముగానున్న జటాయువును (గ్రద్దను) జూచి - (అతని వలన) అపహరింపబడిన సీతను గూర్చి విని, శ్రీరాముడు శోకము చేత సంతప్తుడై, వ్యాకులమైన ఇంద్రియములు గలవాడై ఏడ్చెను.

(గృధ్రంచ - అని) - మృగరూపుడైన మారీచుని చంపుట, పర్ణశాలయందు సీతాదేవి కనబడకపోవుటచేత ఆమె యొక్క అన్వేషణము (ఆమెను వెదకుట) చకారముతో సముచ్చయింపబడినది, నిహతం = చంపబడిన, చచ్చుటకు సిద్ధముగా నున్న - గృధ్రం = జటాయువను గ్రద్దను, దృష్ట్వా = చూచి, అతని మాట వలన, మైథిలీం = సీతాదేవిని, హృతాం = రావణునిచే అపహరింపబడిన దానినిగా, శ్రుత్వా = విని, రాఘవః = శ్రీరాముడు, శోకసంతప్తః = శోకముచే సంతప్తుడై, మిక్కిలి తపించినవాడై, సీతకనబడకపోవుటచేత తప్తుడు, జటాయువు యొక్క మరణముచేత మిక్కిలి తప్తుడు, (సంతప్తుడు), ఇందువలననే, వ్యాకులేంద్రియః = కలుషితమైన (కలవరబడిన) ఇంద్రియములు గలవాడై, విలలాప = విలపించెను - (పరిదేవనము చేసెను) "విలాపః పరిదేవనం" (విలాపము - పరిదేవనము - ఈ రెండును దుఃఖముతో పలికెడు మాట పేళ్ళు) అని అమరము.

రాజ్యాద్భ్రంశో, వనేవాసః సీతా నష్టా హతో ద్విజః । ఈ దృశీయం మమా లక్ష్మీ ర్నిర్దహే దపిపావకం. (రాజ్యము పోవుట అరణ్యమందునివసించుట. సీతకనబడకుండపోవుట, పక్షి చనిపోవుట - ఇవన్నియు నా దౌర్భాగ్యము చేతనే జరిగినవి - ఇట్టి ఈ నా దురదృష్టము అగ్ని హోత్రుని కూడ కాల్చివేయగలదు) అని రాముని పరిదేవనము ముందు చెప్పబడగలదు. ఇచట రాఘవ, మైథిలీ శబ్దములచేత ఈ సీతాపహరణము రెండు కులములకును దోషము (చెఱుపు - అవమానము) కలిగించునది. అని దుఃఖాతిశయమునకు కారణము చెప్పబడుచున్నది.

విష్ణువు యొక్క అవతారమైన ఇతనికి ఎట్లు శోకమోహములు సంభవించును (కలుగును) అని శంక ఏర్పడును - పురుష ధౌరేయునికే కలుగునవి ఇందు అనుమానము, ఆశ్చర్యము లేదు లోకోత్తరమైన గుణములతో గూడిన వస్తువు యొక్క వినాశమందు కూడ శోక మోహములు లేకపోయిన యెడల, అతడెట్లు పురుష ధౌరేయుడు కాగలడు. అదియును అతి సుందర మెట్లగును! ఆ యిద్దరికి నమస్కారమే అగును. మహాపురుషుని యొక్క

గుణగుణి వర్ణన ప్రకరణమునందు "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః" (మనుష్యుల దుఃఖములలో (కష్టములలో) మిక్కిలి అధికముగా దుఃఖించును) అని చెప్పబడగలదు. హనుమంతుడు కూడ "దుష్కరం కృతవాన్ రామో హీనో యదనయా ప్రభుః । ధారయత్యాత్మనోదేహం నశోకేనావసీదతి". ఈమె లేనివాడై ప్రభువైన శ్రీరాముడు తన దేహమును ధరింపగల్గుచున్నాడో, శోకముతో క్రుంగిపోకుండ (నశించకుండ) ఉన్నాడో చాల దుష్కరమైన పనిని చేసినాడు. కఠినుడు గనుక జీవించి యున్నాడు) అని ముందు చెప్పగలడు - సీతమ్మ ఎడబాటు పొందిన దానికంటె అధికముగా జటాయువుకై విలపించెనని తాత్పర్యము. ఇచ్చట అధిక పాఠము గలదు - "రామోపి హతమారీచో నివృత్తో బహుచింతయన్ । శూన్యం దృష్ట్వాశ్రమ పదం విలలాప సలక్ష్మణః । విచిన్వన్ బహుశోరణ్యం దృష్ట్వాగృధ్రం జటాయుషం - రాముడు మారీచుని చంపి అనేక విధములుగా చింతించుచు వెనుకకు మరలినవాడై. ఆశ్రమ స్థానమును సీతలేనిదిగా జూచి లక్ష్మణునితోకూడ చాల విలపించెను. అరణ్యమును అనేక విధములుగా, అనేక చోట్ల వెదకుచు జటాయువను పేరుగల గ్రద్ధను చూచెను - అని అధికపాఠము.

తత స్తేనైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషం । మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శహ । కబంధం నామ రూపేణ వికృతం ఘోరదర్శనం ॥ 55	పిమ్మట ఆ శోకముతోడనే జటాయువను గ్రద్ధను దహించి అడవియందు సీతను వెదకుచున్నవాడై రూపముచే వికృతుడై (వికృతమగు రూపముగల్గి) భయంకర దర్శనము గల కంబంధుడనెడు రాక్షసుని గాంచెను (చూచిన మాత్రముననే భయమును గొలుపుట ఆశ్చర్యము గదా!)

(తతః - అని, మూడు శ్లోకపాదములకు ఏకవాక్యము)

తేనైవ శోకేన = ఆ శోకము తోడనే - గ్రద్ధను చంపుటచే గలిగిన శోకముచేతనే, సీతను అపహరించుట వలన జనించిన దుఃఖముకంటెను అధికమైనది ఆ శోకము అని అర్థము - పిమ్మట (వ్యాపృతుడగు) ప్రసిద్ధికెక్కిన రాముడు, గృధ్రం = గ్రద్ధను, (ఒకానొక పక్షి పక్షులలో ఒక రకమైనది - అయినప్పటికిని), జటాయుషం = జటాయువును - తన తండ్రికి స్నేహితుడగుట వలనను, శేషి (భగవానుని) కార్యమునకై ప్రాణములను వదలిన వాడగుట వలనను, దగ్ధ్వా = బ్రహ్మమేధ సంస్కారముతో దహించి, "యత్తు ప్రేతస్య మర్త్యస్య కథయంతి ద్విజాతయః॥ తత్స్వర్గ గమనం తస్య క్షిప్రం రామో జజాపహ" (మనుష్యులు చనిపోయినపుడు చనిపోయిన ప్రాణి స్వర్గమును పొందవలెనని బ్రాహ్మణులు ఏ పితృ సంబంధమైన మంత్రములను చెప్పుదురో, రాముడా మంత్రములను స్వయముగా జపించెను. -చదివెను) అని ముందు చెప్పబడుట వలనను, ముక్తుడై శరీరమును విడిచిన వాడగుట వలనను ఈ బ్రహ్మమేధసంస్కారమున కితడు తగియున్నాడు. (యోగ్యుడు - అని) నృసింహ పురాణమందిట్లు చెప్పబడినది. మత్కృతే నిధనం యస్మా త్త్వయా ప్రాప్తంద్విజోత్తమ । తస్మాత్త్వం మత్ప్రసాదేన విష్ణులోక మవాప్స్యసి" (పక్షి శ్రేష్ఠ-ద్విజోత్తమా! నా కొఱకై నీకు మరణము కలిగినది. అందువలన నీవు నా అనుగ్రహముతో విష్ణులోకమును పొందగలవు) అని సామాన్యముగా చెప్పబడినది. ఆగ్నేయ పురాణమందు- విష్ణోః కార్యం సముద్దిశ్య దేహత్యాగో యతః కృతః॥ తతో వైకుంఠ మాసాద్య ముక్తో భవతి మానవః" (విష్ణు కార్యమునుద్దేశించి దేహత్యాగముచే మనుష్యుడు వైకుంఠమునొంది ముక్తుడగును. అని(విశేషముగా) చెప్పబడినది. "అశ్వమేధపర్వమునందును" "ప్రాణాం స్త్యజతి యోమర్త్యో మాంప్రపన్నోపి మత్కృతే, బాలసూర్య ప్రకాశేన వ్రజే ద్యానేన మద్గృహం" ఏ మానవుడు నన్ను శరణాగతి పొందినవాడును నా కారణముగా (నా విషయమునందు) ప్రాణములను విడుచునో బాలసూర్యుని కాంతివంటి కాంతిగల విమానముతో నాస్థానమును (పరమ పదమును) పొందును అని చెప్పబడినది. ఇచ్చట కూడ "యాగతి ర్యజ్ఞశీలానాం ఆహితాగ్నేశ్చ యాగతిః॥ అపరావర్తినాంయాచ యాచ భూమి ప్రదాయినాం । మయాత్వం సమనుజ్ఞాతో

గచ్ఛ లోకా ననుత్తమాన్" (యజ్ఞములుచేయుటయే స్వభావముగా గల గృహస్థులకు, ఆహితాగ్నులైన వాన ప్రస్థులకు, వైరాగ్యముచే సన్యసించి వెనుకకు మరలిరాని సన్న్యాసులకు, భూదానము చేసిన (భూమి భోగములను త్యజించిన) నైష్ఠికులకు (మరణానంతరము) ఏ లోకము గలుగునో, నాచే నీవు అనుమతింపబడినవాడవై అట్టి ఉత్తమ (అనుత్తమ) లోకములకు (పరమ పదమునకు) వెళ్ళుము అని ముందు చెప్పబడగలదు. ఇచ్చట అపరావృత్తి అనగా నచపునరావర్తతే (మరల వెనుకకు సంసారమునకు - తిరిగిరాడు) అని చెప్పబడిన ముక్తియే, కాని యుద్ధమునందు పారిపోకుండ నిలబడుట కాదు. ఆ ఫలము స్వయముగా సిద్ధించునదగుటచేత అది యనుగ్రహింపబడదగినది కాకపోవుట వలన, దహనాది సంస్కారములేనప్పుడు పుణ్యఫలము జనించకపోవుట చేత దానిని (ఆసంస్కారమును) చేయుటచే అది యనుగ్రహింపబడదగినది అని చెప్పదగదు. పక్షికి యజ్ఞమునందధికారము లేకపోవుటచే అతనికి అది లేక పోవుటచే అతని కది అనుగ్రహింపబడదగిన దగుటవలన, అంగి (ప్రధానమైన) ఫలమునకే అంగ ఫలమగుటచే (అప్రధాన ఫలము) ఉపాసనాంగములైన యజ్ఞము దానము మొదలగు వానికి గూడ ముక్తియె ఫలము అనే అభిప్రాయముతో 'యాగతి ర్యజ్ఞశీలానాం' అని మొదలైనది చెప్పబడినది. లేక - ఇమాన్ లోకాన్ కామాన్నీ కామరూప్యను సంచరన్ - (కోరిన ఆహారము తినువాడై, కోరిన రూపము (వేషము) ధరించి ఈ లోకములను యథేష్టముగా సంచరించును)అని మొదలగు శ్రుతులందు చెప్పబడిన ప్రకారముగా సర్వలోకములందు తిరుగుట సంభవించుట వలన 'యాగతిః' (ఏ గతియో - ఏ లోకమో) అని చెప్పబడినది. ఈ వాక్యము క్రమముక్తి- పరము (క్రమ ముక్తికి చెందినది). ఆత్మానం మానుషం మన్యే (నన్ను మనుష్యునిగా తలంచుకొనుచున్నాను) అని మనుష్యత్వమును భావించుచున్న వానికి పరత్వమునకు అసాధారణమైన చిహ్నము (గుర్తు) అగు మోక్షము నొసంగుట యెట్లు చెప్పబడుచున్నది? అని సందేహము కలిగినచో - అది సరికాదు. సత్యేన లోకాన్ జయతి (సత్యముచే లోకములను జయించును - అనగా సత్య పాలనము చేయువానికి లోకములన్నియు వశమైయుండును) అని చెప్పబడినట్టి సర్వలోక జయమునకు (వశమునకు) మనుష్యుడగుటయందును విరోధము లేకపోవుట వలన (సంభవమే) - ఇట్లు జటాయువును దహించి, వనే సీతాం మార్గమాణః = అడవి యందు సీతను వెదకుచున్నవాడై, (మృగ అన్వేషణ ఇత్యస్మాద్ధాతో శ్శానచ్ - ఆధృషాద్వేతి వికల్పాణ్ణిజభావః), రూపేణ = శరీరముతో, వికృతం = వికారముతో కూడిన వాడును, (యేనాంగ వికార ఇతి తృతీయా) కుక్షియందు (పొట్టయందు) నిక్షిప్తమైన (ఉంచబడిన) మస్తకము (తల) గలవాడు అని యర్థము, ఘోర దర్శనం = భయంకరమైన దర్శనము కలవాడు అగు, కబంధం = కబంధ (మొండెము) ము యొక్క ఆకారముగలవాడగుట వలన కంబంధుడను పేరుగల, రాక్షసం = రాక్షసుని, దదర్శ = చూచెను, హ = కటకటా, అయ్యో! (దుఃఖమును తెలుపుచున్నది) హా అని విచారమునందు వర్తించును. అమృతమునే వెదుకువానికి కాలకుటము (విషము) లభించినది. అని యర్థము. ఇతడు దానవుడే అయినను రాక్షస (కౄర) స్వభావము గలవాడగుటవలన అట్లు చెప్పబడినదని తెలియదగినది.

తంనిహత్య మహాబాహు ర్దదాహ స్వర్గతశ్చసః ॥	$55^1/_2$	గొప్ప భుజములు గల శ్రీరాముడు అతనిని చంపి దహించెను (కాలబెట్టెను) అతడును స్వర్గ లోకమున కేగెను.

"తం" అని, మహాబాహుః = కబంధుని యొక్క భుజములను ఖండించుట (కోయుట) యందు సమర్థమైన (శక్తిగల) భుజములు కలవాడగు రాముడు, తం-ఆ కబంధుని, నిహత్య = చంపి, (పడగొట్టి) అతనియొక్క ప్రార్థనచే, దదాహ = దహించెను.

సచ = అకబంధుడును, కాలుటవలన (దాహకారణముగా) స్వః = స్వర్గ లోకమును, గతః = పొందెను. ఈ సగము ఒక వాక్యము.

స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీం । శ్రమణీం ధర్మ నిపుణా మభిగచ్ఛేతి రాఘవ ॥ $56^1/_2$	ఆకంబంధుడును "రాఘవ-రామచంద్రా', ధర్మమును ఆచరించునదియు, ధర్మమునందు నేర్పుగలదియు, సన్యాసిని (భిక్షుకి) యగు, శబరి వద్దకు వెళ్ళుము అని ఆ శ్రీరామునికి చెప్పెను.

(సచ- అని), సచ = అతడును, స్వర్గమునకు వెళ్ళుచు కబంధుడును, అతని యొక్క (రామునియొక్క) ఉపకార స్మృతితో క్షణకాలమాకాశమునందుండి, ధర్మచారిణీం = గురుశుశ్రూష మొదలైన ధర్మములను ఆచరించు స్వభావము గలది, ఆచార్యాభిమానరూపమైన చరమపర్వనిష్ఠ గలది. అని యర్థము. 'పాదమూలం గమిష్యామి యానహం పర్యచారిషం' (ఏ గురువులకు నేను పరిచర్యచేసితినో, వారి పాద సన్నిధికి పోగలను) అని ముందు చెప్పబడుటవలన, ధర్మ నిపుణాం = అతిథి సత్కార రూపమైన ధర్మమునందు సమర్థురాలు (నేర్పరురాలును), ధర్మ సూక్ష్మములను తెలిసినదియు, అని అర్థము. రాముడు తప్పక రాగలడని తియ్యని పండ్లను రుచిచూచి, రుచి చూచి పరీక్షించి తియ్యగా ఉన్న పండ్లను సేకరించి ప్రేమతో దాచిపెట్టినది అని ప్రసిద్ధి కలదు.

(ఎంగిలిచేసిన పండ్లను రామునికి ఇచ్చినదని ఒక వదంతి యున్నది. చెట్టు యొక్క ఒక పండు రుచి చూచిన మిగిలిన ఆ చెట్టు పండ్ల రుచి అట్లేయుండును కదా! ఇట్లు చెట్టు చెట్టుకు తిరిగి రుచిచూచి పండ్లను సేకరించియుండును. లేదా! పండ్ల యొక్క కొంచెము తొక్క తీసి రసము చేతిలో పిండుకొని రుచిచూచి ఆ పండ్లను రామునికిచ్చియుండును. అట్లు చేసినను ఎంగిలియే. కాని ప్రేమకు ఈ విషయములు తెలియవు. ప్రేమతో సమర్పించిన వానిని స్వీకరించుటలో భగవంతుడీదోషములను పరికింపడు. ప్రేమతో అర్పించినవానిని భగవంతుడు ప్రేమతో గ్రహించును.) శ్రమణీం = సన్యాసినిని (పరివ్రాజికను) 'చతుర్థ మాశ్రమం ప్రాప్తా శ్రమణా నామ తే స్మృతా' నాల్గవ ఆశ్రమమును పొందినవారు శ్రమణులని పిలువబడుదురు అని స్మృతి వచనము, శబరీం = శబరస్త్రీని, ప్రతిలోమజాతి స్త్రీని, నారద పురాణమునందు 'నృపాయాం వైశ్యతో జాత శ్శబరః పరికీర్తితః, మధూని వృక్షా దానీయ విక్రీణేతే స్వవృత్తయే' రాజవనిత (క్షత్రియ స్త్రీ) యందు వైశ్యుని వలన పుట్టినవాడు శబరుడని చెప్పబడును. అతడు తన జీవిక కొరకై (జీవనోపాయమునకై) వృక్షముల నుండి తేనెలను సేకరించి (తీసుకొని వచ్చి), అమ్ముకొనును అని చెప్పబడినది. (జాతే రస్త్రీవిషయాదితి ఙీష్), అభిగచ్ఛ = (ఆభిముఖ్యముగా వెళ్ళుము) ఎదురుగా వెళ్ళుము. కలియుము. అని, రాఘవం కథయామాస = రామునికి చెప్పెను. రాఘవ, అను పాఠము నందు - ఓ రాఘవ, శబరి వద్దకు వెళ్ళుము అని, అస్య కథయామాస = ఇతనికి (రామునికి) చెప్పెను అని యర్థము. ఇచ్చట భాగవతుల యెడగల భక్తి మహిమతో హీనజాతి అయినను ఆ భక్తుడు (అందరిచేతను) పొందదగినవాడగునని చెప్పబడినది. అనగా హీనజాతి అయినను భక్తుల యందు భక్తి విశ్వాసము కలిగి సేవించెడివారు అందరి చేతను సేవింపదగినవారే అని చెప్పినట్లైనది.

సో2భ్యగచ్ఛ న్మహాతేజా శ్శబరీం శత్రు సూదనః శబర్యా పూజిత స్సమ్య గ్రామో దశరథాత్మజః ॥ $57^1/_2$	గొప్ప తేజస్సు గలవాడు, శత్రువులను నశింపజేయు-వాడగు ఆ శ్రీరాముడు శబరి వద్దకు (దర్శించుటకై) వెళ్ళినాడు. దశరథుని కుమారుడగు శ్రీరాముడు శబరిచేత చక్కగా పూజింపబడినాడు.

'సః' అని, మహాతేజాః = గొప్ప తేజస్సు గలవాడు, చరమపర్వనిష్ఠ గల జనులయందలి ఇచ్ఛ (ఇష్టము) తో అతి సంతుష్టుడైన, (మిగుల సంతోషించినవాడైన) సః = అ రాముడు, శత్రుసూదనః = శత్రువులను నశింపజేయువాడు. 'గమిష్యా మ్యక్షయాన్ లోకాన్ త్వత్ప్రసాదా దరిందమ! (శత్రువుల నణచువాడా! నీ అనుగ్రహము (ప్రసాదము)

వలన నేను (ఇప్పుడు) అక్షయములైన లోకములను పొందగలను.) (పొందెదను) అని చెప్పబడిన ప్రకారముగా, వానిని పొందుటలో గల ప్రతిబంధకములను (ఆటంకములను) తొలగించువాడు. (సాత్పద్యోరితి షత్వాభావః) శబరీం = నీచత (హీనత) కు సీమాభూమి అయిన దాని వద్దకు (నీచజాతి వనిత వద్దకు), అభ్యగచ్ఛత్ = వెళ్ళెను - అని రాముని యొక్క సౌశీల్యమునకు అతిశయమును (పరాకాష్ఠను) చెప్పుట - దశరథాత్మజః రామః = దశరథుని కుమారుడైన రాముడు, శబర్యా = శబరిచేత, సమ్యక్పూజితః = చక్కగా పూజింపబడినాడు. అరువైవేల సంవత్సరములు గొడ్డువాడైన దశరథుని యొక్క ప్రాసాదమునందు మిక్కిలి ఆదరముతో చేయబడిన భోజనము కంటే కూడ అతిశయము గావింపబడినది. తత్కాలమున మాత్రము వచ్చి చేరిన, శబరిచే సమర్పింపబడిన మృష్టాన్నము (సుభోజనము - మంచి ఆహారము) అని భావము. శరభంగుడు మొదలు అగస్త్యుని వర్గమైన ఋషులచే చేయబడినది పూజ మాత్రమే, కాని శబరిచే చేయబడినదయితే సమ్యక్పూజ = చక్కని పూజ. ఆమె చరమపర్వనిష్ఠ గలదగుట వలన, అని భావము. 'మమ మద్భక్త భక్తేషు ప్రీతి రభ్యధికా భవేత్' నాకు నా భక్తులయందు (భక్తులైనవారికి భక్తులయందు) ప్రీతి (ప్రేమ) మిక్కిలి అధికమైనదగును) అని చెప్పబడినదిగదా! లేక సమ్యక్పూజనము - పరీక్షింపబడిన రసములు గల ఫలములతోడ భోజనము - (పూజిత ఇత్యత్ర మతిబుద్ధి పూజార్థేభ్యశ్చేతి వర్తమానేక్తః, వ్యాకరణ విషయము) దశరథునిది స్నేహము శరభంగాదులది భక్తి, శబరిది అచ్చమైన ప్రేమ - తాను తక్కువ జాతిదానినని, అతడు మహాపురుషుడు - తాను ఆరాధించవచ్చునా - లేదా అని సందేహమే ఆమెకు కలుగలేదు - శ్రీరాముడు లక్ష్మణునితో వచ్చును. నీవు అతనిని పూజించి రమ్మని తన గురువగు మతంగముని శిష్యులు ఆదేశించిరి. వారి ఆజ్ఞలను పాలించుటయే ఆమె యోగ్యత -శ్రీరాముడు వచ్చుచున్నాడని ఆలకించిన నాటి నుండి చెట్టు చెట్టుకు తిరిగి ఆ చెట్టు పండ్లు తీపిగా ఉండునా, పులుపుగా ఉండునా అని రుచిచూచి, తీపిపండ్లు పరీక్షించి దాచి శ్రీరామునికి సమర్పించెనట అంతేకాని తాను ఏ పండు తిన్నదో ఆ పండు పెట్టలేదు. కాని కొందరు ఎంగిలి పండ్లను పెట్టినదని అనుకుందురు. గురువుల ప్రభావముచే చాలా కాలము నిలువచేసినను పండ్లలో మార్పు రాలేదు. అట్టి ప్రభావము గల గురువుల శిష్యురాలగుటచే వారి వాక్యమునే నమ్మి శ్రీరాముని ఆరాధన పరిపూర్ణమగు ప్రేమతో చేసినది. తన యోగ్యతను చూచుకొనలేదు. స్వామికి రుచిగ ఉండుటయే ప్రధానము, ఆ పండ్లలో ఒక పండును తిని మిగిలిన వాటిని సమర్పింప వచ్చునా లేదా అని చూడలేదు. ఇది ఆమె ప్రేమ - అందుచేత ఆమె చేసిన పూజ సమ్యక్పూజ అయినది. ఇచ్చట పెద్దలొక చమత్కారమును చెప్పెదురు. స్వామి, నీకు నేను పూజ చేసితిని, మా గురువులు నమ్మునట్లు వ్రాసియిమ్మని ప్రార్థించెనట. అప్పుడు రాముడు 'శబర్యా పూజితస్సమ్యక్' (శబరి బాగుగా పూజించినది) అని వ్రాసెనట - అపుడు శబరి 'చీటికి వ్రాలు (సంతకము) ప్రాణము, చేవ్రాలు చేయనిచో ఈ మాటకు విలువ ఉండదని అనెనట - అప్పుడు రామః = రాముడు అని సంతకము చేసినాడట - ఎందరో రాములుందరు కదా! ఏ రాముడని సందేహము కలుగకుండ తండ్రిపేరు వ్రాయుమని కోరినదట - అప్పుడు రాముడు 'దశరథాత్మజః'= (దశరథుని కుమారుడు) అని వ్రాసి యిచ్చెనట - శబర్యా పూజిత స్సమ్యగ్రామో దశరథాత్మజః = అని ఇందలి చమత్కారము - ఇట్లు శ్రీరాముని ఆరాధించి శబరి తన గురువుల పాదమూలమునకేగెను - ఇది శబరి యొక్క చరమపర్వనిష్ఠ -

పంపాతీరే హనుమతా సంగతో వానరేణహ ।	58	(పిదప) పంపాతీరము నందు శ్రీరాముడు వానరుడైన హనుమంతునితో కలిసెను హనుమంతుని మాట వలననే (మాటననుసరించి) శ్రీరాముడు సుగ్రీవునితో చేరినాడు (కలిసినాడు)
హనుమ ద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతః ॥	$58^1/_2$	

ఇట్లు సత్యప్రతిజ్ఞుడగుటకు ప్రధానమైన అరణ్యకాండ చరిత్రను సంగ్రహించి మిత్రునియొక్క కార్యమును నిర్వహించుట యందు ఉత్కృష్టమైన కిష్కింధాకాండము యొక్క కథను సంక్షేపించుచున్నాడు, (సంగ్రహించి చెప్పుచున్నాడు) 'పంపా' అని - పంపాతీరే = పంప అనునది పద్మసరస్సు. (తామరల కొలను), దాని యొక్క తీరమునందలి కాననమున, (తీరారణ్యమునందు), అని విరహము నుద్దీపింపజేయు (ఉద్రేకింపజేయు) దాని యొక్క సన్నిధానము (సామీప్యమును)ను చెప్పుట. హనుమతా = హనుమంతుడు - ప్రశస్తమైన హనువు (దవడ) కలవాడు. వీరుడని తెలుపునట్టి, రాపిడివలన నేర్పడిన కాయతో గుర్తింపబడిన ముఖము కలవాడు - వజ్రాయుధముతో ఇంద్రుడు కొట్టగా, ఒక బండపైబడి, హనువు అనగా దవడ సొట్టపోయి అదే అతనికి ప్రసిద్ధమైన కీర్తి గుర్తుగా ఏర్పడి హనుమంతుడైనాడు - అట్టి, వానరేణ =వానరునితో, సంగతః = కలిసినాడు, కూడినాడు, రాముడు అని అధ్యాహారము, హ - సంతోషము గదా! అని ప్రయోగింపబడినది. విరహజనులయొక్క ప్రాణమును హరించునట్టి పంపోపవనమునందు తన ప్రియురాలిని కూర్చువాడైన హనుమంతునితో కలియుట యనునది దొంగలచే వనమునందు సర్వస్వము దోచుకొనబడినవానికి తన వారిని చూచుటవలె (రామునికి) మిక్కిలి ఓదార్పును (ప్రోత్సాహమును) కలుగజేయుట (కలిగించినది) అని ముని హర్షము సూచించుటకు హ అని ప్రయోగించినాడు - హనుమంతునితో నిప్పుడిచ్చట ఏమి పరిస్థితి కల్గునో అని మిక్కిలి కలవరముచెందిన స్థితియందు విజయమును దెలుపునట్టి కిణము (కాయ) చిహ్నముతో కూడిన ముఖముగల పురుషునితో కలయిక యాదృచ్ఛికముగా (అనుకోకుండ) కలిగినది - 'వానరునితో' -(వానరేణ) అను విశేషణముచే రావణునివలె సన్యాసి వేషము లేకుండ తన (స్వ) వేషముతో కలియుట వలన విశ్వసనీయత్వము (నమ్మదగియుండుట) వెల్లడి కావింపబడినది. హనుమద్వచనాత్ = హనుమంతుని మాట వలన, సుగ్రీవేణ = సుగ్రీవునితో, సమాగతః = చేరినాడు - (కలిసినాడు) చ+ ఏవ = చైవ అని రెండు అవ్యయముల సముదాయము సముచ్చయార్థమును తెలుపును. అనుకూలమైన పురుషకారము యొక్క లాభము వలన తగిన మిత్రుని యొక్క లాభము కలిగినదని భావము. Recommandation సిఫారసు. (పురుషకారము = పురుష ప్రయత్నము) హనుమంతుడు అనుటచే వాగ్వైభవము గలవాడనియు, వానరుడనుడచే ఆచార్య స్థానమును అలంకరింపదగిన జ్ఞానము కలవాడు (జ్ఞాని) యని సూచింపబడినది. (పరమాత్మతో జీవుని చేర్చుటకు తగిన ఆచార్య లాభము భగవానునకు ఆనందము గూర్చుననియు 'హ' అను శబ్దముచే సూచింపబడినది - అప్పలా చార్యులు).

సుగ్రీవాయచ తత్సర్వం శంస ద్రామో మహాబలః । ఆదిత స్తద్యథావృత్తం సీతాయాశ్చ విశేషతః ॥ 59½	మహాబలుడైన శ్రీరాముడు సుగ్రీవునికి మొదటనుండి జరిగిన వృత్తాంతమును - అంతయును ప్రత్యేకముగా సీతయొక్క సంగతిని (అవశ్యకర్తవ్యమైన సీతాన్వేషణమును గూర్చి) తెలియజేసెను.

పిమ్మట సఖ్యమునకు కారణమైన రహస్యమును ప్రకటించుచున్నాడు. 'సుగ్రీవాయ' అని - మహాబలః = గొప్ప బలవంతుడు, అనుటచేత గడచిన దానిని స్మరించు కాలమునందలి కాతర్య (పిరికితనము) ను దాచుటకు కారణమైన ధైర్యము చెప్పబడుచున్నది. గొప్ప ధైర్యము గలవాడుఅని అర్థము. రామః = రాముడు, ఆదితః - పుట్టుక మొదలుకొని (మొదటి నుండి) తత్ = ప్రసిద్ధమైన, సర్వం వృత్తం = వృత్తాంతమంతయు (జరిగినదంతయు) సుగ్రీవాయ = సుగ్రీవునికి, శంసత్ = (అనిత్యమాగమ శాసన మిత్యడభావః) చెప్పెను, అని అర్థము. సీతాయాః తద్వృత్తం చ = సీత యొక్క ఆ వృత్తాంతమును, రావణునిచే అపహరింపబడుట మొదలైనది, యథా వృత్తం - (వృత్తమనతిక్రమ్య) - జరిగినది ఏమాత్రమతిక్రమించకుండ, జరిగినది జరిగినట్లు, (పదార్థానతివృత్తావవ్యయీభావః), ఆమెయొక్క అన్వేషణము తప్పకుండ (అవశ్యముగా) చేయదగినదగుటచేత, విశేషేణ = విశేషముగా, ప్రత్యేకముగా, అశంసత్ = చెప్పెను, తెలిపెను.

సుగ్రీవశ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః । చకార సఖ్యం రామేణ ప్రీత శ్చైవాగ్ని సాక్షికం ॥ 60½	వానరుడైన సుగ్రీవుడును రాముని యొక్క వృత్తాంతమంతయు (రామునిదంతయు) విని ప్రీతుడై (సంతుష్టుడై) రామునితో అగ్ని సాక్షికగా సఖ్యమును (మైత్రిని) చేసికొనెను.

'సుగ్రీవః'-అని, చాపి అని రెండవ్యయములు సముచ్చయార్థమును తెలుపును. వానరః = వానరుడైన, సుగ్రీవః అపి = సుగ్రీవుడును, రామస్య = రామునికి సంబంధించిన, తత్సర్వం = (అది యంతయు) పూర్వము చెప్పబడిన వృత్తాంతమునంతయు, శ్రుత్వా = విని, ప్రీతః = ప్రీతుడై, రాముని యొక్క ప్రయోజనమును అపేక్షించుట వలన తన యొక్క ప్రయోజనము కూడా నేరవేర్పబడగలదని సంతుష్టిచెందినవాడై, అగ్నిసాక్షికం= అగ్నిఃసాక్షీ సాక్షాద్ద్రష్టాయస్య తదగ్ని సాక్షికం = రాముని కార్యమున సహాయము చేసి, అతనిచే తమ శత్రువును జయింపజేసి తాను రాజ్యమును, భార్యను పొందవలెనని తలంచి. అగ్నియే సాక్షి (ప్రత్యక్షముగా చూచువాడు) గా గలదైన, (శేషాద్విభాషేతి కప్రత్యయః) రామేణ = రామునితో, సఖ్యం = సఖిత్వమును, స్నేహితమును, (సఖ్యుర్య ఇతి భావార్థే యప్రత్యయః), చకార = చేసికొనెను. వానర రామశబ్దములచేత స్నేహమునకు అసమానత్వము చేసెను అని - వ్యంజింపబడినది. దానిచేతను రాముని యొక్క సౌశీల్యాతిశయము వ్యాంజింపబడుచున్నది. (తెలుపబడుచున్నది). గుహుడు హీనజాతి మనుష్యుడగుటచేత అతనితో చెలిమి సౌశీల్యము యొక్క హేతువు, అచట కూడ, స్త్రీయగుటచేత శబరియొద్దకు వెళ్ళుట (చేరుట-) అంతకంటే అధికమైన సౌశీల్యము, రెండవమెట్టు. సుగ్రీవుడు తిర్యగ్జాతికిచెందినవాడు యగుటచేత అంతకంటే మిక్కిలి అధికమైన సౌశీల్యము అని భావము. సౌశీల్యమునందు తతస్తర సౌశీల్యము, తతస్తమ సౌశీల్యము మొదటిమెట్టు, రెండవమెట్టు చివరిమెట్టు అనగా సౌశీల్యమునందలి తరతమ భావము వ్యంజింపబడినది. ఇంగ్లీషులో Good, Better, Best, positive, comparative superlative Degree లున్నట్లు.

తతో వానర రాజేన వైరానుకథనం ప్రతి । రామాయావేదితం సర్వం ప్రణయా ద్దుఃఖితేనచ ॥ 61½	పిమ్మట దుఃఖితుడైన వానర రాజుచే (సుగ్రీవునిచే) వాలి యొక్క విరోధమునకు సంబంధించిన వృత్తాంతమును గూర్చి అంతయు రామునికి స్నేహమువలన ప్రేమతో (నమ్మకముతో) చెప్పబడినది.

"తతః"- అని, తతః = మైత్రి చేసికొన్న తరువాత, దుఃఖితేన = గొప్ప (పరమ) స్నేహితుడైన రాముని సన్నిధానము (సమీపము) వలన (దగ్గర ఉండుట వలన) పూర్వవృత్తము (జరిగిన సంగతి) (మేలుకొని) తలంపునకు వచ్చుట చేత కన్నీళ్ళను కార్చుచున్న (అని యర్థము), వానరరాజేన = సుగ్రీవునిచే (కర్తృకరణయో స్తృతీయేతి కర్తరి తృతీయా) వైరాను కథనం = వాలితో తనకు కలిగిన వైరము యొక్క వృత్తమును, అనుకథనం = ప్రశ్నకు తగిన ఉత్తరముగా, అని యర్థము - వాలితో నీకెందువలన విరోధమేర్పడినది అని ఇట్లు (ఈ విధమైన) ప్రశ్న - దానిని గూర్చి చెప్పదగినది. సర్వం = రహస్యమైన, ప్రకాశమైన వృత్తాంతమునంతయు, ప్రణయాత్ = స్నేహముచేత - లేక నమ్మకమువలన, (ప్రణయా స్త్వమీ విస్రంభ యాచ్ఞా ప్రేమాణః - ప్రణయశబ్దము విశ్వాసమునకు (పరిచయమునకు), అడుగుటకును, ప్రేమకును పేరు అని అమరము) రామాయ = రామునికి, ఆవేదితం = దాచకుండ చెప్పబడినది - తెలుపబడినది. పూర్తిగా నంతయు (ఒక్కటియు విడువకుండ) చెప్పబడినదని యర్థము.

ప్రతిజ్ఞాతంచ రామేణ తదా వాలివధం ప్రతి । వాలినశ్చ బలం తత్ర కథయామాస వానరః ॥ 62 1/2	అప్పుడు రామునిచే వాలివధను గూర్చి ప్రతిజ్ఞచేయబడినది (రాముడు వాలిని చంపుదునని ప్రతిజ్ఞచేసినాడు) (పిమ్మట) సుగ్రీవుడు అచట వాలియొక్క బలమును తెలిపినాడు.

"ప్రతిజ్ఞాతంచ"- అని, చ శబ్దము భిన్నక్రమమును తెలుపును - రామేణచ = రామునిచేతను, తదా = (వాలితో తనకేర్పడిన వైరమును గూర్చి) విజ్ఞాపనము చేసిన తరువాత, వాలివధంప్రతి = వాలి సంహారమును గూర్చి, ప్రతిజ్ఞాతం = ప్రతిజ్ఞ చేయబడినది, వాలి వధకై ప్రతిజ్ఞ చేయబడినదని యర్థము. (భావేక్తం) వానరః = సుగ్రీవుడును, తత్ర = ఆఋశ్యమూక పర్వతమునందు, వాలినః బలంచ= వాలియొక్క బలమునున్ను. 'సముద్రా త్పశ్చిమా త్పూర్వం, దక్షిణాదపి చోత్తరం । క్రామత్యనుదితే సూర్యే వాలీ వ్యపగతక్లమః' పశ్చిమ సముద్రము నుండి తూర్పు సముద్రమునకు, దక్షిణ సముద్రము నుండి ఉత్తర సముద్రమునకు సూర్యుడు ఉదయించక ముందే వాలి బడలిక (ఆయాసము) లేకుండ ఎగిరివెళ్ళి వచ్చును. (అంతటి సమర్థుడు) అని మొదలగు వానిచేత చెప్పబడగల బలమును, (ఉత్సాహమును వృద్ధిపొందించుట కొఱకు), కథయామాస = వివరించి చెప్పెను - (దుందుభి అను రాక్షసుని సంహరించి కాలి కొనతో చిమ్మినాడు అని చెప్పెను).

సుగ్రీవ శ్శంకిత శ్చాసీ న్నిత్యం వీర్యేణ రాఘవే ॥ 63	సుగ్రీవుడు రాముని విషయమున వీర్యమునందు (పరాక్రమమునందు) నిత్యమును శంకించిన వాడయ్యెను.
రాఘవ ప్రత్యయార్థంతు దుందుభేః కాయ ముత్తమం । దర్శయామాస సుగ్రీవో మహాపర్వత సన్నిభం ॥ 64	రాముని (బలమును) విశ్వసించుట కొఱకై సుగ్రీవుడు పెద్దకొండతో సమానమైన దుందుభి యొక్క ఉన్నతమైన శరీరమును (అస్థిపంజరమును) రామునికి చూపించెను.

"సుగ్రీవ"- అని, సుగ్రీవః = సుగ్రీవుడు, రాఘవే = రాముని విషయమునందు, వీర్యేణ = పరాక్రమకారణముగా, నిత్యం = చూచినది మొదలు మద్దిచెట్లను కూల్చువరకు, మాటి మాటికిని, (అడుగడుగున), శంకితః ఆసీచ్చ = అనుమానించినవాడాయెను కూడ. ఇతడు వాలితో సమానమైన పరాక్రమము గలవాడు ఔనో, కాదో అని సందేహించినవాడని యర్థము. (నిత్య శబ్దస్య వీప్సా పరత్వం మహాభాష్యే నిత్య ప్రహసితో నిత్య ప్రజ్వలిత ఇతి. నిత్య శబ్దమునకు వీప్సా పరముగా అర్థము చెప్పబడుటకై - మహాభాష్యమునందు నిత్య ప్రహసితుడు = మాటిమాటికి పెద్దగా నవ్వువాడు, నిత్య ప్రజ్వలితః = మాటిమాటికి మండువాడు - (కోపించువాడు) అని ఉదాహరణము లీయబడినవి. మతిబుద్ధ్యాదిసూత్రే శంకితాదయోప్యర్థసిద్ధా ఇతి సూచనాత్ కర్తరినిష్ఠా). ('రాఘవ' అని) తుశబ్దము విశేషమును తెలుపును - కేవలము శంకితుడు మాత్రమే కాలేదు, ప్రత్యయము (విశ్వాసము) కొఱకై వేఱొకదానిని కూడా చూపించెనని యర్థము. రాఘవ ప్రత్యయార్థం = రాముని విషయమైన జ్ఞానము కొఱకు - రాముని బలమును తెలుసుకొనుట కొఱకు అని యర్థము, లేక రాముని యెడ విశ్వాసము కలుగుట కొఱకు (అనియైనను చెప్పవచ్చును) 'ప్రత్యయోధీన శపథ, జ్ఞాన విశ్వాసహేతుషు, రంధ్రేశబ్దే (ప్రత్యయ శబ్దము, అధీనమునకును, శపథమునకును, జ్ఞానమునకును, విశ్వాసమునకును, హేతువునకును అవకాశమునకును, పదముల చివరచేరు శబ్దములకును పేరు) అని అమరము. దుందుభేః = వాలిచే చంపబడిన, దుందుభి అను పేరుగల రాక్షసుని యొక్క ఉత్తమం = శిథిలము కాని ఉన్నతమైన, ఇందువలననే, మహా పర్వత సన్నిభం = పెద్ద పర్వతముతో సమానమైన, కాయం= శరీరాకారమున నున్న అస్థి పంజరమును, ఎముకలగూడును, దర్శయామాస = (రామునికి)

చూపించెను. (రామునికి, అని శేషము) వాలి ఈ అస్థిపంజరముగల శరీరమును కాలి కొన మీద పెట్టుకొని (పెట్టి) మీదికి చిమ్మెను అని చెప్పి చూపించెనని యర్థము.

ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః పాదాంగుష్ఠేన చిక్షేప సంపూర్ణం దశయోజనం ॥ 65	మహాబలుడును మహాబాహువును అగు శ్రీరాముడు దుందుభి కళేబరమును (అస్థిపంజరమును) చూచి, నవ్వి తన కాలిబొటన వేలితో ఎత్తి పదియోజనముల(కు తక్కువ కాకుండ) దూరమునకు చిమ్మి వేసెను.

"ఉత్స్మయిత్వా"-అని, మహాబలః = కొలయిడరాని (అధికమైన) బలము గలవాడు, మహాబాహుః = బలానుగుణమైన కార్యములను చేయుటయందు సమర్థమైన (శక్తివంతమైన) భుజములు గలవాడగు శ్రీరాముడు, అస్థి = ఎముకల గూడును (కళేబరమును), ప్రేక్ష్య = చూచి, స్మయిత్వా = ఇది యెంత మాత్రమని అనాదరించి నవ్వి (ఇడార్థః), పాదాంగుష్ఠేన = కాలిబొటన వ్రేలితో, సంపూర్ణం = పూర్తిగా, తక్కువగాకుండ, దశయోజనం = పదియోజనముల (దూరము), (ప్రాదిత్వాత్ సమాహారే జీబభావః - అత్యంత సంయోగే ద్వితీయా). ఉత్‌చిక్షేప = పైకెత్తి (యత్నించి) చిమ్మివేసెను. (వ్యవహితాశ్చేత్యుపసర్గస్య వ్యవహిత ప్రయోగః = (ఉపసర్గలు సాధారణముగా ధాతువులతో కూడియే ప్రయోగింపబడును, అప్పుడప్పుడు ధాతువులతో కూడక విడిగాను ప్రయోగింపబడును) వాలిచేత పాదముతో చిమ్మబడినది, రామునిచేత నయితే కాలి బొటనవ్రేలితో ఎగజిమ్మబడినది, అతనిచేత రెండువందల విండ్లదూరము చిమ్మబడినది, ఇతనిచేత పది యోజనముల దూరము ఎగజిమ్మబడినది. అని విశేషము స్ఫురించుచున్నది.

బిభేదచ పునస్సాలాన్ సప్తైకేన మహేషుణా, గిరిం రసాతలంచైవ జనయన్ ప్రత్యయంతదా ॥ 66	శ్రీరాముడు మరలను ఏడుసాల వృక్షములను, పర్వతమును, రసాతలమును (పాతాళమును) కూడ సుగ్రీవునికి విశ్వాసమును కలిగించుటకొఱకై అప్పుడొకే బాణముతోడ భేదించెను - (సాల వృక్షములకు బదులు తాటిచెట్లు (బిభేద సప్తతాలాంశ్చ) అని పాఠభేదము.

చాలకాలము యుద్ధముచేయుటచే అలసటచెందిన వాలిచే ఆర్ద్రమైన (రక్తమాంసములతోకూడి ఆర్ద్రమైన) శరీరము చిమ్మబడినది. ఆయాసాదులు లేక స్వస్థుడవైన (ఆరోగ్యవంతుడవైన) నీచేత ఈనాడు ఎండినదైన అస్థిపంజరము ఎగజిమ్మబడినది. అని ఊరడిల్లని (కుదుటపడని-నెమ్మదిచెందని) మనస్సు గల సుగ్రీవునికి విశ్వాసార్థమై మరొక నిదర్శనమును చూపినాడని చెప్పుచున్నాడు. 'బిభేద' అని - ఇచ్చట రాముడు అని అనుసంధించుకొనవలెను. (చేర్చుకొనవలెను) పునశ్చ = మరలను, సప్త సాలాన్ = ఏడు మద్ది చెట్లను, గిరిం = వానికి సమీపముననున్న పర్వతమును, రసాతలంచ = క్రింది లోకములలో ఆరవలోకమైన రసాతలమునున్ను, ప్రత్యయం = విశ్వాసమును, నమ్మకమును, జనయన్ = కలిగించువాడై, విశ్వాసము కలిగించుటకొఱకై, (లక్షణ హేత్వోరితి శతృ ప్రత్యయః), ఏకేన మహేషుణా ఏవ = ఒక గొప్ప బాణముచేతనే, బిభేద = భేదించెను - 'మహేషుణా' అను దానిచేత సుగ్రీవుని యొక్క కార్యమును సాధించుటకై రామునిచే తప్త పరశుధారణము చేయబడినది (ఎఱ్ఱగా కాల్చబడిన గండ్ర గొడ్డలి చేత ధరించబడినది) అని ధ్వనింపబడుచున్నది.

తతఃప్రీతమనా స్తేన విశ్వస్త స్సమహాకపిః । కిష్కింధాం రామ సహితో జగామ చ గుహాం తదా ॥ 67	పిమ్మట దానిచేత విశ్వాసము పొందినవాడై, సంతోషించిన మనస్సు గలవాడై మహాకపియైన ఆ సుగ్రీవుడు రామునితో కూడి అప్పుడే (కొండల నడుమ) గుహవలె నున్న కిష్కింధకు (కిష్కింధయను పురమునకు) వెళ్ళెను కూడ.

"తతః" - అని, తతః = పిమ్మట, మద్దివృక్షములు మొదలైన వానిని భేదించిన తర్వాత, మానుషాతీత చరిత్రము గల అతనిని నమ్మినవాడై, ఇతడు తప్పకుండ వాలిని చంపుట యందు సమర్థుడు (చంపుటకు తగినవాడు) అని విశ్వాసమును పొందినవాడై, ప్రీతమనాః = (త్వరలోనే రాజ్యమును పొందగలనని) సంతోషించిన మనస్సు గలవాడై, మహాకపిః - గొప్ప వానరుడు (తనను కపిరాజుగా తలంచుచున్నవాడు) అగు, సః = ఆ సుగ్రీవుడు, రామసహితః = రామునితో కూడినవాడై, తదా = అప్పుడే, అదే సమయమునందు, కిష్కింధాం = కిష్కింధయను పేరుగల, గుహాం = గుహవలె కొండల నడుమ నున్న పట్టణమునకు, జగామచ = వెళ్ళెను - చ కారము చేత మరల (రెండవసారి) పోవుట సముచ్చయింపబడుచున్నది (చేర్చబడుచున్నది)

తతోగర్జ ద్ధరివర స్సుగ్రీవో హేమపింగళః । తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః ॥ 68	తరువాత బంగారువంటి పింగళవర్ణము గలవాడు, వానర శ్రేష్ఠుడగు సుగ్రీవుడు (వాలిని సమరమున కాహ్వానించుచు) గొప్పగా (గంభీరముగా) గర్జించెను - (ఇంతకు ముందుకంటె విలక్షణమైన) గొప్పనైన ఆ ధ్వనితో వానర రాజగువాలి (సహింపనివాడై) (పట్టణము నుండి) బయలుదేరి వచ్చెను (బయటకు వచ్చెను)

తతః = (కిష్కింధకు పోయిన) తర్వాత, హరివరః = వానరశ్రేష్ఠుడు, తనకు కపిశ్రేష్ఠత్వమును నిశ్చయించుకొన్నవాడు, హేమపింగళః = బంగారువంటి పింగళ (కాంతి) వర్ణము కలవాడు, (ఈ మధ్య ఆపదచే ఆకాంతి (రంగు) కొంచెము తగ్గియుండెను. మరల రాముని ఆశ్రయము దొరకుట వలన హర్షాధిక్యముచే మరల ఆ కాంతిగల వాడయ్యెను) హర్షప్రకర్షముచే తొలగిన వైవర్ణ్యము కలవాడు - వెల్లబాటు -వివర్ణత తొలగినవాడు అని యర్థము. సుగ్రీవః = గర్జనకు అను గుణమైన కంఠధ్వని కలవాడగు సుగ్రీవుడు, అగర్జత్ = గర్జించెను, గంభీరముగా ఘోషించెను - మహతా = గొప్పనైన, పూర్వము (ముందు) గర్జించిన దానికంటే విలక్షణమైన, తేన నాదేన = ఆ ధ్వనితో, ఆ గర్జన కారణముగా, హరీశ్వరః వాలీ = వానర రాజగు వాలి, నిర్జగామ = గృహమునుండి - పట్టణము నుండి బయటకు వచ్చెను.

అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః ॥ నిజఘానచ తత్రైనం శరేణైకేన రాఘవః ॥ 69	అప్పుడు (యుద్ధమునకు పోవలదని అడ్డగించిన) తారను ఓదార్చి ఒప్పించి సుగ్రీవునితో కలిసెను, (కలియబడెను - యుద్ధము చేసెను) అచ్చట (రాఘవుడు) ఒకే బాణముతో వాలిని సంహరించెను.

"అనుమాన్య"-అని, తదా = అప్పుడు, వాలి బయలుదేరు సమయమునందు, తారాం = తారను, ఈనాడు వనము నుండి వచ్చిన అంగదునిచేత సుగ్రీవుడు రాముని సహాయముగా గలవాడై (రామసహాయుడై) ఉన్నాడని చెప్పబడినది. ఇవ్వేళ ఓడి (పరాజితుడై) వెళ్ళిపోయినాడు, మరల వచ్చినాడు, కావున (ఇందువలన) నీవు పోవుట ఉచితము కాదు (తగినది కాదు - మంచిది కాదు) అని అడ్డగించుచున్న తారను, అనుమాన్య = ఓదార్చి, ధార్మికాగ్రేసరుడైన రాముడు ఎట్లు అపరాధములేని (తప్పుచేయని) నన్ను (ఎందుకు) చంపును, అని ఒప్పించి, సుగ్రీవేణ = సుగ్రీవునితో, సమాగతః = కలిసెను, (తలపడెను) యుద్ధము చేసెను అని యర్థము-
రాఘవః - రాఘవుడు, మహా (గొప్ప) కులమునందు పుట్టినవాడగుటచేత ధర్మ సూక్ష్మములను తెలిసినవాడు, తత్ర = అచ్చట, యుద్ధభూమియందు, ఏనం = ఇతనిని, ఇతరునితో యుద్ధముచేయుచున్న వాలిని, అట్లు ఇతరునితో యుద్ధము చేయు సమయమునందు - చ - అవధారణార్థమును దెలుపును, ఏకేన చ శరేణ = ఏకేనైవ శరేణ = ఒకే బాణముతో, నిజఘాన = చంపెను, రెండవ బాణము యొక్క ప్రయోగమునందు అతని యొక్క అభి ముఖ్యముతో (అతడు ఎదురుపడుటచేత) అతని వధ దుర్లభము అని భావము. యుద్ధమునందు ఎదురుపడిన వాని యొక్క (ఎదుటివారియొక్క) బలము వాలికే పోవును అని వరము యొక్క ప్రసిద్ధి యున్నది. (వరము ప్రసిద్ధి కెక్కియున్నది). (ఎదుటపడి యుద్ధము చేసినచో (ఎదుటివారి అనగా, తన) బలము వాలికే పోవును) ఆ వరమును మన్నించుటకు, అధర్మమును చేసిన వానిని శిక్షించుట తప్పుకాదని, క్షత్రియులు మృగమునుకొట్టుట, చెట్టుచాటు నుండి కొట్టుట వేటలో పాటియని, సుగ్రీవునికిచ్చిన మాటను కాపాడుకొనుటకు చాటునుండి చంపుట ధర్మ విరుద్ధము కాదని ఒకే బాణముతో కొట్టి చంపెను.

తత స్సుగ్రీవ వచనా ద్ధత్వా వాలిన మాహవే । సుగ్రీవ మేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్ ॥ 70	సుగ్రీవుని మాట వలన యుద్ధమునందు వాలిని చంపి, పిమ్మట రాఘవుడు ఆ రాజ్యమునందు సుగ్రీవునే స్థాపించెను.

"తతః"-అని, సుగ్రీవ వచనాత్ = సుగ్రీవుని యొక్క (ప్రార్థనా రూపమైన) మాట వలన, ఆహవే = సుగ్రీవుని యొక్క యుద్ధమందు (సుగ్రీవుడు వాలితో చేయు యుద్ధమునందు), వాలినం హత్వా = వాలిని వధించి, తతః = పిమ్మట, వాలి వధ తర్వాత, తద్రాజ్యే = ఆ వాలి రాజ్యమునందు, సుగ్రీవమేవ = సుగ్రీవునే, ప్రత్యపాదయత్ = స్థాపించెను - అని యర్థము -
(అనుజ్ఞాతస్తు రామేణ కిష్కింధాం ప్రవివేశహ । చత్వారో వార్షికాన్ మాసాన్ ఉవాస సమయేన సః = అధిక పాఠము = రామునిచే అనుజ్ఞాతుడై కిష్కింధను ప్రవేశించెను అతడు ఒడంబడికతో (ఒప్పందము మేర) నాల్గువర్షాకాలపు మాసములు అచ్చట గడిపెను).

సచ సర్వాన్ సమానీయ వానరాన్ వానరర్షభః । దిశః ప్రస్థాపయామాస దిదృక్షు ర్జనకాత్మజామ్॥ 71	వానర శ్రేష్ఠుడైన (రాజైన) ఆ సుగ్రీవుడు కూడ వానరులనందరిని పిలిపించి జనకుని కూతురైన సీతాదేవిని చూడగోరినవాడై (నాలుగు) దిక్కులకు పంపించెను.

పిమ్మట సుగ్రీవుని యొక్క ప్రత్యుపకారమును నిరూపించుచున్నాడు. 'సచ' అని - వానరర్షభః = వానర + ఋషభః (యణాదేశ సంధి)=వానర రాజుగా అభిషేకమొందిన 'వానర శ్రేష్ఠుడైన', సచ=ఆ సుగ్రీవుడును, జనకాత్మజాం

= జనకుని కూతురగు సీతను, దిదృక్షుః = చూడ (అన్వేషింప) కోరిక గలవాడై (కృతజ్ఞతతో), సర్వాన్ వానరాన్ = (నానాదేశ నివాసులైన) వానరులనందరిని, సమానీయ = పిలిపించి, రప్పించి, దిశః = నాల్గు దిక్కులకు, ప్రస్థాపయామాస = పంపించెను, శీఘ్రముగా (త్వరగా) సీతను జూచి రావలసినది అని ఆదేశించెను అని యర్థము.

తతో గృధ్రస్య వచనాత్ సంపాతే ర్హనుమాన్ బలీ । శతయోజన విస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్ ॥ 72	పిమ్మట బలము గల హనుమంతుడు సంపాతియను గ్రద్ధ యొక్క మాట వలన నూరు యోజనములు విస్తారముగల ఉప్పు సముద్రమును దాటెను.

తర్వాత సుందరకాండ కథను సంగ్రహించుచున్నాడు. 'తతః'- అని, తతః = సీతను వెదకుటకు ప్రయాణమైన తర్వాత, బలీ = పరిచ్ఛేదింపరాని (ఇంత అని చెప్పరాని, మేరలేని) బలము గలవాడు, (భూమార్థేమత్వర్థీయః అతిశయార్థమునందు మత్వర్థము చెప్పదగినది), హనుమాన్ = ప్రశస్తమైన (ప్రసిద్ధమైన) హనువుకలవాడు, (అన్వర్థము గలది ఇది) సార్థకమైన పేరు ఇది. అట్లును (ఆ విధముగానే) ఇంద్రుడు చెప్పగలడు. "మత్కరోత్సృష్ట వజ్రేణ హను స్తస్య తదాక్షతః । నామ్నైష హరిశార్దూలో భవితా హనుమానితి" - (నా చేత విడువబడిన వజ్రముచే (వజ్రాయుధముచే) అప్పుడతని దౌడ గాయపడినది (క్షతమైనది) కావున, వానర శ్రేష్ఠుడైన ఇతడు హనుమంతుడను పేర ప్రసిద్ధి చెందగలడు' అని. ఈ పదములచే పూర్వకథను ప్రస్తావించుటచేత జాంబవంతునిచే ప్రోత్సహింపబడుటయు, దాని వలన పుట్టిన (ఉద్భూతమైన) నిరతిశయబలము కలవాడగుటయు తెలియబడుచున్నది (స్ఫురింపబడుచున్నది), సంపాతేః = జటాయువు యొక్క అన్న యైన సంపాతియను పేరు గల పక్షి యొక్క, వచనాత్ = మాట వలన (మాటననుసరించి), ఇక్కడకు నూరుయోజనముల కవతల సముద్రము నడుమ లంకయందు సీత కలదు. సముద్రమును దాటుము, ఆమెను దర్శించగలవు, అనుమాట వలన, శతయోజన విస్తీర్ణం = నూరు యోజనముల వైశాల్యముగల, లవణార్ణవం = ఉప్పు సముద్రమును, పుప్లువే = దుమికిదాటెను, లంఘించి (తీరము) చేరెను - అని యర్థము.

తత్ర లంకాం సమాసాద్య పురీం రావణ పాలితాం । దదర్శ సీతాం ధ్యాయంతీ మశోకవనికాం గతాం ॥ 73	(హనుమంతుడు) రావణునిచే పాలించబడుచున్న లంకా పట్టణమును జేరి, అచ్చట అశోకవనములో (రామునే) ధ్యానించుచున్న సీతమ్మను దర్శించెను.

'తత్ర'-అని, హనుమంతుడు, రావణపాలితాం = రావణునిచే పాలించబడుచున్న (అనగా రావణుడు పాలించుచున్న), లంకాం = లంకను, ఆసాద్య = చేరి, పొంది, తత్ర = ఆ లంక యందు, అశోకవనికాం = అశోక వనమనెడు అంతఃపురోద్యానమును, గతాం = పొందియున్నట్టి, ధ్యాయంతీం = రామునినే నిరంతరముగా (ఎడతెగకుండ) స్మరించుచున్నదగు, సీతాం = సీతను, దదర్శ = చూచెను.

నివేదయిత్వాభిజ్ఞానం ప్రవృత్తించ నివేద్యచ । సమాశ్వాస్యచ వైదేహీం మర్దయామాస తోరణం ॥ 74	(పిమ్మట హనుమంతుడు) (రాముడొసంగిన) అంగుళీయకమును గుర్తుగా సమర్పించి, రామ వృత్తాంతమును దెలిపి, సీతాదేవినోదార్చి, తోట బహిర్ద్వారమును విఱుగగొట్టెను.

'నివేదయిత్వా'-అని, పిమ్మట హనుమంతుడు, అభిజ్ఞానం = రాముని గుర్తైన ఉంగరమును, నివేదయిత్వా = సమర్పించి (అనిత్యత్వాత్ సమాసేపి ల్యబభావః, అతఏవ న్యాసకారః వా ఛందసీతి వక్తవ్యే క్త్వాపి ఛందసీతి వచన మసమాసేపిల్యబర్థం, తేనార్చ్యదేవా నాగత ఇతి సిద్ధమితి, అనేన వ్యభిచారేణ సమాసే ల్యబ్విధే రనిత్యత్వం సిద్ధమేవ) ప్రవృత్తిం = సుగ్రీవునితో స్నేహముచేయుట, సేనను సమకూర్చుట మొదలైన రాముని రాక యొక్క వార్తను "వార్తా ప్రవృత్తి ర్వృత్తాంతః ఉదంత స్స్యాత్" (వార్త, ప్రవృత్తి, వృత్తాంతము, ఉదంతము, ఈ నాలుగు వృత్తాంతము పేళ్ళు) అని అమరము. చకారము వలన, "నైవ దంశా న్నమశకా న్నకీటా న్నసరీసృపాన్, రాఘవోపనయే ద్గాత్రా త్త్వద్గతేనాంతరాత్మనా" (నీయందేమగ్నమైన (నిలిచిన) మనస్సుతో రాఘవుడు, ఈగలనుగాని, దోమలనుగాని, పురుగులను గాని, పాములను గాని (వాలుచున్నను, పాకుచున్నను) తన శరీరమునుండి తొలగించుకొనుటలేదు) అని రాముడు సీతయందే ముఖ్యముగా ఆసక్తి గలిగియుండుట మొదలగునవి చెప్పబడుచున్నవి. నివేద్యచ= చెప్పియును, వైదేహీం = సీతను, సమాశ్వాస్య = (త్వరలోనే నీ భర్త రాగలడు అని) ఓదార్చి, సాంత్వనపరచి, తోరణం = అశోకవనమ్ముయొక్క వెలుపలి ద్వారమును, తోరణమును, మర్దయామాస = భంజించెను, విఱిచెను, తోరణో స్త్రీ బహిర్ద్వారం (గృహాదులకు వెలుపల పూలమాలలు మొదలగునవి కట్టుటకై ఆ ప్రక్క ఈ ప్రక్క (అటునిటు) రెండు స్తంభములచేత ద్వారమువలె గట్టబడు దానిని తోరణమందురు) అని అమరము.

పంచ సేనాగ్రగాన్ హత్వా సప్త మంత్రిసుతానపి శూర మక్షంచ నిష్పిష్య గ్రహణం సముపాగమత్ ॥ 75	ఐదుగురు సేనా నాయకులను చంపి, ఏడుగురు మంత్రి కుమారులను కూడ సంహరించి, శూరుడైన అక్షకుమారుని పిండి చేసి (చివరకు బ్రహ్మాస్త్రముచే) కట్టుబడెను (బంధింపబడెను).

'పంచ'-అని, అగ్రే గచ్ఛంతీత్యగ్రగాః = ముందు (పోవువారు) నడుచువారు అగ్రగులు, సేనాయాః అగ్రగాఃసేనాగ్రగాః = సేనకు ముందునడుచువారు, (సేనాగ్రగులు) సేనా నాయకులు, (అంతాదిష్వపాతే ప్యన్యేష్వపి దృశ్యతే ఇతి డప్రత్యయః), సేనాగ్రగాన్ పంచ = పింగళనేత్రుడు మొదలైన సేనా నాయకులు ఐదుగురిని, సప్తమంత్రి సుతాన్ అపి = జంబుమాలి మొదలైన ఏడుగురు మంత్రి కుమారులను కూడ, హత్వా = చంపి, శూరం = శూరుడైన, అక్షం = రావణుని ద్వితీయ కుమారుడైన అక్షకుమారుని, నిష్పిష్య = చూర్ణముచేసి, గ్రహణం = బంధనమును, ఇంద్రజిత్తుచే ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రముచే బంధనమును, సముపాగమత్ = పొందెను. (బ్రహ్మాస్త్రముచే బంధింపబడెను అని యర్థము)

అస్త్రేణోన్ముక్త మాత్మానం జ్ఞాత్వా పైతామహా ద్వరాత్ । మర్షయన్ రాక్షసా న్వీరో యంత్రిణ స్తాన్ యదృచ్ఛయా ॥ 76 తతో దగ్ధ్వా పురీం లంకా మృతే సీతాంచ మైథిలీం । రామాయ ప్రియమాఖ్యాతుం పునరాయాన్ మహాకపిః ॥ 77	పరాక్రమముగలవాడును, గొప్ప కోతియునగు హనుమంతుడు, బ్రహ్మవరమువలన ప్రయత్నము లేకుండ బ్రహ్మాస్త్రముచే విడువబడిన తనను గూర్చి తెలిసికొనియు, తనను త్రాళ్ళచే బంధించి ఇటు నటు లాగుచున్న ఆ రాక్షసులను క్షమించుచు (సహించుచు), మిథిలా రాజపుత్రిక యైన సీతను దప్ప లంకా పట్టణము నంతయు కాల్చి పిమ్మట రామునికి ప్రియమును జెప్పుటకు మరల దిరిగి వచ్చెను.

'అస్త్రేణ'- అని, మొదలైన రెండు శ్లోకములు ఏకాన్వయముగలవి. వీరః= (దేవ రాక్షసుల చేతను ప్రధర్షింపరానిదైన రావణునిచే పాలింపబడు లంకను ప్రదర్శించుట మొదలగు వానిచే ప్రసిద్ధిచెందిన) పరాక్రమము గలవాడు, స్వయముగా తాను అక్షతుడై (అపాయమునొందకయే) అనేక రాక్షసులను చంపుటయందు సమర్థుడు, అని అర్థము. పైతామహాత్ = పితామహుడగు బ్రహ్మచే ఈయబడిన, వరాత్ = వరము వలన, ఆత్మానం = తనను, యదృచ్ఛయా = ప్రయత్నము లేకుండ, తనంతటతానే, అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచే, ఉన్ముక్తం = వదలబడిన వానినిగా, జ్ఞాత్వా = తెలిసికొనియు, యంత్రిణః = యంత్రములు గలవారలైన, తనను రజ్జుయంత్రముచే బంధించి, ఇటునటు లాగుచున్న వారైన (అని యర్థము), రాక్షసాన్ = రాక్షసులను, మర్షయన్ = (వారి తప్పులను క్షమించుచున్నవాడై) సహించుచు (రావణుని సభలో ప్రవేశించి, అతనికి హితముపదేశించి, అతడు కోపముతో తన తోకను కాల్పింపగ ఆ అగ్నితో) మైథిలీం = మిథిలా రాజు కూతురగు, సీతాం = సీతను, ఋతే = తప్ప (విడిచి) - పృథక్, వినాంతరేణర్తే హిరు జ్నానా చవర్జనే = (పృథిక్, వినా, అంతరేణ, ఋతే, హిరుక్, నానా = ఈ ఆరు శబ్దములు విడిచి, లేక తప్ప అను అర్థమందు వర్తించును) అని అమరము, కులము యొక్క ప్రభావము (మహిమ) వలన ఆమెను మాత్రము కాల్చక, లంకాపురీం = లంకా పట్టణమును, దగ్ధ్వా = కాల్చి, రామాయ = రామునికి, ప్రియం = సీతాదర్శన మనెడి ప్రియ వాక్యమును, ఆఖ్యాతుం = చెప్పుటకు, పునరాయాత్ = మరల దిరిగి వచ్చెను.

సోభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణం । న్యవేదయ దమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః ॥ 78	అమేయాత్ముడైన హనుమంతుడు మహాత్ముడైన రామచంద్రుని జేరి, ప్రదక్షిణముచేసి, "దృష్టా సీతా" (చూడబడినది సీతమ్మ) అని ఉన్నదున్నట్లు నివేదించెను.

"సోభిగమ్య"- అని, అమేయాత్మా = అపరిచ్ఛేద్యమగు బుద్ధిగలవాడు (తెలిసికొన శక్యముగాని బుద్ధివైభవము గలవాడు) అగు, సః= ఆ హనుమంతుడు, (సముద్రమును దాటి వెనుకకు తిరిగి వచ్చి) మహాత్మానం = సీత యొక్క విరహతాపమందును వారింపరాని ధైర్యము గలవాడగు శ్రీరాముని, అభిగమ్య = (జేరి) ఎదురుగా బోయి, (సమీపముగా బోయి), దీనితో హనుమంతుడు కార్యమును నెరవేర్చినవాడగుట స్ఫురింపజేయ బడినది. (తెలియజేయబడినది) - ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణమునుజేసి, సీతా = సీతాదేవి, తత్త్వతః = నిజముగా, దృష్టా = చూడబడినది, ఇతి = అని, తత్త్వతః = ఉన్నదున్నట్లు, న్యవేదయత్ = చెప్పెను, నివేదించెను - (తెలిపి ఆనందింపజేసెను). సీత చూడబడినది (సీతా దృష్టా) అని చెప్పుటకు సాధ్యమైనదైనప్పటికిని దృష్టా సీతా (చూడబడినది సీత) అని చెప్పుట రామునికి సీతను జూచుట, బ్రతికి యుండుట మొదలగు విషయములందు సందేహము కలుగకుండుగాక (కలుగవద్దు) అని కొందరు చెప్పుదురు. మరికొందరు, అదృష్టా (చూడబడలేదు - కనబడలేదు) అని ప్రతిభాసించవచ్చును ఆ క్షణములో రెండవమాట చెప్పునంతలో ఏమైన జరుగవచ్చును) అని చెప్పబడినదందురు, ఇంకను మరికొందరు సంతోషాధిక్యమును ప్రకటించుటకై మొదట నెరవేర్చిన కార్యమును గూర్చి నిర్దేశించుట యని పలుకుదురు.

తతస్సుగ్రీవ సహితో గత్వాతీరం మహోదధేః । సముద్రం క్షోభయామాస శరై రాదిత్యసన్నిభైః ॥ 79	పిమ్మట సుగ్రీవునితో కూడినవాడై రాముడు మహా సముద్రము యొక్క తీరమును జేరి (ఒడ్డునకుపోయి) సూర్యసదృశములగు బాణములతో సముద్రమును క్షోభింపజేసెను. (కలతపొందించెను)

తర్వాత యుద్ధకాండము యొక్క కథను సంగ్రహించుచున్నాడు. 'తతః'- అని, తతః = హనుమంతుని మాటను విన్న తరువాత, సుగ్రీవ సహితః = సుగ్రీవునితో కూడినవాడై, మహోదధేః = మహా+ఉదధేః = నూరు యోజనముల విస్తీర్ణమైన (వైశాల్యము గల) సముద్రము యొక్క, తీరం గత్వా = తీరమును జేరి (ఒడ్డునకు పోయి), ఆదిత్య సన్నిభైః = సూర్య సదృశములైన (సూర్యునితో సమానమైన), శరైః = బాణములతో, సముద్రం = సాగరమును, క్షోభయామాస = క్షోభింపజేసెను - పాతాళము వరకు ఆకుల పరచెను.

దర్శయామాస చాత్మానం సముద్ర స్సరితాం పతిః । సముద్ర వచనా చ్చైవ నళం సేతు మకారయత్ ॥ 80	నదీభర్తయైన సముద్రుడు (రామునకు) తన నిజరూపమును దర్శింపజేసెను. సముద్రుని మాటననుసరించి నలునిచే సేతువును నిర్మింపజేసెను.

"దర్శయామాస"- అని, సరితాం = నదుల యొక్క, పతిః = భర్తయైన, దీనిచేత రాముని కోపము శాంతించుటకై కాళియుడు వలె (కాళీయ సర్పమువలె) సముద్రుడు భార్యలతో కూడినవాడై వచ్చెను అని ధ్వనింపబడుచున్నది. సముద్రః = సముద్రుడు, ఆత్మానం = తన నిజ స్వరూపమును, రామునికి, దర్శయామాస = కనిపింపజేసెను. (కనబఱచెను), సముద్ర వచనాత్+చైవ = సముద్రుని యొక్క మాట వలననే (మాటననుసరించి), నళం సేతుం = నలునిచే సేతువును, అకారయత్ చ = నిర్మింపజేసెను కూడ. సముద్రుని మాట వలన నలుడు సేతువును నిర్మించెనని యర్థము. (హృక్రో రన్యతరస్యా మితి ప్రయోజ్యకర్తుః కర్మత్వం)

తేన గత్వా పురీం లంకాం హత్వా రావణ మాహవే । రామ స్సీతా మనుప్రాప్య పరాం వ్రీడా ముపాగమత్ ॥ 81	రాముడు ఆ సేతువుతో (మీద) లంకాపురికేగి, యుద్ధమునందు రావణుని జంపి, సీతనుపొంది, తర్వాత (పరగృహమునందున్న సీతనెట్లు స్వీకరించవలెనని) అధికమైన (మిక్కిలి) లజ్జ (సిగ్గు) నొందెను-(సంశయించెను)

"తేన"- అని, రామః = రాముడు, తేన = ఆసేతువుతో (మీద), లంకాం పురీం గత్వా = లంకాపురమునకు వెళ్ళి, ఆహవే = యుద్ధమునందు, రావణం = రావణుని, హత్వా = వధించి, సీతాం = సీతాదేవిని, ప్రాప్య = పొంది, అను = తర్వాత, పరాం = మిక్కిలి అధికమైన (అతిశయితమైన), వ్రీడాం = లజ్జను, ఉపాగమత్ = పొందెను. పౌరుషమును నిర్వహించుటకై (చూపుటకై) శత్రు సంహార పూర్వకముగా సీతను మరల పొందితిని, కాని ఇంత కాలము పరుని ఇంటిలో నున్న దానిని ఎట్లంగీకరించగలను" అని లజ్జితుడాయెను (సిగ్గుచెందెను, సంశయించెను) అని యర్థము.

తా మువాచ తతోరామః పరుషం జనసంసది । అమృష్యమాణా సాసీతా వివేశ జ్వలనం సతీ ॥ 82	పిమ్మట రాముడు ఆమెను జనుల యొక్క సభలో పరుషముగా మాటాడెను. పతివ్రత యగు ఆ సీతాదేవి (రాముని కఠినమైన మాటలను) ఓర్వలేనిదై (సహించనిదై) అగ్నిలో ప్రవేశించెను.

"తాం"-అని, తతః = పిమ్మట, సిగ్గు (సంకోచము) కలుగుట వలన 'యత్తద్యతస్తతోహేతౌ' (యత్, తత్, యతః, తతః - ఈ నాలుగు పదములు కారణమందు వర్తించును) అని అమరకోశము, రామః = రాముడు, తాం = అట్టి పాతివ్రత్యముగల (పతివ్రతాత్వము గల) సీతను, జన సంసది = దేవతలు మొదలైన వారియొక్క సభ (సమూహము) యందు, పరుషం = పరుషముగా (కఠినమైన మాటలను) ఉవాచ = పల్కెను. (అకథితం = చేతి ద్వికర్మకత్వం) జనసభయందు అని అనుటచేత విశ్వాసము (నమ్మకము) కలుగుట కొఱకు శపథమును జేయుము (ప్రమాణము జేయుము, ఒట్టు పెట్టుకొనుము) అని సూచింపబడినది. సతీ సీతా = పతివ్రతయైన సీతాదేవి, అమృష్యమాణా = రామునిచే పలుకబడిన పరుష వచనములను (కఠినమైన మాటలను) సంహింపజాలనిదై (ఓర్వలేనిదై), జ్వలనంవివేశ = (లక్ష్మణునిచే పేర్చబడిన) అగ్నిని (లో) ప్రవేశించెను.

తతోగ్ని వచనా త్సీతాం జ్ఞాత్వా విగతకల్మషాం । బభౌ రామ స్సంప్రహృష్టః పూజిత స్సర్వదైవతైః ॥ 83	పిమ్మట రాముడు అగ్నిదేవుని మాట వలన సీతను దోషములేని దానినిగా గుర్తించి (తెలిసికొని) మిక్కిలి సంతోషము చెందినవాడై (సంతుష్టుడై), సకల దేవతలచే పూజింపబడినవాడై ప్రకాశించెను.

తతోవాయుః ప్రాదు రాసీత్ వాగువాచాశరీరిణీ
దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిః పపాతచ - (పిమ్మట గాలి వీచెను (ఉదయించెను) అశరీరిణి మాటాడెను. దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము కురిసినది అని అధిక పాఠ శ్లోకమున్నది.
"తతోగ్ని వచనాత్" అనెడి శ్లోకమే సరియైనది. మరొక శ్లోకమైతె లేఖకుని పొరపాటున జరిగినది
తతః = అగ్ని ప్రవేశము తర్వాత, అగ్నివచనాత్ = అగ్ని దేవుని యొక్క మాట వలన (మాటననుసరించి), సీతాం = సీతను, విగతకల్మషాం = మనోవాక్కాయములనెడి త్రికరణములందును, దోషము యొక్క వాసనయును లేనిదానినిగా, (కల్మషము - పాపము లేనిదానినిగా), జ్ఞాత్వా = తెలిసికొని గుర్తించి, రామః = రాముడు, సంప్రహృష్టః = సంతుష్టుడై, బభౌ = ప్రకాశించెను - సర్వదైవతైః = సకల దేవతలచేత, పూజితశ్చ = పూజింపబడినవాడునయ్యెను. (దేవతలందరు రాముని ప్రస్తుతించిరి అని అర్థము) రాముని యొక్క ధర్మమునందలి ఆకాంక్ష ఎంతగొప్పదో (ఆశ్చర్యము గదా)

కర్మణా తేన మహతా త్రైలోక్యం సచరాచరం । సదేవర్షి గణంతుష్టం రాఘవస్య మహాత్మనః ॥ 84	మహాత్ముడైన రాఘవుని యొక్క గొప్పనైన, ఆ కార్యము చేత (రావణవధచేత) చరాచరములతో కూడిన, దేవఋషి సముదాయముతో గూడిన మూడులోకములును తుష్టిచెందినవి.

"కర్మణా"-అని, మహాత్మనః = గొప్ప స్వభావముగల, రాఘవస్య = రామునియొక్క, మహతా = గొప్పనైన, తేన కర్మణా = ఆ ప్రసిద్ధమైన కర్మమగు రావణవధతో, సచరాచరం = స్థావరజంగమములతో కూడినదియు, సదేవర్షిగణం = దేవతల యొక్కయు, ఋషుల యొక్కయు సమూహముతో గూడినదియునగు, త్రైలోక్యం = ముల్లోకము (స్వార్థేష్యఞ్) తుష్టం = సంతుష్టిచెందెను. (సంతోషించెను), స్థావరముయొక్క సంతోషము చిగురించుట మొదలగు దానిచే తెలియబడును. 'అంతస్సంజ్ఞా భవంత్యేతే' (ఈ స్థావరములు లోపల భావ సంకేతములు గలవి. అనగా సంతోషము, బాధ, సిగ్గు మొదలగు భావములను చిగురించుట, వాడిపోవుట, ముడుచుకొనుట మొదలగు బయటి చిహ్నముల ద్వారా తెలియజేయును) అని విష్ణు పురాణమునందు చెప్పబడినది.

అభిషిచ్యచ లంకాయాం రాక్షసేంద్రం విభీషణం । కృతకృత్య స్తదా రామో విజ్వరః ప్రముమోదహ ॥ 85	రాముడు రాక్షసేంద్రుడైన విభీషణుని లంకయందు పట్టాభిషిక్తునిగాజేసి (విభీషణునికి పట్టాభిషేకముజేసి) కృతకృత్యుడై విజ్వరుడై అప్పుడు సంతోషించెను, ఆశ్చర్యముగదా?

"అభిషిచ్య"-అని, సీతానమాగమమునకు (సీతయొుక్క కలయికకు) పూర్వమే విభీషణ పట్టాభిషేకము అయినప్పటికిని, ఇచ్చట క్రమము వివక్షింపబడలేదు అని తెలియదగినది. రామః = రాముడు, రాక్షసేంద్రం = రాక్షసశ్రేష్ఠుడైన, విభీషయతీతి విభీషణః = విశేషముగా భయము కలిగించువాడు విభీషణుడు, (నంద్యాదిత్వాల్ల్యుః) శత్రువులకు భయమును కలిగించువాడు (శత్రుభయంకరుడు) అని అర్థము. అతనిని, లంకాయాంచ = లంకయందును, అభిషిచ్య = అభిషేకించి (పట్టాభిషిక్తునిజేసి), సముద్ర తీరమందలి అభిషేకమును సముచ్చయింపబడుచున్నది. లేక, చకారము అవధారణార్థమును దెలుపును. అభిషేకించియే, కృతకృత్యః = కృతకృత్యుడు - (కృతార్థుడు = పనిని నెరవేర్చినవాడు) అయ్యెను, కాని రావణుని చంపియే (కృతకృత్యుడు) కాలేదు. లంకయందు విభీషణుని అభిషేకించి కృతకృత్యుడయ్యెను. స్నుహి = జెముడుమొక్కల, (జెముడుచెట్ల) అడవిని నరికి, తియ్యమామిడిని స్థాపించి అన్నట్లు, లేక, చ - అనునది అన్వాచయమునందును వర్తించును. (అన్వాచయమనగా రెండు క్రియలలో ఒకటి ప్రధానమై రెండవది అప్రధానమై యుండుట) ప్రధానముగా అపవర్గమును (మోక్షమును) అనుగ్రహించి, ఆనుషంగికముగా (అప్రధానముగా) రాజ్యమునందు అభిషేకించి అని అర్థము. 'శరీరారోగ్య మర్థాంశ్చ భోగాంశ్చైవానుషంగికాన్, దదాతి ధ్యాయతాం పుంసా మపవర్గ ప్రదోహరిః (అపవర్గము (మోక్షము) నొసంగువాడైన విష్ణువు అప్రధానములైన శరీరారోగ్యమును, సంపదలను, భోగములను కూడ తనను ధ్యానముచేయు మానవులకు ఇచ్చును (ఒసంగును) అనెడి వచనము వలన, అభిషేకించి, తదా రామః = అప్పుడు రాముడు, "పట్టాభిషేకము కంటే పూర్వము" ఎట్లగునో (ఔనో-కాదో), అని బెంగచే వివర్ణుడు (కాంతిలేనివాడు) ఆయెను, (ఇప్పుడాబెంగతీరుటచే) (కాంతిగలవాడై) రమణీయుడయ్యెను, అప్పుడు రాముడు రాముడయ్యెను, (అనగా అభిరాముడు - ఆనందింపజేయువాడయ్యెను).

విజ్వరః = జ్వరములేనివాడు (తాపములేనివాడు) = భరతుడెట్లు రాజ్యమును స్వీకరించలేదో అట్లే యితడుకూడ స్వీకరించకపోయినచో, ఏమి చేయుదునని పూర్వము జ్వరము (తాపము) ఉండెను అది (జ్వరము) ఇప్పుడు తొలగినది అని యర్థము. లేక నాగపాశముచే కట్టబడుట మొదలగువానియందు 'యన్మయా నకృతో రాజా రాక్షసానాం విభీషణః తచ్చ మిథ్యా ప్రలప్తం మాం ప్రధక్ష్యతి నసంశయః' (నేను విభీషణుని రాక్షసులకు రాజుగా చేతునని మాటయిచ్చితిని. విభీషణుడు నాచేత రాక్షసులకు రాజుగా చేయబడకపోవుట వలన ఆ అసత్యతాపము నన్ను దహింపగలదు. అనుమానము లేదు) అని రాముని మనస్సులో ఏ తాపము గలదో అది ఇప్పుడు నివృత్తమైనదని అర్థము. కేవలము విజ్వరుడు (తాపము తొలగినవాడు మాత్రమే) కాలేదు. ప్రముమోదచ = అత్యధికముగా ఆనందమును పొందినవాడాయెనుకూడ. (చక్షిఙో జిత్కరణా దనిత్య మనుదాత్తేత ఆత్మనే పదత్వం అతోత్ర పరస్మై పద ప్రయోగః), దీనిచేత రామునికి రావణవధ, సీతాప్రాప్తి ఈ రెండును ఆనుషంగిక (అప్రధాన) ఫలములే. తననాశ్రయించిన విభీషణుని యొుక్క పట్టాభిషేకమే పరమ పురుషార్థము, (ప్రధాన ప్రయోజనము) అని తెలియబడుచున్నది. లేక

'వి' అనగా పక్షియని యర్థము. వౌ పక్షిణి జటాయుషి జ్వరః యస్యసః విజ్వరః = పక్షియగు జటాయువు విషయమున జ్వరము (తాపము) గలవాడు విజ్వరుడు, లోకమునందొకానొక పుత్రుని యుత్సవమునందు ఏదో ఒక విధముగా (ఎట్లో) సంతోషించుచున్నవాడైనప్పటికిని, తండ్రి వెనుక (పూర్వమునందు) చనిపోయిన పుత్రుని

స్మరణ వలన (పుత్రుడు జ్ఞాపకమునకు వచ్చుట వలన) ఎట్లు సంతప్తుడు (బాధనొందినవాడు) కాగలడో, అట్లే సర్వజగత్తులకు తండ్రి, స్వామియును అగు రామచంద్రుడు విభీషణుని యొక్క పట్టాభిషేక సమయమునందు అభిషేకము లేకుండ గడిచిపోయిన (చనిపోయిన) జటాయువును స్మరించుచు, కొంచెము లోపల (మనస్సు లోపల) తాపమును (బాధను) పొందినవాడై సంతోషించెను (ఆనందించెను) అని యర్థము. లేక - విజ్వరః అనిష్ట నివృత్తి (ఇష్టము కానిది తొలగుట) చెప్పబడినది, ప్రముమోద అని ఇష్టప్రాప్తి (ఇష్టమైనది లభించుట) చెప్పబడినది, 'హ' అని ప్రసిద్ధియందును, ఆశ్చర్యమునందును ప్రయోగింపబడును. రాముడు సత్యప్రతిజ్ఞ కలవాడగుట ఆనందముకదా అని యర్థము.

తనిశ్లోకి:- అభిషిచ్యచలంకాయాం .... బాల.సర్గ । శ్లో. 85

ప్రధానముగా నభిలషింపబడిన (కోరబడిన) కైంకర్య సామ్రాజ్య లాభముతో ఒకవేళ లంకాప్రభుత్వము (ఐశ్వర్యము) విభీషణునిచే స్వీకరింపబడకపోయినచో (అంగీకరింపబడక పోయినచో) అప్పుడు 'అహం హత్వా దశగ్రీవం సప్రహస్తం సబాంధవం । రాజానం త్వాం కరిష్యామి లంకాయాం రాక్షసేశ్వర ॥'' నేను ప్రహస్తునితో, బంధువులతో, సైన్యముతో కూడ రావణుని సంహరించి నిన్ను లంకయందు రాజునుగా జేయగలను రాక్షసేశ్వర!) సత్యమేతద్బ్రవీమితే (ఇది సత్యము, నేను నీకు చెప్పుచున్నాను) అని చేయబడిన ప్రతిజ్ఞ విఫలము (ఫలించనిది) అగును అనెడి గొప్ప జ్వరము (తాపము-బెంగ) శ్రీరాముడు కలిగియుండెను, అది యిప్పుడు తొలగినదని సంతోషించెను.

దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్యచ వానరాన్ అయోధ్యాం ప్రస్థితో రామః పుష్పకేణ సుహృద్వృతః ॥ 86	రాముడు దేవతల వలన వరమును పొంది (దానిచే యుద్ధములో చనిపోయిపడియున్న) వానరులను (నిద్రపోయినవారినివలె) లేపి పుష్పక విమానమున సుగ్రీవ విభీషణాది మిత్రులతోకూడి అయోధ్యకు బయలుదేరెను.

''దేవతాభ్య''ః - అని, రామః = రాముడు, దేవతాభ్యః = రాముని యొక్క విజయమును శ్లాఘించుటకు వచ్చినట్టి దేవతల (వలన) నుండి, వరం ప్రాప్య = వరమును పొంది, ఆ వరముచేత, వానరాన్ = యుద్ధమునందు చనిపోయిన కోతులను (వానరులను), సముత్థాప్య = బ్రతికింపజేసి, నిద్రపోయినవారిని వలె లేపి, సుహృత్ = సుగ్రీవుడు, విభీషణుడు మొదలైన మిత్రులతో, వృతః = కూడినవాడై, పుష్పకేణ = కుబేరుని జయించి రావణునిచే తీసికొని రాబడిన పుష్పకమను పేరుగల విమానముతో, అయోధ్యాం = అయోధ్యను గూర్చి, ప్రస్థితః = బయలు దేరెను - (ప్రయాణమయ్యెను).

భరద్వాజాశ్రమంగత్వా రామ స్సత్యపరాక్రమః । భరతస్యాంతికం రామో హనూమంతం వ్యసర్జయత్ ॥ 87	సత్య పరాక్రముడైన రాముడు భరద్వాజమహర్షి ఆశ్రమమును చేరి భరతుని వద్దకు (దగ్గరకు) హనుమంతుని పంపెను.

''భరద్వాజ''-అని, సత్యపరాక్రమః = సత్య విషయమయిన పరాక్రమము గలవాడైన (తండ్రికిచ్చిన మాటను నిలబెట్టుకొనుటచే మిక్కిలి కాంతిగలవాడైన), రామః = రాముడు. (క్రియాభేదమువలన రామ శబ్దము రెండుసార్లు వాడబడినది), భరద్వాజాశ్రమంగత్వా = భరద్వాజమహర్షి యొక్క ఆశ్రమమునుజేరి, భరతస్య = భరతుని యొక్క, అంతికం = సమీపమునకు (భరతుని దగ్గరకు) హనూమంతం = హనుమంతుని, వ్యసర్జయత్ = పంపెను, (హను శబ్దము దీర్ఘ ఊకారాంతముగా కూడ కలదు) ఈనాడిచ్చట ఉండదగినదని భరద్వాజునిచే ప్రార్థింపబడి

(భరద్వాజుడు ప్రార్థించగా) ఆ దినముతో పదునాలుగు సంవత్సరములు పూర్తియగుట వలన - "పూర్ణే చతుర్దశే వర్షే ఆగమిష్యామి" (పదునాలుగు సంవత్సరములు నిండగానే రాగలను) అని భరతునకు చెప్పుట (మాటయిచ్చుట) వలన, సత్యమును రక్షించుటకై (కాపాడుటకై) (తన రాకను తెలుపుమని) హనుమంతుని పంపెనని భావము.

పున రాఖ్యాయికాం జల్పన్ సుగ్రీవ సహితశ్చ సః । పుష్పకం తత్సమారుహ్య నందిగ్రామం యయౌతదా ॥ 88	రాముడు సుగ్రీవునితో గూడినవాడై ఆ పుష్పక విమానమును ఎక్కి (ఆరోహించి) (పోవునప్పుడు) పూర్వము జరిగిన కథలను మరలమరల చెప్పుచు నంది గ్రామమునకు వెళ్ళెను. (భరతుడు నివసించుచున్న నంది గ్రామమును జేరెను).

"పునః"- అని, సః = ఆ రాముడు, తత్పుష్పకం = ఆ పుష్పక విమానమును, సమారుహ్య = చక్కగా ఎక్కి (ఆరోహించి), సుగ్రీవ సహితః = సుగ్రీవునితో గూడినవాడై, తదా = పోవునప్పుడు (వెళ్ళు సమయమున), ఆఖ్యాయికాం = పూర్వము (వెనుక) జరిగిన కథ(ల)ను "ఆఖ్యాయికోపలబ్ధార్థా" (పూర్వము తెలిసిన అర్థము (వృత్తము) గలది ఆఖ్యాయిక, "ఆఖ్యాయిక, ఉపలబ్ధార్థా"- (ఈ రెండు పదములు సత్యమైన, జరిగిన చరిత్రకు పేళ్ళు) అని అమరము. పునః జల్పన్ = మరల మరల జెప్పుచు, అనగా పూర్వము జరిగిన భరతునికి సంబంధించిన కథలను - భరతుడు చిత్ర కూటమునకు వచ్చుట, రాజ్యమును స్వీకరింపుమని తనను కోరుట, తాను కాదనుట, అతడు భీష్మించుట, తాను పాదుకల నొసంగుట మొదలైన వెనుకటి కథలను - సుగ్రీవునితో జెప్పుచు" అని తెలియబడుచున్నది. నంది గ్రామం = భరతుడు నివాసమున్న స్థానమగు నందిగ్రామమును, తదా = అప్పుడే - ఆ కాలమునందే - త్వరగా, అని యర్థము, యయౌ = జేరెను, పొందెను.

నందిగ్రామే జటాం హిత్వా భ్రాతృభి స్సహితోనఘః । రామ స్సీతా మనుప్రాప్య రాజ్యం పున రవాప్తవాన్ ॥ 89	ఏ విధమగు దోషములు లేనివాడైన (అనఘుడైన) రాముడు నందిగ్రామములో సోదరులతో కలిసినవాడై, జడలను విడిచి (విసర్జించి) సీతను కూడి (సీతతో కలిసి) మరల రాజ్య పట్టాభిషేకమును పొందినవాడాయెను.

"నందిగ్రామే"-అని, అనఘః = ఎట్టి దోషములేనివాడు, అపహతపాప్మా-అని శ్రుతి - చక్కగా అనుష్ఠించిన (ఆచరించిన పితృాజ్ఞ కలవాడు - పితృవాక్యమును బాగుగా అనుష్ఠించినవాడు) లేక, "శిరసా యాచత స్తస్య వచనం నకృతం మయా" (తలతో (తలవంచి వినయముతో) యాచించిన అతని మాట నాచే పూర్తిచేయబడలేదు. భరతుని మాటను నేను పాలింపలేకపోయితిని అని చెప్పబడిన పాపము లేనివాడు అని యర్థము. లేక నిరసింపబడిన సమస్త వ్యసనములు గలవాడు, (వ్యసనములనన్నింటిని నిరసించినవాడు) "దుఃఖైనో వ్యసనేష్వఘం - (అఘ శబ్దము దుఃఖమునందు, పాపమునందు, వ్యసనమునందును వర్తించును) అని వైజయంతి, అగు, రామః = రాముడు, భ్రాతృభిఃసహితః = సోదరులతో కూడినవాడై, "కదాన్వహం సమేష్యామి భరతేన మహాత్మనా, శత్రుఘ్నేనచ వీరేణ త్వయాచ రఘునందన" - (లక్ష్మణా! మహాత్ముడగు భరతునితో, వీరుడగు శత్రుఘ్నునితో, నీతో (సీతతో) నేనెన్నడు కలిసియుందునో - (కలిసియానందమునొందుదునో) అని చెప్పబడిన మనోరథమును పూర్తిగా నెరవేర్చుకొన్నవాడు (పొందినవాడు) అని యర్థము. నందిగ్రామే = నందిగ్రామమునందు, జటాం = జడలను, హిత్వా = విసర్జించి, విప్పి (పరిష్కరించి శుద్ధిచేసికొని), ఇది ఉపలక్షణము - "విశోధిత జట స్స్నాతః చిత్రమాల్యాను లేపనః । మహార్హవసనో రామ స్తస్థౌ తత్ర శ్రియా జ్వలన్" (జడలను విప్పి (పరిష్కరించి), స్నానముచేసి, చిత్రములైన

మాల్యములను, చందనము మొదలైన అనులేపనములను గ్రహించి, విలువైన తగిన వస్త్రములను ధరిచి, దివ్యమైన లక్ష్మి (శోభ) తో ప్రకాశించుచు రాముడుండెను) అని చెప్పబడిన రూపము గలవాడు, సీతాం అనుప్రాప్య = సీతను కూడి (సీతతో కలిసి)" రామం రత్నమయే పీఠే సహసీతం న్యవేశయత్" (రత్నమయమగు సింహాసనమునందు సీతతోకూడ రాముని కూర్చుండజేసెను) అని మొదలుగా చెప్పబడిన ప్రకారముగా దివ్యసింహాసనమునందు సీతతో పట్టాభిషేకము నొంది, అని అర్థము. రాజ్యం = సాకేత రాజ్యమును, పునః = మరల, అవాప్తవాన్ = పొందినవాడాయెను.

ప్రహృష్ట ముదితో లోకః
తుష్టః పుష్ట స్సుధార్మికః ।
నిరామయో హ్యారోగశ్చ
దుర్భిక్ష భయ వర్జితః ॥ 90

శ్రీరాముడు రాజ్యముచేయుచుండగా, లోకము (జనము) మిక్కిలి సంతోషించెను, మనసుల్లో తృప్తిచెందెను, నిండుగ కన్పట్టెను, ప్రజలు చక్కగా ధర్మము నాచరించిరి, వారు శారీరక వ్యాధులు, మానసిక రోగములు లేనివారైరి. కరువు భయమును లేకపోయెను.

రాముడు రాజ్యమును పొందుటచే జరిగిన లోకాతిశయమును చూపుచున్నాడు. "ప్రహృష్ట" అని, లోకః = ప్రపంచము, జన (సమూహ)ము, ప్రహృష్ట ముదితః = అప్పుడు మిక్కిలి సంతోషమునొందినది, ఆయెను. ప్రహృష్టః = గగుర్పాటు కలిగినది (హృష్టేర్లోమస్వేత్యనిట్త్వవిధానాత్), ముదితః = అని, దానికి మూలమైన సంతోషించిన అంతకరణము (మనస్సు) కలుగుట చెప్పబడుచున్నది, తుష్టః = అన్ని కోరికలు లభించుటచే కలిగిన (జనించిన) ప్రీతితో కూడినది - లేక "ఇచ్ఛామోహి మహాబాహుం రఘువీరం మహాబలం । గజేన మహతా యాంతం రామం ఛత్రావృతాననం" మహాభుజుడు, రఘువీరుడు, మహాబలుడైన రాముడు గొప్ప వెల్లయేనుగు మీద (పట్టాభిషేకచిహ్నములతో) వెల్లగొడుగుచే (ఛత్రముచే) ఆవరింపబడిన ముఖముకలవాడై ఊరేగుచువచ్చుచుండగా చూడవలెనని కోరుచున్నాము") అనేడి కోరిన కోరిక యొక్క లాభము చెప్పబడుచున్నది. పుష్టః = నిండైనది (బలిసినది) - "విషయే తే మహారాజ రామ వ్యసన కర్శితాః । అపి వృక్షాః పరిమ్లానా స్సపుష్పాంకురకోరకాః" (మహారాజా! నీ (మన) రాజ్యమునందలి చెట్లు రాముని యెడబాటు వలని దుఃఖముచే కృశించినవై పూవులు, మొగ్గలు, చిగుళ్ళతో కూడి వాడిపోయినవి, అని చెప్పబడిన రాముని విరహముచే కలిగిన (జనించిన) కార్శ్యమును (కృశత్వము) విడుచుట వలన పుష్టిచెందినది నిండుకొన్నది, బలిసినది (ఆయెను), సుధార్మికః = సుధర్మ మాచరించువారుగలదయ్యెను. సుధర్మమనగా రామభక్తితో కూడిన కర్మము - అట్టి సుధర్మాచరణము చేయువాడు సుధార్మికుడు. ప్రజలు సుధార్మికులైరని యర్థము. స్త్రీలు, వృద్ధులు, యువతులును (స్త్రియో వృద్ధా స్తరుణ్యశ్చ) చెప్పబడిన ధర్మఫలముననను భరించువారు అయిరి అని యర్థము. నిరామయః = శారీర రోగము లేనిది, అరోగః = మానస వ్యాధి లేనిది, దుర్భిక్షభయవర్జితః = భిక్షాణాంవ్యృద్ధిః = దుర్భిక్షం= కరువు, (వ్యృద్ధా వవ్యయీభావః) (దుర్భిక్షమువలన భయము, దుర్భిక్షభయము), దుర్భిక్షభయము చేత విడువబడినది (కరువులేదు అని భావము) యాచకులులేరు, దీనిచేత పూర్వము సీతా విశిష్టుడైన (సీతతో కూడిన) రామునియొక్క వియోగమందు ప్రజలకు రోగములు మొదలగునవి యుండెను. అవి యిప్పుడు తొలగినవి అని చెప్పబడుచున్నది. ('ప్రహృష్ట' అని మొదలు) రామాభిషేకదర్శనము వలన, కలిగిన సంతోషము వర్ణించుటకు శక్యముగాదని కవి చెప్పెను. (ప్రహృష్టముదితో లోకస్తుష్టః పుష్టః' అని) - పిమ్మట ప్రీతిచే చేయింపబడిన కైంకర్యము యొక్క సిద్ధిని చూపుచున్నాడు (సుధార్మికః అని) శోభనమైన ధర్మము - సుధర్మము - విశిష్ట విషయమునెడ కైంకర్యమే. పిమ్మట కైంకర్య విరోధి యొక్క నివృత్తిని (తొలగింపును) చెప్పినాడు. (నిరామయో హ్యారోగశ్చ-అని) కైంకర్యోపకరణముల సమృద్ధిని చెప్పినాడు (దుర్భిక్ష భయవర్జితః అని).

నపుత్ర మరణం కించి ద్ద్రక్ష్యంతి పురుషాఃక్వచిత్ । నార్య శ్చావిధవా నిత్యం భవిష్యంతి పతివ్రతాః ॥ 91	ఏ పురుషులును (తల్లిదండ్రులును) ఎక్కడనైనను, ఎప్పుడైనను పుత్రుల మరణమును చూడ గలుగ కుండిరి. స్త్రీలు భర్తలు గలవారై వ్యభిచరించనివారై (భర్తృహీనలు - విధవలు - గాక) నిత్యము పతివ్రతలై యుండగలిగిరి.

పిమ్మట వర్ణాశ్రమధర్మముల యొక్క పరిపాలనయే ప్రధానమైన ఉత్తరకాండ యొక్క కథను సంగ్రహించుచున్నాడు. 'నపుత్ర' అని మొదలుకొని - పురుషాః = పురుషులు ఎవ్వరును కూడ, క్వచిత్ = ఎక్కడను, కించిత్ = ఎప్పుడును, పుత్రమరణం = పుత్రుల యొక్క చావును, నద్రక్ష్యంతి = చూడగలుగకుండిరి. (తల్లిదండ్రులుండగా కుమారులు చనిపోవుట ఆనాడు లేకుండెను అని భావము). చూడగలుగకుండిరి అను దానిచేత బ్రాహ్మణ కుమారుని మరణము వలె ఎప్పుడైన సంభవించిన తొలగింపజేయగలడని భావము. నార్యశ్చ = స్త్రీలును, అవిధవా = విధవలుకానివారై, భర్తలు కలవారై, నిత్యం = ఎల్లప్పుడు, పతివ్రతాశ్చ = పతివ్రతలును భవిష్యంతి = కాగలరు. లేక, వివిధాః ధవాః యాసాంతాః - విధవాః = ఎవరికి భర్తలు అనేకులో వారు విధవలు - అనగా వ్యభిచారిణులు కారు. వ్యభిచారము లేకపోయినప్పటికిని భర్తయందనురాగము లేకపోవుట కొందరికి ఉండును. అది లేదని చెప్పుచున్నాడు - (పతివ్రతలు అని) కౌసల్య మొదలగువారు పుత్రులు కలవారగుటచేతను, ముసలితనము చేతను వారు విధవలు కారు అని భావము - (రాముడు రాజ్యము చేయుటకు పూర్వమే కౌసల్యాదులు విధవలగుట సంభవించినది - ఆ ప్రశ్నకిచ్చట ఆస్కారము లేదు).

నచాగ్నిజం భయంకించి న్నాప్సు మజ్జంతి జంతవః । న వాతజ భయం కించి న్నాపి జ్వరకృతం తథా ॥ నచాపి క్షుద్భయం తత్ర న తస్కర భయం తథా । 92 1/2	అగ్నివలన పుట్టిన భయము కొంచెమును లేదు. జంతువులు (మనుష్యులు) నీటిలో మునిగి చనిపోవుట లేదు - గాలి వలన గలిగే భయము (ఉపద్రవము) లేదు, జ్వరము, ఆకలి, దొంగలు మొదలగు భయములు ఆనాడచ్చట లేవు.

అచ్చట రాజ్యమునందు అధిభౌతిక, అధిదైవిక అధ్యాత్మికములనెడు మూడు విధములైన తాపముల వాసన కూడ కలుగదు (లేదు) అని చెప్పుచున్నాడు. "నచ" అని, మొదలైన మూడు శ్లోక పాదములు. అగ్నిజం భయం = అగ్నివలన కలుగు భయము, కించిన్న = కొంచెమును లేదు, జంతవః = జంతువులు, మనుష్యులు, అప్సు = నీటిలో, సమజ్జంతి = మునుగుచు లేరు, మునిగి చచ్చుచులేరు అని అర్థము, ఇట్లు అధిదైవిక తాపము యొక్క నివృత్తి చెప్పబడినది, పిమ్మట ఆధ్యాత్మికము మొదలైన తాపనివృత్తిని చెప్పుచున్నాడు, తథా = అట్లే, జ్వరకృతం = జ్వరము వలన వచ్చిన భయము, నాపి = లేదు, తత్ర = అక్కడ, క్షుద్భయం = ఆకలివల్ల భయము, నచాపి = లేదుకూడను - అని, తథా = అట్లే, తస్కరభయంన = దొంగల వలన భయము లేదు అని అధి భౌతిక తాపమునకు ఉపలక్షణము (గుర్తు)

తనిశ్లోకి :- నచాగ్నిజం భయం కించి న్నాప్సు మజ్జంతి జంతవః ॥ 91 1/2 బాల. సర్గ. 1

నచాగ్నిజం భయంకించిత్ = అగ్ని వలన కలిగెడు భయము కొంచెమును లేదు. వంట కుపయోగించుటకంటె ఎక్కువగా అగ్నిమండదు - దీనిచేత, 'భీషాస్మా దగ్ని శ్చేంద్రశ్చ = (ఇతని వలన, అనగా పరమాత్మ వలన, భయము

చేతనే అగ్నియును, ఇంద్రుడును తమ తమ పనులను సక్రమముగా జేయుచున్నారు)' అనెడి శ్రుతి ధ్వనింపబడినది - నాప్సు మజ్జంతి జంతవః - (నీటిలో జంతువులు మునుగవు, అనగా మునిగిచావవు) ప్రమాదము వలన (పొరపాటు వలన) నీటిలో మునుగుచున్న జంతువులనుకూడ నీరు మీద తేలించుటతో బయటకు నెట్టి ఒడ్డునకు త్రోసివేయును, అని భావము.

నగరాణిచ రాష్ట్రాణి ధన ధాన్య యుతానిచ । నిత్యం ప్రముదితా స్సర్వే యథా కృతయుగే తథా ॥ $93^1/_2$	నగరములు, రాష్ట్రములును (పల్లెలును) ధన ధాన్యములతో కూడినవి. కృతయుగమునందెట్లుండిరో, అట్లే జనులు అందరును ఎల్లప్పుడును (నిత్యమును) సంతుష్టులై యుండగలరు.

అచట రామరాజ్యమునందు అనిష్ట నివృత్తిని చెప్పి, ఇష్టసిద్ధిని చెపుచున్నాడు (నగర - అని) నగరాణి = పట్టణములు, రాష్ట్రాణిచ = రాష్ట్రములును, ధనధాన్యయుతానిచ = ధన ధాన్యములతో కూడినవి కాగలవు - అనగా నగరములు ధనముతో కూడినవి, రాష్ట్రములు (పల్లెలు) ధాన్యములతో కూడినవి కాగలవు అని అర్థము, ఇందువల్లనే, సర్వే = అందరు, నాగరికులు జానపదులును (పట్టణవాసులు, పల్లె (ప్రజలును), యథా కృతయుగే = ఎట్లు కృతయుగమునందుండిరో, తథా = అట్లే, ఇచ్చట త్రేతాయుగమునందు కూడ, నిత్యం = ఎల్లప్పుడు, నిత్యము, ప్రముదితాః = సంతుష్టులై (సంతోషించినవారై) ఉండగలరు, (గత్యర్థా కర్మకేత్యాదినా కర్తరి క్తః) -

అశ్వమేధ శతై రిష్ట్వా తథా బహు సువర్ణకైః । గవాం కోట్యయుతం దత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి ॥ 95 అసంఖ్యేయం ధనం దత్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః ॥ $95^1/_2$	గొప్పకీర్తి గలవాడగు శ్రీరాముడు వందల కొలది అశ్వమేధయాగములను, అట్లే (అదే రీతిగా) బహు సువర్ణకములనెడి యజ్ఞములను జేసి అనేక కోట్ల ఆవులను, లెక్కపెట్ట శక్యముగాని ధనమును బ్రాహ్మణులకు దానము జేసి బ్రహ్మ లోకమునకు మరల పోగలడు.

ఇట్లు క్షత్రియులకు అసాధారణమైన (సామాన్యముగాని) ప్రజాపాలన రూపమైన ధర్మమును జెప్పి ద్విజాతి (బ్రాహ్మణ) ధర్మములను చెప్పుచున్నాడు - "అశ్వమేధ" అని మూడు అర్ధ (శ్లోకపాద)ములు ఏకాన్వయము గలవి. మహాయశాః = ప్రజలను మిన్నగా పాలించుటచే పొందబడిన గొప్ప కీర్తిగలవాడగు శ్రీరాముడు, దీనిచే ద్రవ్యము (ధనము) నందలి శుద్ధి (పవిత్రత) చెప్పబడినది. అశ్వమేధశతైః = నూర్లకొలది అశ్వమేధములతో "దశవర్షసహస్రాణి వాజిమేధ ముపాకరోత్" (పదివేల సంవత్సరములు అశ్వమేధ యాగములను యథావిధిగా జేసెను) అని ముందు జెప్పబడును. తథా = అట్లే, అదే ప్రకారముగా, బహు సువర్ణకైః = బహుసువర్ణకములను పేరుగల క్రతు విశేషములతోడ, ఇష్ట్వా = యజ్ఞములుచేసి, వ్రేల్చి, సుబహూని సువర్ణాని యత్రోపకరణత్వతః విందతే సక్రతు స్సద్భిః స్మృతో బహుసువర్ణకః (ఏ యజ్ఞమునందు అనేకములైన యజ్ఞ పరికరములు (పనిముట్టులు - సాధనములు) బంగారుతో చేయబడినవో (సువర్ణమయములో) ఆ యజ్ఞము బహుసువర్ణకమని సత్పురుషులచే చెప్పబడుచున్నది - యజ్ఞాంతమున ఆ బంగారు ఉపకరణములన్నియు బ్రాహ్మణులకే చెందును). అను మాట వలన ఇట్లు చివరి క్రతువుల అనుష్ఠానమును విశదపరచి తెలుపుటచేత వానికి పూర్వ క్రతువులైన అగ్నిష్టోమము మొదలైనవి ఆచరింపబడినవి (చేయబడినవి) అని చెప్పకున్నను తేటపడుచున్నవి - అయుతం = పదివేలు, అనేకము, గవాంకోట్యయుతం = పదివేల కోట్ల గోవులను, అనేక కోట్ల ఆవులను, బ్రాహ్మణేభ్యః = బ్రాహ్మణులకు, దత్వా = ఇచ్చి, అసంఖ్యేయధనం దత్వా = లెక్కపెట్ట సాధ్యముగాని ధనమును ఒసంగి, బ్రహ్మలోకం = బ్రహ్మలోకమును, తన యొక్క

అప్రాకృతస్థానమగు పరమ పదమును గూర్చి, ప్రయాస్యతి = పోగలడు. ఇచ్చట 'మహాయశాః' అనుటచేత ఏదో కొంచెము అపవాదును వినుట మాత్రము చేత సీతా పరిత్యాగము సూచితమైనది (సూచింపబడినది) పదివేల సంవత్సరములు అశ్వమేధ యజ్ఞముల ఆచరణ (అనుష్ఠాన) కాలము అని చెప్పుట చేత సీతలేకయే యజ్ఞానుష్ఠానము ముందు చెప్పబడగలుగుచుండుట వలన అభిషేకము తర్వాత వేయి సంవత్సరముల కొద్ది కాలమే సీతా వియోగమని నిశ్చయింపబడుచున్నది. అశ్వమేధారంభమును రావణవధ రూపమైన పాపము తొలగుట కొఱకగుటచేత ప్రస్తకమైనది (ప్రస్తావమునకు వచ్చినది) అది ఆలస్యము లేనిది. (త్వరగా చేయబడినది). అంతకు పూర్వమే సీతా వియోగము. మొదట యశ్వమేధయాగమునందే సీతయొక్క ప్రతిరూపము (ప్రతిమ-ప్రతిబింబము) చేయుట వలన - ప్రతిమ తోడను యజ్ఞానుష్ఠానమునకు ప్రామాణికత్వము (శాస్త్ర ప్రామాణ్యముండుట గూర్చి) దర్భశయన ప్రకరణము మొదట చెప్పబడగలదు -

రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః । చాతుర్వర్ణ్యం చ లోకేస్మిన్ స్వేస్వే ధర్మే నియోక్ష్యతి ॥ 96	రాఘవుడు (శ్రీరామచంద్రుడు) నూర్ల కొలది రాజవంశములను స్థాపించగలడు - ఈ లోకమునందు బ్రహ్మక్షత్రియ వైశ్యశూద్రు లనెడి నాలుగు వర్ణములను తమ తమ ధర్మములందు నియమించగలడు. (నాలుగు వర్ణములవారు తమతమ ధర్మముల నాచరించునట్లు శాసింపగలడు).

ఇట్లు ధర్మము ననుష్ఠించువాడగుటను చెప్పి ధర్మమును ప్రవర్తింపజేసిన (చేయు) వాడగుటను చెప్పుచున్నాడు. (రాజ - అని) అస్మిన్ లోకే = ఈ లోకమునందు, రాఘవః = శ్రీరామచంద్రుడు, రాజవంశాన్ = క్షత్రియ వంశములను, శతగుణాన్ = వందల కొలదిగా, స్థాపయిష్యతి = స్థాపింపగలడు - నూర్ల కొలదిగా పెరిగిన (వివిధములుగా వృద్ధి పొందిన) రాజవంశములను ప్రత్యేకముగా (వేరువేరుగా) రాజ్యముల నొసంగుటచే - (ఇచ్చి) పాలింపగలడని యర్థము. చత్వారో వర్ణాః చాతుర్వర్ణ్యం = (బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులనెడు) నాలుగు వర్ణములవారు, స్వేస్వేధర్మే = తమ తమ వర్ణాశ్రమములకు దగిన ధర్మమునందు (నిలుచునట్లు) (పూర్వాదిత్వాత్ సర్వనామత్వ వికల్పః), నియోక్ష్యతి = ప్రవర్తింపజేయగలడు, (శాసింపగలడు)

దశవర్ష సహస్రాణి దశవర్ష శతానిచ రామో రాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం గమిష్యతి 97	పదివేల సంవత్సరములు, పదివందల సంవత్సరములును (మొత్తము పదకొండువేల సంవత్సరములు) రాముడు రాజ్యమును (బాగుగ) పరిపాలించి, బ్రహ్మలోకము అనగా పరమపదమును పొందగలడు.

ధర్మ సంస్థాపన యొక్క ఆధిక్యతను చూపుట కొఱకై చాలకాలము రాజ్యమును పాలించుటను గూర్చి చెప్పుచున్నాడు - (రాజ్యము యొక్క పరిపాలన కాలము చాలగ నుండుటను చెప్పుచున్నాడు. 'దశ' అని - దశవర్ష సహస్రాణి దశవర్ష శతానిచ = పదివేల సంవత్సరములు, పదివందల యేండ్లును - అనగా పదకొండువేల సంవత్సరములని అర్థము. ఉపాసిత్వా = ఉపాసించి, (వాఛందసీతి వక్తవ్యే క్త్వాపి ఛందసీతి ప్రయోగా దనిత్యో ల్య బాదేశః) సాంత్వ పూర్వకముగా (దయతో, సామోపాయముతో, మధుర వాక్కులతో) ప్రజలననుసరించి వర్తించుట (నడుచుట) ద్వారా పరిపాలించి అని అర్థము, (భగవదుపాసనముగ పాలించి) (అత్యంత సంయోగే ద్వితీయా) రాజ్యపాలనలో వ్యాసంగాభావము (ఇతర విషయములందు శ్రద్ధ లేకపోవుట) చూపబడినది. బ్రహ్మలోకం = వైకుంఠమునకు గమిష్యతి = పోగలడు.

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితం । యః పఠే ద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే ॥ 98	పవిత్రము, పాపఘ్నము (పాపములను నశింప జేయునది) పుణ్యము, వేదములతో సమాన మగు ఈ రామ చరిత్రమును ఎవ్వడు చదువునో, అతడు సర్వపాపముల నుండి విముక్తిచెందును. (సర్వపాపములచే విడివడును)

పిమ్మట దీని పఠనము మోక్షసాధన మగుటను చెప్పుచున్నాడు. పూయతే అనేన ఇతి పవిత్రం = దీనిచేత పవిత్రము చేయబడును, కావున పవిత్రము, (కర్తరి చర్షి దేవతయోరితి కరణే ఇత్ర ప్రత్యయః) పవిత్ర సాధనములు అని యర్థము. కేవలము శుద్ధిని కలిగించునది మాత్రమే కాదు, మరేమనగా, పాపఘ్నం = పాపములను పోగొట్టునది (అమనుష్య కర్తృకే చేతి టక్ ప్రత్యయః) = పుణ్యం = పుణ్యము, "పుణ్యం లాంగలజీవనం" (నాగలితో (దున్నకొని) బ్రతుకుట పుణ్యము) అనినట్లు పుణ్యసాధనము. దీనిచే ప్రాయశ్చిత్తము లేకపోవుట చెప్పబడినది కారణమేమనగా అది పాపమునే తొలగించును (నివారించును). చెప్పబడిన మూడు అర్థములందు హితవునుచెప్పుచున్నాడు - 'వేదైశ్చ "సమ్మితం' అని, సకల వేదములతో సమానమైనది అని యర్థము. ఇదం రామచరితం = సంక్షేపరూపమైన ఈ రామచరితను, యఃపఠేత్ = ఎవ్వడు వేదమువలె నియమముతో కూడ ప్రతిదినము పఠించునో (చదువునో), సర్వపాపైః = పూర్వోత్తరాఘముల నుండి (ఇదివరకు చేసిన, ఇకముందు రాబోవు పాపములనుండి), ప్రముచ్యతే = ముక్తుడగును, విడువబడును, అది "రామోపనిషత్తునందు బ్రహ్మహత్యా సహస్రాణి, వీరహత్యాశతానిచ । స్వర్ణస్తేయ సురాపాన గురుతల్పాయుతానిచ । కోటి కోటి సహస్రాణి ఉపపాతకజాన్యపి । సర్వాణ్యపి ప్రణశ్యంతి రామచంద్రస్య కీర్తనాత్" - (వేలకొలది బ్రహ్మహత్యా పాతకములు, వందల కొలది వీర హత్యలు చేసిన పాపములు, బంగారు దొంగతనము, మద్యపానము, గురు భార్యాసంగమము మొదలైన అనేక పాపములు, వేలకోట్ల ఉపపాతకములు అన్నియు రామచంద్రుని కీర్తించుటవలన ఏమియు మిగలకుండ నాశనమునొందును) అని చెప్పబడినది - (పాపములు మోక్షమున కాటంకములు - అవి నశించుట వలన రామానుగ్రహముచే మోక్షము నిరాటంకముగా లభించును అని భావము)

ఏతదాఖ్యాన మాయుష్యం పఠన్ రామాయణం నరః । సపుత్ర పౌత్ర స్సగణః ప్రేత్య స్వర్గే మహీయతే ॥ 99	ఆయుష్యకరమైన, సత్యమైన ఈ రామాయణ కథను చదువు మనుష్యుడు పుత్ర పౌత్రులతోడ, బంధు సమూహముతో కూడ శరీరము పడిపోయిన తర్వాత స్వర్గమునందు (పరమ పదమునందు) పూజింపబడును.

ఇట్లు రామ చరిత్రమును చదువుటకు మోక్షము ఫలముగాజెప్పి ఆనుషంగిక (అప్రధానమైన) మైన ఫలమును చెప్పుట ద్వారా అతనికి సంబంధించిన వారి వరకిది కలుగుటను చెప్పుచున్నాడు "ఏతత్" అని -
ఆయుః ప్రయోజన మస్య ఆయుష్యం = ఆయువే ప్రయోజనము (లాభము)గా గలది గావున ఆయుష్యము, (స్వర్గాదిభ్యో యద్వక్తవ్య ఇతి యత్ప్రత్యయః) ఆఖ్యానం = ఆఖ్యాయికారూపమైన, సత్యముగా జరిగిన కథయైన, ఏతద్రామాయణం = ఈ బాలరామాయణము, (సంక్షేప రామాయణము), రామస్య అయనం = రామాయణం = రాముని యొక్క చరిత్ర = (అయగతా వితి ధాతోర్భావే ల్యుట్) లేక, రామః అయ్యతే ప్రాప్యతే అనేన ఇతి వా రామాయణం = రాముడు దీనిచేత పొందబడును కావున రామాయణము.
రామః అయనం ప్రతిపాద్యోయస్య ఇతివా రామాయణం = ఎవనికి (దేనికి) రాముడు ప్రతిపాద్యుడో అది

రామాయణము. పఠన్నరః = చదువు మనుష్యుడు, వర్ణాశ్రమములు మొదలైన నియమము లేకుండ ఎవ్వడైనను, సపుత్రపౌత్రః = కొడుకులు మనుమలతో కూడినవాడై, పూర్వులు పదితరముల వారితో, పరులు పదితరములవారితో కూడినవాడై - అని యర్థము. సగణః = భృత్యులు బంధువులతో కూడినవాడై, ప్రేత్య = చనిపోయి, ఆత్యంతిక (శాశ్వత)ముగా శరీరనాశమును పొంది, (స్థూల సూక్ష్మ, లింగ, యాతనాది శరీరముల నాశనమును పొంది), స్వర్గే = పరమపదమునందు, (ఇచ్చట ఇంద్రాది దేవతలు నివసించే స్వర్గమని అర్థము చెప్పకూడదు).
(వైకుంఠమునందు), తస్యాగ్ం హిరణ్మయః కోశః, స్వర్గోలోకో జ్యోతిషా వృతః (దానియందు హిరణ్మయమైన కోశము గలదు, స్వర్గలోకము జ్యోతిస్సు (తేజస్సు) చే ఆవరింపబడినది, అని పరమపదమునందు స్వర్గ శబ్దమును ప్రయోగించుట వలన, సమస్త పాపములనుండి విడివడిన వానికి కేవల స్వర్గము (స్వర్గమాత్రమే) ఫలమగుట వలనను, మహీయతే = పూజింపబడును. "తం పంచశతా న్యప్సరసాంప్రతి ధావంతి. శతం మాల్య హస్తాః, శతం చూర్ణహస్తాః" (ఆముక్త పురుషుని వద్దకు ఐదువందల మంది అప్సరస స్త్రీలు పరుగెత్తుకొని వత్తురు, వందమంది మాల్యములు (దండలు) చేతులందుగలవారు, వందమంది పరిమళించు పలురకముల సువాసన ద్రవ్యపు పొడులు (చూర్ణములు) చేతుల యందుకలవారు) అని శ్రుతి గలదు.

పఠన్ ద్విజో వాగృషభత్వ మీయాత్ స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్ వణిగ్జనః పణ్య ఫలత్వ మీయాత్ జనశ్చ శూద్రోపి మహత్వ మీయాత్ 100 ఇతి శ్రీమద్రామాయణే బాలకాండే కథాసంక్షేపో నామ ప్రథమస్సర్గః	ఈ రామాయణమును చదువువాడు బ్రాహ్మణుడు ఐన యెడల వాక్కునందు శ్రేష్ఠత్వమును (వేదవేదాంగ పారంగతత్వమును) పొందును. క్షత్రియుడైనచో రాజత్వమును పొందును (రాజగును, అధికారము నొందును) వర్తకుడు (వైశ్యుడు) ఐనచో వ్యాపారమునందు లాభము నొందును. శూద్రుడైనచో గొప్పతనమును పొందును - ఇది బాలకాండమునందు రామాయణకథా సంక్షేపము (సంగ్రహము) అను పేరుగల మొదటి సర్గ.

పిమ్మట నాల్గు వర్ణములకంటే వేరైన జాతివారికి చదువు అధికారము లేదు అని సూచించుచు, ఆయా వర్ణములవారికి ప్రత్యేకముగా నియతము (నిశ్చితము) లైన ఫలములను చూపుచున్నాడు ('పఠన్'-అని), స్యాత్ - అనునది అవ్యయపదము, ఒకవేళ, అయినచో, అని యర్థమునందు ప్రయోగింపబడినది. ఈ బాల రామాయణము (సంక్షేప రామాయణము) పఠన్ = చదువునట్టి, (పఠించునట్టి) వాడు, ద్విజః స్యాత్ = బ్రాహ్మణుడైనచో, వాగృషభత్వం = వాక్కునందు శ్రేష్ఠత్వమును (మాటనేర్పరితనమును) వేదవేదాంగ పారగత్వమును, ఈయాత్ = పొందజాలును - (ఈగతా విత్యస్మాద్ధాతో ర్లిఙ్). చదువువాడు, క్షత్రియఃస్యాత్ = క్షత్రియుడైనచో, భూమిపతిత్వం = చక్రవర్తిత్వమును, ఈయాత్ = పొందును, చదువువాడు, వణిక్ జనః స్యాత్ = వైశ్యుడు (వర్తకుడు) ఐనచో, పణ్యఫలత్వం = వ్యాపార లాభమును ఈయాత్ = పొందును - పణమనగా మూల్యము. దానికి దగియుండునది పణ్యము. కావున పణ్యమనగా కొనుటకు అమ్ముటకు దగిన వస్తువు.
తదేవ ఫలం లాభోయస్య స పణ్యఫలః=అదియే ఫలము (లాభము) గా గలవాడు పణ్యఫలుడు. వాని భావము = పణ్యఫలత్వము. "పణోద్యూతాదిషూత్సృష్టే స్తుతౌ మూల్యే ధనేపిచ" (పణశబ్దము జూదము మొదలైన వానియందు నొడ్డుపందెమునకును, కూలికిని, వెలకును, ధనమునకును, ముద్రకును, కర్షమెత్తు రాగికిని పేరు) అని అమరము.

(పణశబ్దాదర్థార్థే యత్ప్రత్యయః, అవద్యపణ్యేత్యాదినా పణతే ర్యత్ప్రత్యయాంతో నిపాతోవా) చదువావాడు, శూద్రోపి జనః స్యాత్ = శూద్రజనుడు అయిన యెడల, మహత్వం = సజాతీయులయందు శ్రైష్ఠ్యమును (శ్రేష్ఠత్వమును) ఈయాత్ = పొందును. లేక -

బ్రాహ్మణులలో అల్పుడు (చిన్నవాడు) అని మొదలగునది ఊహింపదగినది. స్యాదిత్యేత దల్పార్థే అవ్యయం = 'స్యాత్' అనునది అల్పార్థమునందు ప్రయోగింపబడు అవ్యయము, స్యాత్ క్షత్రియః = అల్పనృపతిః - (రాజులలో చిన్నవాడు (రాజు), భూమి పతిత్వం = అఖండ భూమండలానికి ప్రభుత్వమును పొందును (చక్రవర్తి అగును) లేక స్యాచ్ఛబ్దము "కథంచిత్" అర్థమునందు నిపాతము చేయబడ్డది. స్యాదస్తి స్యాన్నాస్తి (ఉన్నట్లో లేనట్లో) అని సప్తభంగీవ్యాఖ్యానమునందు చెప్పబడినది, స్యాత్ పఠన్ = (కథంచిత్ పఠన్) = ఏదో ఒక విధముగా చదువువాడు. శాస్త్రమునందు చెప్పబడిన నియమము లేకుండకూడ చదువువాడు అని యర్థము. లేక కొంతభాగము చదువువాడు అనియు నర్థము చెప్పవచ్చును అతడు వాక్కునందు శ్రేష్ఠత్వము మొదలగునవి పొందును. స్యాచ్చ = సత్తను పొందును అని సర్వసాధారణముగా సత్తా లాభరూప ఫలము.

అస్తిబ్రహ్మేతి చేద్వేద, సంతమేనంతతోవిదుః (బ్రహ్మమున్నది అని ఎవడు తెలిసికొనునో, వానిని ఉన్నవానినిగా తర్వాత తెలిసికొందురు) అని శ్రుతి యుండుట వలన, ఒకడు "స్యాత్ ప్రబంధే చిరాతీతః" (స్యాత్ అను శబ్దము ప్రబంధమునందు, చాలకాలము గడిచిన దానియందును వర్తించును) అను మాట వలన, స్యాచ్ఛబ్దము ప్రబంధపరము అని చెప్పెను. అది అజ్ఞానముచే చెప్పబడినది. "స్యాత్ప్రబంధే చిరాతితే నికటాగామికే పురా" (పురా - అను శబ్దము వాక్యరచనయందును, అనేక కాలమందును, గడచిన కాలమందును సమీపమందును, రాగలదానియందును) అని వాక్యశేషము వలన పురాశబ్దమునకు నానార్థములుండుటయే అచ్చట చెప్పబడినది అయినప్పటికిని "శ్రావయేచ్చతురో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణ మగ్రతః" (బ్రాహ్మణుని ముందుంచుకొని నాలుగు వర్ణముల వారికిని వినిపించవలెను) అని శూద్రునికి స్మృతి పురాణములు కేవలము వినుట మాత్రమే స్మృతులచేత అంగీకరింపబడినది, కాని చదువుటకు (పఠనమునకు) కాదు. (అంగీకరింపబడలేదు) అట్లయినను పఠన్ (చదువువాడు) అని ఋషివచనము యొక్క ప్రామాణ్యము వలన, వచనా ద్రథకారస్య" (రథకారుని యొక్క వచనము వలన) అనెడి న్యాయముచేత ఈ సంక్షేప రామాయణము యొక్క పాఠమాత్రమునందే అధికారము కలదని సిద్ధమగుచున్నది. అట్లే విష్ణుసహస్రనామముల యొక్క అధ్యాయము చివరను "య ఇదం శృణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్" (ఎవడిది నిత్యము వినగల్గునో (వినజాలునో), ఎవడైనను కీర్తించునో (చదువునో) అని మొదలిడి "వేదాంతగో బ్రాహ్మణ స్స్యాత్ క్షత్రియో విజయీభవేత్, వైశ్యో ధనసమృద్ధ స్స్యాచ్ఛూద్ర స్సుఖ మవాప్నుయాత్ (బ్రాహ్మణుడు వేదాంత పారగుడగును, క్షత్రియుడు విజయము గలవాడగును, వైశ్యుడు ధన సమృద్ధిగలవాడగును, శూద్రుడు సుఖమును పొందును) అని కనబడుచున్నది. లేక, వేదము యొక్క ఉపబృంహణమునందు శూద్రునికి ఎల్లప్పుడును అధికారము లేకపోవుట వలన "శూద్రః" అని ఇచ్చట పఠన్ (చదువువాడు) అని చేర్చబడదు. శృణ్వాన్ (వినువాడు) అని అధ్యాహారముచేయబడును. అనగా లేనిదానిని అన్వయమునకై తెచ్చుకొనబడును. "శృణ్వాన్ రామాయణం భక్త్యా" (రామాయణమును భక్తితో వినువాడు) అని శ్రవణము (వినుటకు) నకు కూడ గొప్ప ఫలముండుట యొక్క వచనము వలన.

ఇచ్చట సంక్షేప (రామాయణ) ము నందు తకారముతో ప్రారంభించి, యాత్ అని సమాప్తి (ముగింపు - సమాపనము) చేయుట వలన దీనికి గాయత్రీ రూపముండుట తెలియబడుచున్నది. ఈ శ్లోకము ఉపజాతివృత్తము

= స్యాదింద్రవజ్రా తతజాస్తతోగా వుపేంద్ర వజ్రాజతజా స్తతోగా, అనంతరోదీరిత లక్ష్మభాజః పాదా యదీయా ఉపజాతయస్తా" (ఒక పాదమునందు "త, త, జ, గగ" గణములు ఇంద్ర వజ్రకు చెందినవి, మరొక పాదమునందు "జ, త, జ, గగ" గణములు ఉపేంద్ర వజ్రకు చెందినవి ఉన్నచో ఉపజాతి పద్యములనబడును) అని లక్షణము. "జనశ్చశూద్రోపి మహత్వమీయాత్" అను పాదమునకు "శృణ్వంశ్చ శూద్రోపి మహత్వమీయాత్" అని పాఠాంతరము కలదు - ఇత్యార్షే శ్రీమద్రామాయణే, ఆదికావ్యే, బాలకాండే శ్రీమద్రామాయణ కథా సంక్షేపోనామ ప్రథమస్సర్గః = ఇది ఆదికావ్యమగు శ్రీమద్రామాయణమునందు బాలకాండలో శ్రీమద్రామాయణ కథా సంక్షేపము అను పేరుగల మొదటి సర్గ.

మొదటి సర్గను ముగించుచున్నాడు (ముగింపు చేయుచున్నాడు) 'ఇతి' అని. ఋషిణాప్రోక్తం ఆర్షం = ఋషిచే చెప్పబడినది ఆర్షము. (తేన ప్రోక్తమిత్యణ్) శ్రీరామాయణే = శ్రీరామాయణమను పేరుగల, ఆదికావ్యే = మొదటి కావ్యమునందు, బాలకాండే = బాలకాండలో, సంక్షేపో నామ = సంక్షేపము (సంగ్రహము) అను పేరుగల, ప్రథమస్సర్గః = మొదటి సర్గ, సమాప్తః = ముగిసినది. అని శేషము చేర్చుకోవలెను - కావ్యలక్షణమును, సర్గ లక్షణమున్ను దండిచే కావ్యాదర్శమునందు ఇట్లు చెప్పబడినది.

నగరార్ణవశైలర్తు చంద్రార్కోదయ వర్ణనైః । ఉద్యాన సలిలక్రీడా మధుపాన రతోత్సవైః । విప్రలంభై ర్వివాహైశ్చ కుమారోదయవర్ణనైః । మంత్ర ద్యూత ప్రయాణాజి నాయకాభ్యుదయైరపి ॥ అలంకృత మసంక్షిప్తం రసభావ నిరంతరం । సర్గైరనతి విస్తీర్ణైః శ్రావ్యవృత్తై స్సుసంధిభిః । సర్వత్ర భిన్నవృత్తాంతై రుపేతం లోకరంజనం । కావ్యం కల్పాంతరస్థాయి జాయతే సదలంకృతి' (నగరములు, సముద్రము, పర్వతములు, ఋతువులు, చంద్రోదయ, సూర్యోదయములు - వీటి వర్ణనములతోడను, ఉద్యాన క్రీడలు, జలక్రీడలు, మధుపానము, సురతోత్సవము, - వీని వర్ణనముల తోడను, వియోగ వర్ణనముతోడను, వివాహవర్ణనతోడను, పుత్రోత్పత్తి వర్ణనలతోడను, మంత్రము - అనగా రాజకార్యవిచారము, ద్యూతము, యుద్ధయాత్ర, యుద్ధము, నాయకుని యొక్క అభ్యుదయము - వీటి వర్ణనములతోడను అలంకరింపబడినదియు, "వసుదేవాత్సముత్పద్య పూతనాం వినిపాత్యచ । కంసం హత్వా ద్వారకాయా ముషిత్వా స్వర్గతో హరిః" ("శ్రీకృష్ణుడు - వసుదేవునికి జనించి, పూతనను పడగొట్టి, కంసుని జంపి, ద్వారకయందుండి, స్వర్గమునకేగెను) అను విధముగా మిక్కిలి సంక్షిప్తము కానిదియు, శృంగారాది రసములతోడను, భావములతోడను నిండియున్నదియు, ఎక్కువ పెద్దవికాని, చెవులకింపుగానుండు వృత్తములు కలవియు, బాగుగా కూర్చబడిన ముఖ ప్రతిముఖ గర్భ అవమర్శ నిర్వహములనెడు పంచసంధులు గలవియు, అన్ని సర్గలందును, (అంతటను) వేరువేరైన వృత్తములతో అంతములు గలవియు, (అనగా సర్గాంతమున వృత్తమును మార్చవలెనని భావము) అగు సర్గలతో కూడినదియు, లోకులకు ఆనందకరముగా నుండునదియు, మంచి అలంకారములు గలదియు నగుకావ్యము కల్పాంతరము వరకును స్థిరమైయుండును) అని చెప్పబడినది -

ఇది శ్రీకౌశిక గోవిందరాజుచే రచింపబడిన శ్రీరామాయణ భూషణమైన బాలకాండ వ్యాఖ్యానమునందు మొదటి సర్గమునకు గుండి వేంకటాచార్య విరచితమైన ఆంధ్రానువాదము సమాప్తము.

శ్రీరామ శ్శరణం మమ